


సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 356

మంగళవారం 18-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

### 'విన్'రైజర్స్ అయ్యేనా!

రెండో టైటిల్ లక్ష్యంగా ఐపీఎల్ బరిలోకి సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు -14లో



### బంగారం కొత్త రికార్డులు

ఒకేరోజు రూ. 1,300 పెరుగుదల
10 గ్రాములకు రూ. 90,750 -15లో



### ఖలిస్తానీ శక్తుల భరతం పట్టండి

న్యూజిలాండ్‌లో ఖలిస్తానీ శక్తులను అణచివేయాలని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌ను ప్రధాని మోదీ కోరారు.

వివరాలు 6లో ▸



### ఉగ్రసంస్థగా ప్రకటించండి

సిక్కు వేర్పాటువాద సంస్థ 'సిఖ్స్ ఫర్ జస్టిస్'ను ఉగ్ర సంస్థగా ప్రకటించాలని అమెరికా నిఘా డైరెక్టర్ తులసీ గబ్బార్డ్‌ను రాజ్‌నాథ్ కోరారు.

వివరాలు 6లో ▸



### 'చంద్రయాన్-5'కు ఆమోదం

చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఆమోదం తెలిపిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ నారాయణన్ తెలిపారు.

వివరాలు 6లో ▸



### నేడు పుతిన్, ట్రంప్ మంతనాలు

ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేలా రష్యాను ఒప్పించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేడు పుతిన్‌తో చర్చలు జరపనున్నారు.

వివరాలు 6లో ▸

# 'బీసీ' బిల్లులు ఏకగ్రీవం

## విద్య, ఉద్యోగాల్లో.. స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించే రెండు బిల్లులకు అసెంబ్లీ ఆమోదం



- బీసీలకు రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం ప్రధాని మోదీని కలుద్దాం.. సమైక్య గొంతు వినిపిద్దాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినోత్సవంగా పాటిద్దామని వెల్లడి
- ఆమోదం వచ్చేలా శాస్త్రీయంగా రూపొందించాం: డిప్యూటీ సీఎం భట్టి
- తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు సాధించుకుందాం: మంత్రి పొన్నం ప్రభాకర్
- న్యాయపరమైన చిక్కులకు అవకాశం: వివేకానంద

"బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును చట్టం చేసేలా కేంద్రంపై అన్ని పక్షాలు ఒత్తిడి పెంచాలి. దీనిపై తెలంగాణ సమాజం ఏకాభిప్రాయంతో ఉందనే సందేశాన్ని కేంద్రానికి పంపాలి. బీసీ రిజర్వేషన్ సాధనకు నేను నాయకత్వం వహిస్తా. సభా నాయకుడిగా హామీ ఇస్తున్నా.

..: సీఎం రేవంత్ రెడ్డి :..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు బిల్లులను సోమవారం శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించి ఒక బిల్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధించి మరో బిల్లు ఆమోదం పొందాయి. అనంతరం అసెంబ్లీ మంగళవారానికి వాయిదా పడింది. సోమవారం ఉదయం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఈ రెండు బీసీ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రి గంగుల కమలాకర్ బీసీ రిజర్వేషన్ల ఆవశ్యకతను వివరించారు. తర్వాత సాయంత్రం వరకు కూడా బీసీ రిజర్వేషన్ల బిల్లులపై శాసన సభలో సుదీర్ఘ చర్చ జరిగింది.

**ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుదాం..**

బీసీ బిల్లులపై చర్చ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నది కాంగ్రెస్ పార్టీ ఎజెండా. బీసీలకు 37శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును గతంలో అసెంబ్లీ ఆమోదించింది. దానికి సంబంధించిన తీర్మానం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. సాంకేతిక కారణాల రీత్యా గతంలో చేసిన తీర్మానం ఉపసంహరించుకుని, కొత్తగా అసెంబ్లీ తీర్మానం చేసింది. బిల్లుకు మద్దతు ఇచ్చిన పక్షాలకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. కేంద్రంలో అధికారంలోకి వస్తే దీన్ని అమలు చేస్తామని మా నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

### తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు

- ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ ఆమోదం
- పరిపాలనలో గందరగోళం తొలగించేందుకే అన్న సీఎం
- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు ప్రతిపాదన
- సురవరం పేరు ఉస్మానియా యూనివర్సిటీకి పెట్టాలని సూచించిన భారతీయ జనతా పార్టీ

2 లో

### అపాయింట్‌మెంట్ ఇవ్వండి

- బీసీ రిజర్వేషన్ల అంశంపై అన్ని పార్టీల నేతలం వచ్చి కలుస్తాం: ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ
- రాష్ట్ర అసెంబ్లీ రెండు బిల్లులను ఆమోదించిందని వెల్లడి

2 లో

# పాలనపై పట్టుకు మరికొంత సమయం

## 'రాజీవ్ యువ వికాసం' పథకం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

| | | |
|---|---|---|
| ఒకరిద్దరు మంత్రులను తొలగించడం, అధికారులను జైలుకు పంపడం చేస్తే పట్టు వచ్చినట్టు కాదు | అందరినీ సమన్వయం చేసుకుని సమర్థవంతమైన పాలన అందించాలి | రాజీవ్ యువ వికాసం పార్టీ పథకం కాదు... ఇది ప్రజల పథకం |

రూ.6 వేల కోట్లతో 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

ప్రతి నియోజకవర్గంలో 5 వేల మందికి లబ్ధి.. జూన్ 2న లబ్ధిదారుల జాబితా




కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: "అందరినీ సమన్వయం చేసుకుంటూ.. సుపరిపాలన అందిస్తే పాలనపై పట్టు సాధించినట్లు.. నేను ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నా. దీనికి మరికొంత సమయం పడుతుంది. పాలనపై నాకు ఇంకా పట్టురాలేదని కొందరు అంటున్నారు. పాలనపై పట్టు అంటే ఏంటి? ఒకరిద్దరు మంత్రులను తొలగించడం, ఓ ఇద్దరు అధికారులపై కేసులు పెట్టి జైలుకు పంపించడమా?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టలేదన్నారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు.

**యువతకు భవిష్యత్తు ఇవ్వడానికే..**

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చినట్టు సీఎం రేవంత్ చెప్పారు. "తెలంగాణ ఉద్యమంలో ఉవ్వెత్తున పోరాడిన యువత.. ఇప్పుడు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. ఇదో పంజాబ్, కేరళ మాదిరిగా మారుతోంది. అలాకాకుండా

మిగతా 5వ పేజీలో ▶



ఐఎస్‌ఎస్‌లో విల్మోర్, సునీతా విలియమ్స్ (ఫైల్)

# ఎన్నాళ్లో వేచిన ఉదయం

## 9 నెలల తర్వాత భూమ్మీదకు రానున్న సునీత, విల్మోర్

**ఎప్పుడు?**

భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున

3:27

గంటలకు భూమిపై దిగనున్న క్యాప్సూల్

**ఎక్కడ?**

అమెరికాలోని ఫ్లోరిడా సముద్ర తీరంలో ల్యాండింగ్

**ఎలా?**

ఐఎస్‌ఎస్ నుంచి విడిపోయి భూమిపైకి చేరనున్న క్రూ డ్రాగన్-10 వ్యోమనౌక

**ఎంతమంది?**

- సునీత, విల్మోర్‌తో పాటు నిక్ హేగ్, అలెగ్జాండర్ గుర్బునోవ్
- అనుకూల వాతావరణం నేపథ్యంలో వారి తిరుగు ప్రయాణాన్ని ఒకరోజు ముందుకు జరిపిన నాసా

- వివరాలు 6లో ▶

# కుటుంబం ఇప్పుడు గుర్తుకొచ్చిందా?

మీరు అసహ్యకరంగా మాట్లాడినపుడు మాకు ఫ్యామిలీ లేదా?

**సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**

సంబంధాలు అంటగట్టి మా పిల్లలను దూషించినపుడు విలువలు లేవా?

- మేం కూడా రేవంత్ బట్టలు విప్పగలం.. ఫొటోలు పెట్టగలం.. ఢిల్లీలో ఆయన గోడలు దూకిన విషయాలు చెప్పగలం
- రేవంత్ గురించి తెలిస్తే ఇంట్లో ఆయన భార్య తిండి కూడా పెట్టదు.. సీఎంకు గాసిప్స్‌పై తప్ప గవర్నెన్స్ మీద దృష్టి లేదు
- జాతిపిత లాంటి కేసీఆర్‌పై చిల్లరగా మాట్లాడే రేవంత్ అభినవ గాడ్సే
- తెలంగాణ రైజింగ్ కాదు.. తెలంగాణ ఫాలింగ్ అవుతోంది
- బీజేపీ నేతల బాగోతాలు కూడా తమ వద్ద ఉన్నాయని వ్యాఖ్య



### జిల్లా పర్యటనలకు కేటీఆర్

- 20న సూర్యాపేట, 23న కరీంనగర్‌లో కార్యకర్తలతో భేటీ.. అసెంబ్లీ సమావేశాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు

12 లో

సాక్షి, హైదరాబాద్: "నైతిక విలువలపై అసెంబ్లీలో చిలుక పలుకులు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్ సభలో బజారు భాష మాట్లాడారు. రాజకీయాల్లో హద్దు దాటకూడదని ఇన్నాళ్లూ సంయమనంతో వ్యవహరించాం. మేం కూడా రేవంత్ బట్టలు విప్పితే.. ఆయన బయట తిరగలేడు. రేవంత్ సెల్ఫ్ డ్రైవింగ్ కథలు, ప్రైవేటు కార్ల సంగతులు, సాగర్ సొసైటీలు, మైహోమ్ భుజ వ్యవహారాలను మేం మాట్లాడగలం. ఢిల్లీలో ఆయన గోడలు దూకిన విషయాలు చెప్పగలం. రేవంత్ దాటిన 'రేఖలు, వాణిలు, తార'ల గురించి.. ఎక్కువగా మాట్లాడితే ఫొటోలు కూడా బయటపెట్టగలం.." అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి తాము నోరు విప్పితే ఆయనకు ఇంట్లో తిండి కూడా పెట్టరని పేర్కొన్నారు. సోమవారం శాసనసభ లాబీలో కేటీఆర్ మీడియాతో

మిగతా 12వ పేజీలో ▶

## న్యూస్‌రీల్

### కొత్తగా 37 మద్యం బ్రాండ్లు



తెలంగాణ లిక్కర్ మార్కెట్‌లోకి అతిత్వరలో 37 కొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. అందులో 15 విదేశీ మద్యం బ్రాండ్లు కాగా మరో 15 దేశీయ మద్యం బ్రాండ్లు, ఏడు దరఖాస్తులు బీర్ల సరఫరాకు వచ్చినట్లు తెలుస్తోంది.

- వివరాలు 5లో ▶

### అమెరికాలో ముగ్గురు తెలంగాణవాసుల దుర్మరణం




అమెరికాలోని ఫ్లోరిడాలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు మృత్యువాత పడ్డారు. వారు ప్రయాణిస్తున్న కారును ట్రక్కు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది.

- వివరాలు 5లో ▶

### నవజాత శిశువుకు నిప్పు



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఓ నవజాత శిశువును గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకుప్పలో వేసి నిప్పంటించడం కలకలం రేపింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం శిశువు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

- వివరాలు 12లో ▶

### పదేళ్లయినా పరిహారం చెల్లించరా?

ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం

-వివరాలు 12లో ▶









ఇదండీ సంగతి




# లక్ష ఎకరాల్లో ఎండిన వరి

## ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పంటలు నీళ్ల లేక ఎండిపోతున్నాయి. ముఖ్యంగా సూర్యాపేట, నిజామాబాద్, కామారెడ్డి, వనపర్తి, యాదాద్రి, మెదక్, సిద్దిపేట, భద్రాద్రి, ఖమ్మం, సిరిసిల్ల జిల్లాల్లో వరి మళ్లు ఎండుతున్నాయి. ప్రాజెక్టుల నీటి మీది ఆశతో వరి సాగు చేసిన రైతులతో పాటు బోర్లు, బావుల కింద పంట వేసిన లక్షలాది మంది రైతులు పొట్ట కొచ్చే దశలో ఉన్న వరిని చూసి తల్లడిల్లుతున్నారు. ప్రాజెక్టుల కింద ఉన్న పొలాలకు వారబందీ ప్రాతిపదికన నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, దేవాదుల, ఎల్‌ఎండీ, మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, సీతారామసాగర్ మొదలైన ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని పొదుపుగా కిందకు వదులుతుండడంతో ఆయకట్టు చివర ఉన్న పొలాలకు నీరు అందడం లేదు. దీంతో పలు జిల్లాల్లో వరిమళ్లు ఎండుతున్నాయి. ఇప్పటికే సుమారు లక్ష ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలిసింది.

**పడిపోతున్న భూగర్భ జలాలు:** ఈ ఏడాది మార్చిలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. చాలాచోట్ల ఏప్రిల్‌లో ఉండే ఉష్ణోగ్రతలు ఇప్పుడే నమోదవుతున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గత

మిగతా 5వ పేజీలో ▶

- ప్రాజెక్టుల నుంచి పొదుపుగా నీళ్లు.. అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఎండుతున్న పంటల్ని చూసి తల్లడిల్లుతున్న రైతులు
- సన్నాల సాగు పెరగడంతో మరింత పెరిగిన నీటి అవసరం
- పలు జిల్లాల్లో మొక్కజొన్న, వేరుశనగ పంటలదీ అదే పరిస్థితి



సూర్యాపేట జిల్లా ఖాసీంపేటలో ఎస్సారెస్పీ నీళ్లందక ఎండిన వరి పంట

### మొక్కజొన్న, వేరుశనగ కూడా..

నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, మెదక్ మొదలైన జిల్లాల్లో మొక్కజొన్న, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్ తదితర జిల్లాల్లో వేరుశనగ పంటలు కూడా నీళ్ల లేక ఎండిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఏప్రిల్ నెలాఖరు వరకు వరి పంట కోతకు వచ్చే అవకాశం ఉండడంతో అప్పటి వరకు ఆయకట్టుకు నీరు ఎలా ఇవ్వాలో తెలియక నీటిపారుదల శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుల బాధలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నారు. ఎస్‌ఆర్‌ఎస్పీ నీరు పెద్దపల్లి జిల్లా గుండా మంథని వరకు నిరాటంకంగా వెళ్లేలా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రయత్నిస్తున్నప్పటికీ, వచ్చే నెలలో ఎలా ఉంటుందో చెప్పలేమని ఓ అధికారి పేర్కొన్నారు.

# శాస్త్రీయ విధానంతోనే పునర్విభజన

- అప్పటివరకు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను వాయిదా వేయాలి
- అఖిలపక్ష సమావేశంలో రాష్ట్ర రాజకీయ పార్టీల అభిప్రాయం
- కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యం కావాలి: డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో శాస్త్రీయ విధానంతో కేంద్రం ముందుకెళ్లాలని, దీనికి ఆమోదం వచ్చేంత వరకు ఆ ప్రక్రియను వాయిదా వేయాలని రాష్ట్రంలోని పలు రాజకీయ పక్షాల నేతలు అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేయడం వల్ల దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని, ప్రధానంగా తెలంగాణకు రాజకీయ ముప్పు పొంచిఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై శాస్త్రీయ విధానంతోనే కేంద్రం ముందుకెళ్లేలా ఒత్తిడి తెచ్చే కార్యాచరణను రూపొందించాలని

మిగతా 12వ పేజీలో ▶

## క్లుప్తంగా...

### బీఆర్‌ఎస్ నేతల్లో 'అపరిచితుడు'

మంత్రి సీతక్క ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: 'అపరిచితుడు'సినిమాలో మాదిరిగా బీఆర్‌ఎస్ నేతలు తమ వైఖరి ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వస్తున్నారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. ఉదయం రాము.. రాత్రి రెమోగా మారినట్లు.. వారి వ్యవహార శైలి ఉందన్నారు. రిజర్వేషన్ల పెంపు బిల్లుకు ఉదయం సంపూర్ణ మద్దతు ప్రకటించిన బీఆర్‌ఎస్.. సాయంత్రం కాగానే సన్నాయి నొక్కులు నొక్కుతోందన్నారు. ఆమె సోమవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం చేసిన కులగణనకు బీఆర్‌ఎస్ మొదటి నుంచి వ్యతిరేకతతోనే ఉందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నా మైనార్టీ, ఎస్టీ రిజర్వేషన్లను పెంచలేదని, అధికారం కోల్పోయే ముందు ఎస్టీ రిజర్వేషన్లు పెంచినట్లు డ్రామాలు ఆడారని మండిపడ్డారు.

### గురుకులాలన్నీ ఇంటర్ వరకు అప్‌గ్రేడేషన్

సాక్షి, హైదరాబాద్: ఆలయం.. దేవాలయం.. ఇది గిరిజన ఆశ్రమ విద్యాలయం.. అంటూ కాంగ్రెస్ సభ్యులు జారే ఆదినారాయణ శాసనసభలో పాటపాడి ఆకట్టుకున్నారు. వసతి గృహ పాఠశాలలను ఇంటర్మీడియెట్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేయగా, అన్ని వసతి గృహ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు. వసతి గృహ విద్యార్థులకు సోలార్ గీజర్ సదుపాయం కల్పిస్తామన్నారు.

### 'ఏలేటి' వాయిదా తీర్మానం తిరస్కృతి

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధతపై సభ్యుని ప్రతిపాదన



సాక్షి, హైదరాబాద్: అభయహస్తం పథకం కింద కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని బీజేపీ సభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రతిపాదించిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. సింగరేణి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని సైతం తిరస్కరించారు.

### సీఎం భాష సరిగా లేదు

ధరణి, ఫోన్ ట్యాపింగ్‌పై చర్యలేవీ?: ఏలేటి

సాక్షి, హైదరాబాద్: ఇటీవల అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఉపయోగించిన భాష సరిగ్గా లేదని, చట్ట సభల్లో ఒకసీఎం మాట్లాడాల్సిన భాషేనా అని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. 'రేవంత్‌కు ఈ బట్టలు ఊడదీసే ఫాంటసీ ఏమిటో?'అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, అభివృద్ధి అంశాలపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సోమవారం అసెంబ్లీలో బీజేఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, తాను గవర్నర్ చేసిన ప్రసంగంపై ప్రశ్నిస్తే ఎక్కడా సమాధానం చెప్పకుండా దాటవేశారని, రుణమాఫీ పూర్తిచేశామని గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారన్నారు. నిర్మల్‌లో ఏ గ్రామానికి వెళ్లినా సరే.. రుణమాఫీ పూర్తి అయిందని నిరూపిస్తే ఎంతటి శిక్షకైనా తాను సిద్ధమేనని మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. కాళేశ్వరం అవినీతి, ధరణి, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేస్ అంశాలపై చర్యలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

### బీసీ బిల్లు ఆమోదంపై హర్షం

సాక్షి, హైదరాబాద్: బీసీలకు విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రాజకీయ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ సోమవారం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.



# అపాయింట్‌మెంట్ ఇవ్వండి

- బీసీ రిజర్వేషన్ల అంశంపై అన్ని పార్టీల నేతలం వచ్చి కలుస్తాం: ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ
- రాష్ట్ర అసెంబ్లీ రెండు బిల్లులను ఆమోదించిందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే అంశంలో సహకరించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మోదీని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరుతూ సోమవారం రాత్రి లేఖ రాశారు. ''రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానం మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులగణన సర్వే నిర్వహించాం. ఆ సర్వే నివేదికల ఆధారంగా రాష్ట్రంలోని బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో రెండు బిల్లులను పెట్టి చర్చించాం. అన్ని రాజకీయ పక్షాలు ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చాయి. బిల్లులు ఆమోదం పొందాయి. ఈ చర్చ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం సహకారం కోరాలని రాజకీయ పక్షాలు సూచించాయి. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీల తరఫున మిమ్మల్ని కలసి మీ సహకారాన్ని అభ్యర్థిస్తున్నాం. సానుకూలంగా స్పందించి అపాయింట్‌మెంట్ ఇవ్వగలరు''అని ఆ లేఖలో సీఎం కోరారు.

#### చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టండి

రైల్వేశాఖ ఇటీవల ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కోరుతూ రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు సీఎం సోమవారం రాత్రి లేఖ రాశారు. చర్లపల్లి టెర్మినల్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ లాజిస్టిక్ హబ్‌గా మరో కేంద్రం ఏర్పాటు కావడం సంతోషకరమని చెప్పారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరును ఈ టెర్మినల్‌కు పెట్టడం సముచితమని పేర్కొన్నారు.

# 'బీసీ' బిల్లులు ఏకగ్రీవం

▶ మొదటి పేజీ తరువాయి

చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం అడుగులు వేస్తోంది'' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించబోనని చెప్పారు. ఫిబ్రవరి 4వ తేదీని సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుదామన్నారు.

**ఏకాభిప్రాయంతో వెళదాం.. నాయకత్వం వహిస్తా..**

బీసీల లెక్క తెలియకపోవడం వల్లే రిజర్వేషన్లపై గతంలో సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్రం కులగణన సర్వే చేపట్టామన్నారు. ''బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును చట్టం చేసేలా కేంద్రంపై అన్ని పక్షాలు ఒత్తిడి పెంచాలి. దీనిపై తెలంగాణ సమాజం ఏకాభిప్రాయంతో ఉందనే సందేశాన్ని కేంద్రానికి పంపాలి. బీసీ రిజర్వేషన్ సాధనకు నేను నాయకత్వం వహిస్తా. సభా నాయకుడిగా హామీ ఇస్తున్నా. అఖిలపక్ష నాయకులంతా సమైక్యంగా ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రిని కలుద్దాం. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ తీసుకొచ్చే బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలి. మేం రాహుల్ గాంధీని కలిసి పార్లమెంట్లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరుతాం. ఆయనను కలిసే బాధ్యత, ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించేలా చేసే బాధ్యతను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అప్పగిస్తాం..'' అని సీఎం రేవంత్ చెప్పారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా చేసే బాధ్యత ప్రతి పార్టీపైనా ఉందన్నారు.

**చట్టబద్ధత లభించేలా శాస్త్రీయంగా చేశాం: భట్టి**

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాటు కసరత్తు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టిందన్నారు. శాస్త్రీయంగా, పకడ్బందీగా 50రోజుల్లో దీనిని పూర్తి చేశామని చెప్పారు. ''దేశంలో కులగణన శాస్త్రీయంగా జరిగిందంటే అది ఒక తెలంగాణ రాష్ట్రంలోనే.. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలు కులగణన చేయాల్సిన సమయంలో మనం చేసిన సర్వేను మోడల్ గా తీసుకునేంత శాస్త్రీయంగా చేయించాం. గతంలో కేంద్రానికి పంపిన అనేక తీర్మానాలు శాస్త్రీయంగా లేకపోవడం వల్ల కోర్టుల్లో వీగిపోయేవి. అలాంటి అనుభవాలను దృష్టిలో పెట్టుకొని శాస్త్రీయంగా సర్వే చేయించి, అసెంబ్లీలో తీర్మానం చేశాం..'' అని భట్టి వివరించారు. కుల గణనలో బీసీలు 50.36 శాతం ఉన్నట్టు తేలిందని.. దీని ఆధారంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కోసం సభలో తీర్మానం పెట్టామన్నారు. తెలంగాణలో కులగణన జరిగినట్టే దేశవ్యాప్తంగా జరగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

**తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు సాధించుకుందాం**



తమిళనాడులో మొత్తం 68శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని.. 50శాతం రిజర్వేషన్లు మించకూడదన్న నిబంధన కూడా ఈడబ్ల్యూఎస్‌కు 10శాతం రిజర్వేషన్లతో తొలగిపోయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. తమిళనాడు స్ఫూర్తితో రిజర్వేషన్లు సాధించుకుందామన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందన్న నమ్మకం ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ రాజకీయ పార్టీలన్నీ ఒకేతాటిపై ఉన్నాయన్న సంకేతం పంపిద్దామని.. ఎవరేం చేశారన్నది మరోసారి చర్చించుకుందామని చెప్పారు. బీసీ బిల్లుపై చర్చించేందుకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించే బాధ్యతను బీజేపీ నేతలు తీసుకోవాలన్నారు. బీజేపీకి ఇది శీలపరీక్ష లాంటిదని, ఆ పార్టీ వ్యాపారుల పార్టీనా, బీసీల పార్టీనా తేలిపోతుందని పేర్కొన్నారు.


**న్యాయపరమైన చిక్కులకు అవకాశం**



కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ సభ్యుడు కేపీ వివేకానంద పేర్కొన్నారు. బీసీ కమిషన్, డెడికేటెడ్ కమిషన్‌ల పేర్లతో శాస్త్రీయత లేకుండా బీసీ రిజర్వేషన్లను నిర్ధారిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఎవరైనా కోర్టుల్లో సవాల్ చేసే అవకాశం ఉందని.. బీజేపీ కేంద్ర మంత్రులు కూడా అదే చెప్తున్నారని తెలిపారు. ఒక పద్ధతి ప్రకారం రిజర్వేషన్ల పెంపు ప్రక్రియ జరగాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా జరిపారని పేర్కొన్నారు. అయితే వివేకానంద చెప్పిన అంశాలపై మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అభ్యంతరం తెలిపారు. కేంద్రం ఎలాంటి అడ్డంకులు లేకుండా బీసీ బిల్లును ఆమోదిస్తుందని చెప్పారు. ఇందుకోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానిని కలుస్తామన్నారు. ఇక బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కాంగ్రెస్ సభ్యులు బీర్ల అయిలయ్య, వాకిటి శ్రీహరి, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ప్రసంగించారు.

#### స్వీట్లు తినిపించుకున్న మంత్రి, ఎమ్మెల్యేలు

బీసీ బిల్లులకు శాసనసభ ఆమోదం పొందడం మంత్రి పొన్నం, బీసీ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి, బీసీ ఎమ్మెల్యేలు స్వీట్లు తినిపించుకున్నారు.




### బీసీలపై అప్పుల భారం: పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: సమాజానికి అనేక రకాల సేవలందిస్తున్న బలహీనవర్గాలకు సరైన న్యాయం జరగడం లేదని బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లుపై సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. పదేళ్లుగా ప్రభుత్వాలు చేస్తున్న అప్పుల వల్ల బీసీలపై భారం పెరిగిందన్నారు. రెండు కోట్ల జనాభా ఉన్న బీసీల్లో అతి తక్కువ మందికే ఉపాధి లభిస్తోందన్నారు. న్యాయ స్థానాల్లోనూ పీపీలు, జీపీలు సరైన సంఖ్యలో లేరన్నారు. న్యాయమూర్తుల ఎంపికలో కొలీజియంకు సిఫార్సు చేసే వారిలోనూ బీసీలు తక్కువగా ఉంటున్నారని తెలిపారు. చట్టసభల్లోనూ బీసీల సంఖ్య అతి తక్కువగా ఉందన్నారు. బీసీ కార్పొరేషన్లకు భారీగా నిధులిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు, ఖర్చులో మాత్రం తీసికట్టుగా ఉన్నాయన్నారు. ఇవి కాగితంపైనే ఉంటున్నాయని, బీసీ సంక్షేమం ఆచరణలో శూన్యమని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ బిల్లును తమ పార్టీ సమర్థిస్తోందని, అయితే, బీసీలకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న మేలు చేయాలని సూచించారు. అప్పులపై పాయల్ శంకర్ మాట్లాడుతున్నప్పుడు కాంగ్రెస్ సభ్యులు జోక్యం చేసుకుని.. పదేళ్ల మోదీ ప్రభుత్వంలోనే అప్పులు పెరిగాయన్నారు బీసీ బిల్లుపై చర్చలో రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి వాణి విన్పించేలా మాట్లాడాలని మంత్రి పొన్నం కోరారు.

### వెనుకబడ్డ ముస్లింలకు రిజర్వేషన్: అక్బరుద్దీన్



ముస్లిం మైనార్టీల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లును సమర్థించిన ఆయన బీసీలకు సరైన న్యాయం జరిగేందుకు కలిసి పనిచేసేందుకు సిద్ధమన్నారు. ఢిల్లీపై ఒత్తిడి తెచ్చేందుకు ఎలాంటి ప్రణాళిక రూపొందించినా తాము ముందుంటామని చెప్పారు. కేంద్రపాలిత ప్రాంతాల్లో రిజర్వేషన్ల అమలు భిన్నంగా ఉందన్నారు. అక్కడ ఎలాంటి లక్ష్మణ రేఖ లేదని తెలిపారు. భారత రాజ్యాంగంలోని వివిధ ఆర్టికల్స్ బీసీ రిజర్వేషన్‌పై ఇచ్చిన స్పష్టతను పరిశీలించాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పును ముందు పెట్టి రిజర్వేషన్లకు బ్రేకులు వేయడం సరికాదన్నారు. రాజకీయాలు, విద్య, ఉద్యోగాల్లోనే కాకుండా ప్రభుత్వ కాంట్రాక్టుల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని, అప్పుడే బీసీలు ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తారని తెలిపారు. బీసీల రిజర్వేషన్లపై వివిధ కమిషన్లు ఇచ్చిన నివేదికలను సభలో విన్పించారు.

### బీసీలకు అన్యాయం: కూనంనేని



బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తరతరాలుగా అన్యాయం జరుగుతోందని, సమాజాన్ని ప్రభావితం చేసే శ్రమ జీవులు ఈ వర్గాల్లోనే ఉన్నారని, దీన్ని సరిచేయాల్సిన అవసరం ఉందని సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వందశాతం రిజర్వేషన్లు అమలు చేసిన కాంగ్రెస్ పార్టీని అభినందించారు. ప్రైవేటు విభాగంలోనూ రిజర్వేషన్ విధానం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోతున్న నేపథ్యంలో ఇది సరైన మార్గమన్నారు. వెనుకబడిన ముస్లింలకు మేలు చేసేలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కృషి చేశారని తెలిపారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించేలా ప్రతిపాదన చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న రిజర్వేషన్లపై అధ్యయనం చేయాలని కోరారు. బిల్లుకు మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు.

### కల్యాణమస్తు పథకాన్ని భవిష్యత్‌లో అమలు చేస్తాం : మంత్రి పొన్నం

సాక్షి, హైదరాబాద్ : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం నుంచి ఇప్పుడే తేరుకుంటున్నామని, అందుకే భవిష్యత్‌లో కల్యాణమస్తు పథకాన్ని అమలు చేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అయితే గత ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. మూడేళ్లుగా ఉన్న ఆ బకాయిలు చెల్లిస్తున్నట్టు తెలిపారు. కల్యాణమస్తు పథకం అమలుపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత సోమవారం శాసనమండలిలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. గతంలో పెళ్లి అయ్యి, పిల్లలు పుట్టిన తర్వాత కూడా కల్యాణలక్ష్మి పథకం చెక్కులు తీసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు బకాయిలు లేకుండా వెంటనే చెల్లిస్తున్నామన్నారు. కాగా, మహిళలను మోసగిస్తున్నామని మరోమారు కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించిందని, ఇందుకు మంత్రి సమాధానమే నిదర్శనమని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు.

### మహిళా వ్యతిరేక సీఎంగా రేవంత్ చరిత్రలో నిలుస్తారు: కవిత

సాక్షి, హైదరాబాద్: 'సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే తామిచ్చిన హామీలు, మేనిఫెస్టో..ఖురాన్, బైబిల్, భగవద్గీతతో సమానమని చెప్పారు. అదంతా అబద్ధమని శాసనమండలి సాక్షిగా బయటపడింది'అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శాసనమండలి మీడియాపాయింట్‌లో కవిత చెప్పారు. 'కల్యాణమస్తు పథకం ద్వారా రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పారు. ఇదే విషయంపై మేము అడిగిన ప్రశ్నకు ఆ పథకాన్ని ప్రవేశపెట్టే ఆలోచన లేదని మండలి సాక్షిగా సమాధానం చెప్పారు. మహిళల పట్ల ఏ మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. మహిళా వ్యతిరేక ముఖ్యమంత్రిగా చరిత్రలో రేవంత్‌రెడ్డి నిలుస్తారు. అసెంబ్లీలో కూడా సీఎం రేవంత్ మహిళల పట్ల దురుసుగా మాట్లాడారు. దీన్ని చీకటిరోజుగా భావిస్తున్నాం'అని కవిత చెప్పారు.

### బలహీన వర్గాలకు చరిత్రాత్మక దినం



సాక్షి హైదరాబాద్: 'అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ బిల్లు ప్రవేశపెట్టడం తెలంగాణలో బలహీనవర్గాలకు చరిత్రాత్మక దినం. బడుగు,బలహీన వర్గాలకు సామాజికన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని నిరూపితమైంది' అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. 'బీజేపీ నిజంగా బీసీలకు న్యాయం చేయాలని ఉంటే..కేంద్రంలో కూడా ఈ బిల్లు ఆమోదించేలా అధిష్టానాన్ని ఒప్పించాలి. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 23 శాతానికి తగ్గించి చరిత్రాత్మక తప్పు చేసిన బీఆర్‌ఎస్.. ఇప్పుడు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని చెప్పిన కేసీఆర్, గెలిచాక తానే గద్దెనెక్కి దళితులను అవమానించారు'అని అన్నారు.

### శాస్త్రీయత లేదు.. 3 సవరణలు అవసరం

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుపై బీఆర్‌ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్
- మద్దతు ఇస్తున్నట్టు నటిస్తూ.. అడ్డుతగిలేలా బీఆర్‌ఎస్ వ్యవహారం: మంత్రి పొన్నం కౌంటర్



సాక్షి, హైదరాబాద్: బీసీల రిజర్వేషన్ల పెంపు ప్రాతిపదిక, ప్రక్రియ ఏర్పాటులో శాస్త్రీయత లోపించిందని..ఇది 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అడ్డుగా మారే పరిస్థితి రాకుండా చూడాల్సి ఉందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. దీని కోసం బిల్లుకు మూడు సవరణలు చేయాలని సూచించారు. శాసనసభలో మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం అధికార పక్షం తరఫున ఆది శ్రీనివాస్ చర్చను ప్రారంభించారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ పక్షాన గంగుల కమలాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు బిల్లులకు బీఆర్‌ఎస్ పూర్తి మద్దతు తెలుపుతోందన్నారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, అక్కడి ప్రభుత్వం పకడ్బందీగా ప్రక్రియ చేపట్టడంతోపాటు నాటి ముఖ్యమంత్రి జయలలిత బాధ్యతను భుజాన వేసుకొని పట్టుదలగా వ్యవహరించటమేనన్నారు. అదే తరహాలో తెలంగాణలో కూడా జరగాల్సి ఉందని, కానీ ఇక్కడ అలా లేదన్నారు. దీంతో మంత్రి పొన్నం జోక్యం చేసుకుని, బిల్లును పాస్ చేసుకునేందుకు మద్దతు తెలుపుతున్నట్టు చెబుతూనే అడ్డుతగిలేలా బీఆర్‌ఎస్ వ్యవహరిస్తోందని, రాజకీయాలు చేస్తోందని, మాజీ మంత్రి హరీశ్‌రావు వెనకనుంచి గంగుల కమలాకర్‌కు ఏవేవో సూచించి తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు.

**న్యాయపరమైన చిక్కులు లేకుండా ఉండాలనే..: హరీశ్‌రావు**



హరీశ్‌రావు కలగజేసుకొని మాట్లాడుతూ తమిళనాడు తరహాలో సాఫీగా రిజర్వేషన్లు అమలులోకి రావాలంటే న్యాయపరమైన చిక్కులు లేకుండా ఉండాలని, అందుకే తాము సూచనలు చేస్తున్నామే తప్ప రాజకీయం కోసం కాదన్నారు. రిజర్వేషన్లు సాధించుకునేందుకు పార్లమెంటులో పోరాటానికి బీఆర్‌ఎస్ కలిసి వస్తుందని, రాహుల్‌గాంధీ కూడా గట్టిగా పూనుకోవాలన్నారు. తాము సూచించే సవరణలను బిల్లులో చేర్చాలని కోరారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బిల్లులో ఈ అంశం చేర్చడానికి ఢిల్లీ పర్మిషన్ అవసరం లేనందున వెంటనే అమలులోకి తేవాలని కోరారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ అన్ని పార్టీలు కలిసి వచ్చి బీసీల రిజర్వేషన్లు సాధించుకోవాలని, మిగతా రాజకీయ విషయాలను వేరే సందర్భంలో చర్చించుకుందామని పేర్కొన్నారు.

### బీసీ ఎమ్మెల్యేలతో మంత్రులు పొన్నం, సురేఖ భేటీ

'బిల్లు'పై సీఎంకు ఎమ్మెల్యేల కృతజ్ఞతలు



సమావేశంలో పొన్నం, సురేఖ, ఆది శ్రీనివాస్, మఖన్‌సింగ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ముందు బీసీ వర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు సమావేశమయ్యారు. అసెంబ్లీ హాలులో జరిగిన ఈ భేటీలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్యతో పాటు ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మకన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఈర్ల శంకరయ్య, ప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీ ముందుకు వచ్చేంతవరకు కాంగ్రెస్ పార్టీ పక్షాన జరిగిన కృషిని ఈ సందర్భంగా చర్చించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### మిరపకాయల దండలతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల నిరసన

మిర్చికి రూ.25 వేల గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: మిర్చి రైతుల సమస్యలు పరిష్కరించాలని, క్వింటాల్ మిర్చికి రూ.25 వేల గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు వినూత్న నిరసన తెలిపారు. సోమవారం శాసన మండలి ఆవరణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు ఎండు మిరపకాయల దండలను మెడలో వేసుకొని ఆందోళనకు దిగారు. తెలంగాణలో గత సీజన్‌లో 4 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు అయిందని, అయితే ధరలేక ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం 2 లక్షల 40 వేల ఎకరాలకు తగ్గిపోయిందని ఎమ్మెల్సీలు కవిత, మధుసూదనాచారి, ఇతర బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన వ్యక్తం చేశారు. నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్ మిర్చికి రూ.25 వేల ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మిర్చి పంటను విదేశాలకు ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మిర్చి పంటను సుగంధ ద్రవ్యాల బోర్డు నుంచి ఆహార పంటల జాబితాలో చేర్చాలని కోరారు.

### ఇది గాంధీభవన్ కాదు.. అసెంబ్లీ!

- ప్రశ్నోత్తరాల సమయం కుదింపుపై ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఆగ్రహం... సభ నుంచి పార్టీ సభ్యులతో కలసి వాకౌట్

సాక్షి, హైదరాబాద్: 'శాసనసభను నడపడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రశ్నలను ఆపుతోంది. వాటిని మార్చిపడేస్తోంది. దీనికి నిరసనగా వాకౌట్ చేస్తాం. ఇది గాంధీభవన్ కాదు, అసెంబ్లీ. అసెంబ్లీని అసెంబ్లీ లాగా నడపండి..'అని ప్రభుత్వంపై ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో సోమవారం ఉదయం 11.30 గంటలకే ప్రశ్నోత్తరాల సమయం ముగిసిందని, మిగిలిన ప్రశ్నలకు సమాధానమిచ్చినట్టు భావించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించడంతో అక్బరుద్దీన్ తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. రంజాన్ ఉపవాసాల్లో ఉండటంతో కనీసం నీళ్లు కూడా తాగనని, ఈ పరిస్థితిలో సైతం సభకు వస్తే 4 నిమిషాలు మాట్లాడే అవకాశం ఇవ్వరా? అని నిలదీశారు. గత డిసెంబర్ నుంచి ఇచ్చిన జీవోలు, బీఆర్‌ఓల వివరాలను అడిగితే ఆ ప్రశ్నను పూర్తిగా మార్చేశారని తప్పుబడుతూ ఆయన తన పార్టీ ఎమ్మెల్యేలతో కలసి సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రశ్నోత్తరాలు గంటపాటే జరుగుతాయని ముందే ప్రకటించానని, అక్బరుద్దీన్ విజ్ఞప్తిని పరిశీలిస్తానని స్పీకర్ బదులిచ్చారు.

**అప్పుడెందుకు ప్రశ్నించలేదు?: సీతక్క**

గత ప్రభుత్వ హయాంలో సభను అప్రజాస్వామికంగా నడిపినపుడు ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ఎందుకు ప్రశ్నించలేదని మంత్రి సీతక్క నిలదీశారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గత పదేళ్లలో ఎన్ని ప్రశ్నలు వాయిదా పడ్డాయి? అప్పుడెందుకు అడగలేదు? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ప్రశ్నోత్తరాలే లేకుండా అసెంబ్లీని నడిపిందన్నారు.


### 'తెలుగు వర్సిటీ' బిల్లుకు మండలి ఆమోదం

సభలో బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ చట్ట సవరణ బిల్లుకు శాసనమండలి ఆమోదం తెలిపింది. సోమవారం మధ్యాహ్నం మండలిలో వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. . కాగా, సభ్యులంతా బిల్లుకు మద్దతు పలకడంతో సభ ఆమోదించింది. అనంతరం మండలిని మంగళవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్టు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

# తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు

- ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ ఆమోదం
- పరిపాలనలో గందరగోళం తొలగించేందుకే అన్న సీఎం
- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు ప్రతిపాదన
- వ్యతిరేకించిన బీజేపీ.. ఓయూకు సురవరం పేరు పెట్టాలని సూచన



సాక్షి, హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు సోమవారం శాసనసభ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి పక్షాన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం ఈ బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లు ప్రవేశపెట్టడానికి కారణాలపై సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రకటన చేశారు. తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ సహా పలువురు తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో ఆయన వివరణ ఇచ్చారు.

**పొట్టి శ్రీరాములును తక్కువగా చూడటం లేదు**

'పొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువగా చూడటం లేదు. వారి ప్రాణత్యాగాన్ని అందరూ స్మరించుకోవాలి. పరిపాలనలో భాగంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకున్నాం. రాష్ట్ర పునర్విభజన తర్వాత గత పదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే కొందరు కొన్ని వర్గాల్లో అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర పదవుల్లో ఉన్నవారు కూడా ఇలా చేయడం సమంజసం కాదు. ఉమ్మడి రాష్ట్రంలో హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరుండేది. రాష్ట్ర విభజన తర్వాత ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఏపీకి వెళ్లగా తెలంగాణలో హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకున్నాం. ఇది ఎన్టీఆర్‌ను అగౌరవపరిచినట్టు కాదు. రాష్ట్ర విభజన తర్వాత ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టుకున్నాం. వైఎస్ పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ నరసింహారావు పేరును పెట్టుకున్నాం. ఇదే కోవలో తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టుకున్నాం.

**వ్యక్తులను అగౌరవ పరిచేందుకు కాదు..**

ఏపీలో ఆ పాత పేర్లతో యూనివర్సిటీలు, సంస్థలు కొనసాగనున్నందున తెలంగాణలో కూడా అవే పేర్లతో ఉంటే పరిపాలనలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉన్నందున మార్చుకుంటున్నాం. అంతే కానీ వ్యక్తులను అగౌరవపరిచేందుకు కాదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు బాధ్యతాయుత పదవుల్లో ఉన్న కొందరు కులాన్ని ఆపాదిస్తున్నారు. కుల, మత ప్రాతిపదికన విభజించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకోవటం తప్పు. గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఉన్న స్టేడియంకు ఆయన పేరు తొలగించి నరేంద్ర మోదీ పేరు పెట్టారు. మేం అలాంటి తప్పిదాలు చేయలేదు..'అని రేవంత్ చెప్పారు.

**నేచర్‌క్యూర్ ఆసుపత్రికి రోశయ్య పేరు**

'మాకు ఆర్యవైశ్యులపై, పెద్దలు పొట్టి శ్రీరాములుపై అపార గౌరవం ఉంది. ఆయన త్యాగాలు, ఆయన దేశభక్తిని సమున్నతంగా స్మరించుకునేలా.. ఇటీవలే ఘనంగా ప్రారంభించుకున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు ఆయన పేరు పెట్టుకుందాం. ఈ మేరకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు లేఖ రాస్తా. ఇక మాజీ సీఎం కె.రోశయ్య ఇంటికి చేరువలోనే ఉన్న ప్రభుత్వ నేచర్ క్యూర్ ఆసుపత్రికి రోశయ్య పేరు పెట్టడంతో పాటు ఆవరణలో ఆయన విగ్రహం కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తాం. ఇక సురవరం ప్రతాపరెడ్డి మహనీయుడు. తెలంగాణలో కవులు లేరు అంటూ అపహాస్యం చేసిన పరిస్థితిలో 354 మంది ఉద్దండ కవులతో సమావేశమై గోల్కొండ పత్రికలో వారి ప్రతిభకు పట్టం కట్టి తెలంగాణ కవుల గొప్పదనాన్ని చాటారు. నిజాంకు వ్యతిరేకంగా గొప్పగా పోరాడిన ధీశాలి..'అని సీఎం వివరించారు.

#### తెలుగుజాతి త్యాగాన్ని అవమానించడమే: బీజేపీ

తెలుగు వర్సిటీ పేరు మార్పును బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. 'పొట్టి శ్రీరాములు ఓ ప్రాంత నేత కాదు. ఆయన గాంధీజీతో కలిసి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ విముక్తి కోసం ప్రాణత్యాగం చేశారు. అలాంటి మహనీయుడి పేరును తొలగించటం అంటే తెలుగు జాతి త్యాగాన్ని అవమానపరచటమే. సురవరం ప్రతాపరెడ్డి పేరును.. నిజాంకు గుర్తుగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ పేరును మార్చి దానికి పెట్టాలి..'అని బీజేపీ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అహ్మదాబాద్‌లోని స్టేడియానికి సర్దార్ పటేల్ పేరును తొలగించారన్న ఆరోపణ సరికాదని, స్టేడియం ప్రాంగణానికి ఆయన పేరే ఉందని, అక్కడి క్రికెట్ గ్రౌండ్‌కు మాత్రమే నరేంద్ర మోదీ పేరు పెట్టారని ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డి చెప్పారు.

మరిన్ని అసెంబ్లీ వార్తలు | సాక్షి ప్లస్- ఈపేపర్‌లో

# ఫొటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలది గొప్ప చరిత్ర..

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- సాక్షి ఫొటోగ్రాఫర్లకు అవార్డులు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మనుంచి పురస్కారం అందుకుంటున్న సాక్షి ఫొటోగ్రాఫర్లు మోహనాచారి, రాజేశ్‌రెడ్డి, శివప్రసాద్, భాస్కరాచారి వేణు, యాకయ్య

కాచిగూడ (హైదరాబాద్): ఫొటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆ రోజుల్లో దేశంలోనే ప్రప్రథమంగా ఫొటో కెమెరాలు కొనుగోలు చేసి ఫొటోగ్రఫీని అభివృద్ధి చేసిన ఘనత హైదరాబాద్, త్రిపుర సంస్థానాలకే దక్కిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉత్తమ వార్త, తెలంగాణ పండుగలు, సాంస్కృతిక విభాగాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతలైన ఉత్తమ ఫొటో జర్నలిస్టులకు గవర్నర్ అవార్డులను అందజేశారు. అవార్డులు అందుకున్న సాక్షి దినపత్రిక ఫొటోగ్రాఫర్లలో పి.మోహనాచారి (హైదరాబాద్), రాజేశ్ రెడ్డి (హైదరాబాద్), భాస్కరాచారి (మహబూబ్‌నగర్), శివప్రసాద్ (సంగారెడ్డి), వేణు (జనగామ), యాకయ్య (సూర్యాపేట) ఉన్నారు. కార్యక్రమంలో ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యుడు దేవులపల్లి అమర్, రాష్ట్ర టూరిజం సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, అఖిల భారత రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తుడి దేవేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్, ప్రధానకార్యదర్శి కేఎస్ హరి పాల్గొన్నారు.

## విద్యకు నిధులు పెంచాలి

- గవర్నర్‌ను కోరిన ఎమ్మెల్సీ కొమరయ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచేందుకు కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కోరారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్‌సురేశ్‌తో కలిసి ఆయన సోమవారం గవర్నర్‌ను కలిశారు. టీచర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు.

Attn: Inter 1st & 2nd Year / XI & XII Std. Students
Join Excellent Coaching for
IPM/BBA '25/26
(5 year Integrated MBA from IIMs*)
IPMAT | JIPMAT | NPAT | Symbiosis SET, etc.
- 50 Mock tests on latest pattern
- 150 Sectional tests for practice
- Doubt clarifying Sessions
CLAT 2026
(Exam in December 2025)
SLAT | AILET | LNAT | MH-CET (Law) | Christ
- Extensive online support
- Legal Reasoning & GK Classes by expert faculty
Batches starting on 20th, 21st & 24th March.
T.I.M.E. Triumphant Institute of Management Education Pvt Ltd
www.t4e.info/enroll
CLAT PREP
Call: 40088300 / 40068400

## హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగాల తుది జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల్లో వసతిగృహ సంక్షేమాధికారి ఉద్యోగ నియామకాల తుది జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం విడుదల చేసింది. మొత్తం 581 ఉద్యోగాలకు 574 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తూ.. జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ ఉద్యోగాలకు 2022 డిసెంబర్ 12న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ తర్వాత గతేడాది జూన్ 24 నుంచి 29వ తేదీ వరకు ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించింది. మొత్తం 1,45,359 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా ఎంపికైన వారిలో 561 మంది గ్రేడ్–1, గ్రేడ్–2, లేడీ సూపరింటెండెంట్ కేటగిరీ ఉద్యోగాలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలో 13 మంది వార్డెన్, మ్యాట్రిన్ పోస్టులకు ఎంపికయ్యారు.

## కారుణ్య నియామకాలు భేష్

- ఉద్యోగ జేఏసీ హర్షం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించడం శుభపరిణామమని ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వివిధ శాఖల్లో 588 కుటుంబాల కారుణ్య నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేయడం ఉద్యోగుల్లో ధైర్యం నింపిందన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ దాదాపు 560 మంది అర్హులైన అభ్యర్థులకు కారుణ్య నియామకాలు చేపట్టిందని వెల్లడించారు.

## సీఎం వ్యాఖ్యలు సరికాదు

- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఖండన

సాక్షి, హైదరాబాద్: డీఏ బకాయిలు, పీఆర్సీ అమలును అడగొద్దని, అవి కావాలంటే నెలనెలా జీతాలే ఇవ్వలేమని ముఖ్యమంత్రి ప్రకటించటాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ తీవ్రంగా ఖండించింది. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని.. వారికి న్యాయంగా రావలసిన బకాయిలను లేదా దాచుకున్న సొమ్మును తిరిగి చెల్లించాలని మాత్రమే అడుగుతున్నారని స్పష్టం చేసింది. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఉద్యోగుల ఆగ్రహాన్ని ప్రభుత్వం చవిచూడాల్సి వస్తుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి హెచ్చరించారు.

## డీ1 వద్ద సాగుతున్న తవ్వకాలు

- 24 రోజులైనా దొరకని కార్మికుల ఆచూకీ

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి సోమవారం నాటికి 24 రోజులు పూర్తయ్యాయి. కార్మి కుల ఆచూకీ కోసం.. కడావర్ జాగిలాలు గుర్తించిన డీ2, డీ1 పాయింట్ల వద్ద తవ్వకాలు చేపట్టగా, ఇప్పటికే డీ2 వద్ద మట్టి తొలగింపు పూర్తి అయ్యింది. డీ1 వద్ద తవ్వకాలు కొనసాగుతున్నాయి. సింగరేణి, ర్యాట్‌హోల్ మైనర్స్ ఆధ్వర్యంలో తవ్వ కాలు జరుగుతున్నాయి. టీబీఎంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మెటల్ ప్లాట్‌ఫామ్ తవ్వకాలకు ఆటంకంగా ఉండటంతో వాటిని కట్ చేస్తూ తొలగిస్తున్నారు. దొంతరలుగా ఉన్న వీటిని తొలగించేందుకే ఎక్కువ సమయం పడుతోంది. సాంకేతిక సమస్యలతో రోబోటిక్ తవ్వకాలు ఇంకా మొదలు కాలేదని చెబుతున్నారు. ఈ ప్రక్రియ మొదలైతే పెద్ద ఎత్తున బుర ద, మట్టి, రాళ్లను కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలించవచ్చని భావిస్తున్నారు. మొత్తం 8 మంది కార్మికులు ప్రమా దానికి గురికాగా ఇప్పటివరకు ఒక కార్మికుడి మృతదేహం మాత్రమే లభించింది. ప్రస్తుతం డీ1 పాయింట్ వద్ద తవ్వకా లు కొనసాగుతుండగా మరోసారి కడావర్ జాగిలాలతో గాలింపు చేపట్టారు.








తల్లిదండ్రులే నీటి ఊటను విషపూరితం చేస్తారు.
మళ్లీ ప్రవాహం ఎందుకు చేదుగా ఉందని ఆశ్చర్యపోతుంటారు.
– జాన్ లాకి



సాక్షి
మంగళవారం, 18 మార్చి 2025

# ఎంతకాలం ఈ 'పంచాయతీ'!

రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా అయిదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో గద్దెనెక్కేవారు పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల విషయంలో మీనమేషాలు లెక్కించటం పరిపాటయింది. దేశంలో దాదాపు అన్ని చోట్లా ఇదే పోకడ. పల్లెసీమల్లో ప్రజాతంత్ర భావన పెంపొందించి, పంచాయతీరాజ్ సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా పనిచేయనివ్వాలని... వాటికవే అభివృద్ధి ప్రణాళికలను స్వతంత్రంగా రూపొందించుకోవటానికి అవకాశమీయాలన్న సంకల్పంతో మూడున్నర దశాబ్దాల క్రితం 73వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. కానీ ఇప్పటికీ చాలా ప్రభుత్వాలు ఆ సంస్కృతికి పాతరేస్తున్నాయని పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇటీవలి నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామ పంచాయతీ కాలపరిమితి ముగిసేలోపు లేదా గడువుతీరిన ఆర్నెల్లలోగా ఎన్నికలు పూర్తి చేయాలని రాజ్యాంగంలోని 243 ఈ (3) నిర్దేశిస్తోంది. ఎన్నికలు సకాలంలో నిర్వహించని రాష్ట్రాలకు కేంద్రంనుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు ఆగిపోతున్నాయి. పర్యవసానంగా అభివృద్ధి కుంటుపడుతోంది. గ్రామాలు పారిశుద్ధ్య లేమితో, అందువల్ల కలిగే అంటువ్యాధులతో ఇబ్బంది పడుతున్నాయి.

పంచాయతీ ఎన్నికలు వాయిదా వేయటానికి రాష్ట్ర ప్రభుత్వాలు వేనవేల సాకులు చెబుతుంటాయి. అందులో రిజర్వేషన్ల నిర్ధారణ ఒకటి. పారదర్శకత పాటించకుండా, నిబంధనలకు విలువీయకుండా రూపొందించే ఆ రిజర్వేషన్లు ఎటూ వివాదాస్పదంగా మారి న్యాయస్థానాల పరిశీలనకు వెళ్తాయని, దాన్ని సాకుగా చూపి ఎన్నికలు వాయిదా వేయొచ్చని చాలా ప్రభుత్వాలు అనుకుంటున్నాయి. ఈ విషయంలో కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అగ్రస్థానంలో ఉంది. ఆఖరుసారి 2006లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన ఆ కేంద్రపాలిత ప్రాంతం ఆ తర్వాతనుంచి ఏదో ఒక కారణం చూపిస్తూ వాయిదాల్లోనే కాలక్షేపం చేస్తోంది. సిగ్గుచేటైన సంగతేమంటే... అక్కడ ఫ్రెంచ్ పాలన సాగినన్నాళ్లు స్థానిక సంస్థలు అద్భుతంగా పనిచేశాయి. అభివృద్ధి పనుల ప్రణాళికలు ఒక క్రమపద్ధతిలో అమలయ్యాయి. తీరా స్వాతంత్ర్యం వచ్చాక ఆ సంస్థలు నీరసించాయి. అధికారంలోకి ఎవరొచ్చినా ఏదో వంకతో వాటి ఎన్నికలు వాయిదా వేస్తూ పోయారు. 1954లో జరిగిన రిఫరెండమ్ ద్వారా భారత్‌లో విలీనానికి మెజారిటీ ప్రజలు సుముఖత వ్యక్తం చేయగా, 1962లో అది పూర్తి స్థాయి కేంద్రపాలిత ప్రాంతమైంది. 1968–2024 మధ్య కేవలం ఒకే ఒక్కసారి 2006లో పంచాయతీరాజ్ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలైనా మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల పుణ్యమే. అంటే గడిచిన 56 ఏళ్లలో ఒకే ఒక్కసారి మినహా పుదుచ్చేరిలోని 108 పల్లెల బాగోగులు చూసే ప్రజాతంత్ర వ్యవస్థలే లేవన్నమాట! చిత్రమేమంటే... వివిధ అంశాల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటివి కూడా సకాలంలో ఎన్నికలు నిర్వహించటంలో విఫలమయ్యాయి. ఇప్పటికి నాలుగేళ్లుగా కర్ణాటకలో పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలు లేవు. మహారాష్ట్ర మూడేళ్లనుంచీ, అస్సాం, జమ్మూ–కశ్మీర్ వంటివి రెండేళ్లనుంచీ ఎన్నికలు నిర్వహించటం లేదు. తెలంగాణ, తమిళనాడు, ఉత్తరాఖండ్‌లలో గతేడాది ఎన్నికలు జరగాల్సివుంది. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ అసెంబ్లీ సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది కనుక త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు మార్గం సుగమం అవుతుందని ఆశించాలి.

రాజ్యాంగంలో ఎన్ని ఉన్నతాశయాలున్నా ఆచరణ సరిగా లేనప్పుడు అవన్నీ నీరుగారిపోతాయి. అందులో పల్లెసీమల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడే పంచాయతీరాజ్ సంస్థలను నిర్లక్ష్యం చేయటం ఒకటి. నిజానికి నిర్దిష్ట కాలంలో సక్రమంగా ఎన్నికలు జరిగేచోట సైతం ఆ సంస్థల పనితీరు ఏమంత ఆశాజనకంగా లేదు. నిధుల విడుదలలో జాప్యం, నాసిరకంగా పనులుండటం, సిబ్బంది కొరత వగైరాలు ఎన్నోవున్నాయి. ఇక మహిళలకు పంచాయతీరాజ్ వ్యవస్థలో పెద్ద పీట వేయాలని 73వ రాజ్యాంగ సవరణ ప్రతిపాదించింది. అందుకోసం వారికి మూడోవంతు స్థానాలు కేటాయించాలని నిర్దేశించింది. అయితే దీన్ని 50 శాతానికి మార్చాలని మెజారిటీ రాష్ట్రాలు భావించాయి. ఒక లెక్క ప్రకారం 21 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు సగం స్థానాలు మహిళలకు కేటాయించాయి. కానీ విషాదమేమంటే... మహిళల పేరుమీద వారి భర్తలో, తండ్రులో అధికారం వెలగబెడుతున్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని తగిన చర్య తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టు నిస్సహాయత వ్యక్తం చేసింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఈ సంగతి చూడాలని ఆదేశించింది. అటు తర్వాత ఈ సమస్య పరిష్కారానికి ఒక కమిటీ వేశారుగానీ జరిగిందేమీ లేదు. ప్రజా సేవారంగంలో మహిళలు చొరవగా పాల్గొనటా నికి ఉద్దేశించిన విధానం కాస్తా ఇలా దారితప్పుతోంది.

దశాబ్దాల తరబడి పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తూ పోవటంవల్ల పల్లెసీమల్లో వర్ధిల్లాల్సిన ప్రజాస్వామిక వాతావరణం లోపిస్తోంది. తమకున్న వనరులేమిటో, తమ అవసరాలేమిటో సమీక్షించుకుని ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలో నిర్ణయించుకోవాల్సిన పంచాయతీరాజ్ సంస్థలు నిధుల కోసం బేలగా ఎదురు చూస్తున్నాయి. పల్లెల్లో సమస్యలన్నీ అపరిష్కృతంగా ఉండిపోవటంవల్ల ఆ సంస్థలపై ప్రజలకు ఒక రకమైన చిన్నచూపు ఏర్పడుతోంది. అందుకే పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించినట్టు పంచాయతీరాజ్ ఎన్నికలు సకాలంలో జరిగేలా చూడాలి. పుదుచ్చేరి మాదిరి నిరవధికంగా వాయిదాలతో పొద్దుపుచ్చుతూ, పంచాయతీలను నామ మాత్రావశిష్టంగా మార్చే ప్రభుత్వాలను దారికి తీసుకొచ్చేందుకు కొత్త మార్గాలు వెదకాలి.

# భస్మాసుర హస్తంగా... ట్రంప్!

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

సమస్యలను పరిష్కరించగలిగే అధికారం కలిగినవారే కొత్త సమస్యలను, సవాళ్లను కొనితెస్తే ఎలా ఉంటుంది? అచ్చు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారంలా ఉండదూ! 'అమెరికా ఫస్ట్' నినాదంతో ఎన్నికలలో మళ్లీ గెలిచి 47వ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన ట్రంప్ పట్ట పగ్గాలు లేనివిధంగా తీసుకుంటున్న నిర్ణయాలతో అంతర్జాతీయ సమాజం ఆర్థికంగా అల్లకల్లోలంగా మారుతున్నది.

ట్రంప్ దేశాధ్యక్షుడు అయిన వెంటనే అమెరికాకు సంబంధించి పలు రక్షణాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. అమెరికా పౌరసత్వంపై ఆంక్షలు, విదేశాలకు అందించే సహాయ నిధులలో కోత, అక్రమ వలసదారులపై వేటు, అమెరికన్ ప్రభుత్వ ఉద్యోగుల కుదింపునకు, దుబారా నివారణకు ఎలాన్ మస్క్ నేతృత్వంలో 'డోజ్' ఏర్పాటు తదితర నిర్ణయాలకు చాలావరకు సానుకూల స్పందన వచ్చింది. కానీ వివిధ దేశాలతో జరిపే ఎగుమతులు, దిగుమతులలో సమాన స్థాయిలో సుంకాలు విధిస్తామనీ, టారిఫ్‌ల విషయంలో ఎవ్వరికీ మినహాయింపులు ఉండవనీ తెగేసి చెప్పడంతో అంతర్జాతీయ వాణిజ్యంలో అనిశ్చితి ఏర్పడింది. 'తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే' అనే ఓ ముతక సామెతను గుర్తు తెచ్చే విధంగా ట్రంప్ ఒకవైపు భారత ప్రధాని నరేంద్ర మోదీ, భారత దేశ ప్రజల పట్ల తనకు ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయని చెబుతూనే భారత్ నుంచి దిగుమతయ్యే సరుకులపై అధిక సుంకాలు వేస్తామని తేల్చేశారు.

పరస్పర సుంకాల విధానం అంటే, ఏదైనా ఒక దేశం అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులపై ఎంత మొత్తాన్నైతే దిగుమతి సుంకంగా విధిస్తుందో, అమెరికా కూడా సదరు దేశ ఉత్పత్తులపై అంతే సుంకం విధిస్తుందంటూ ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించేశారు. కెనడా, మెక్సికోల నుంచి దిగుమతి చేసుకొనే ఉత్పత్తులపై 25%; చైనా ఉత్పత్తులపై 10% సుంకం విధిస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అలాగే, భారత్ వద్ద చాలా సంపద ఉందనీ, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే కార్లపై భారత్ 100 శాతం సుంకాలు విధిస్తోంది కనుక... ఆ మేరకు మేమూ సిద్ధమేనంటూ ట్రంప్ సాక్షాత్తూ మోదీ సమక్షంలోనే కుండబద్దలు కొట్టారు.

### సుంకాలకు శ్రీకారం చుట్టింది అమెరికాయే!

ప్రపంచం మొత్తం ఓ అంతర్జాతీయ గ్రామంగా మారాలనీ, స్వేచ్ఛా ప్రపంచ వాణిజ్యం వల్ల అన్ని దేశాలూ లాభపడతాయంటూ తొలుత విదేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 1929 నుంచి ఆంక్షలు విధించడం మొదలుపెట్టింది అమెరికాయే. దాంతో, అంతర్జాతీయ వాణిజ్యంలో క్రమంగా అన్ని దేశాలూ పాల్గొనడం మొదలైంది. వాణిజ్య సుంకాలకు సంబంధించి అంతర్జాతీయ నిబంధనలు ఏర్పరచడం తప్పనిసరి అని అన్ని దేశాలూ అంగీకారానికొచ్చిన నేపథ్యంలోనే 1948లో 'గాట్' (జనరల్ అగ్రిమెంట్ ఫర్ ట్రేడ్ అండ్ టారిఫ్) ఒప్పందం మొదలైంది. దాంతో 'అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్య సమాజం' ఆవిర్భవించింది.

1994లో 117 దేశాలు గాట్ ఒప్పందంపై సంతకాలు చేశాయి. అందులో భారత్ కూడా ఉంది. 'వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్' (ప్రపంచ వాణిజ్య సంస్థ)లోని సభ్య దేశాల నడుమ వాణిజ్య ఒప్పందాలు జరగడం; సుంకాల విధింపునకు సంబంధించి పలు దఫాలు చర్చలు జరిగి ఆ యా దేశాలపై విధించిన ఆంక్షల విషయంలో సడలింపులు చోటు చేసుకొన్నాయి. భారతీయ జౌళి ఉత్పత్తుల దిగుమతులపై అప్పటివరకు ఉన్న ఆంక్షల్ని చాలా దేశాలు ఎత్తి వేశాయి. ఇదంతా చరిత్ర!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

### ఎవరికి నష్టం?

'అమెరికన్లను రక్షించేందుకు ఈ సుంకాలు అవసరం' అని ట్రంప్ తన నిర్ణయాలను సమర్థించుకొంటున్నారు. పైగా, దీనికోసం అమెరికా అధ్యక్షుడిగా తనకున్న అసాధారణ అధికారాలను ఉపయోగించుకొని 'అంతర్జాతీయ ఆత్యయిక ఆర్థిక అధికారాల చట్టం' (ఐఈఈపీఏ)ను ఉపయోగించుకొంటున్నారు. దీనివల్ల అమెరికా న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికీ, ట్రంప్ నిర్ణయాలను సమీక్షించడానికీ అవకాశం లేకుండా పోయింది. ప్రజల స్పందన ఎలా ఉన్నా, అమెరికా దేశీయ స్టాక్ మార్కెట్లు మాత్రం తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. రోజుల వ్యవధిలోనే లక్షల డాలర్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. చమురు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. చౌకగా లభించే శ్రామిక శక్తి దూరమైంది. ఈ విపరిమాణాలతో అమెరికా ద్రవ్యోల్బణ రేటు ప్రస్తుతం ఉన్న 2.9 శాతం నుంచి 3.3 శాతానికి చేరుకొంటుందని అక్కడి ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే.. అమెరికాలోని భారతీయులు కూడా ఆ మేరకు నష్టపోతారు.

ట్రంప్ దూకుడును నియంత్రించే శక్తి ఎవరికి ఉంది? రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై బైడెన్ అనుసరించిన వైఖరికి భిన్నంగా ట్రంప్ రష్యాకు అనుకూలంగా మారిపోవడంతో రష్యా అధ్యక్షుడు పుతిన్ అనివార్యంగా ట్రంప్‌ను సమర్థిస్తున్నారు. బ్రెజిల్, రష్యా, ఇండియా సభ్య దేశాలుగా ఉన్న 'బ్రిక్స్' కూటమి అమెరికా ఆధిపత్యాన్ని తగ్గించడానికి ఒక దశలో డాలరు చెల్లింపుల వ్యవస్థ నుంచి వైదొలగాలని భావించినప్పటికీ మారిన పరిస్థితుల నేపథ్యంలో ఆ ప్రతిపాదనను విరమించుకొనే అవకాశం ఉంది.

'అమెరికా హితం ప్రపంచ హితం, అమెరికా శోకం ప్రపంచ విషాదం' అనే ఓ వ్యంగ్య నానుడి ఉంది. అంటే అమెరికా ఏది చేసినా ప్రపంచానికి మంచి చేస్తుంది కనుక అన్ని దేశాలూ గొర్రెల్లా తలలు ఊపాల్సిందే. కానీ ట్రంప్ తీసుకొంటున్న సమాన టారిఫ్ నిర్ణయాలు ప్రపంచ వాణిజ్యాన్ని చావుదెబ్బ తీసే పరిస్థితులు కనిపిస్తున్న నేపథ్యంలో మిగతా దేశాలు ఏ విధంగా స్పందిస్తాయన్నది ఆసక్తికరం.

### భారత రైతాంగానికి రక్షణ అవసరం

నిజానికి, అభివృద్ధిలో వెనుకబడిన దేశాలు తమ దేశీయ ఉత్పత్తులను రక్షించుకోవడానికి అధిక సుంకాలు విధించడం సహజం. ఉదాహరణకు మన దేశంలోకి ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడే వ్యవసాయ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించనట్లయితే... దేశ రైతాంగానికి పండించే పంటలకు కనీస మద్దతు ధరలు లభించక వారి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ఒకవేళ భారత ప్రభుత్వం కనుక ట్రంప్ హెచ్చరికలకు తలొగ్గి, అమెరికా వ్యవసాయ దిగుమతులపై ప్రస్తుతం విధిస్తున్న సుంకాలను తగ్గించినట్లయితే... భారతీయ మార్కెట్లను అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులు ముంచెత్తుతాయి. ఫలితంగా భారతీయ రైతాంగం మరింతగా కష్టాల ఊబిలోకి కూరుకుపోతుంది.

కాగా, అమెరికాకు భారత్ చేస్తున్న ఎగుమతులలో వస్త్రాలు, ఔషధాలు, ఐటీ ఆధారిత సేవలు, అల్యూమినియం, ఉక్కు, ఇంకా కొన్ని రకాల వ్యవసాయ ఉత్పతులు ప్రధానంగా ఉన్నాయి. వీటిపై అమెరికా అధిక సుంకాలు వేస్తే మన దేశంలోని పరిశ్రమలు నష్టపోతాయి. నష్టాన్ని నివారించాలంటే కొత్త మార్కెట్లను అన్వేషించాలి. అది ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పని కాదు. అందువల్ల... దేశ పారిశ్రామిక రంగాన్ని 'ట్రంప్' సవాళ్ల నుంచి రక్షించుకోవడం కేంద్ర ప్రభుత్వానికి తలకు మించిన భారమే. ట్రంప్ ఏకపక్షంగా పెంచిన సుంకాలపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)కు ఫిర్యాదు చేసింది. భారత్ కూడా అమెరికా మీద ఒత్తిడి తేవడానికీ, తన ప్రయోజనాలను కాపాడుకోవడానికీ దృఢంగా వ్యవహరించాలి.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి

- అమెరికా ఆధిపత్యాన్ని తగ్గించడానికి 'బ్రిక్స్' కూటమి ఒక దశలో డాలరు చెల్లింపుల వ్యవస్థ నుంచి వైదొలగాలని భావించినప్పటికీ మారిన పరిస్థితుల నేపథ్యంలో ఆ ప్రతిపాదనను విరమించుకొనే అవకాశం ఉంది.
- రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై డోనాల్డ్ ట్రంప్ రష్యాకు అనుకూలంగా మారిపోవడంతో రష్యా అధ్యక్షుడు పుతిన్ అనివార్యంగా ట్రంప్‌ను సమర్థిస్తున్నారు.
- ఒక వేళ భారత ప్రభుత్వం అమెరికా వ్యవసాయ దిగుమతులపై సుంకాలను తగ్గించినట్లయితే... భారతీయ మార్కెట్లను అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ముంచెత్తుతాయి. ఫలితంగా ఇక్కడి రైతులు నష్టపోతారు.

## సోషల్ మీడియా

### ఫ్రాన్స్ వంతు



ఫ్రాన్స్ నాయకుడొకరు 'స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ'ని అమెరికా తిరిగివ్వాలని డిమాండ్ చేశారని వార్త. ఒకప్పుడు ఫ్రాన్స్ బాధ్యతాయుతంగా ఉండేది. చిర్రుబుర్రులాడే అమెరికా 'ఫ్రెంచ్ ఫ్రైస్' పేరును 'ఫ్రీడమ్ ఫ్రైస్'గా మార్చాలని నిర్ణయించడం నాకు గుర్తుంది. ఇప్పుడు మూర్ఖంగా ఉండే వంతు ఫ్రాన్స్‌దేమో!

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

### క్రూరత్వానికి మద్దతా?



ప్రతీ బలోచీ అయినవాళ్లను కోల్పోవడమో, వాళ్లే మాయమవడమో, లేదా తమ కుటుంబ సభ్యులు ఏ క్షణమైనా మాయమవుతారేమోనన్న భయంలో జీవించడమో జరుగుతోంది. తీవ్రవాదాన్ని 'పెకిలించి వేద్దాం', దయ చూపొద్దు అంటున్న పాకిస్తాన్ సైన్యం మాటలకు కేరింతలు కొడుతున్నవాళ్లు ఈ వివేచన లేని క్రూరత్వానికి మద్దతిస్తున్నట్లే!

– నిదా కిర్‌మాణీ, పాక్ సోషియాలజిస్ట్

### మానేస్తారు!



అమెరికాకు వలస వెళ్లిన అన్ని రకాల జనాలు (డాక్టర్ల నుంచి స్ట్రాబెర్రీలు ఏరేవాళ్ల దాకా) నెమ్మదిగానే అయినా కచ్చితంగా పోవడం మానేస్తారు. బయటికి వెళ్లగొడతారేమో అనే భయంలో ఉండటం కంటే మరోచోట తమ జీవితాల్ని నిర్మించుకోవడం సులభమని గ్రహిస్తారు.

– విజయ్ ప్రసాద్, రచయిత

### ఎన్నో కేసులు



క్రీడలు, క్రీడా సంఘాలకు సంబంధించి 2015 నుంచి దాదాపు 770 వ్యాజ్యాలు భిన్న కోర్టుల్లో భిన్న స్థాయిల్లో ఉన్నాయి. ఇందులో 462 హైకోర్టుల్లో, 22 సుప్రీంకోర్టుల్లో ఉన్నాయి.

– మిహిర్ వాసవ్‌దా, స్పోర్ట్స్ రైటర్

### మంచిది బోరే!



సముచిత విధానం, న్యాయమైన పాలన, అత్యంత ప్రాధాన్యత కలిగిన సూత్రాలు చాలా బోరు కొట్టినట్టుగా ధ్వనిస్తాయి.

– పాల్ గ్రాహమ్, శాస్త్రవేత్త

ఇన్ బాక్స్

## వర్సిటీ భూములను కాపాడాలి!

1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో 399 మంది పోరాట యోధుల బలిదానం కారణంగా... 610 జీవో విడుదలయ్యింది. తెలంగాణ ఉద్యమం మొదటి దశలోని ఆరు పాయింట్ల ఫార్ములాలో రెండవ అంశంగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఏర్పాటు చేయబడింది. ఆర్టికల్ 371–ఈ ప్రకారం ఏర్పడిన ఈ విశ్వవిద్యాలయానికి ప్రాథమికంగా 2,324.05 ఎకరాల భూమిని కేటాయించారు. అయితే, కాలక్రమేణా గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ హైదరాబాద్, బస్ డిపో, టీఐఎఫ్ఆర్ లాంటి అనేక ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం భూమిని బదిలీ చేయడంతో ప్రస్తుతం విశ్వవిద్యాలయం వద్ద కేవలం 1,800 ఎకరాల భూమి మాత్రమే మిగిలింది. యూనివర్సిటీకి మొదటి వైస్ చాన్సలర్‌గా ఉన్న గుర్ బక్షి సింగ్ 2 సంవత్సరాల నిర్విరామ కృషితో దాదాపు 29 కిలోమీటర్ల విస్తీర్ణంలో 'గ్రేట్ వాల్ ఆఫ్ యూనివర్సిటీని' నిర్మించారు. ఆ తదనంతర పరిస్థితుల్లో హైద్రాబాద్ నగరం అభివృద్ధి చెంది, ఐటీ హబ్‌గా మారడంతో ఇక్కడి భూములకు విలువ పెరిగిపోయింది. దీంతో ఈ భూములను కబ్జా చేసే ప్రయత్నాలు ఎక్కువయ్యాయి.

ఈ చర్యలకు వ్యతిరేకంగా యూనివర్సిటీలో ఉన్న లెఫ్ట్, రైట్ వింగ్‌ల విద్యార్థి సంఘాలు, దళిత, బహుజన, బీసీ విద్యార్థి సంఘాలు, యూనివర్సిటీ అధికారులు పోరాడుతున్నారు. యూనివర్సిటీకి చెందిన భూమిలో ఎలాంటి ఆదేశాలు, అనుమతులు లేకుండా ఇప్పటికే దేవాలయ నిర్మాణాలను చేపట్టారు. యూనివర్సిటీ చుట్టు రక్షణ కవచంగా నిర్మించిన గోడను పడగొట్టి అక్రమ నిర్మాణాలను చేపట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రహరీ గోడను కూల్చడం వల్ల బయటి వ్యక్తులు యూనివర్సిటీలో ప్రవేశించి, విద్యార్థినీ విద్యార్థులపై భౌతికపరమైన దాడులు చేయడానికీ, అలాగే క్యాంపస్‌లో సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడానికీ అవకాశం ఉంది.

యూనివర్సిటీ అద్భుతమైన జీవావరణాన్ని కలిగి ఉంది. ఇందులో 3 చెరువులు, కొండ ప్రాంతాలు, 734 రకాల మొక్కలు, జింకలు, అడవి పందులు, నెమళ్ళు, 15 రకాల కుందేళ్ళు, 220 రకాల పక్షులున్నాయి. ఈ భూములను కబ్జా చేసి పరిశ్రమలు, ఇతర భవనాలు నిర్మిస్తే కాంక్రీట్ జంగిల్‌గా మారి ఈ జీవావరణం పూర్తిగా దెబ్బతింటుంది. కాబట్టి ఈ యూనివర్సిటీ భూములు కబ్జా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

– వై. శివ ముదిరాజ్, తెలంగాణ బీసీ కులాల జాక్ చైర్మన్

# మహారాష్ట్ర రాజకీయ చదరంగం

అభిప్రాయం



జిల్లా గోవర్ధన్

రాజకీయాల్లో ఇవ్వాళ్టి మిత్రుడు రేపు కాబోయే శత్రువు; అదే విధంగా నేటి శత్రువే రేపటి మిత్రుడు అనే నానుడికి చక్కని ఉదాహరణ మహారాష్ట్ర ప్రస్తుత రాజకీయాలు. 2024 నవంబరులో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 288 స్థానాలకు గాను మహాయుతి కూటమి ప్రధాన భాగస్వామ్య పక్షాలైన భారతీయ జనతా పార్టీ 105, ఏక్‌నాథ్ షిండే శివసేన 57 స్థానాలు కైవసం చేసున్నాయి. దీంతో ఆ కూటమి తిరిగి అధికారం చేజిక్కించుకుని పాలిస్తోంది. అయితే కూటమి రెండోసారి పాలనకు 100 రోజులు నిండేలోపే మొత్తం మరాఠా రాజకీయ చిత్రం రసవత్తరంగా తయారయ్యింది.

ఎన్నికల ఫలితాల రోజు సాయంత్రమే (2024 నవంబర్ 23) దేవేంద్ర ఫడ్నవీస్ నాగపూర్ వెళ్ళి ఆర్ఎస్ఎస్ ప్రముఖులతో; ఢిల్లీ వెళ్లి బీజేపీ అగ్ర నేతలతో చర్చలు జరిపి ముఖ్యమంత్రి పీఠం కోసం తన బాటను సుగమం చేసుకొన్నారు. చివరి వరకు ఏక్ నాథ్ షిండే సీఎం కుర్చీ వదలటానికి సుముఖంగా లేనప్పటికీ మోదీ–షాల బుజ్జగింపుతో, ఆయన ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. తను కోరుకున్న హోం శాఖ కూడా దేవా భావు (ఫడ్నవీస్)కే దక్కింది. ఇక అప్పటి నుండి అలక పాన్పు పట్టారు షిండే. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన ఈ వంద రోజుల్లో (మార్చి 15 నాటికి) కొన్ని గమ్మత్తయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

మాజీ ముఖ్యమంత్రి షిండే గతంలో చేపట్టిన పలు ప్రాజెక్టులను 'తనిఖీ' చేయవలసిందిగా ముఖ్యమంత్రిగా అధికార పగ్గాలు చేపట్టగానే ఫడ్నవీస్ అధికారులకు హుకుమ్ జారీ చేశారు. మరో వైపు భాజపాతో దోస్తీ వదలుకున్న శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే, సీఎం ఛాంబర్ చేరుకుని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలవటం షిండే వర్గీయులను ఆశ్చర్యపరచింది. ఆ తర్వాత ఫిబ్రవరి 21న కొత్త ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ఎన్‌సీపీ నేత శరద్ పవార్ అధ్యక్షతన జరిగిన అఖిల భారత మరాఠీ సాహిత్య సమ్మేళనంలో ఆయన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేని అవార్డుతో సత్కరించటం ఇక్కడ ఉద్ధవ్ వర్గీయులను ఆశ్చర్య పరచింది. పవార్ లాంటి సీనియర్ నేత తమ పార్టీ ద్రోహిని, 'రాష్ట్రీయ గౌరవ్ పురస్కారం'తో సత్కరించటం మింగుడు పడలేదు వారికి. (శరద్ పవార్ పాచిక ప్రభావంతో 2019లో బీజేపీతో తెగదెంపులు చేసుకుని, కాంగ్రెస్–ఎన్‌సీపీ కూటమికి చేరింది అవిభక్త శివసేన). ఇది చాలదన్నట్టు ప్రధాని నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆ కార్యక్రమానికి పవార్ ఆహ్వానించటంలోని రాజకీయం ఏమిటో ఎన్‌సీపీ కార్యకర్తలకు కూడా బోధ పడలేదు. ప్రస్తుత పరిస్థితులను నిశితంగా గమనిస్తే ఎవరు ఎవరి అనుయాయులో, ఎవరు ఎవరి శత్రువులో తేల్చుకోలేని పరిస్థితి!



ఏక్‌నాథ్ షిండేతో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఓటమి చవిచూసిన ఉద్ధవ్ ఠాక్రేను మరింత గాయపరచాలని, ఆయన 20 మంది ఎమ్మెల్యేలలో కొందరిని తన వైపు లాక్కొని, ఉద్ధవ్ రాజకీయ భవిష్యత్తునే మట్టిలో కలపాలని షిండే వ్యూహం. ఇది ఇలా ఉంటే... శివసేన పార్టీకి కంచుకోటగా ఉన్న కొంకణ్ ప్రాంతంలోని షిండే సన్నిహితుడు, కేబినెట్ మంత్రి, ఉదయ్ సామంత్‌ను లోబరచుకుని, ఆయన ద్వారా షిండే వర్గాన్ని రెండుగా విభజించి పార్టీ చీఫ్ బలాన్ని తగ్గించే యోచనలో బీజేపీ ఉందనేది ఒక చర్చ. అది గ్రహించిన వెంటనే ఉదయ్ సామంత్ ప్రాముఖ్యాన్ని తగ్గిస్తూ, తనే అసలైన టీం కెప్టెన్ అని షిండే తేల్చేశారు. ఇదే సమయంలో ఇక షిండే 'బాలే ఖిల్లా'గా చెప్పుకునే, ముంబై నగర శివారులోని థానేలో బీజేపీ పాగా వేసి ఆయనను ఇరుకున పెట్టాలని బీజేపీ వర్గీయులు అక్కడ తరచుగా క్యాంపులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన సందర్భంగా ఫడ్నవీస్ పేర్కొనడం ఈ సందర్భంగా గమనార్హం. దానికి అనుగుణంగానే క్షేత్ర స్థాయిలో కమలనాథులు పావులు కదుపుతున్నారు.

227 కార్పొరేటర్లతో గ్రేటర్ ముంబయ్ మున్సిపల్ కార్పొరేషన్ ఆసియాలోనే అతి పెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా ప్రసిద్ధి చెందింది. బ్రిటిష్ కాలం నాటి ఈ కార్పొరేషన్ గత నాలుగు దశాబ్దాల (1985) నుండి 'మరాఠీ అస్మిత'(ఆత్మ గౌరవం) నినాదంతో శివసేన అధీనంలోనే ఉంది. ప్రస్తుతం రెండుగా చీలిన ఈ ప్రాంతీయ పార్టీని తిరిగి ఇక్కడ పూర్వ వైభవం వరిస్తుందా అనేది ఒక ప్రశ్న. మొన్న జరిగిన విధాన సభ ఎన్నికల్లో 36 ముంబై సిటీ అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఉద్ధవ్ శివసేన కేవలం 10 సీట్లు గెలవటంతో పార్టీ కేడర్ కొంత వరకు జవసత్వాలు కోల్పోయింది. దీనికి తోడు చీలిపోయిన శివసేన (షిండే) పార్టీ, అటు బీజేపీలు ఉద్ధవ్ పార్టీలోని క్రియాశీల కార్యకర్తలను, కార్పొరేటర్లను తమ తమ వైపు ఆకర్షించుకోవటం మొదలుపెట్టాయి. ఇక ఎన్‌సీపీ నేత, కింగ్ మేకర్ శరద్ పవార్ ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో; షిండే సీఎం పదవికి ఎసరుపెట్టిన దేవేంద్ర ఫడ్నవీస్ (బీజేపీ)కి ఉద్ధవ్ ఠాక్రే దగ్గర అవుతున్న వైనాన్ని గమనిస్తే మహారాష్ట్రలో రాబోయే నగర పాలక సంస్థల ఎన్నికలు ఎంత రసవత్తరంగా మారనున్నాయో అంచనా వేయొచ్చు.

వ్యాసకర్త మాజీ పీఎఫ్ కమిషనర్, ముంబయ్
మొబైల్: 98190 96949

# మనసే కీలకం

పూర్వం అనుభవజ్ఞులైన ఆలోచనాపరులు జీవితానికి సంబంధించి వివిధ దశలలో వివిధ నియమాలను, జీవన పద్ధతులను నిర్దేశించి చెప్పి, ఆ పద్ధతుల ప్రకారం జీవనం సాగిస్తే జీవితం సాఫీగా సాగడమే కాకుండా, ఇహలోకం నుండి నిష్క్రమించడం కూడా అంతగా బాధ అనిపించకుండా జరుగుతుందని చెప్పారు. ఆ పద్ధతులలో ఒక వ్యక్తి గృహస్థుడిగా జీవితాన్ని గడిపి, నిర్వర్తించాల్సిన ధర్మాలన్నిటినీ నిర్వర్తించాక, వృద్ధాప్యంలో సన్యాసాశ్రమం స్వీకరించి అడవులకు వెళ్ళిపోయి, శేషజీవితం అక్కడ గడిపి ప్రశాంతంగా ఇహలోకాన్ని వదిలి ప్రకృతిలో కలిసి పొమ్మన్నారు. అయితే, సన్యాసం స్వీకరించడం అందరూ చేయగలిగే పని కాదనీ, ఎన్నో ఏళ్లుగా పెంచుకున్న బంధాలను ఒక్కసారిగా తెంచుకుని వెళ్ళిపోవడం ఏ కొద్దిమందికో మాత్రమే సాధ్యమయ్యే పనీ అని ఆచరణలో తేలింది. ఫలితంగా, అడవులకే వెళ్ళాలా? అన్న ప్రశ్న ఉదయించి, అన్నిటికీ మనసే మూలం కనుక, మనసు చేసే ఆలోచనలను కట్టడి చేస్తే, అడవులకు వెళ్ళవలసిన పనిలేదని చెప్పుకోవడం జరిగింది.




ఈ విషయంపై దంతులూరి బాపకవి రచించిన 'మూర్తిత్రయోపాఖ్యానము' ద్వితీయాశ్వాసంలో ఆసక్తికరమైన వివరణ ఉంది. 'ఇల్లు వదిలిపెట్టి అడవులలోకి అడుగుపెట్టగానే కామ సంబంధమైన ఆలోచనలు కరిగిపోయి, బుద్ధి నిష్కామమై మిగులుతుందా? మిగలదు కదా! అలాగే క్రోధ మోహ మద మాత్సర్యాలనే లక్షణాలు కూడా జీవితంలో ఏదో ఒక క్షణం నుండి మొదలై, మరొక క్షణంలో అంతమవ్వాలని కోరుకున్నప్పుడు అంతమయ్యేవిగా ఉండవు. ఒకవేళ ఎవరైనా అలా అనుకుంటే, తాను అలా అయిపోయానని అంటే... అతడిని మించిన మోసగాడు మరొకడు ఉండడు!' అన్నది ఆ వివరణ సారాంశం. ఆ సందర్భంలో ముఖ్య విషయానికి ముక్తాయింపుగా ఈ క్రింది పద్యం చెప్పబడింది.

**తే. మనసు నిలుపలేని మనుజుండు వనములో**
**నున్నయంత మోక్షయుక్తి లేదు**
**వహ్నిలోన నెన్ని వారముల్ వైచినం**
**గుప్యమునకు హేమగుణము గలదె?**

'మనసును కట్టడి చేసుకోలేకపోతే అడవిలో ఉండి కూడా ప్రయోజనం ఏమీ కలగదు. అగ్నిలో ఎన్ని వారాల పాటు మండించి కరిగించినా కుప్యం (బంగారం, వెండి తక్క అన్యలోహం) బంగారమవుతుందా? కాదు కదా! ఆ విధంగానే ఆలోచనలను అదుపులో ఉంచుకోకుండా కొనసాగించే అడవులలో జీవనం ప్రయోజనం లేనిదిగా పరిణమిస్తుంద'ని భావం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.చవితి రా.7.03 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** స్వాతి ప.3.15 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.9.25నుండి 11.11 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.32 నుండి 9.20 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.43 వరకు, **అమృత ఘడియలు:** లేవు, శుక్రమూఢమి ప్రారంభం; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.11, **సూర్యాస్తమయం:** 6.06.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

## క్లుప్తంగా...

### 19న దేవన్నపేట పంప్‌హౌస్ ప్రారంభం

- ఒక మోటార్‌ను ఆన్ చేయనున్న మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశలో భాగంగా దేవన్నపేటలో పంప్‌హౌస్ నిర్మించారు. ఆపంప్‌హౌస్‌లోని ఒక మోటార్‌ను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆన్ చేసి యాసంగి పంటలకు నీటిని విడుదల చేయనున్నారు. మూడు మోటార్లు పంప్‌హౌస్‌లో ఉండగా, ఒక్కో మోటార్ 600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. దేవాదుల ప్రాజెక్టు నిర్వహణ, పర్యవేక్షణ పనులు చూసే కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో అక్కడ పనిచేసే సిబ్బంది జీతాల కోసం 24 రోజులపాటు సమ్మె నిర్వహించారు. దీంతో అప్పట్లో దేవాదుల ప్రాజెక్టు కింద రిజర్వాయర్లకు నీటి పంపింగ్ నిలిచిపోయింది. ప్రస్తుతం సమ్మక్కసాగర్ నుంచి దేవాదుల ప్రాజెక్టు కింద నీటిని ఎత్తిపోస్తుండగా, సమ్మక్కసాగర్‌లో 2.5 టీఎంసీల నిల్వలు మిగిలాయి. రోజూ 1,500 క్యూసెక్కుల ప్రవాహం సమ్మక్కసాగర్‌కు వస్తోంది. దేవన్నపేటలోని మూడు మోటార్లను సిద్ధం చేస్తే రోజూ 1,600 క్యూసెక్కులను ఎత్తిపోసేందుకు అవకాశం ఉంటుంది. దేవాదుల ప్రాజెక్టు కింద 5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, యాసంగిలో 1.9 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.

### ఈ నెల 22న రాష్ట్రానికి జస్టిస్ పీసీ ఘోష్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్వహిస్తున్న విచా రణ కీలక దశకు చేరు కుంది. ఈ నెల 22న హైదరాబాద్‌కు రానున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ 24వ తేదీ నుంచి తుది విడత క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను నిర్వహించి విచారణ ప్రక్రియను ముగించే అవకాశం ఉందని తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తీసుకున్న నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌లకు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించి ప్రశ్నించాల్సి ఉంది. ఈ దఫాలోనే వారికి సమన్లు పంపించి క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని కమిషన్ కోరే అవకాశం ఉంది. ఇప్పటికే పలు దఫాలుగా నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో బరాజ్‌ల నిర్మాణంలో భాగస్వాములైన నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఇంజనీర్లతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులను కమిషన్ ప్రశ్నించి కీలక సాక్ష్యాధారాలు సేకరించింది. వీటిని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్, ఈటల ముందు ఉంచి ప్రశ్నించనున్నట్టు తెలిసింది. అనంతరం వచ్చే నెలాఖరులోగా ప్రభుత్వానికి కమిషన్ నివేదిక సమర్పించే అవకాశాలున్నాయి.

### కళాశాలకు వెళ్లడం ఇష్టం లేక..

- ఇంటర్ విద్యార్థి బలవన్మరణం



సాయిమహేశ్

బయ్యారం: కళాశాలకు వెళ్లడం ఇష్టం లేక ఒక విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహ బూబాబాద్ జిల్లా బయ్యారంలోని కాకతీయనగర్‌లో సోమవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. కాకతీయనగర్‌లో నివసించే అజ్మీరా అనంతరాములు కుమారుడు సాయిమహేశ్(19) సిద్దిపేటలోని ఒక కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజియోథెరపీ చదువుతున్నాడు. హోలీ సందర్భంగా ఇంటికి వచ్చిన సాయిమహేశ్ తిరిగి కళాశాలకు వెళ్లడానికి ఇష్టం లేక.. ఇంట్లో ఎవ రూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కొత్తగా 37 మద్యం బ్రాండ్లు

**రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు కంపెనీల ఆసక్తి**
- ఊహించిన దానికన్నా ఎక్కువ స్పందన.. ఆసక్తి వ్యక్తీకరించిన 15 విదేశీ బ్రాండ్లు
- 15 దేశీయ లిక్కర్.. ఏడు బీర్ బ్రాండ్లు కూడా
- మరో నెలలో అంగీకార ఒప్పందం కుదుర్చుకోనున్న బేవరేజెస్ కార్పొరేషన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ లిక్కర్ మార్కెట్‌లోకి అతిత్వరలో కొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా 37 మద్యం బ్రాండ్లు ఇందుకోసం ముందుకొచ్చాయి. మద్యం సరఫరా కోసం గత నెల 23న బేవరేజెస్ కార్పొరేషన్ కొత్త సరఫరాదారుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఆసక్తి వ్యక్తీకరణ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే దేశంలో తయారయ్యే మద్యం బ్రాండ్లలో 95 శాతం కార్పొరేషన్‌తో రిజిస్టర్ అయిన నేపథ్యంలో 10లోపు బ్రాండ్లు ముందుకొస్తాయని ఎక్సైజ్ వర్గాలు భావించాయి. అయితే ఊహించని స్పందన లభించింది. గడువు ముగిసే సమయానికి ఏకంగా 37 బ్రాండ్లు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో 15 విదేశీ మద్యం బ్రాండ్లు కాగా, మరో 15 దేశీయ మద్యం, ఏడు దరఖాస్తులు బీర్ల సరఫరాకు వచ్చినట్టు తెలుస్తోంది. నోటిఫికేషన్ లేకుండానే కొత్త బ్రాండ్ల సరఫరా కోసం అనుమతినిచ్చారంటూ వివాదాస్పద జాబితాలోకెక్కిన సోం డిస్టలరీస్ కూడా ఈ జాబితాలో ఉందని, బీర్‌తోపాటు లిక్కర్ సరఫరా కోసం ఈ సంస్థ దరఖాస్తు పెట్టిందని సమాచారం.



**ఆచితూచి.. అన్నీ సరిచూసి..**

వచ్చిన దరఖాస్తులను అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే మద్యం సరఫరాకు అంగీకార ఒప్పందం కుదుర్చుకుంటామని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. ఆయా సంస్థల ట్రాక్ రికార్డును పరిశీలించడంతోపాటు ఎంత ధరకు కోట్ చేసింది? ఆ బ్రాండు మద్యానికి ఇతర రాష్ట్రాలు ఎంత చెల్లిస్తున్నాయి? ఏ కేటగిరీలో ఆ బ్రాండు ఉంది? ఆ కేటగిరీకి మన రాష్ట్రంలో చెల్లిస్తున్న ధర ఎంత? ఒకవేళ సంస్థ కోట్ చేసిన ధరకు, ప్రభుత్వ ధరకు తేడా ఉంటే ఏం చేయాలి? ధరల నిర్ధారణ కమిటీకి ప్రతిపాదించాలా లేదా? అనే అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ ప్రక్రియ ముగిసేందుకు కనీసం మరో నెల రోజుల సమయం పడుతుందన్నారు.

**ఆ ధర పెంచితే.. మద్యం ధర పెంపు?**

కొత్త బ్రాండ్ల సరఫరాకు ఒప్పందాలు చేసుకునే సమయంలోనే మద్యం బేసిక్ ధరలను కూడా పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.
- ఇప్పటికే బీర్ల బేసిక్ ధరను పెంచిన విషయం తెలిసిందే. అయితే లిక్కర్ బేసిక్ ధరలను మాత్రం సవరించలేదు. ప్రస్తుతం లిక్కర్ కేస్ బేసిక్ ధర ఐదు స్లాబుల్లో (రూ.565, 700, 1000, 2000, 2000 కంటే ఎక్కువ చొప్పున) ఉంది. ఈ బేసిక్ ధరను కూడా కేస్‌కు రూ.85 చొప్పున పెంచే ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది.
- బీర్ల బేసిక్ ధర పెంచే సమయంలో బహిరంగ మార్కెట్‌లో బీర్ల ధరలను కూడా ఎక్సైజ్ శాఖ సవరించింది. అదే క్రమంలో లిక్కర్ బేసిక్ ధరలను పెంచాల్సి వస్తే మద్యం ధరలు కూడా పెరగొచ్చు. అయితే, లిక్కర్ ధరలు పెంచాలా వద్దా అన్నది రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అంచనాలను బట్టి ఉండొచ్చు. ప్రస్తుత బడ్జెట్‌లో ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.25 వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం అంచనా వేయగా, వచ్చే బడ్జెట్‌లో రూ.30 వేల కోట్ల వరకు వెళితే మాత్రం లిక్కర్ ధరలు పెంచక తప్పదనే అభిప్రాయం ఎక్సైజ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# పాలనపై పట్టుకు మరికొంత సమయం

▶ మొదటి పేజీ తరువాయి

యువతకు భవిష్యత్తు ఇవ్వడానికి ఈ కార్యక్రమం చేపట్టాం. రూ.6 వేల కోట్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని 5 లక్షల మంది నిరుద్యోగులకు రాయితీ పద్ధతిలో ఆర్థిక సహకారం అందిస్తాం. ఇది పార్టీ పథకం కాదు.. పూర్తిగా ప్రజలు, అర్హులైన నిరుద్యోగులకు అమలు చేసే పథకం. పూర్తిగా ప్రజల పథకం'' అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నో హామీలు అమలు చేశామని, పథకాలు, సంస్కరణలు తీసుకువచ్చామని రేవంత్ చెప్పారు.

**అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడపం..:** రాష్ట్రంలో బీసీ జనాభా 56.36 శాతం ఉందని కుల సర్వే ద్వారా తేల్చామని, వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో బిల్లు పెట్టామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై దేశంలోనే మొదటగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టిందన్నారు. ''ప్రభుత్వ ఆదాయం తగ్గినా, అప్పులు పెరిగినా ధైర్యాన్ని కోల్పోలేదు. అబద్ధాల ప్రాతిపదికన ప్రభుత్వాన్ని నడిపించం. దుబారా తగ్గించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నాం. ఇసుక విక్రయంతో రోజువారీ ఆదాయం రూ.3 కోట్లకు పెరిగింది. పన్నుల వసూలులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. నిరుద్యోగ సమస్య 8.8 నుంచి 6.6 శాతానికి తగ్గిందని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయి..'' అని చెప్పారు. రాజీవ్ యువ వికా సం ద్వారా రూ.50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని.. జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటి స్తామని సీఎం తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి నియో జకవర్గంలో 5 వేల మంది వరకు లబ్ధి కలిగిస్తామని, నిజమైన నిరు ద్యోగులకే పథకం అం దిస్తామని వివరించారు.



రాజీవ్ యువ వికాసం పథకం కార్యక్రమాన్ని జ్యోతివెలిగించి ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కొండా సురేఖ, ఆది శ్రీనివాస్, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహేశ్‌గౌడ్, సీతక్క, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు

**నిరుద్యోగ యువత కాళ్లపై నిలబడేలా..: భట్టి**

గత ప్రభుత్వం దశాబ్దకాలంలో ఒక్కసారి కూడా గ్రూప్-1 నియామకాలు చేపట్టలేదని.. తాము కేవలం ఏడాదిలో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో జాబ్ కేలండర్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాని నిరుద్యోగ యువత వారి కాళ్లపై నిలబడేలా, సమాజంలో తలెత్తుకొని ఆత్మగౌరవంతో బతికేలా స్వయం ఉపాధి పథకాలు అందించేందుకు సీఎం రేవంత్ రాజీవ్ యువ వికాసాన్ని తీసుకువచ్చారని భట్టి పేర్కొన్నారు. లబ్ధిదారులను మూడు కేటగిరీలుగా విభజించి, సాయం అందించనున్నట్టు తెలిపారు.

# లగచర్ల, హకీంపేట్ భూములపై స్టేటస్ కో

- మెరిట్ ప్రకారం ఉత్తర్వులు జారీ చేయండి
- సింగిల్ జడ్జికి సీజే ధర్మాసనం సూచన

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట్‌లో కొందరి భూ సేకరణపై సీజే ధర్మాసనం స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. మెరిట్ ప్రకారం విచారణ చేపట్టి.. ఉత్తర్వులు ఇవ్వాలని సింగిల్ జడ్జికి సూచించింది. రెండు అప్పీళ్లను తిరిగి సింగిల్ జడ్జి వద్దకు పంపింది. లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి తదితర గ్రామాల్లో భూ సేకరణ జరిపి మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని సర్కార్ నిర్ణయించింది. దీనికోసం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో 1,177.35 ఎకరాలు సేకరించేలా 2024, నవంబర్ 29న ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 534 ఎకరాలు సర్కార్ భూమి కాగా, మిగతా 643 ఎకరాలు పట్టా భూమి. లగచర్లలో 110.32 ఎకరాలు, హకీంపేట్‌లో 351.10 ఎకరాలు సేకరించనున్నట్లు పేర్కొంది. ఈ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హకీంపేట్‌కు చెందిన కె.శివకుమార్ మరొకరు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పిటిషనర్ల భూ సేకరణపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా.. దీన్ని సవాల్ చేస్తూ ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే భూ సేకరణ చాలావరకు జరిగిందని, ఇలాంటి సమయంలో స్టే ఇవ్వడం సరికాదని చెప్పారు. ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రభుత్వం ఏర్పాట్లు కూడా చేస్తోందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ల భూ సేకరణ (సుమారు 8 ఎకరాలు)పై స్టేటస్ కో ఆదేశాలు జారీ చేస్తూ, విచారణ ముగించింది. మెరిట్‌పై విచారణ చేపట్టి వీలైనంత త్వరగా తుది ఉత్తర్వులు జారీ చేయాలని సింగిల్ జడ్జికి సూచించింది.

### రూ.50 కోట్ల భూమి కబ్జాపై ఏం చేస్తున్నారు?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మునగనూరు, అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రూ.50 కోట్లకుపైగా విలువైన 6.28 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ భూమిని రక్షించడంలో నిర్లక్ష్యానికి తగిన కారణాలు వెల్లడించాలని స్పష్టం చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. అలాగే రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్, వనస్థలిపురం ఎస్‌ఈ, డీఈలకు నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని ఆదేశించింది. రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి ఆక్రమించారని, దీనిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదంటూ జర్నలిస్ట్ చెన్నోజు ప్రశాంత్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

# లక్ష ఎకరాల్లో ఎండిన వరి

▶ మొదటి పేజీ తరువాయి

సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో నమోదైన భూగర్భ నీటి మట్టాలు ఈసారి మార్చి నెలలోనే ఆ స్థాయికి వెళ్లాయి. గత నెలాఖరు నాటికే వికారాబాద్ జిల్లాలో 13.67 మీటర్ల లోతుకు వెళ్లగా, ప్రస్తుతం 14 మీటర్లు దాటింది. కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి, సిరిసిల్ల, మహబూబ్‌నగర్, భద్రాద్రి, భూపాలపల్లి జిల్లాల్లో.. ఫిబ్రవరిలో రాష్ట్ర సగటు భూగర్భ జల మట్టం 8.32 మీటర్లను మించి 9 మీటర్ల నుంచి ఏకంగా 13 మీటర్ల వరకు వెళ్లింది. ఇక మార్చి రెండో వారం దాటే నాటికి కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో భూగర్భ మట్టాలు మరింత అడుగంటినట్లు అధికారులు చెపుతున్నారు.

**రికార్డు స్థాయిలో పంటల సాగు**

రాష్ట్రంలో ఈ యాసంగిలో అత్యధికంగా 73.65 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వరే 56.13 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి బోనస్ కింద క్వింటాలుకు రూ.500 ఇస్తుండడంతో సాగు గణనీయంగా పెరిగింది. సన్నాల సాగు పెరగడంతో సాగునీటి అవసరం మరింత పెరిగింది. పంట కాలం ఎక్కువ కావడంతో నీటి తడులు కూడా ఎక్కువ కావలసి ఉంది. అయితే ఎస్‌ఆర్‌ఎస్‌పీ, దేవాదుల వంటి ప్రాజెక్టుల కింద పొలాలకు వారబందీ కింద ఒక వారం నీరిచ్చి, మరో వారం బంద్ చేస్తుండడంతో వారం పాటు పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. భూగర్భ జలాలపై ఆధారపడి పంటలు వేసిన చాలా గ్రామాల్లో పంటను పశువులకు వదిలేశారు. మొక్కజొన్న పంట కూడా సాధారణ సాగుతో పోలిస్తే ఈసారి ఏకంగా మూడున్నర లక్షల ఎకరాలు అధికంగా సాగైంది. గిట్టుబాటు ధర ఉండడంతో రైతులు 8.09 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఆరు తడి పంటగా సాగయ్యే మొక్కజొన్నకు వారం, పదిరోజులకు కూడా ఒక తడి నీరు ఇవ్వని పరిస్థితుల్లో నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట, మెదక్, సిద్దిపేట, ఖమ్మం జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో మొక్కజొన్న ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

### 'వారబందీ విధానంలోనే సాగునీరు'

సాక్షి, హైదరాబాద్: యాసంగి పంటలకు వారబందీ విధానంలోనే సాగునీరు అందించాలని క్షేత్ర స్థాయిలోని నీటిపారుదల శాఖ ఇంజనీర్లను ఆ శాఖ ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్ ఆదేశించారు. ఒక వారం నీళ్లు ఇచ్చి మరో వారం నిలుపు దల చేయాలని కోరారు. క్షేత్ర స్థాయిలోని సీఈలతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యాసంగి పంటలకు మరో వారం నీళ్లు అందించడం కీలకమని, నెలాఖరులోగా నీటి అవసరా లు తగ్గిపోతాయని అన్నారు. ఎక్కడా పంటలు ఎండకుండా ఈ వారం రోజులు నీళ్లు అందించాలని సూచించారు. ఇప్పటికే నీటిపారుదల శాఖ రూపొందించిన ప్రణాళికను అనుసరించాలని చెప్పారు. శ్రీరామ్‌సాగర్ జోన్-1 కింద ఈ నెల 31 వరకు, జోన్-2 కింద ఈ నెల 24 వరకు చివరి తడిని అందించాలని ఆదేశించారు. సాగర్ ఎడమ కాల్వ ద్వారా 8,500 క్యూసెక్కులు విడుదల చేస్తుండడంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేవని క్షేత్ర స్థాయిలోని అధికారులు వివరించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

**HYDERABAD ARCHDIOCESE EDUCATIONAL SOCIETY (HAES)**
9-1-17/1, Archbishop's House, S. P Road, Secunderabad

**WANTED TEACHERS**

**HAES** invites applications from the qualified and experienced Teachers to work for the chain of schools for the following posts KG, Primary, Middle and High school for all subjects, Computer Staff & PETs.

**Educational Qualification:** Degree with B.Ed. in their respective Methodology.

**Walk in Interview and Demo with lesson plan and resumé on 23-02-2025 (Sunday) from 9:30 a.m. to 1.00 p.m. at St. Mary's High School, St. Francis Street, Secunderabad-500025. Ph: 27701801 / 8977938171**

Vice Chairman – HAES




# అమెరికాలో రోడ్డు ప్రమాదం

**ఓ బాలుడు సహా రాష్ట్రానికి చెందిన ముగ్గురు మృతి**
- ఫ్లోరిడాలో కారును ఢీకొట్టిన ట్రక్కు
- టేకులపల్లి, బక్రిచెప్యాలలో విషాదఛాయలు



ప్రగతిరెడ్డి



హర్వీన్



సునీత

కొండుర్గు/ సిద్దిపేట అర్బన్: అమెరికాలోని ఫ్లోరిడాలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడ్డారు. వీరు ప్రయాణిస్తున్న కారును ట్రక్కు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. మృతులను పురుమాండ్ల సునీత (56), ఆమె కోడలు ప్రగతిరెడ్డి (35), మనవడు హర్వీన్‌రెడ్డి (6)గా గుర్తించారు. బాధిత కుటుంబానికి చెందినవారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామానికి చెందిన పురుమాండ్ల దుర్గారెడ్డి, భార్య సునీతతో కలిసి 40 సంవత్సరాలుగా విదేశాల్లోనే ఉంటున్నారు. ప్రస్తుతం ఉగాండాలో ఉంటున్నారు. వీరి కుమారుడు రోహిత్‌రెడ్డి వివాహం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన పవిత్ర, మోహన్‌రెడ్డి దంపతుల కుమార్తె ప్రగతి రెడ్డితో జరిగింది. రోహిత్, ప్రగతి ఫ్లోరిడాలోని హర్లాండోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. వీరికి హర్వీన్ (6)తో పాటు 8 నెలల వయస్సు గల మరో కుమారుడు ఉన్నారు. భార్య సునీతతో కలిసి ఇటీవల ఫ్లోరిడా వచ్చిన దుర్గారెడ్డి తిరిగి ఉగాండా వెళ్లిపోగా సునీత అక్కడే ఉండిపోయారు. కాగా ప్రగతిరెడ్డి అక్క ప్రియాంక రెడ్డి కూడా భర్త నవీన్‌రెడ్డి, కుమారుడు, కుమార్తెతో కలిసి ఫ్లోరిడాలోనే జాక్సన్ విల్లేలో ఉంటున్నారు. రెండు నగరాల మధ్య దూరం సుమారు 200 కి.మీ కాగా వారాంతంలో రెండు కుటుంబాలు కలిసి రెండు కార్లలో టూర్‌కు వెళ్లాయి. సోమవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా..రోహిత్‌రెడ్డి కుటుంబం ప్రయాణిస్తున్న కారును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రగతిరెడ్డి, హర్వీన్, సునీత అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రోహిత్, బాబు మాత్రం ప్రమాదం నుంచి బయట పడ్డారని, అయితే బాలుడికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. కాగా మృతుల అంత్యక్రియలు ఫ్లోరిడాలోనే నిర్వహించనున్నట్లు తెలిసింది. సిద్దిపేటలో నివాసం ఉంటున్న దుర్గారెడ్డి తమ్ముడు ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు హుటాహుటిన అమెరికాకు ప్రయాణమయ్యారు.

**10 నిమిషాల ముందే ఆ కారెక్కిన హర్వీన్**

హర్వీన్ తిరుగు ప్రయాణంలో తొలుత తమ పెద్దమ్మ వాళ్ల కారు ఎక్కాడు. ప్రమాదం జరగడానికి పది నిమిషాల ముందే అమ్మానాన్న ప్రయాణిస్తున్న కారులోకి వచ్చాడని, అంతలోనే దుర్ఘటన చోటు చేసుకుందని తెలిసింది. ప్రమాద వార్త తెలియడంతో ఇటు టేకులపల్లిలో, అటు బక్రిచెప్యాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**మూడు రోజుల క్రితమే మాట్లాడింది..**

తన కూతురు మూడురోజుల క్రితమే ఫోన్‌లో మాట్లాడిందని, ఇంతలోనే మృత్యు ఒడికి చేరిందంటూ ప్రగతి తల్లి పవిత్ర విలపించారు. అమెరికా వెళ్లిన తాము గత డిసెంబర్ 3న తిరిగి వచ్చామని, తాము వచ్చే ముందే చిన్నబాబును చూసుకోవడానికి సునీత అమెరికా వెళ్లారని తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు ప్రగతిరెడ్డి తల్లిదండ్రులను పరామర్శించారు.

**తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ**
"టూరిజం హౌస్", # 3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన నం.21/SE/TGTDC/2024-25, తేది:17-03-2025
పని పేరు: 01 ఏప్రిల్ నుండి 31 మే 2025 కాలవ్యవధి కొరకు కాళేశ్వరం (సరస్వతీ పుష్కరాలు) వద్ద గుడారాల వసతి (స్త్రీలు & పురుషుల కోసం వసతిగృహాలు & ఇండిపెండెంట్ కాటేజెస్) అభివృద్ధి చేయుట కొరకు ఏజెన్సీ ఎంపిక చేయుటకు ప్రతిపాదన కోసం అభ్యర్థన. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 18-03-2025. అర్హత గల కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై బిడ్లు కోరబడుతున్నవి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.tender.telangana.gov.in లో చూడవలెను.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TGTDC, హైదరాబాద్
DIPR RO No.11607-PP/CL/Advt/1/2024-25, Dt:17-03-2025

**సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం**
తెలంగాణ రాష్ట్ర విద్య మరియు సంక్షేమ మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ : హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు ప్రకటన నం.SE/TGEWIDC/HYD/NIT/646 to 657/2024-25, తేది:17.03.2025
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో GJCs, BC హాస్టల్స్ ACRS సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం, మరమ్మతు పనుల కొరకు అర్హతగల కాంట్రాక్టర్లు అందరి నుండి టెండర్లు కోరబడుచున్నవి (అంచనా వ్యయం రూ. 13.50 లక్షల నుండి రూ. 550.00 లక్షలు). క్ర.సం. 1 నుండి 8 (1వ కాల్), క్ర.సం. 9 నుండి 12 (2వ కాల్). ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు మరియు స్వీకరణకు చివరి తేది : 02.04.2025న సా.5.00 గం. వరకు. గమనిక : G.O.Ms.No. 94 of Transport, Roads & Buildings (R.1) Dept., Dt. : 16.04.08 ప్రకారం మాత్రమే ధరల సర్దుబాటు వర్తిస్తుంది అనగా స్టీల్ మరియు సిమెంట్ కొరకు మాత్రమే. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.inను చూడండి లేదా స్వయంగా సంప్రదించండి: సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, TGEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, ఇ-సేవ్ ఎదురుగా, ఎల్బీ స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం.040-29565991.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TGEWIDC, హైదరాబాద్
DIPR RO No. 11558-PP/CL/Advt/1/2024-25, Dt. 17.03.2025

**hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.
**HMDA చట్టం 2008లోని సెక్షన్ 15(4) క్రింద బహిరంగ ప్రకటన**
(G.O.Ms.No.61 MA & UD Dept., తేది : 07.03.2025)
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (చట్టం నం.8 ఆఫ్ 2008)లోని సెక్షన్ 15లో సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, సదరు సెక్షన్‌లోని సబ్-సెక్షన్ (1) ద్వారా అవసరమైన విధంగా, G.O.Ms.No.33 MA, తేది: 24.01.2013 ప్రకారం ప్రకటిత MDP-2031లో ఉద్దేశించిన భూమి వినియోగానికి దిగువ మార్పును ప్రభుత్వం ఇందుమూలంగా చేస్తోంది. G.O.Ms.No.33 MA&UD, తేది: 24.01.2013 ప్రకారం ప్రకటిత మాస్టర్ ప్లాన్ MDP-2031లో పరిరక్షణ వినియోగ జోన్‌గా ప్రస్తుతం కేటాయించబడినటువంటి, 24281.16 చ.మీటర్ల విస్తీర్ణం గల, మెదక్ జిల్లా, శివంపేట (మం), పెద్ద గొట్టిముక్కల (గ్రా) వద్ద గల సర్వే నం.లు. 320/3/2, 320/3/1/2, 320/2/2, 320/2/1/2, 320/1/2, 320/1/1/2, 318UU/2,318AA/2/4/2, 318/3/2, 318/3/1/2, 318/2/2, 318/2/1/2లోని స్థలం, ఇప్పుడు 'ఆరెంజ్' కేటగిరి క్రింద ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ యూనిట్ నెలకొల్పుట కొరకు తయారీ వినియోగ జోన్‌గా నిర్దేశించడమైనది. పై వాటి యొక్క వివరాలు వెబ్‌సైట్స్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో లభిస్తాయి.
సం/- ప్లానింగ్ ఆఫీసర్ (RC)
DIPR RO No.11615-PP/CL/Advt/1/2024-25, Dt. 17.03.2025

**హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి**
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, రెవెన్యూ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004
**ఇ-టెండరు ప్రకటన**
EP No.
EP.No.302/CGM(E)/Rev.Circle/2024-25, తేది: 18.03.2025
పని పేరు: ఫైల్ నం. 2025-1-1987 ప్రకారం O&M Div.XVIIIలోని తుక్కుగూడ సెక్షన్, సబ్ డివిజన్-II పరిధిలో M/s. రెన్యూసిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సర్వే నం. 114/పి, శ్రీనగర్ గ్రామం, మహేశ్వరం, తుక్కుగూడకు నీటి సరఫరా పెంపుదల కొరకు 500mm dia, 300mm dia DI నీటి సరఫరా పైపులైను వేయుట.
ECV : రూ.68,49,640.59
1. ఇ-టెండరు వివరాలు మరియు డాక్యుమెంటు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in నుండి ఆన్‌లైన్ ద్వారా తేది: 18-03-2025న సా.5.30 గం. నుండి లభిస్తాయి మరియు ఇ-టెండరు బిడ్ డాక్యుమెంట్ల దాఖలుకు చివరి తేది: 21-03-2025న సా.5.30 గం.వరకు.
2. ఇ-టెండరు కోరుతున్న అధికారి పేరు మరియు చిరునామా: చీఫ్ జనరల్ మేనేజర్ (E), HMWSSB, రెవెన్యూ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్ -04.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), రెవెన్యూ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్ -04
కస్టమర్ కేర్ సెంటర్- డయల్: 155313

**మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్**
టెండరు ప్రకటన
NIT No.03/EE/MRDCL/2024-25 తేది : 17.03.2025
పని పేరు : 2025 & 2026 సంవత్సరాల కొరకు 24 నెలల కాలానికి నాగోల్ వద్ద మూసీ నది ఒడ్డున ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్ యొక్క మెయింటెనెన్స్ మరియు ఆపరేషన్. బిడ్ల స్వీకరణకు చివరి తేది, సమయం: టెండరు దాఖలుకు చివరి తేది: 26.03.2025న సా.4.00 గం.వరకు. అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నం. : ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం,MRDCL, 9059320432. 1) డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 19.03.2025న ఉ.10.30 గం. నుండి. 3) బిడ్ల దాఖలుకు చివరి తేది, సమయం : 26.03.2025న సా. 4.00 గం.వరకు. 4) సాంకేతిక బిడ్లు తెరుచుట : 26.03.2025న సా.4.00 గం.కు. 5) ధర బిడ్లు తెరుచుట: 27.03.2025న సా.4.00 గం.కు. గమనిక : బిడ్డర్లు టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు www.tender.telangana.gov.in దర్శించవలసిందిగా సూచించడమైనది. ఏవైనా విచారణలను musirdc@gmail.comకు పంపవలెను. ఏవైనా విచారణల కొరకు సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గారిని MRDCL కార్యాలయంలో కార్యాలయ వేళలలో సంప్రదించవలెను. సంప్రదించు నం. 9059320432. MRDCL, 1వ అంతస్తు, O/o ENC (PH), కాషన బిల్డింగ్, AC గార్డ్స్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్ -500004. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, MRDCL
DIPR RO No.11599-PP/CL/Advt/1/2024-25, Dt: 17.03.2025

**भारतीय रिज़र्व बैंक**
मानव संसाधन प्रबंध विभाग
सचिवालय रोड, सैफाबाद, हैदराबाद - 500 004
ई-निविदा सूचना
कार रेंटल / हायरिंग एजेंसियों का पैनल बनाने के लिए ई-निविदा
भारतीय रिजर्व बैंक, हैदराबाद, एमएसटीसी वेबसाइट (https://www.mstcecommerce.com/eprocn) पर भाग-1 और भाग-2 में ई-निविदाएं आमंत्रित करता है ताकि आवश्यकता के आधार पर कार किराए पर लेने के उद्धेश्य से प्रतिष्ठित और सक्षम कार रेंटल/हायरिंग एजेंसियों/कंपनियों को सूचीबद्ध किया जा सके। केवल वही एजेंसियां/कंपनियां निविदा के पात्र हैं जो पूर्व-योग्यता मानदंड को पूरा करती है।
ई-निविदा प्रसंस्करण, शर्तों और समय सारिणी के विवरण के लिए "टेंडर्स" लिंक के तहत हमारी वेबसाइट www.rbi.org.in पर जाएं।
क्षेत्रीय निदेशक

**భారతీయ రిజర్వు బ్యాంకు**
మానవ వనరుల నిర్వహణ విభాగం
సెక్రటేరియట్ రోడ్, సైఫాబాద్, హైదరాబాద్ - 500 004
ఇ-టెండర్ నోటీసు
కారు అద్దె / హైరింగ్ ఏజెన్సీల ఎంప్యానల్‌మెంట్ కొరకు ఇ-టెండర్
అవసరం ప్రాతిపదికన కార్లను అద్దెకు తీసుకునే ఉద్దేశంతో ప్రఖ్యాత మరియు సామర్థ్యం గల కారు రెంటల్ / హైరింగ్ ఏజెన్సీస్ / కంపెనీలను ఎంప్యానల్ చేసేందుకు ఎం ఎస్ టీ సి వెబ్‌సైట్ (https://www.mstcecommerce.com/eprocn) లో భాగం-1 మరియు భాగం-2 లో ఇ-టెండర్లను భారతీయ రిజర్వు బ్యాంకు, హైదరాబాద్ ఆహ్వానిస్తోంది. ప్రీ-క్వాలిఫికేషన్ ప్రామాణికతను నెరవేర్చిన ఏజెన్సీలు / కంపెనీలు మాత్రమే టెండర్ దాఖలు చేయడానికి అర్హులు.
ఇ-టెండర్ ప్రాసెసింగ్, నియమ నిబంధనలు మరియు కాల వ్యవధి వివరాల కోసం దయచేసి మా వెబ్‌సైట్ www.rbi.org.in ని టెండర్స్ లింకు కింద చూడండి.
ప్రాంతీయసంచాలకులు

**TELANGANA POWER GENERATION CORPORATION LIMITED**
VIDYUT SOUDHA :: HYDERABAD - 82.
T.No.e-29/CE/Civil/Thermal/TGGENCO/2025-26
YTPS - Procurement of 2130 MT of PP cement required for execution of certain civil works at Yadadri Thermal Power Station, Veerlapalem (V), Dameracherla (Mdl), Nalagonda Dist. - Scheduled Open & Closing Date: 17.03.2025 at 16:00 Hrs. & 24.03.2025 at 16:00 Hrs.
T.No.e-30/CE/Civil/Thermal /TGGENCO/2024-25
YTPS - Soil Investigation , Engineering, Design and Construction of Integrated Township with infrastructural Works consisting of Independent Quarters (A&B Type) and Multi-storeyed (stilt +10 floors) residential quarters (D,E & F Type) including Fire Fighting System, Hospital building, School building, Club house, Commercial Complexes, Indoor Stadium, Multipurpose Function Hall, Sports Complex, Security Rooms & Maintenance Offices, site Levelling and Grading, Roads & Drains, Construction of underground potable water tanks, OHSR, Septic Tanks & STP, Avenue Plantation, Parking Sheds, Rainwater Harvesting Pits, Laying BT approach Road to Township including Bridge over Tungapadu Vagu, Main Gate & Internal Compound walls, Street lighting, Sub-Station at Yadadri Thermal Power Station, Veerlapalem (V), Dameracherla (Mdl), Nalagonda Dist -Value of the works: Rs. 928,52,13,596/- Scheduled Open & Closing Date: 15.03.2025 at 15:00 Hrs. & 29.03.2025 at 15:00 Hrs.
T.No.e-301/CE/O&M/KTPS-V&VI/BM-VI/P31/TGGENCO/2024-25
KTPS-V&VI- Procurement of Various Coal Nozzle Assemblies for Unit-XI Boiler (1x500MW) at Kothagudem Thermal Power Station Stages-V&VI, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works. Rs.48,20,000/- Scheduled Open & Closing Date: 19.03.2025 at 10:00 Hrs. & 09.04.2025 at 15:30 Hrs.
T.No.e-325/CE(O&M)/KTPS VII Stage/P11/BM//TGGENCO/2024-25
KTPS-VII Stage - Supply of Vane Wheel Segment Assembly For HP 1103 Bowl Mills at Kothagudem Thermal Power Station, Stage-VII along with necessary provisions at Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works. Rs.19,42,500/- Scheduled Open & Closing Date: 12.03.2025 at 11:00 Hrs. & 11.04.2025 at 15:30 Hrs.
T.No.e-321/CE(O&M)/KTPS VII Stage/P23/TM/TGGENCO/2024-25
KTPS-VII Stage - Procurement of Fire resistant electro-hydraulic control fluid (FYRQUEL EHC-N) at Kothagudem Thermal Power Station, Stage-VII along with necessary provisions at Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works. Rs. 30,94,000/- Scheduled Open & Closing Date: 12.03.2025 at 17:30 Hrs. & 27.03.2025 at 15:30 Hrs.
For further Details: "www.tggenco.com & https://tender.telangana.gov.in
DIPR RO No.11562-PP/CL/Advt/1/2024-25, Dt:17-03-2025

# ఎన్నాళ్లో వేచిన ఉదయం

## ఎట్టకేలకు తిరిగొస్తున్న సునీత, విల్మోర్ ● రేపు తెల్లవారుజామున 3.27కు రాక

### ఫ్లోరిడా తీరంలో దిగనున్న క్యాప్సూల్ ● వారితో పాటే రానున్న హేగ్, గుర్బనోవ్ ● 9 నెలల అంతరిక్షవాసానికి శుభం కార్డు


సునీత, విల్మోర్

వాషింగ్టన్: భూమికి దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తున. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో. ఏడెనిమిది రోజులనుకుంటే ఏకంగా వారాలూ, నెలలూ గడిచిపోతున్నాయి. ఉన్నది భారరహిత స్థితిలోనే. అయినా అటు కార్యభారం. ఇటు ఎడతెగని ఆలోచనల భారం. క్షణమొక యుగంగా సమయం కూడా భారంగానే గడుస్తున్న పరిస్థితి. ఎడతెగని ఆ ఎదురుచూపులకు ఎట్టకేలకు శుభం కార్డు పడనుంది. 9 నెలల అంతరిక్షవాసం ముగించుకుని నాసా వ్యోమగాములు భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ (59), బచ్ బారీ విల్మోర్ (62) భూమికి తిరిగి రానున్నారు. వాతావరణం అనుకూలించి, అన్నీ అనుకున్నట్టుగా జరిగితే మంగళవారం సాయంత్రం 5.57 గంటలకు (భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3.27కు) అమెరికాలో ఫ్లోరిడా సముద్ర తీరంలో దిగనున్నారు. ఆదివారం నాసా ఈ మేరకు ప్రకటించింది. అనుకూల వాతావరణం నేపథ్యంలో తిరుగు ప్రయాణాన్ని నిర్ణీత సమయం కంటే ఒక రోజు ముందుకు జరిపినట్టు పేర్కొంది. గత సెప్టెంబర్లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన మరో ఇద్దరు వ్యోమగాములు నిక్ హేగ్ (అమెరికా), అలెగ్జాండర్ గుర్బనోవ్ (రష్యా) కూడా స్పేస్ ఎక్స్ డ్రాగన్-10 స్పేస్‌క్రాఫ్ట్‌లో సునీత, విల్మోర్‌తో పాటే తిరిగి వస్తున్నారు. వారి రాక కోసం ప్రపంచమంతా అత్యంత ఉత్కంఠతో ఎదురుచూస్తోందిప్పుడు.

**బాధ్యతల అప్పగింత**

బోయింగ్ సంస్థ తొలి మానవసహిత అంతరిక్ష ప్రయోగంలో భాగంగా 2024 జూన్ 5న ప్రయోగించిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో సునీత, విల్మోర్ ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ మేరకు వారు ఎనిమిది రోజుల్లోనే తిరిగి రావాలి. కానీ స్టార్‌లైనర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా అది వీలు పడలేదు. దాని మరమ్మతుకు చేసిన ప్రయత్నాలు కూడా పూర్తిగా ఫలించలేదు. దాంతో రిస్కు తీసుకోరాదని నాసా నిర్ణయించింది. ఫలితంగా సెప్టెంబర్ 7న స్టార్‌లైనర్ ఖాళీగానే భూమికి తిరిగొచ్చింది. వారిని తిరిగి తీసుకొచ్చేందుకు మధ్యలో చేసిన ఒకట్రెండు ప్రయత్నాలు కూడా ఫలించలేదు. అలా 9 నెలలుగా సునీత ఐఎస్ఎస్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎట్టకేలకు ఆమెను, విల్మోర్‌ను వెనక్కు తీసుకొచ్చేందుకు నాసాతో కలిసి స్పేస్ ఎక్స్ ప్రయోగించిన డ్రాగన్-9 వ్యోమనౌక ఆదివారం విజయవంతంగా ఐఎస్ఎస్‌ను చేరింది. అందులో వచ్చిన నలుగురు వ్యోమగాములు సునీత బృందం నుంచి లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. కమాండర్ బాధ్యతలను రష్యాకు చెందిన అలెక్సీ ఒచినిన్‌కు సునీత అప్పగించారు. వచ్చే ఆర్నెల్ల పాటు ఐఎస్ఎస్ కార్యకలాపాలన్నీ ఆయన కనుసన్నల్లో జరుగుతాయి.

**అయినా స్థైర్యమే...**

అనూహ్యంగా ఐఎస్ఎస్‌లో 9 నెలల పాటు గడపాల్సి వచ్చినా సునీత ఎక్కడా డీలాపడలేదు. మొక్కవోని ఆత్మస్థైర్యం ప్రదర్శించారు. తన పరిస్థితిపై కూడా తరచూ జోకులు పేల్చారు! నడవటమెలాగో గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నానంటూ గత జనవరిలో నాసా సెంటర్‌తో మాట్లాడుతూ చమత్కరించారు. ఐఎస్ఎస్‌లో ఉన్నన్ని రోజులూ ఊపిరి సలపని బాధ్యతల నడుమే గడిపారు. అలాగని చిన్నచిన్న సరదాలకూ లోటులేకుండా చూసుకున్నారు. సహచరులతో కలిసి సునీత, విల్మోర్ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. వీడియో కాల్స్ ద్వారా తమ కుటుంబీకులతో టచ్‌లో ఉంటూ వచ్చారు.

### ఎందరికో స్ఫూర్తి

వ్యోమగామిగా గ'ఘన' విజయాలు సాధించిన సునీతవి భారత మూలాలు. ఆమె పూర్తి పేరు సునీతా లిన్ విలియమ్స్. 1965లో అమెరికాలోని ఒహాయోలో జన్మించారు. తండ్రి దీపక్ పాండ్యా గుజరాతీ కాగా తల్లి బోనీ జలోకర్‌ది స్లొవేనియా. వారి ముగ్గురు సంతానంలో సునీత అందరికన్నా చిన్న. అమెరికా నావల్ అకాడెమీ నుంచి ఫిజిక్స్‌లో డిగ్రీ, ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేశారు.

**తండ్రి సూచనతో...**

- తండ్రి సూచన మేరకు నావికా దళంలో బేసిక్ డైవింగ్ ఆఫీసర్‌గా చేరారు సునీత.
- నేవల్ ఏవియేటర్‌గా యుద్ధ విమానాలు నడపడంలో శిక్షణ పొందారు. కంబాట్ హెలికాప్టర్ స్క్వాడ్రన్‌లో పని చేశారు.
- 30 ఏళ్ల వృత్తిగత జీవితంలో పైలట్‌గా 30 పైచిలుకు రకాల విమానాలను 3,000 గంటలకు పైగా నడిపిన అపార అనుభవం ఆమె సొంతం.
- నేవీ నుంచి రిటైరయ్యాక సునీత 1998 జూన్‌లో నాసా వ్యోమగామిగా ఎంపికయ్యారు.
- 2006లో తొలిసారి అంతరిక్ష యాత్ర చేశారు. ఐఎస్ఎస్‌లో ఆర్నెల్లకు పైగా గడిపి దాని నిర్వహణ, మరమ్మతులు తదితరాలపై అనుభవం గడించారు.
- 2012లో రెండోసారి ఐఎస్ఎస్‌కు వెళ్లి నాలుగు నెలలకు పైగా ఉన్నారు.
- సునీత భర్త మైకేల్ జె.విలియమ్స్ రిటైర్డ్ ఫెడరల్ మార్షల్. వారికి సంతానం లేరు. పెట్ డాగ్స్ అంటే ఈ జంటకు ప్రాణం. వాటినే తమ సంతానంగా భావిస్తుంటారు.
- సునీత హిందూ మతావలంబి. నిత్యం భగవద్గీత చదువుతానని చెబుతారు.

### పరిహారమేమీ ఉండదు

సునీత, విల్మోర్ ఏకంగా 9 నెలలకు పైగా ఐఎస్ఎస్‌లో చిక్కుబడిపోయారు కదా. మరి వారికి పరిహారం రూపంలో అదనపు మొత్తం ఏమన్నా లభిస్తుందా? అలాంటిదేమీ ఉండదు. తమకు ప్రత్యేకంగా ఓవర్‌టైం వేతనమంటూ ఏమీ ఉండదని నాసా వ్యోమగామి కాడీ కోల్మన్ చెప్పారు. ''అంతరిక్ష యాత్రలను అధికార పర్యటనల్లో ఇతర కేంద్ర ప్రభుత్వోద్యోగుల మాదిరిగానే పరిగణించడమే ఇందుకు కారణం. ఇలాంటప్పుడు ఖర్చుల నిమిత్తమని మాకు అదనంగా రోజుకు కేవలం 4 డాలర్లు (రూ.347) అందుతాయంతే'' అని వివరించారు. ఆ లెక్కన సునీత, విల్మోర్ అదనంగా 1,148 డాలర్లు (దాదాపు రూ.లక్ష) అందుకోనున్నారు. వారు అమెరికా ప్రభుత్వోద్యోగుల్లో అత్యున్నతమైన జీఎస్-15 వేతన గ్రేడ్‌లో ఉన్నారు. ఆ లెక్కన వాళ్లకు ఏటా 1.25 లక్షల నుంచి 1.62 లక్షల డాలర్ల (కోటి నుంచి 1.41 కోట్ల రూపాయల) వేతనం లభిస్తుంది.

- ఐఎస్ఎస్ కమాండర్‌గా కీలక ప్రయోగాలకు సునీత సారథ్యం వహించారు.
- అంతరిక్షంలో భారరహిత స్థితిలో మొక్కల్ని పెంచిన నాసా ప్రయోగాన్ని స్వయంగా పర్యవేక్షించారు.
- మొత్తం 50 గంటల 40 నిమిషాల పాటు స్పేస్ వాక్ చేశారు.

**- సాక్షి, నేషనల్ డెస్క్**

### తిరుగు ప్రయాణం ఇలా...

- సునీత బృందం తిరుగు ప్రయాణానికి భారత కాలమానం ప్రకారం మంగళవారం కౌంట్‌డౌన్ మొదలవుతుంది.
- క్రూ డ్రాగన్-10 వ్యోమనౌక హ్యాచ్ మూసివేత ప్రక్రియ మంగళవారం ఉదయం 8.15కు మొదలవుతుంది.
- ఐఎస్ఎస్ నుంచి వ్యోమనౌక విడివడే ప్రక్రియ మంగళవారం ఉదయం 10.35కు మొదలవుతుంది. ఆ తర్వాత నాసా ప్రత్యక్ష ప్రసారం ఆడియోకు పరిమితమవుతుంది. అంతా అనుకూలిస్తే బుధవారం (మంగళవారం అర్ధరాత్రి దాటాక) తెల్లవారుజాము 2.15 గంటలకు తిరిగి ప్రత్యక్ష ప్రసారం మొదలవుతుంది.
- బుధవారం తెల్లవారుజాము 2.41 గంటలకు వ్యోమనౌక భూ కక్ష్యలోకి ప్రవేశిస్తుంది.
- బుధవారం తెల్లవారుజామున సుమారు 3.27కు ఫ్లోరిడా తీరానికి సమీపంలో సముద్ర జలాల్లో క్యాప్సూల్ దిగుతుంది.
- ఆ వెంటనే నలుగురు వ్యోమగాములనూ నాసా సిబ్బంది ఒక్కొక్కరిగా బయటికి తీసుకొస్తారు.

**అన్నీ అనుకూలించాలి**

అయితే ప్రయాణ సమయం నిర్ణయమైనా చివరి నిమిషం దాకా అన్నీ అనుకూలించాల్సి ఉంటుంది. వాతావరణంతో పాటు ఇతర పరిస్థితులన్నీ సజావుగా ఉంటేనే తిరుగు ప్రయాణం షెడ్యూల్ ప్రకారం సాగుతుంది.

**ప్రత్యక్షప్రసారం**

సునీత బృందంతో స్పేస్ ఎక్స్ డ్రాగన్ క్రూ-9 స్పేస్‌క్రాఫ్ట్ తిరుగు ప్రయాణాన్ని భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8.30 నుంచి నాసా ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

### రికార్డు మాత్రం కాదు

సునీత, విల్మోర్ వరుసగా 9 నెలల పాటు (287 రోజులు) ఐఎస్ఎస్‌లో గడిపినా ప్రపంచ రికార్డుకు మాత్రం దూరంగానే ఉండిపోయారు. రష్యా వ్యోమగామి వలేరీ పొల్యకోవ్ తమ దేశానికి చెందిన మిర్ అంతరిక్ష కేంద్రంలో ఏకబిగిన 437 రోజులు గడిపి రికార్డు సృష్టించారు. నాసా ఆస్ట్రోనాట్ 371 రోజులతో ఆ తర్వాతి స్థానంలో నిలిచారు. మూడు అంతరిక్ష యాత్రల్లో కలిపి సునీత 583 రోజులు ఐఎస్ఎస్‌లో గడిపారు. క్రమశిక్షణ విషయంలో సునీత చాలా పట్టుదలగా ఉంటారు. ఐఎస్ఎస్‌లో ఉన్నన్నాళ్లూ ఒక్క రోజు కూడా వ్యాయామం మానలేదట!

### టైమ్‌లైన్



**2024 జూన్ 5:** సునీత, విల్మోర్‌లతో ఐఎస్ఎస్‌కు బయల్దేరిన బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక
**జూన్ 6:** ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైన స్టార్‌లైనర్. కానీ ఆ క్రమంలో స్టార్‌లైనర్‌లో థ్రస్టర్లు పని చేయకపోవడం, ప్రొపల్షన్ వ్యవస్థలో హీలియం లీకేజీ వంటి సాంకేతిక లోపాలు తెరపైకొచ్చాయి. దాంతో వ్యోమగాములు క్షేమంగా తిరిగిరావడంపై ఉత్కంఠ నెలకొంది.
**జూన్ 12:** స్టార్‌లైనర్ ప్రయాణానికి సిద్ధంగా లేనందున సునీత, విల్మోర్ తిరుగు ప్రయాణం నిరవధికంగా వాయిదా పడ్డట్టు నాసా ప్రకటన.
**జూలై-ఆగస్టు:** తిరుగు ప్రయాణంపై మరింత పెరిగిన అనిశ్చితి. దాంతో సునీత, విల్మోర్ ఐఎస్ఎస్ సిబ్బందితో కలిసిపోయి దాని నిర్వహణ బాధ్యతలు, పరిశోధనలు తదితరాను పూర్తిగా తలకెత్తుకున్నారు. ఆ క్రమంలో సునీత ఆరోగ్యం కాస్త క్షీణించింది. ఎముకల సాంద్రత తగ్గడం వంటి పలు సమస్యలు తలెత్తాయి.
**సెప్టెంబర్:** ఐఎస్ఎస్ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించిన సునీత
**నవంబర్:** సహోద్యోగులతో కలిసి ఐఎస్ఎస్‌లోనే దీపావళి, థాంక్స్ గివింగ్ వేడుకలు జరుపుకున్న సునీత. ఈ సందర్భంగా వారికోసం ప్రత్యేకంగా స్మోక్డ్ చికెన్ తదితర వంటకాలను పంపిన నాసా.
**డిసెంబర్:** విద్యార్థులతో చిట్‌చాట్ చేసి తన అనుభవాలు పంచుకున్న సునీత. అంతరిక్షంలో జీవితం చాలా ఫన్నీగా ఉందని వ్యాఖ్య.
**2025 జనవరి 30:** తొలి స్పేస్ వాక్ చేపట్టిన సునీత. అందులో భాగంగా ఐఎస్ఎస్ బయట కీలక మరమ్మతుల్లో భాగస్వామ్యం.
**ఫిబ్రవరి:** తిరుగు ప్రయాణంపై సర్వత్రా అనిశ్చితి పెరుగుతుండటంతో, తాము బాగున్నామని సందేశం పంపిన సునీత, విల్మోర్.
**మార్చి 12:** స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌక ద్వారా వారిని వెనక్కు తీసుకొస్తున్నట్టు ప్రకటించిన నాసా, ఎక్స్.
**మార్చి 16:** విజయవంతంగా ఐఎస్ఎస్‌ను చేరిన డ్రాగన్ క్రూ-10 వ్యోమనౌక
**మార్చి 17:** సునీత, విల్మోర్, మరో ఇద్దరు వ్యోమగాములతో డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ మార్చి 18న భూమికి తిరిగొస్తుందంటూ నాసా ప్రకటన

---

## ఎస్ఎఫ్‌జేను ఉగ్రసంస్థగా ప్రకటించండి

### తులసీ గబ్బార్డ్‌ను కోరిన రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: అమెరికా గడ్డ మీద నుంచి భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ఖలిస్తాన్‌కు మద్దతు పలుకుతున్న సిక్కు వేర్పాటువాద సంస్థ 'సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే)ను ఉగ్రసంస్థగా ప్రకటించాలని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్‌ను భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కోరారు. రెండున్నర రోజుల పర్యటన కోసం భారత్‌కు ఆదివారం తెల్లవారుజామున చేరుకున్న తులసీ సోమవారం రైసినా హిల్స్‌లోని రక్షణశాఖ కార్యాలయంలో రాజ్‌నాథ్‌ను కలిశారు. అంతర్జాతీయ జలాల్లో ఇరుదేశాల ద్వైపాక్షిక వ్యూహాత్మక సహకారంపై ఇరువురూ సమీక్ష జరిపారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షపీఠంపై కూర్చున్నాక అమెరికా అత్యంత సీనియర్ ఉన్నతాధికారి ఒకరు భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. దాదాపు 30 నిమిషాలకుపైగా ఇరువురూ చర్చించుకున్నారు. ముఖ్యంగా అధునాతన సాంకేతికత, పరస్పర సమాచార మార్పిడి, రక్షణ రంగ ఉత్పత్తుల సరఫరా వ్యవస్థను సమీకృతం చేయడం వంటి కీలకాంశాలపై దృష్టిసారించారు. ప్రపంచదేశాల నిఘా విభాగాధిపతుల సదస్సులో పాల్గొనేందుకు తులసీ ఢిల్లీకి వచ్చిన విషయం తెల్సిందే. బబ్బర్ ఖల్సా ఉగ్రసంస్థతో చేతులు కలిపిన ఎస్ఎఫ్‌జేను అడ్డుకోవాలని తులసీని రాజ్‌నాథ్ విజ్ఞప్తిచేశారు. గురుపత్వంత్ సింగ్ కనుసన్నల్లో పనిచేస్తున్న ఎస్ఎఫ్‌జే అమెరికాలో హిందూ మత సంబంధ కట్టడాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతోందని రాజ్‌నాథ్ అన్నారు. మరోవైపు భారత్-అమెరికా బంధాన్ని బలీయం చేసే మార్గాలను అన్వేషించామని రాజ్‌నాథ్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఒక పోస్ట్‌చేశారు.


అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్‌తో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్


మహా కుంభమేళా సందర్భంగా సేకరించిన గంగాజలాన్ని తులసికి అందిస్తున్న మోదీ

## ఖలిస్తానీ శక్తుల భరతం పట్టండి

**న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌కు మోదీ విజ్ఞప్తి**
- భారత వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డాగా మారనివ్వొద్దని సూచన
- భారత్, న్యూజిలాండ్ మధ్య ఆరు ఒప్పందాలపై సంతకాలు

న్యూఢిల్లీ: ద్వీపదేశమైన న్యూజిలాండ్‌లో ఖలిస్తానీ శక్తుల ప్రాబల్యం నానాటికీ పెరుగుతుండడం, భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా శక్తులను కఠినంగా అణచివేయాలని న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌కు విజ్ఞప్తి చేశారు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు న్యూజిలాండ్‌ను అడ్డాగా మారనివ్వకూడదని కోరారు. మోదీ, లక్సన్ సోమవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. భారత్-న్యూజిలాండ్ సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. 2019లో న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చ్ నగరంలో జరిగిన ఉగ్రవాద దాడులు, 2008 నవంబర్ 26న ముంబైలో జరిగిన ఉగ్రవాద దాడులకు సారూప్యం ఉందని మోదీ గుర్తుచేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నాసరే వ్యతిరేకించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఉగ్రవాద దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, రాడికల్ శక్తులపై పోరాడే విషయంలో భారత్, న్యూజిలాండ్ మధ్య సహకారం కొనసాగుతుందని స్పష్టంచేశారు.

**రక్షణ పరిశ్రమ రంగంలో సహకారానికి రోడ్‌మ్యాప్**

భారత్, న్యూజిలాండ్ మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై చర్చలు ప్రారంభం కావడాన్ని మోదీ, లక్సన్ స్వాగతించారు. ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అలాగే భారత్, న్యూజిలాండ్ మధ్య నేరుగా విమానాలు నడిపేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలపై చర్చించారు. ఇండో-పసిఫిక్ విషయంలో అనుసరించాల్సిన వ్యూహాత్మక వైఖరిపై తాము చర్చించామని లక్సన్ వివరించారు. మోదీ, లక్సన్ భేటీ సందర్భంగా భారత్, న్యూజిలాండ్ మధ్య ఆరు కీలక ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల నడుమ రక్షణ సంబంధాలను వ్యవస్థీకృతంగా మార్చడం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడంతోపాటు విద్య, క్రీడలు, వ్యవసాయం, వాతావరణ మార్పుల నియంత్రణ వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకోవడానికి ఇరు పక్షాలు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రక్షణ పరిశ్రమ రంగంలో సహకారం కోసం ఒక రోడ్‌మ్యాప్ రూపొందించాలని ఇరు దేశాలు నిర్ణయానికొచ్చాయి.


న్యూజిలాండ్ ప్రధానితో మోదీ

**విస్తరణవాదం వద్దు.. అభివృద్ధే కావాలి**

స్వేచ్ఛాయుత, భద్రతతో కూడిన, సౌభాగ్యవంతమైన ఇండో-పసిఫిక్‌కు భారత్, న్యూజిలాండ్ బేషరతుగా మద్దతు ఇస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇండో-పసిఫిక్‌లో అభివృద్ధిని కోరుకుంటున్నాం తప్ప విస్తరణవాదాన్ని కాదంటూ పరోక్షంగా చైనా తీరును తప్పుపట్టారు. ఇండో-పసిఫిక్ సార్వభౌమత్వం, ప్రాంతీయ సమగ్రతను అందరూ గౌరవించాలని మోదీ, లక్సన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇరువురు నేతలు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. అక్రమ వలసల సమస్యను పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఒక దేశానికి చెందిన నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, కార్మికులకు మరో దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చట్టబద్ధమైన ఏర్పాటు చేసుకోవాలని, దీనిపై చర్చలు ప్రారంభించాలని అంగీకారానికి వచ్చారు. గాజాలో శాశ్వతంగా శాంతి నెలకొనాలన్నదే తమ ఆకాంక్ష అని వెల్లడించారు.

**అందుకే క్రికెట్ మాట ఎత్తలేదు**

ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన చర్చల్లో క్రికెట్ అంశం ప్రస్తావనకు రాలేదని న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ చెప్పారు. తాను ఉద్దేశపూర్వకంగానే ఆ అంశాన్ని విస్మరించానని అన్నారు. భారత్-న్యూజిలాండ్ మధ్య దౌత్య సంబంధాల దెబ్బతినకుండా అడ్డుకోవాలన్నదే తన ఆలోచన అని వివరించారు. దీంతో పక్కనే ఉన్న ప్రధాని మోదీ బిగ్గరగా నవ్వేశారు. సోమవారం భేటీ తర్వాత లక్సన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత్ చేతిలో న్యూజిలాండ్ క్రికెట్ జట్టు ఓడిపోయిన సంగతి తెలిసిందే. అలాగే ఇండియాలో జరిగిన టెస్టు క్రికెట్ సిరీస్‌లో న్యూజిలాండ్ నెగ్గింది. తమ చర్చల్లో క్రికెట్ గురించి మాట్లాడనందుకు మోదీని అభినందిస్తున్నానని లక్సన్ చెప్పారు. మరోవైపు మోదీ, లక్సన్ కలిసి సోమవారం ఢిల్లీలోని చరిత్రాత్మక గురుద్వారా రకాబ్‌గంజ్ సాహిబ్‌ను సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## నాగ్‌పూర్‌లో చెలరేగిన అల్లర్లు

- మతగ్రంథం తగలబెట్టారన్న పుకార్లతో మొదలైన ఘర్షణలు
- ఘర్షణల్లో 20 మందికి గాయాలు
- 15 మంది అరెస్ట్, నిషేధాజ్ఞలు అమలు

నాగ్‌పూర్: మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని కూల్చేస్తామనే విశ్వహిందూ పరిషత్ చేసిన డిమాండ్లతో మొదలైన ఉద్రిక్తతలు చివరకు అల్లర్లకు దారితీశాయి. ఇందుకు సెంట్రల్ నాగ్‌పూర్ ప్రాంతం వేదికైంది. సోమవారం ఒక మత గ్రంథానికి నిప్పుపెట్టారన్న పుకార్లు షికార్లు చేయడంతో ఒక వర్గం ఆందోళనకు దిగడంతో అల్లర్లు చెలరేగాయి. పోలీసులు రంగంలోకి దిగి అదుపులోకి తెచ్చే ప్రయత్నంచేయంతో వారిపైనా రాళ్లు రువ్వారు. దీంతో జరిగిన ఘర్షణల్లో 20 మంది గాయపడ్డారు. నాగ్‌పూర్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యాలయం ఉండే మహల్ ప్రాంతంలో ఘర్షణలకు దిగిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ చార్జీచేశారు. భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. 15 మందిని అరెస్టుచేశారు. ఘర్షణలు సాయంత్రంకల్లా కోత్వాలీ, గణేష్‌పేట్ ప్రాంతాలకూ పాకాయి. కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన డీసీపీ నికేతన్ కదమ్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారీ తలావ్‌రోడ్‌లోని ఛిత్నీశ్ పార్క్ వద్ద ఆందోళనకారులు చెలరేగిపోయారు. ఇక్కడ పలువాహనాలకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. పలు నివాస గృహాలపై రాళ్లు రువ్వారు. హింసను విడనాడాలని, శాంతియుతంగా ఉండాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్, నాగ్‌పూర్ నుంచి కేంద్ర మంత్రి అయిన నితిన్ గడ్కరీ విజ్ఞప్తిచేశారు. మహల్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం వద్ద బజరంగ్ దళ్ సభ్యులు ఆందోళన చేపట్టిన తర్వాతే ఉద్రిక్త పరిస్థితి తలెత్తినట్లు పోలీసులు తెలిపారు. ఇక్కడ ఒక మతగ్రంథాన్ని తగలబెట్టారని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇది నిజమని నమ్మిన మరో వర్గం సభ్యులు మహల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఆందోళనకు దిగాక పరిస్థితి అదుపుతప్పింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్, రాష్ట్ర రిజర్వ్ పోలీస్ బలగాలను భారీ ఎత్తున మొహరించారు. పలుచోట్ల నిషేధాజ్ఞలు జారీచేశారు. ఛిత్నీశ్ పార్క్ వద్ద పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. ఔరంగజేబు దిష్టిబొమ్మను మాత్రమే దగ్ధంచేశామని బజరంగ్‌దళ్ వర్గాలు స్పష్టంచేశాయి.

## ఇండియా పాత్ర కీలకం

- న్యూజిలాండ్ ప్రధాని లక్సన్
- ఢిల్లీలో 'రైజినా డైలాగ్' ప్రారంభం

న్యూఢిల్లీ: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత దేశం అత్యంత కీలక పాత్ర పోషించాల్సి ఉందని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించాలని ఆకాంక్షించారు. ఈ ప్రతిపాదనకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఢిల్లీలో 'రైజినా డైలాగ్' కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. వివిధ దేశాల విదేశాంగ మంత్రులు, దౌత్యవేత్తలు, విదేశాంగ విధాన నిపుణులు హాజరయ్యారు. ఈ కార్య క్రమంలో క్రిస్టోఫర్ లక్సన్ ప్రసంగించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో నిబంధనల ఆధారిత క్రమాన్ని (ఆర్డర్) అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కర్ర ఉన్నవాడిదే బర్రె అనే విధానం ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకార యోగ్యం కాదని స్పష్టంచేశారు. ఇండో-పసిఫిక్‌లో చైనా విస్తరణ వాదాన్ని పరోక్షంగా తప్పుపట్టారు. ప్రపంచానికి హృదయ స్థానం లాంటి ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మనం నివసిస్తున్నామని, మనమంతా గొప్ప ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

## చంద్రయాన్-5 మిషన్‌కు ప్రభుత్వ ఆమోదం

న్యూఢిల్లీ: చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఇది 250 కిలోల భారీ రోవర్‌ను చంద్రుడి ఉపరితలంపైకి తీసుకెళ్తుందన్నారు. చంద్రుడి ఉపరితలం, కూర్పుపై సమగ్ర అధ్యయనం ఈ అధునాతన రోవర్ లక్ష్యమని ఆయన వెల్లడించారు. చంద్రయాన్-5 మిషన్‌కు మూడు రోజుల కిందటే అనుమతి లభించిందని, జపాన్ సహకారంతో దీన్ని చేపడతామని తెలిపారు. చంద్రయాన్‌ను ఇండియన్ లూనార్ ఎక్స్‌ప్లోరేషన్ ప్రోగ్రామ్ అని కూడా పిలుస్తారు. చంద్రుని మీద అన్వేషణ కోసం భారత్ చేస్తున్న ఐదో ప్రయోగం ఇది. చంద్రయాన్-3 అద్భుత విజయం సాధించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. చంద్రయాన్-3.. 25 కిలోల రోవర్‌ను తీసుకెళ్లగా, చంద్రయాన్-5 మిషన్ 250 కిలోల బరువున్న రోవర్‌ను తీసుకెళ్లనుంది. ఇక 2019లో ప్రయోగించిన చంద్రయాన్-2కు చివరిదశలో ఎదురుదెబ్బ తగిలింది. 2027 నాటికి చంద్రయాన్-4ను ప్రయోగించాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది.

## నేడు పుతిన్, ట్రంప్ చర్చలు

వాషింగ్టన్: ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేలా రష్యాను ఒప్పించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మంగళవారం మంతనాలు జరపనున్నారు. నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అగ్రరాజ్యం చేస్తున్న ప్రయత్నాల్లో ఇది కీలక పరిణామమని ప్రపంచదేశాలు భావిస్తున్నాయి. దీంతోబాటే సమకాలీన పరిస్థితులకు తగ్గట్లు అమెరికా విదేశాంగ విధానాలకు మార్చే సదవకాశం ట్రంప్‌కు దక్కనుంది. '' గత వారం రోజులుగా ఇందుకోసం ఎంతో కసరత్తు చేశాం. యుద్ధాన్ని ఎంత త్వరగా ముగింపు పలకగలమో ఈ చర్చల ద్వారా తెలుస్తుంది'' అని ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలో వస్తూ మీడియాతో ట్రంప్ చెప్పారు. ట్రంప్‌తో పుతిన్ చర్చించబోతున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ సోమవారం ధ్రువీకరించారు. అయితే ఇరుదేశాల అగ్రనేతల మధ్య ఎలాంటి అంశాలు చర్చకు రాబోతున్నాయనే వివరాలను పెస్కోవ్ పేర్కొనలేదు.

## సుప్రీం జడ్జిగా బాగ్చీ ప్రమాణం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన కలకత్తా హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సంజీవ్ ఖన్నా ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇతర న్యాయమూర్తుల సమక్షంలో సుప్రీంకోర్టు ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. జస్టిస్ బాగ్చీ అత్యున్నత న్యాయస్థానంలో ఆరేళ్లకు పైగా ఉంటారు. బాగ్చీ ప్రమాణ స్వీకారంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33కు చేరింది. మరో పోస్టు ఖాళీగా ఉంది. బాగ్చీ 2031 మే 25న సీజేఐగా బాధ్యతలు చేపడతారు. అక్టోబర్ 2న ఆయన పదవీ విరమణ వరకూ కొనసాగుతారు. 1966 అక్టోబర్ 3న జన్మించిన జస్టిస్ బాగ్చీ.. 2011 జూన్27న కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 జనవరి 4న ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. అప్పటినుంచి అక్కడే విధులు నిర్వహించారు. 13 ఏళ్లకు పైగా హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందించిన ఆయన ప్రధాన న్యాయమూర్తులతో సహా హైకోర్టు న్యాయమూర్తుల ఉమ్మడి అఖిల భారత సీనియారిటీలో 11వ స్థానంలో ఉన్నారు. సీజేఐ ఖన్నా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కొలీజియం మార్చి 6న జస్టిస్ బాగ్చీ పేరును సిఫారసు చేసింది.




**'అక్రమ ఇన్‌ఫ్లూయన్స్'పై ఉక్కుపాదం!**
ఇన్‌ఫ్లూయన్సర్ల పాత్ర కీలకంగా మారింది. సమాజంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న వారిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.
-8లో



**వైవిధ్యభరితం..**
శ్రీమద్భాగవతాన్ని అచ్చు పుస్తక రూపంలో, ఇంటర్నెట్‌లోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు న్యూనల్లకుంటకు చెందిన మందడి కృష్ణారెడ్డి.
- సిటీప్లస్‌లో

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం 39.0/22.0
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 39, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.




## సిటీ హీటెక్కుతోంది!

### 39 డిగ్రీలకు చేరిన గరిష్ట ఉష్ణోగ్రతలు

- మరో మూడ్రోజులు భానుడి భగభగలు

**లక్డీకాపూల్:** నగరం గరం అవుతోంది. ఉదయం 7 గంటలకే భానుడు భగ్గుమంటున్నాడు. మధ్యాహ్నం ఎండలు మండుతున్నాయి. గత రెండు రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు నమోదవుతున్నాయి. మరో మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెలాఖరులోగా 45 డిగ్రీలకు చేరి వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఒంటి పూట బడులు ప్రారంభం కావడంతో మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సమయంలో విద్యార్థులు ఎండలకు తల్లడిల్లుపోతున్నారు. సోమవారం గోల్కొండ, ముషీరాబాద్, చార్మినార్, బహదూర్‌పురా, బండ్లగూడ, అంబర్‌పేట, మారేడుపల్లి, హిమాయత్ నగర్, షేక్‌పేట్, ఖైరతాబాద్, సైదాబాద్ లలో గరిష్టంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు మధ్యాహ్నం పూట బయటికి రాకపోవడమే మంచిదని సూచించింది.

## మద్యం కొనేందుకు వెళితే కారుతో పరారయ్యాడు

**పంజగుట్ట:** మద్యం కొనుగోలు చేసేందుకు షాపులోకి వెళ్తున్న క్రమంలోనే.. గుర్తు తెలియని వ్యక్తి ఖరీదైన కారును కొట్టేసిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట లీలానగర్‌కు చెందిన తోట ప్రసాద్ వ్యాపారవేత్త. ఆదివారం సికింద్రాబాద్‌లో పనులు ముగించుకుని రాత్రి 8.30 గంటల ప్రాంతంలో బేగంపేట గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న రిలాక్స్ సంధ్య వైన్‌షాపులో మద్యం కొనేందుకు తన ఎంజీ హెక్టార్ కారులో వెళ్లారు. కారును ఆఫ్ చెయ్యకుండా అలానే ఉంచి మద్యం షాపులోకి పోతుండగానే తన కారు ముందుకు వెళ్లడం ఆయన గుర్తించారు. వెంటనే అడ్డుకునేందుకు ప్రయత్నించే లోపే.. ఆగంతకుడు అమీర్‌పేట వైపు వాహనాన్ని తీసుకుని అతివేగంతో వెళ్లిపోయాడు. ఆందోళనకు గురైన ప్రసాద్ పంజగుట్ట పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వైన్ షాపు ముందున్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా.. నిందితుడిని పట్టుకున్నట్లు కారును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుడు గతంలో ఏదైనా దొంగతనాలు చేశాడా? పాత నేరస్తుడా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.



# వచ్చేవెన్నో.. ఇచ్చేదెన్నో?



## గత బడ్జెట్‌లో కేటాయించింది రూ.3065 కోట్లు

### విడుదల చేసింది రూ.902 కోట్లు

- ఈసారీ రాష్ట్ర బడ్జెట్‌పై భారీ ఆశలు
- రూ.7,600 కోట్లు కోరిన జీహెచ్‌ఎంసీ

**సాక్షి, సిటీబ్యూరో:** రాష్ట్ర బడ్జెట్‌పై జీహెచ్‌ఎంసీ భారీ ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే పలు ప్రాజెక్టుల పనుల కోసం చేసిన భారీ అప్పులు, వాటి ఈఎంఐల చెల్లింపులతో పాటు కొత్తగా చేపట్టనున్న పలు ఫ్లై ఓవర్లు తదితర పనులకు వేల కోట్లు కావాల్సి ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.7,032 కోట్ల పనులకు లాంఛనంగా ఇప్పటికే శంకుస్థాపనలు చేశారు. ఆ పనులు చేయాల్సి ఉంది. అవన్నీ హైసిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కింద చేయనున్న ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు తదితర పనులకు సంబంధించినవి. వరద నీటి సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎన్‌డీపీ కింద చేస్తున్న పనులకు సంబంధించి దాదాపు రూ.528 కోట్ల మేర పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనులన్నీ హై సిటీ కిందే చేస్తున్నారు. వీటితో పాటు సమగ్ర రోడ్ల నిర్వహణ పనులనూ హై సిటీ పనులుగానే పేర్కొంటున్నారు. ఇలా హైసిటీ పనులకు భారీ నిధులు కావాల్సి ఉండటంతో.. వాటి కోసం దాదాపు రూ.4,000 కోట్లను జీహెచ్‌ఎంసీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆశిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధుల్లో సింహభాగం వాటిదే కాగా, ఆయా ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణలు తదితరమైన వాటికి కూడా నిధులు కావాలని కోరింది.

**జీహెచ్‌ఎంసీ బడ్జెట్ 8,440 కోట్లు**

రాబోయే ఆర్థిక సంవత్సరం (2025–26) జీహెచ్‌ఎంసీ బడ్జెట్ రూ.8,440 కోట్లు కాగా.. అందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.3,000 కోట్లు క్యాపిటల్ గ్రాంట్స్‌గా అందుతాయనే ఆశతోనే బడ్జెట్‌లో పొందుపరిచారు. వాటితో పాటు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ గ్రాంట్స్ తదితరాల ద్వారా భారీగా నిధులు కేటాయించాలని జీహెచ్‌ఎంసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు సమాచారం. అన్నీ కలిపి.. దాదాపు రూ.7,600 కోట్లు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిసింది. అవసరాలు ఈ మేరకు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి ఎన్ని నిధులు కేటాయిస్తుందో రేపటి (బుధవారం) బడ్జెట్ సమావేశంలో వెల్లడి కానుంది.

**ఆశలు ఇలా..**

హై సిటీ పనుల కోసం
క్యాపిటల్ గ్రాంట్స్: రూ.3,000 కోట్లు
స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ గ్రాంట్స్: 800
భూసేకరణ కోసం : 400

- ఇతరత్రా పద్దుల ద్వారానూ తగిన నిధులతో ఎటొచ్చీ దాదాపు రూ.7,600 కోట్లను జీహెచ్‌ఎంసీ ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిసింది.



**గత బడ్జెట్‌లో రూ.3,065 కోట్లు**

గత సంవత్సరం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ ఊహించని విధంగా నిధులు కేటాయించింది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం తన తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు లేకున్నా హై సిటీ ప్రాజెక్టుల పనుల కోసం రూ.2,654 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు రూ.852 కోట్లు విడుదలయ్యాయి. గత బడ్జెట్‌లో ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్‌గా రూ.700 కోట్లు కోరగా.. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.411 కోట్లు కేటాయించారు. వాటిలో దాదాపు రూ.50 కోట్లు మాత్రం వచ్చినట్లు సమాచారం. హైసిటీ పనుల కింద, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్ కలిపి మొత్తం రూ.3,065 కోట్లు కేటాయించగా, రూ.902 కోట్లు వచ్చాయి.

## అడ్డదారిలో ఐ ఫోన్లు తీసుకొచ్చి.. ఆర్‌జీఐఏ పోలీసులకు పట్టుబడి..




మహిళలు తీసుకొచ్చిన ఐ ఫోన్లను చూపిస్తున్న శంషాబాద్ డీసీపీ రాజేష్ తదితరులు

**శంషాబాద్:**

తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఐ ఫోన్లను అడ్డదారిలో తీసుకొచ్చి నగరంలో విక్రయించడానికి వచ్చిన ఐదుగురు మహిళలను ఆర్‌జీఐఏ ఔట్ పోస్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శంషాబాద్ డీసీపీ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన రిజ్వానా బేగం, సభాఖాన్, కమర్‌బేగం, సురీయాఖానం, లాయిన్నీసాలు రస్ అల్ ఖైమాలో ప్రోమ్యాక్స్ ఐ ఫోన్లు తక్కువ ధరకు కొనుగోలు చేశారు. ఎలాంటి రసీదులు లేకుండా తీసుకొచ్చి హైదరాబాద్ మార్కెట్‌లో విక్రయించేందుకు నిర్ణయించుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ ఔట్ పోస్టు పోలీసులు సోమవారం ఉదయం 7.30 గంటలకు 6ఈ–1496 విమానంలో వచ్చిన ఐదుగురు మహిళలను అంతర్జాతీయ అరైవల్ బయట అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న లగేజీలు తనిఖీ చేయగా మొత్తం 20 ఫోన్లు బయటపడ్డాయి. ఈ మేరకు కేసు నమోదు చేశారు. వీరి స్మగ్లింగ్ వెనక ఎవరున్నారనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్, ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్‌పోస్టు సీఐ జె. బాల్‌రాజ్ తదితరులను డీసీపీ అభినందించారు.



## 50 ఏళ్లలో 500 ఎకరాలు వెనక్కి!

### హారతి కర్పూరంలా కరిగిపోతున్న సెంట్రల్ వర్సిటీ భూములు

- మొదట ఇచ్చింది 2300 ఎకరాలు.. ఇప్పుడు మిగిలింది 1800
- తాజాగా 400 ఎకరాలు వేలం వేసేందుకు నిర్ణయం
- భగ్గుమంటున్న విద్యార్థి సంఘాలు
- అవి వర్సిటీ భూములు కావంటున్న ప్రభుత్వం

**రాయదుర్గం:** ప్రతిష్టాత్మక హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ భూముల వ్యవహారం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. వర్సిటీ భూములను ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు ఏదో సాకు చూపి వెనక్కు లాక్కుంటున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. వర్సిటీ ఏర్పడిన 50 ఏళ్లలో దాదాపు 500 ఎకరాల భూమిని వెనక్కి తీసుకున్నారని అంటున్నారు. మొదట 2300 ఎకరాల్లో హెచ్‌సీయూను ఏర్పాటు చేయగా.. ఇప్పుడు యూజీసీ లెక్కల ప్రకారం 1800 ఎకరాలు మాత్రమే ఉందని ఆరోపిస్తున్నారు. తాజాగా టీజీఐఐసీ ద్వారా 400 ఎకరాలను వేలం వేసేందుకు నిర్ణయించడంతో విద్యార్థి సంఘాలు, వర్కర్లు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పోరాటానికి దిగారు. వీరంతా జేఏసీగా ఏర్పడి ఆందోళనకు శ్రీకారం చుట్టారు. మరో వైపు ఈ స్థలం హెచ్‌సీయూది కాదని, అందుకే కోర్టు తీర్పు మేరకే అభివృద్ధి చేసేందుకు 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి అప్పగించామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే జరిగితే ఇక మిగిలేది 1400 ఎకరాలు మాత్రమే.

- హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, హెచ్‌సీయూ భూములు వర్సిటీ అవసరాలకే వినియోగించేలా చొరవ చూపాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.
- చుట్టూ ఐటీ కారిడార్ ఉండడంతో ఈ భూముల విక్రయం ద్వారా భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. 400 ఎకరాలను విక్రయిస్తే మార్కెట్ విలువ ప్రకారం రూ.10 వేల కోట్లు వస్తుందని ప్రభుత్వ అంచనా వేసిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

**మొదటి కేటాయించింది 2,300 ఎకరాలు**

హెచ్‌సీయూను సిక్స్ పాయింట్ ఫార్ములా ప్రకారం 1974లో ఏర్పాటు చేసి 2,300 ఎకరాలు కేటాయించారు. మొత్తంలో టీఐఎఫ్‌ఆర్‌కు 200 ఎకరాలు, ఐఎస్‌బీకి 260, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల కోసం 200 ఎకరాలు ఎపీబీకి 100, నిడ్‌కు 30, హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోకు 9 ఎకరాలు, ట్రిపుల్ ఐటీకి 60 ఎకరాలను కేటాయించారు. అంతేకాక విద్యుత్ సబ్‌స్టేషన్, గచ్చిబౌలి స్టేడియం, ట్రిపుల్ ఐటీ విద్యుత్ కేంద్రం, ఎంఆర్‌ఓ, ఎంఈఓ కార్యాలయాలకు, జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్, సర్కిల్ కార్యాలయాలకు, టిమ్స్ ఆస్పత్రికి దాదాపు 100 ఎకరాలు కేటాయించారు. ఇటీవలే టీఎన్‌జీఓ కాలనీకి ఐఎస్‌బీ ప్రహరీని ఆనుకొని లింకు రోడ్డుకు 20 ఎకరాలు కూడా హెచ్‌సీయూ నుంచి సేకరించి పెద్ద రోడ్డు వేశారు.

### భూముల విక్రయాలు ఆపాలి



ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల విక్రయాలను ఆపాలి. ఇది ప్రభుత్వ విద్య, పర్యావరణ పరిరక్షణపై స్పష్టమైన దాడి. ప్రైవేటు లాభాపేక్ష కంటే ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాం. – లెనిన్, ఎస్‌ఎఫ్ఐ హెచ్‌సీయూ క్యాంపస్ అధ్యక్షుడు

### ఎంతవరకైనా పోరాడుతాం..



హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తాం. నాణ్యమైన విద్య అందిస్తూ, పర్యావరణ పరిరక్షణకు మారుపేరైన హెచ్‌సీయూను రక్షించుకుంటాం. ఇప్పటికే ఎంతో స్థలం తీసుకున్నా ప్రత్యామ్నాయంగా స్థలం ఇవ్వలేదు. – అనిల్‌కుమార్, ఏబీవీపీ హెచ్‌సీయూ క్యాంపస్ అధ్యక్షుడు

### ఏకతాటిపై నిలుస్తాం..



హెచ్‌సీయూ ఉన్నత విద్యకు ఒక బ్రాండ్. ఈ విద్యా సంస్థ భూమిని తీసుకోవడం దారుణం. అందరం ఏకతాటిపై నిలిచి వర్సిటీ భూములను కాపాడుకుంటా. ఇప్పటికే చాలా భూమి తీసుకున్నారు. ఇకనైనా ఆపండి. – జీ.కిరణ్‌కుమార్, ఏఐటీసీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు

### జీవ వైవిధ్యాన్ని కోల్పోతాం..



ప్రభుత్వ చర్యతో శివారులో జీవ వైవిధ్యాన్ని కోల్పోయే పరిస్థితి దాపురిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వేలాన్ని రద్దు చేసి హెచ్‌సీయూ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం. – నాగరాజు, పీడీఎస్‌యూ హెచ్‌సీయూ అధ్యక్షుడు

# ఆన్‌లైన్‌లో ఇసుక!

### టీజీఎండీసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సాండ్ బజార్లు

- సన్న ఇసుక టన్నుకు రూ.1,800, దొడ్డుది రూ.1,600
- అందుబాటులోకి అబ్దుల్లాపూర్‌మెట్ సాండ్‌బజార్..
- నేడు మేడ్చల్ జిల్లా బౌరంపేటలో,
- రేపు వట్టినాగులపల్లిలోనూ ప్రారంభం

**సాక్షి, సిటీబ్యూరో:** ఇసుక అక్రమ దందాకు ప్రభుత్వం చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఇసుక బుకింగ్, తరలింపులో దళారుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా నాణ్యమైన ఇసుకను నిర్మాణదారులకు అందజేయాలని భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సాండ్ బజార్‌లను ప్రారంభించాలని తీర్మానించింది. ఈ మేరకు సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సాండ్ బజార్‌ను ప్రారంభించింది. మంగళవారం మేడ్చల్ జిల్లా బౌరంపేటలో, బుధవారం రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో మరో రెండు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వమే స్వయంగా క్వారీల నుంచి ఇసుకను లారీల్లో ఇక్కడికి తరలించి, నిర్మాణదారులకు సరఫరా చేయనుంది. సన్న ఇసుక టన్నుకు రూ.1800, దొడ్డు ఇసుక టన్నుకు రూ.1600 ధరగా నిర్ణయించింది. భవన నిర్మాణదారులు మీ సేవ కేంద్రాల్లో/టీజీఎండీసీ వెబ్‌సైట్‌లో నేరుగా ఇసుకను బుక్ చేసుకునే అవకాశం కల్పించింది.

**రోజుకు 50 వేల టన్నులు..**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భారీ సంఖ్యలో భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వ్యక్తిగత నివాసాలతో పాటు అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణం కోసం ఇసుక అవసరం. నగరంలో రోజుకు సగటు 50 వేల టన్నుల ఇసుక అవసరం ఉంటుందని అంచనా. కాళేశ్వరం, కరీంనగర్, భద్రాచలం, జాజిరెడ్డిగూడెం నుంచి గత నెల వరకు రోజుకు సగటున 1,400 లారీల్లో ఇసుకను తరలించగా, ప్రస్తుతం ప్రభుత్వ లోడింగ్‌పై విధించిన ఆంక్షలతో ఇసుక తరలించే లారీల సంఖ్య రెండు వేలకు చేరుకుంది. గతంలో ఒక్కో లారీలో 50 టన్నులకుపైగా ఇసుక తరలిస్తే.. ప్రస్తుతం 25 టన్నులే వస్తోంది. ఫలితంగా ఇసుకను తరలించే లారీల సంఖ్య ప్రస్తుతం రెండు వేలకు చేరింది. ఆయా లారీల యజమానులు ప్రభుత్వ క్వారీల నుంచి ఇసుకను లోడ్ చేసుకుని వచ్చినగర శివారు ప్రాంతాల్లోని ఆటోనగర్, ఉప్పల్, మంద మల్లమ్మ చౌరస్తా, ఉప్పరిగూడ, శివరాంపల్లి, ఉప్పల్ రింగ్‌రోడ్డు, బోడుప్పల్ ప్రధాన రహదారి వెంట ఉన్న ఖాళీ స్థలాల్లో నిలిపి అమ్ముతుంటారు.



**దళారులకు ఇక చెక్..**

దళారులు ఆయా లారీల యజమానులతో ముందే కుమ్మక్కై ఇసుక ధరను అమాంతం పెంచేస్తున్నారు. అంతేకాదు.. ఏకధాటి వర్షాలకు వాగుల్లో వరదలు పోటెత్తే సమయంలో కృత్రిమ కొరత సృష్టించి, అప్పటికే డంపింగ్ కేంద్రాల్లో నిల్వ చేసిన ఇసుకకు భారీ ధరలు నిర్ణయించి అమ్ముతున్న విషయం తెలిసిందే. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో టన్ను రూ.1200 లోపే దొరికే ఇసుక.. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఏకంగా రూ.2500 నుంచి రూ.3000 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక లేకపోతే పని ఆగిపోయే ప్రమాదం ఉందని భావించి ఇష్టం లేకపోయినా నిర్మాణదారులు వారు చెప్పిన ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇసుక అక్రమ దందాకు చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్వారీలపై నిఘా పెంచింది. ప్రస్తుతం ఆయా ఇసుక క్వారీలన్నింటిని తమ చేతుల్లోకి తీసుకుంది. ఓవర్‌లోడు కారణంగా రహదారులు దెబ్బ తినకుండా చెక్ పెట్టింది. అంతేకాదు బహిరంగ మార్కెట్లో ఇసుక అధిక ధరలకు కళ్లెం వేసినట్లయింది.

## ఎంపీ డీకే అరుణ నివాసాన్ని పరిశీలించిన సీపీ

### ఆగంతకుడి చొరబాటు కేసులో దర్యాప్తు ముమ్మరం



ఎంపీ డీకే అరుణ ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ సీవీ ఆనంద్

**బంజారాహిల్స్:** బీజేపీ ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి చొరబడిన కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఎంపీ నివాసంలోకి ప్రవేశించిన ఆగంతకుణ్ని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వంద మీటర్ల దూరంలోనే ఉన్న తన నివాసంలోకి ఆగంతకుడు ప్రవేశించడం, గంటన్నర పాటు ఇల్లంతా కలియతిరగడం భద్రతా వైఫల్యాన్ని కళ్లకు కడుతోందని ఎంపీ డీకే అరుణ ఆరోపించిన నేపథ్యంలో పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–56లోని ఎంపీ ఇంటికి చేరుకుని వివరాలు సేకరించారు. చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ జూబ్లీహిల్స్ పోలీసులతో ఘటనా వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు దుండుగుడు ఇంట్లోకి ప్రవేశించిన ప్రాంతాన్ని పరిశీలించారు. గతంలో ఇక్కడ పని చేసినవారే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. పోలీసు ప్రత్యేక బృందాలు నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేశాయి.

## ఎమర్జెన్సీని తలపిస్తున్న రేవంత్ పాలన: కేటీఆర్



చంచల్‌గూడ జైలు వద్ద మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

**చంచల్‌గూడ:** ఇందిరమ్మ రాజ్యమంటే కేసీఆర్ పాలనలో కంటే మరిన్ని ఎక్కువ సంక్షేమ పథకాలు వస్తాయని తెలంగాణ ప్రజలు అపోహపడ్డారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చంచల్‌గూడ మహిళా జైలులో ఉన్న యూ ట్యూబ్ జర్నలిస్టులు రేవతి, తన్వీ యాదవ్‌లను సోమవారం ఆయన ప్రత్యేక ములాఖత్‌లో కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన చూస్తుంటే ఎమర్జెన్సీ గుర్తుకు వస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపించిన మహిళా జర్నలిస్టులను జైలులో పెట్టడం దుర్మార్గమన్నారు. కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగి అసభ్యంగా మాట్లాడే పద్ధతిని రేవంత్‌రెడ్డి మొదలు పెట్టారన్నారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.


**కావలెను**

శేరిలింగంపల్లి, చిక్కడపల్లి జోన్‌లలో ప్రకటనలు సేకరించుటకు అనుభవం కలిగిన యువకులు కావలెను.

**అడ్వర్టైజ్‌మెంట్ సేల్స్ ట్రైనీ**

అర్హతలు : ఏదైనా డిగ్రీ
వయస్సు : 19 నుండి 30 సం॥లోపు వారై ఉండాలి.
అనుభవం : ఇతర దినపత్రికలలో ప్రకటనల విభాగంలో పనిచేసిన వారు మరియు వివిధ కంపెనీలలో మార్కెటింగ్ రంగంలో పనిచేసిన వారు / ఫ్రెషర్స్ కూడా అవకాశం.
జీతభత్యాలు : రూ. 20,000/-

ఇంటర్వ్యూ తేది: 18-03-2025 (మంగళవారం)
ఉ.11:00 గం. నుండి మ.2:00 గం. వరకు

E-mail id: venkateshl@sakshi.com
(or)
Sakshi Media Group, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyd - 500 034.
Ph: 040-23256000, Extn: 6344
Cell: 9912220352

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

# కదులుతున్న కారులో మంటలు

సకాలంలో స్పందించడంతో తప్పిన ముప్పు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



కారు దిగి ప్రమాదం నుంచి బయటపడిన నాగరాజు కుటుంబం

**లాలాపేట:** హబ్సిగూడ ప్రధాన రహదారిపై వెళ్తున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న వారు వెంటనే కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు.. వారాసిగూడకు చెందిన నాగరాజు జనగామ నుంచి బస్సులో వచ్చిన తన భార్యా పిల్లలను ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద మారుతి స్విఫ్ట్ కారులో ఎక్కించుకుని (ఏపీ 09 బీజే 2366) ఉప్పల్ వైపు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్నాడు. వీరి కారు హబ్సిగూడ రోడ్డు నెంబర్ 6 వద్దకు రాగానే ఇంజిన్ వేడెక్కి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ నాగరాజు వెంటనే కారును రోడ్డు పక్కన నిలిపాడు. స్థానికులు, పోలీసుల సహాయంతో కారు వెనక డోర్లు ఓపెన్ చేసి భార్యా పిల్లలను కూడా బయటకు దింపారు. సమాచారం అందుకున్న మౌలాలి ఫైర్ స్టేషన్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# టీవీ రిపోర్టర్‌పై దాడి..కేసు నమోదు

**ఫిలింనగర్:** ఓ యువతి వెంటపడి వేధిస్తున్న యువకుడిని పద్ధతి మార్చుకోవాలంటూ సూచించిన ఓ టీవీ చానల్ రిపోర్టర్‌పై దాడి జరిగింది. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లో నివాసం ఉంటున్న బాపూరాం శశి సమీపంలోని ఓ టీవీ చానల్‌లో రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి పరిచయం ఉన్న ఓ యువతిని ఎల్బీనగర్‌కు చెందిన శ్రీకాంత్ వేధించసాగాడు. దీనిపై యువతి..శశికి చెప్పడంతో శ్రీకాంత్‌ను పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించాడు. అప్పటి నుంచి కక్ష పెంచుకున్న శ్రీకాంత్ ఈ నెల 2న అపోలో ఆసుపత్రి వద్ద అడ్డుకొని దాడి చేశాడు. నా జోలికి వస్తే అంతు చూస్తానంటూ హెచ్చరికలు జారీ చేశాడు గత నెల 24న శశి ఇంటి ముందు పార్కు చేసిన బైకును ధ్వంసం చేశారు. అది కూడా శ్రీకాంత్ చేసి ఉంటాడని, అతడి వల్ల తనకు ప్రాణహాని ఉందంటూ బాధితుడు శశి కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడు శ్రీకాంత్ మీద బీఎన్ఎస్ 324 (3), 115(2),351(2) సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ‘అక్రమ ఇన్‌ఫ్లూయన్స్’పై ఉక్కుపాదం!

## సోషల్‌మీడియాలో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లు

- తీవ్రంగా స్పందించిన సీనియర్ ఐపీఎస్ సజ్జనార్
- విశాఖపట్నం నుంచి మొదలైన కేసుల పరంపర
- 11 మందిపై నమోదు చేసిన పంజగుట్ట పోలీసులు
- నిందితుల్లో ఆసిఫ్‌నగర్ ఠాణా కానిస్టేబుల్ సైతం



**సాక్షి, సిటీబ్యూరో:** సోషల్‌మీడియా విస్తరణ నేపథ్యంలో ఇన్‌ఫ్లూయన్సర్ల పాత్ర కీలకంగా మారింది. సమాజంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న వారిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిర్ణీత మొత్తాలు చెల్లిస్తూ బెట్టింగ్-గేమింగ్-లోన్ యాప్స్‌ను ప్రమోట్ చేయించుకుంటున్నారు. ఈ ఇన్‌ఫ్లూయన్సర్ల ప్రభావంతో ఈ యాప్స్ వల్లో చిక్కుకుంటున్న అమాయకులు నిండా మునిగిపోతున్నారు. కొందరైతే ఏకంగా ఆత్మహత్యల వరకు వెళ్లారు. ఐపీఎల్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో దీనిపై సీనియర్ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ యుద్ధం ప్రకటించారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో అక్రమ ఇన్‌ఫ్లూయన్సర్లపై కేసులు నమోదవుతున్నాయి. తాజాగా సోమవారం పంజగుట్ట పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఇన్‌ఫ్లూయన్సర్లతో పాటు నటులు, ఓ కానిస్టేబుల్ సైతం ఉన్నారు. బెట్టింగ్, గేమింగ్, లోన్ యాప్స్ నిర్వాహకులు సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉన్న ఇన్‌ఫ్లూయన్సర్లను ఎంపిక చేసుకుంటున్నారు. వారితో ఒప్పందాలు చేసుకోవడం ద్వారా తమ యాప్స్‌కు సంబంధించిన లింకుల్ని వారి ఖాతాల ద్వారా ప్రమోట్ చేస్తున్నారు.

### హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్

ఈ దందా మొత్తం వ్యవస్థీకృతంగా సాగుతోంది. ఆయా యాప్స్‌లో ఉండే ప్రత్యేక ప్రోగ్రామింగ్ ఆధారంగా గెలుపు-ఓటముల శాతం మూడు-ఏడుగా ఉంటోంది. వాటిలోకి వెళ్లి డబ్బు పెట్టి ఆడే వాళ్లు మొదటి మూడుసార్లు గెలిస్తే... ఆపై ఏడుసార్లు ఓడిపోతారు. ప్రతి సందర్భంలోనూ ఈ సైకిల్ రిపీట్ అయ్యేలా ప్రోగ్రామింగ్ ఉంటోంది. ఇలా అమాయకుల నుంచి కొల్లగొట్టిన సొమ్ములో దాదాపు 50 శాతం యాప్స్ నిర్వాహకులు ఇన్‌ఫ్లూయన్సర్లకు ఇస్తున్నారు. ఎవరి ఖాతాలో లింకు ద్వారా అయితే సదరు వ్యక్తి తమ యాప్‌కు యాక్సస్ చేస్తారో..ఆ ఇన్‌ఫ్లూయన్సర్‌కు ఆ మొత్తం అందిస్తున్నారు. వ్యవస్థీకృతంగా సాగుతున్న ఈ దందాను గుర్తించిన వీసీ సజ్జనార్ ఇటీవల ట్విట్టర్‌లో హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్ పేరుతో యుద్ధం ప్రకటించారు. దీనిపై స్పందించిన విశాఖపట్నం పోలీసులు లోకల్ బాయ్ నానిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆపై సూర్యాపేట అధికారులు బయ్యా సన్నీ యాదవ్‌పై కేసు నమోదు చేయగా.. అతడు విదేశాలకు పారిపోయాడు.

### పంజగుట్టలో 11 మందిపై కేసు

రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా యాప్స్‌పై చర్యలు తీసుకోవాలని ఇటీవల డీజీపీ జితేందర్ సైతం అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనరేట్ల కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోషల్ మీడియా ద్వారా వివిధ అక్రమ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న 11 మందిపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం పంజగుట్ట పోలీసులు గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఇందులో ఆయా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులతో పాటు ఇన్‌ఫ్లూయన్సర్లు ఇమ్రాన్ ఖాన్, ఇతడికి స్నేహితుడు, ఇన్‌ఫ్లూయన్సర్‌గా ఉన్న చిక్కడపల్లి వాసి (ఆసిఫ్‌నగర్ ఠాణా కానిస్టేబుల్) కిరణ్ గౌడ్, హర్ష సాయి, టేస్టీ తేజ, అజయ్, బన్నీ యాదవ్, సుధీర్, నటులు సుప్రీత (సురేఖవాణి కుమార్తె), విష్ణు ప్రియ, రీతు చౌదరి తదితరులను నిందితులుగా చేర్చారు. ఈ యాప్స్ ద్వారా రూ.కోట్లు చేతులు మారాయని, మనీలాండరింగ్, హవాలా కోణాలు ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు.

### వైరల్‌గా మారిన సజ్జనార్ పోస్టింగ్స్

హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్ తర్వాత వీసీ సజ్జనార్ పోస్టులు వైరల్‌గా మారాయి. ఈయన కోసం సోషల్ మీడియాలో దాదాపు ఐదు కోట్ల మంది సెర్చ్ చేశారు. ట్విట్టర్‌ను మూడు రోజుల్లో 60 లక్షలు మంది, ఇన్‌స్టాగామ్‌ను 5.8 లక్షలు మంది వీక్షించారు. సజ్జనార్ ఇన్‌స్టాలో ఉన్న ఫాలోవర్లలో భారత్‌తో పాటు అమెరికా, లండన్, యూఏఈ, మొరాకో దేశీయులు ఎక్కువగా ఉండగా...వీరిలో హైదరాబాద్, విశాఖ, బెంగళూరు, విజయవాడ వాసులు పెద్ద సంఖ్యలో చేరారు. ట్విట్టర్‌లో భారత్‌తో పాటు అమెరికా, లండన్, యూఏఈ, ఆస్ట్రేలియా, కెనడా, కువైట్‌లకు చెందిన వారి నుంచి సజ్జనార్‌కు మద్దతు లభిస్తోంది.

# అడుగుకో ఆక్రమణ!

- హైడ్రా ప్రజావాణిలో మొత్తం 59 ఫిర్యాదులు
- విచారణకు ఆదేశాలు జారీ చేసిన రంగనాథ్

**సాక్షి, సిటీబ్యూరో:** రాజధానిలో ప్రభుత్వ స్థలాలే కాదు.. పార్కులు, నాలాలు, రహదారులు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయి.హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 59 ఫిర్యాదులు రాగా.. వీటిని నేరుగా స్వీకరించిన రంగనాథ్ అక్కడికక్కడే విచారణ చేపట్టి సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

◆ బంజారాహిల్స్ రోడ్డు నం.12లోని శ్రీవేంకటేశ్వర కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఓపెన్ ప్లేస్ (ప్రజావసరాలకు ఉద్దేశించిన) 600 గజాలతో పాటు తన ఇంటి స్థలాన్ని కూడా కొంతమేర ఓ ప్లాట్ యజమాని కబ్జా చేశారని అన్నపూర్ణ ఫిర్యాదు చేశారు.

◆ నాగిరెడ్డి గొలుసు కట్టు చెరువు ఎఫ్‌టీఎల్‌తో పాటు నాలా, బఫర్ జోన్‌ల్లో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని యాప్రాల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఫిర్యాదు చేసింది. ఈ చెరువుకు చుట్టూ రూ.1.20 కోట్లు వెచ్చించి ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్‌ను సైతం తొలగించి బఫర్ జోన్‌లో ప్రహరీ నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ వాటిని వెంటనే వాటిని తొలగించాలని కోరింది.

◆ హయత్‌నగర్ మున్సిపాలిటీ సర్కిల్-3లోని వివేకానందనగర్ కాలనీలో 25 అడుగుల రహదారిని ఆక్రమించి ఏకంగా ఇల్లు నిర్మించారని, గతంలో మున్సిపాలిటీ అధికారులు కూల్చేసినా.. మళ్లీ ఇంటిని నిర్మించారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు.

◆ కేపీహెచ్‌బీలో ప్రధాన రహదారికి అనుకుని ఉన్న సర్వీసు రోడ్డును ఆక్రమించి, చిరు వ్యాపారాల పేరిట దందాలు చేస్తున్నారని, అక్కడ తోపుడు బండ్లపై వ్యాపారాలే కాకుండా శాశ్వతంగా డబ్బాలు కూడా పెట్టి మొత్తం రోడ్డును ఆక్రమించారని కేపీహెచ్‌బీ ఫేస్-1, 2 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

◆ నార్త్ లాలాగూడలోని స్లమ్‌లో 160 గజాల స్థలం ఆక్రమణకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేశారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.

ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్

Ph: 040-23256000 Ext: 6344, 9912220352

## ఇటుక బట్టీలపై విజిలెన్స్ దాడులు



**ఇబ్రహీంపట్నం రూరల్:** ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో ఇటుక బట్టీలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. వ్యవసాయ పొలాలకు వినియోగించే విద్యుత్‌ను, అక్రమంగా పరిశ్రమలకు వాడుతున్నారన్న సమాచారంతో విజిలెన్స్ ఏడీ మోషా ఆధ్వర్యంలో సోమవారం పలు చోట్ల దాడులు నిర్వహించారు. 5 చోట్ల కేసులు నమోదు చేశామని అధికారులు తెలిపారు. తప్పనిసరిగా కమర్షియల్ మీటర్లు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

## చికిత్స పొందుతూ.. వ్యక్తి మృతి

**హుడాకాంప్లెక్స్:** సరూర్‌నగర్ డివిజన్ పరిధి సాయితేజ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. భూదాన్ పోచంపల్లికి చెందిన మహేశ్(26) గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతూ.. ఆదివారం ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుండెనొప్పితో మహేశ్ చనిపోయాడని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో ఆగ్రహించిన కుటుంబీకులు సోమవారం ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఇరువురి మధ్య సయోధ్య కుదిర్చి సమస్యను పరిష్కరించారు. కాగా.. బాధితులకు ఆస్పత్రి యాజమాన్యం పరిహారం అందజేసినట్లు సమాచారం.

# ఉదయం కూల్చివేత..సాయంత్రానికి సీసీ రోడ్డు!

కిస్మత్‌పురాలో వివాదాన్ని పరిష్కరించిన హైడ్రా





స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా అధికారులు..ఆక్రమణ స్థానంలో సీసీ రోడ్డు వేసిన దృశ్యం

**సాక్షి, సిటీబ్యూరో:** బండ్లగూడ జాగీర్ పరిధిలో కిస్మత్‌పురాలో మూడేళ్లుగా ఉన్న రహదారి వివాదాన్ని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పరిష్కరించింది. రెండు కాలనీలను కలిపే ప్రధాన రహదారికి అడ్డంగా నిర్మించిన ప్రహరీని హైడ్రా సోమవారం ఉదయం కూల్చేసింది. సాయంత్రానికి మున్సిపాలిటీ అధికారులు సహకారంతో అక్కడ సీసీ రోడ్డు నిర్మించారు. కిస్మత్‌పురాలోని ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్-శ్రీ హర్షిత్ లేఔట్ మధ్య ఈ రహదారి నిర్మాణంతో పలు కాలనీలకు రాకపోకలకు మార్గం సుగమమైంది. 18.65 ఎకరాల్లో 173 ప్లాట్లతో ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ పేరుతో కాలనీ ఏర్పడింది. దీనికి ఆనుకుని దాదాపు 12 ఎకరాల్లో 160 ప్లాట్లతో శ్రీ హర్షిత్ లేఔట్ వచ్చింది. వీటిని కలుపుతూ 30 అడుగుల వెడల్పుతో రహదారి ఉంది. ఒకప్పుడు ఇక్కడ నిర్మాణాలు లేనప్పుడు శ్రీ హర్షిత లేఔట్‌ను ఆక్రమణల నుంచి కాపాడాలనే ఉద్దేశంతో రహదారిని మూసేస్తూ ప్రహరీ నిర్మించారు. ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు దీన్ని ఆరు నెలల క్రితం మున్సిపల్ అధికారులు కూల్చేశారు. శ్రీ హర్షిత్ లేఔట్ నిర్వాహకులు అదే రోడ్డుకు అడ్డంగా మళ్లీ ప్రహరీ నిర్మించడంతో వివాదం ఏర్పడింది. దీనిపై ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ కాలనీ వాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు సోమవారం ఉదయం మున్సిపల్ అధికారుల సమక్షంలో రహదారికి అడ్డంగా ఉన్న ప్రహరీగోడను తొలగించారు. సాయంత్రానికి సీసీ రోడ్డు నిర్మాణం జరిగేలా చొరవ తీసుకున్నారు. ఆ గోడ కారణంగా మూడేళ్లుగా నరకం చవి చూశామని, తాము రాకపోకలు సాగించాలంటే రెండు కిలోమీటర్లకు పైగా అదనంగా ప్రయాణించాల్సి వచ్చేదని ఫార్చ్యూన్ వెస్ట్ మెడోస్ కాలనీ వాసులు వాపోయారు. హైడ్రా చొరవతో ఇన్నాళ్లకు తమ సమస్య తీరిందని, చుట్టుపక్కల మరో రెండుమూడు కాలనీలకు ఉపయుక్తంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■HMDA పరిధిలో గజం కేవలం 2999/-కే Nr.యాదగిరిగుట్ట, స్పాట్ పేమెంట్‌పై గోల్డ్ ఆఫర్ కలదు, 11కస్టమర్స్ మాత్రమే 121 & 242 గజాలు కలవు. ఫోన్: 7842408719 [HA-8214]

Services

BUSINESS SERVICE

■మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా దబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800526]

PERSONAL CARE

CHANGE OF NAME

■I, Arka Vijaya Laxmi, W/o. Arka Bhagavanth Rao, R/o. H.No. 1-334, Lakkaram Utnoor Mandal, Adilabad Dist. Changed My Name As Madavi Vijayalaxmi to Arka Vijaya Laxmi. [SCA25002224]

■I, HALEMBER MANJULA D/o Siva Sangappa Yedrami R/o. 1-7-1074, Flat No: 402 Sanchay Towers. RTC 'X' Roads Hyderabad-500020. TS have changed my name as Yedrami Manjula for all Future purposes. [SCA25002221]

■I, Ashok Kumar R/o. Ward No. 5, Nathusar Bass Po : Bangla nagar, Ps : Nayasahar, Bikaner Rajasthan have changed my minor son's name from Ritanshu to Ritanshu Godara. [DA-41885]

■I, ARE Ramya D/o Late Narasimhulu Naidu Are, R/o H.No: 1-10-118, F.No: 302, Lakshmisri Residency, Street No:11, Ashok Nagar, Hyderabad- 500020 have changed my Name from ARE RAMYA to RAMYA SANDEEP for all record purpose. [HA-00127]

■I, Vishal Ashokrao Haibatpure S/o Ashok Haibatpure R/o Flat : 210, Block 08, My Home Mangala, Kondapur, Cyberabad-Rangareddy-Telangana-500084 have changed my name to Vishal Ashok Haibatpure [HA-09817]

OLD AGE HOME

■వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానసున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-శీనర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467086, 9391039990, 9949520296 [H-783370]

TOURS & TRAVELS

■సాయి టూర్స్ మార్చి 31 కర్ణాటక ఉడిపి గోకర్ణ, శృంగేరి. ఏప్రిల్ 7 రామేశ్వరం, మధురై, ఏప్రిల్ 19 మహారాష్ట్ర షిరిడి, భీమశంకర్, మే 7 గుజరాత్. 9848664831 [SCA25002185]

Wanted

■నెట్‌వర్క్ లీడర్స్, LIC ఏజెంట్స్ కావలెను. కేవలం 1680/- ఒకసారి పెట్టుబడితో సొంత వ్యాపారం ప్రారంభించి ఎర్న్ 3K - 30K. రోజు 9948828641 [SCA25002106]

■ఫార్మా కంపెనీకి ఇంగ్లీష్, హిందీ వచ్చి టూరింగ్ చేయగల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మంచి జీతం + TA, DAలతో 40 పైబడినవారు కావలెను. 9515906315. [SCA25002191]

■సాయిరామ్ హోమ్‌కేర్ Hydలో బేబీ & పేషెంట్ కేర్ ముసలివారిని చూసుటకు ఆయాలు/ నర్సులు ఇంటి/వంటపనికి ఆడ/మగ కావలెను. జీ: 18 వేలు. 9949094607 [SCA25002179]

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్. జీ: 18K. Ph: 9640400073, 9160900024 [SCA25002140]

■హైదరాబాద్‌లో ఇంట్లోనే ఉండి ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్లు కావలెను. జీతం 18-30K. ఫోన్: 8019373131 [H-800524]

■క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-2]

■సెక్యూరిటీగార్డ్స్(తెలుగు&హిందీవాళ్లు)30మంది జీ:14,000,సూపర్‌వైజర్స్,జీ:16,000,12Hr డ్యూటీ,PF&ESI నాంపల్లి రైల్వే స్టేషన్‌లో పనిచేయుటకు కావలెను. 9177539171, 7396016024. [T-1267310]

■మా ఆఫీసులో పని చేయుటకు 18 నుండి 50 సం॥ల లోపు వయస్సు గల స్త్రీలు కావలెను. అర్జెంట్‌గా కావలెను. సంప్రదించండి: సెల్: 7993676361. [KA- 4984]

■WANTED Property Supervisor, Cashier, Restraunt Captain, Accountant. Kompally & Nampally. Ph 9550637059 [HA-09818]

■Wanted Female Telecaller. No Consultancy, Direct Job, Qualification: Degree, Office Address: Ameerpet. Contact: 7075239265. [HA-15165]

■Wanted M/F Exp/Fresh Telecallers with Good Communication Skills @ Attapur. Salary Rs. 12K to 18K+ Commission. Ph: 8074771087 [HA-4009]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు) ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : జీఎస్టీ మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

| | | | |
|---|---|---|---|
| దిల్‌సుఖ్‌నగర్ | 9912348016 | రాజేంద్రనగర్ | 9010202372 |
| ఎల్.బి.నగర్ | 9912225475 | కూకట్‌పల్లి | 9912225476 |
| తార్నాక | 9010202751 | బాలానగర్ | 9951602997 |
| సికింద్రాబాద్ | 9010299013 | మల్కాజ్‌గిరి | 9505507562 |
| చిక్కడపల్లి | 9912225453 | మెహదీపట్నం | 9912225468 |
| అబిడ్స్ | 9705144457 | చందానగర్ | 9912225453 |
| అమీర్‌పేట్ | 9505507563 | ఉప్పల్ | 7095250115 |

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

## ట్రాఫిక్ సిగ్నల్ కూడళ్లలో గ్రీన్ మ్యాట్ రూఫ్‌లు ఏర్పాటు చేయాలి

**లక్డీకాపూల్:** గ్రేటర్‌లో ఎండ తీవ్రత పెరుగుతూ ఉంది. ఈ నెలలోనే 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీనిని పరిగణనలోకి తీసుకొని ట్రాఫిక్ కూడళ్ల వద్ద గ్రీన్ మ్యాట్ రూఫ్‌లను ఏర్పాటు చేయాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) డిమాండ్ చేసింది. ఈమేరకు జీహెచ్ఎంసీ కార్యాలయంలో సోమవారం కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. నగరంలో చాలా కూడళ్ల వద్ద అధిక ట్రాఫిక్ కారణంగా వాహనదారులు రెండు నుంచి మూడు నిమిషాలు ఆగాల్సి వస్తోందని, ఆ సమయంలో ఎండ తీవ్రతకు అనారోగ్యానికి గురవుతున్నారని పీవైఎల్ నాయకులు పేర్కొన్నారు. కాబట్టి ముఖ్యమైన కూడళ్లను గుర్తించి గ్రీన్ మ్యాట్ రూఫ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.రవికుమార్, బీఎస్ కృష్ణ, ఉపాధ్యక్షుడు కుంభోజు కిరణ్ తదితరులు ఉన్నారు.

## చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

**జవహర్‌నగర్:** చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..దమ్మాయిగూడ సన్‌షైన్ కాలనీలో నివసించే మోరా లక్ష్మి(60) భర్త మృతి చెందడంతో పెద్ద కుమారుడు తిలక్‌రెడ్డి వద్దే ఉంటుంది. తిలక్‌రెడ్డి ఇటీవల పలువురి వద్ద అప్పులు చేయగా..వాటిని తీర్చాలని లక్ష్మిని వేధింపులకు గురిచేశారు. కాగా తిలక్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంతో మృతిచెందగా అతనికి వచ్చే బీమా డబ్బులు ఇవ్వాలని బంధువులు కొందరు ఆమెను నిలదీశారు. దీంతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేయగా స్థానిక మహిళ ఒకరు కాపాడారు. ఈ క్రమంలో సోమవారం దమ్మాయిగూడలోని నాసిక్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన స్థానికులు జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గో సంరక్షణకు నడుం బిగించాలి

**సుల్తాన్‌బజార్:** భారతీయ జీవనాడి గోవు అని..గో రక్షణ కోసం హిందువులంతా నడుం బిగించాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ సహ కార్యదర్శి ఆకారపు కేశరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కోఠిలోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయంలో గో రక్ష విభాగం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. కేశవరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గో రక్ష ఉద్యమాన్ని జనాల నుంచి తీసుకురావాలని సూచించారు. గ్రామ గ్రామాన గోరక్షణ కోసం యువకులు కమిటీలుగా ఏర్పాడాలని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గో రక్ష ఉద్యమం ప్రధానంగా నిలిచిందని, ఈ ఉద్యమం ఆధారంగానే స్వాభిమానం, జాతీయ భావాలతో దేశమంతా ఉవ్వెత్తున ఉద్యమం ఎగిసిపడిందని గుర్తుచేశారు. గోవు అనేది కేవలం ఒక ప్రాణి మాత్రమే కాదని, జాతీయ జీవన విధానానికి ప్రాణమన్నారు. గో రక్ష చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, యాదగిరిరావు, ఆర్ఎస్ఎస్ నాయకులు రామారావు, వెంకన్న, రమేష్, ప్రశాంత్, రాధాకృష్ణారెడ్డి, శ్యామ్, శివానంద, మంళ, స్వరాజ్యలక్ష్మి, శ్రీధర్‌తో పాటు వివిధ జిల్లాల ప్రముఖులు పాల్గొన్నారు.

# రద్దయ్యే రైళ్లకు..మూడు రోజుల్లో టికెట్ చార్జీల చెల్లింపు

**సాక్షి, సిటీబ్యూరో:** ప్రకృతి వైపరీత్యాలు, బంద్‌లు, రాస్తారోకోలు వంటి వివిధ కారణాల వల్ల రైళ్లు పూర్తిగా రద్దయినపుడు మాత్రమే ప్రయాణికులు తమ టిక్కెట్ చార్జీలను పూర్తిగా తిరిగి చెల్లించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. రైల్వే రీఫండ్ నిబంధనల ప్రకారం, ప్రమాదాలు, ఉల్లంఘనలు, వరదలు, బంద్ లేదా రైలు రోకో వంటి అనివార్య పరిస్థితుల కారణంగా రైలును పూర్తిగా రద్దు చేస్తే రిజర్వేషన్ కౌంటర్‌ల ద్వారా టిక్కెట్‌లు కొనుగోలు చేసిన ప్రయాణికులు రైలు బయలుదేరాల్సిన నిర్ణీత సమయం నుంచి 3 రోజులలోపు ఏదైనా రైల్వే స్టేషన్‌లోని పి.ఆర్.ఎస్ కౌంటర్‌లో రిజర్వేషన్ టిక్కెట్‌లను సమర్పించాలి. మొత్తం ప్రయాణానికి ఎటువంటి రద్దు ఛార్జీలు లేకుండాపూర్తి చార్జీలను ప్రయాణికులకు చెల్లిస్తారు. ఆన్‌లైన్ ద్వారా అంటే ఇ-టికెట్ ద్వారా బుక్ చేసుకున్న టిక్కెట్ల విషయంలో ఆటోమేటిక్‌గానే టిక్కెట్‌లు రద్దవుతాయి. ఈ మేరకు ప్రయాణికుల ఖాతాల్లో చార్జీలు తిరిగి జమ చేస్తారు. ఐఆర్‌సీటీసీ ద్వారా ఈ సదుపాయం లభిస్తుంది. భారీ వర్షాలు, వరదలు, శాంతిభద్రతల పరిస్థితులు వంటి అసాధారణ సంఘటనల కారణంగా రైలు సర్వీసుల నిర్వహణలో మార్పులు అనివార్యమని సీపీఆర్వో తెలిపారు. మరోవైపు కొత్త లైన్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన వంటి సందర్భాల్లో మాత్రం ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రైళ్లను వివిధ మార్గాల్లో మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. అటువంటి సందర్భాల్లో ప్రయాణికులకు ఎప్పటికప్పుడు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమ వేదికల ద్వారా సమాచారం అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రయాణికుల మొబైల్ ఫోన్‌లకు కూడా సందేశాలు అందుతాయన్నారు. టికెట్ కొనుగోలు చేసే సమయంలో ప్రయాణికులు తప్పనిసరిగా తమ మొబైల్ నంబర్‌లను అందజేయవలసి ఉంటుంది. ఈ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైలు సర్వీసులు పూర్తిగా రద్దయితే చార్జీలు పూర్తిగా వాపసు పొందడానికి రైలు బయలుదేరాల్సిన నిర్ణీత సమయం నుంచి 3 రోజులలోపు సమీపంలోని ఏదైనా స్టేషన్‌లోని పి.ఆర్.ఎస్. కౌంటర్‌లో రిజర్వేషన్ టికెట్‌ను అప్పగించాలని సీపీఆర్వో స్పష్టం చేశారు.

# 75 ఏళ్ల మహిళ నుంచి రూ.73 లక్షలు స్వాహా

- బాధితురాలు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని
- పోలీసు, సీబీఐ పేరు చెప్పిన కేటుగాళ్లు
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు



**సాక్షి, సిటీబ్యూరో:** సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగినిని (75) టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ.73 లక్షలు కాజేశారు. ఆడియో, వీడియో కాల్స్ ద్వారా.. పోలీసు, సీబీఐ అధికారుల పేరు చెప్పి.. దుర్భాషలాడిన ఆరోపణలపై కేసుంటూ మొదలుపెట్టి...మనుషుల అక్రమ రవాణా వరకు తీసుకువెళ్లి ఈ మొత్తం స్వాహా చేశారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సోమవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. బాధితురాలికి వారం రోజుల క్రితం టెలికం విభాగానికి చెందిన అధికారి పేరుతో ఫోన్ వచ్చింది. 702-----562 నంబర్ మీదేనా? అంటూ అవతలి వ్యక్తి పశ్నించగా కాదని సమాధానం ఇచ్చారు. ఆమె ఆధార్‌తో లింకై ఉన్న ఆ ఫోన్ నెంబర్ వినియోగించిన కొందరు అసభ్య పదజాలంతో పలువురికి ఫోన్లు చేశారని, దీనిపై బెంగళూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదై ఉందని చెప్పారు. ఆమె పేరుతో ఉన్న అన్ని ఫోన్లు త్వరలో బ్లాక్ అవుతాయని భయపెట్టాడు. ఈ ఆరోపణల్ని బాధితురాలు తోసిపుచ్చగా... త్వరలోనే పోలీసులు సంప్రదిస్తారని చెప్పాడు. ఆపై వాట్సాప్ వీడియో కాల్ చేసిన వ్యక్తి పోలీసు యూనిఫాంలో బాధితురాలికి కనిపించాడు. ఆమె ద్వారా ఆధార్ కార్డు కూడా షేర్ చేయించుకున్నాడు. తాము షాదత్ ఖాన్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని, అతడు వినియోగించిన బ్యాంకు ఖాతాల్లో కొన్ని బాధితురాలి పేరుతో ఉన్నట్లు చెప్పాడు. బాధితురాలి ఆర్థిక స్థితిగతుల్ని అడిగిన అతగాడు మనుషుల అక్రమ రవాణా కేసులో 187వ అనుమానితురాలిగా చేరుస్తున్నట్లు చెప్పాడు. ఆ కేసులో అరెస్టు వారెంట్, బ్యాంకు ఖాతాల ఫ్రీజింగ్ ఆదేశాలు సిద్ధంగా ఉన్నట్లు నమ్మబలికాడు. దీని తర్వాత సీబీఐ అధికారి పేరుతో వీడియో కాల్ చేసిన మరో వ్యక్తి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ గవర్నర్ జారీ చేసినట్లు ఉన్న నకిలీ లేఖను పంపాడు. అందులో సుప్రీం కోర్టు జ్యుడీషియల్ అథారిటీ ఆదేశాల ప్రకారం బాధితురాలు కొంత మొత్తం పోలీసులు సూచించినట్లు డిపాజిట్ చేయాలని ఉంది. సదరు నకిలీ సీబీఐ అధికారి ఆ కేసుల్లో పలువురు ప్రభుత్వ, బ్యాంకు అధికారులకూ పాత్ర ఉన్నట్లు చెప్పాడు. ఆర్బీఐ ఆదేశాల ప్రకారం నగదు డిపాజిట్ చేయాలని, వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత రిఫండ్ చేస్తామని నమ్మబలికాడు. దీంతో బాధితురాలు తన వద్ద ఉన్న డబ్బుతో పాటు ఫిక్సిడ్ డిపాజిట్లు సైతం బ్రేక్ చేసి, తన కుమార్తె వద్ద నుంచి తీసుకుని మొత్తం రూ.73.5 లక్షలు సిద్ధం చేశారు. ఆపై నేరగాళ్లు ఆర్బీఐ పేరుతో మరో నకిలీ లేఖ పంపి...అందులో కొన్ని బ్యాంకు ఖాతాల నెంబర్లు, వివరాలు సూచించిన వాటిల్లోకి నగదు బదిలీ చేయమన్నారు. బాధితురాలు అలానే చేయడంతో ఆదాయపుపన్ను శాఖ, ఆర్బీఐ స్టాంపులు ఉన్న నకిలీ రసీదులు కూడా షేర్ చేశారు. కొన్నాళ్లకు నేరగాళ్లు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ పేరుతో మరో నకిలీ లేఖను పంపిస్తూ... అందులో ఆమె పేరును నిందితుల జాబితా నుంచి బాధితుల జాబితాలోకి మార్చినట్లు పేర్కొన్నారు. బాధితురాలు ఎన్నిసార్లు కోరినా నగదు రిఫండ్ చేయకపోవడంతో అనుమానించిన ఆమె ఎట్టకేలకు మోసపోయినట్లు తెలుసుకున్నారు. దీంతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

## విశ్వక్సేన్ ఇంట్లో చోరీపై దర్యాప్తు ముమ్మరం

ఫిలింనగర్: సినీ హీరో విశ్వక్సేన్ ఇంట్లో దొంగలు పడి నగలు దోచుకెళ్లిన ఘటనలో ఫిలింనగర్ పోలీసులు దొంగల ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు. మూడు రోజుల క్రితం విశ్వక్సేన్ ఇంట్లోకి ఆగంతకుడు ప్రవేశించి ఆమె సోదరి ఉండే గదిలోకి వెళ్లి ఆభరణాలతో తస్కరించి పరారైన ఘటనలో విశ్వక్సేన్ తండ్రి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు బాధితుడి ఇంటి వద్ద సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఒక వ్యక్తి పైకి వెళ్లి 20 నిమిషాల్లోనే కిందికి వచ్చినట్లుగా గుర్తించారు. ఈ రోడ్లలో సీసీ కెమెరాలను పరిశీలించగా కొద్ది దూరంలో తన కోసం వేచి ఉన్న మరో ఇద్దరితో కలిసి బైక్‌పై వెళ్లినట్లుగా గుర్తించారు. కేబీఆర్ పార్కు వరకు ఈ ముగ్గురూ కలిసి వెళ్లినట్లుగా సీసీ ఫుటేజీల్లో నమోదైంది. ఇంత దర్జాగా విశ్వక్సేన్ ఇంట్లోకి దొంగ వెళ్లి తిరిగి వెళ్లడం తెలిసిన వారి పనే అయ్యి ఉంటుందని భావిస్తున్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హర్షం

లిబర్టీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. బిల్లుకు అన్ని పక్షాలు మద్దతు ఇవ్వడం మంచి పరిణామం అన్నారు. దళ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి ఎన్నికలకు పోవాలన్న నిర్ణయం మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం శాసన సభలో బిల్లు ప్రవేశపెట్టి తన చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. బీసీ బిల్లు పంపినా కూడా కేంద్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తే బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

## పన్నుల వాటాలను పెంచాలి

లిబర్టీ: పన్నుల వాటాల్లో కోత దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయటాన్ని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వి.కృష్ణ స్వరూప్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక పక్క పన్ను వాటాలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుంటే మరోపక్క కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాలకు చెందాల్సిన పన్ను ఆదాయాలను వాటాలను తగ్గించాలని చూస్తుందని ఆరోపించారు. పన్ను ఆదాయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. 40 శాతం పన్నుల వాటాను కుదించాలని నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం కేంద్ర పన్నుల వాటాను 41 శాతం చెల్లిస్తుందని స్పష్టం చేశారు.

# విద్యుత్ అంతరాయం.. ఎఫ్‌వోఎంఎస్‌తో పరిష్కారం

**ప్రతీ ఫీడర్‌కు అనుసంధానం | తీగలు తెగిపోయినా, లైన్ ట్రిప్ అయినా తెలుసుకునే వెసులుబాటు**



బంజారాహిల్స్: వేసవి, వర్షాకాలల్లో ఏదో ఒక చోట కరెంటు తీగలు తెగిపోవడం, లైన్ ట్రిప్ అవ్వడం, ఫ్యూజ్‌లు కాలిపోవడం జరుగుతూనే ఉంటాయి. వీటిని పునరుద్ధరించడానికి సమస్య ఎక్కడున్నదో తెలుసుకోవాలంటే గంటల సమయం పట్టేది. దీని వల్ల సమయం వృథా కావడమే కాకుండా ఘటన జరిగిన ప్రాంతాన్ని తెలుసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇప్పుడు ఆ సమస్యకు అధికారులు చెక్ పెడుతున్నారు. ఇక నుంచి ఈ సమస్యల లేకుండా విద్యుత్ శాఖ నూతన సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో ఫిలింనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, ఎస్‌కె నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట, తదితర సెక్షన్లు ఉండగా వీటి పరిధిలో 190 ఫీడర్లు ఉన్నాయి. ఇలాంటి సమస్య తలెత్తినప్పుడు వెంటనే తెలుసుకోవడానికి ఫీడర్ అవుటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఎఫ్‌వోఎంఎస్) అనే టెక్నాలజీని తీసుకొచ్చి దానికి ప్రతి ఫీడర్‌ను అనుసంధానం చేశారు. దీంతో ఏ ఫీడర్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందో తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.

### 190 ఫీడర్లు..

బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో ఏడు సబ్ స్టేషన్లు ఉండగా వీటి పరిధిలో 190 ఫీడర్లు, 1.80 లక్షల మంది వినియోగదారులు ఉన్నారు. ప్రతి ఫీడర్‌కు ఈ టెక్నాలజీని అమర్చారు. వీటి పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ల అంతరాయం తెలియజేస్తుంది. విద్యుత్ తీగలు తెగిపోయినా, లైన్ ట్రిప్ అయినా చెట్లు కూలి తీగల మీద పడి స్తంభాలు విరిగినా ప్రకటనల బోర్డులు విరిగిపడ్డా, ఇలాంటివి ఏ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌సరఫరా కావడం లేదో ప్రతి సబ్ స్టేషన్‌తో పాటు సెంట్రల్ బ్రేక్‌డౌన్ సిస్టమ్‌కు సమాచారం వస్తుంది. సంబంధిత ఏఈ ఉపయోగించే యాప్‌కు సైతం సమాచారం వెళ్తుంది. వెంటనే విద్యుత్ సిబ్బంది ఆ ఫీడర్ పరిధిలో ఎన్ని స్తంభాలు ఉన్నాయో, అవి ఎక్కడెక్కడ ఉన్నాయో సమాచారం ఉండటంతో వెంటనే అంతరాయం కలిగిన ప్రదేశానికి నిమిషం వ్యవధిలో చేరుకుని వెంటనే పునరుద్ధరిస్తారు.

### విపత్తులు ఏర్పడినప్పుడు ఎంతో ఉపయోగం

ఎండాకాలంలో వడగాలులు, ఈదురుగాలులు విపరీతంగా వచ్చినప్పుడు విద్యుత్ తీగలు తెగిపడడి, స్తంభాలు కూలిపోయినప్పుడు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతున్నది. నూతన టెక్నాలజీతో లోపాలను వెంటనే గుర్తిస్తున్నారు. డివిజన్ పరిధిలో ఎక్కడ అంతరాయం కలిగినా ఏ ఫీడర్ పరిధిలో ఉంటుందో వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం వస్తుంది. దీంతో సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి మరమ్మతులు చేపట్టి పునరుద్ధరిస్తున్నారు. డివిజన్ పరిధిలో సెంట్రల్ బ్రేక్‌డౌన్ సిస్టంలో అయిదు మంది ఏఈలు, లైన్‌మెన్లు పని చేస్తున్నారు. వీరందరూ టెక్నాలజీ ద్వారా త్వరితగతిన సమస్యను గుర్తించి విద్యుత్‌ను పునరుద్ధరిస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగల్‌రావునగర్, బోరబండ డివిజన్ల పరిధిలో ఉన్న అన్ని ఫీడర్లకు ఈ టెక్నాలజీని అనుసంధానం చేశారు.

## మాలలకు న్యాయం జరిగేలా గళం వినిపించాలి



అభివాదం చేస్తున్న మాల సంఘాల నాయకులు

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణతో మాలలు తీవ్రంగా నష్టపోతారని గత శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించుకున్నామని, ఆయన మాల ఎమ్మెల్యేలతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య తెలిపారు. మాల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి మన జాతికి జరుగుతున్న అన్యాయాన్ని గట్టిగా వినిపించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేశారని దీనివల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణ కొనసాగినప్పుడు మాలలకు 6 శాతం రిజర్వేషన్లు ఉండేవని ఇప్పుడు ఐదు శాతం మాత్రమే చెయ్యడంతో తాము నష్టపోతున్నామని ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాంచందర్, కిషన్, రమేష్, తాలూకా రాజేష్, మన్నె శ్రీధర్, బైర్ల శ్రీను, సరళా దేవి, జంగ శ్రీనివాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కారు బీభత్సం

బంజారాహిల్స్: కారు బీభత్సం సృష్టించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం తెల్లవారుజామున కృష్ణానగర్ వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపునకు వెళ్తున్న క్యాబ్ రోడ్డు మధ్యలోని మెట్రో పిల్లర్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక చక్రం ఊడిపోయింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతివేగంతో నడపడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

## జగదీశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

లిబర్టీ: తెలంగాణ శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెన్న సదానందు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. సభాపతి అని చూడకుండా అగౌరవంగా మాట్లాడిన జగదీశ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## నూతన కమిటీ ఎన్నిక

లక్డీకాపూల్ : నిమ్స్ సీఐటీయూ యూనియన్ జనరల్ సెక్రెటరీ వీ. ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిమ్స్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలయ్య, రాజేష్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఊర్మిళ, గౌరవాధ్యక్షులుగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎస్. లక్ష్మి, కే. రాధిక, అదనపు ప్రధాన కార్యదర్శిగా డీ. డేవిడ్, పీ. శ్రీనివాస్, కోశాధికారిగా ఎం. వెంకటేష్, జేఎస్‌లుగా ఎలిజబెత్, రాణి, రాజయ్య ఎన్నికయ్యారు.

## పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్ అందజేస్తున్న యర్రం విజయకుమార్

ఖైరతాబాద్: వాసవి సేవాకేంద్రం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు అందజేసే ఉచిత స్కాలర్‌షిప్‌ల అందజేత కార్యక్రమం సోమవారం ఖైరతాబాద్‌లోని వాసవి సేవాకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన 100 కెడబ్ల్యూసీ సోలార్ ప్లాంట్‌ను ఈ ప్రారంభించారు. వాసవి సేవాకేంద్రం అధ్యక్షులు కొల్పూరు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాసవి గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ యర్రం విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ ముఖ్య అతిథులుగా హాజరై రూ. 40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించారు. 132 మంది విద్యార్థులకు రూ.9 లక్షల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. వాసవి సేవా కేంద్రం ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని యర్రం విజయ్‌కుమార్ తెలిపారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన పలబట్ల ఆనంద్ కుమార్, ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. సేవాకేంద్రం చేస్తున్న సేవా కార్యక్రమాలకు తాము ఎల్లప్పుడు తోడ్పాటు అందించేందుకు ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, నరేంద్ర కుమార్, రవికుమార్, మల్లికార్జున్, రాజశేఖర్ గుప్తా, శంకర్, పాండు పాల్గొన్నారు.

## దారి దోపిడీకి పాల్పడుతున్న యువకుడి రిమాండ్



పాత్లావత్ వీరపన్ నాయక్

బంజారాహిల్స్: జల్సాలకు అలవాటు దారి దోపిడీకి పాల్పడుతున్న ఓ యువకుడిని రిమాండ్‌కు తరలించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ పక్కన ఉన్న గురుబ్రహ్మనగర్‌లో నివసించే పాత్లావత్ వీరపన్ నాయక్ (24) ఆటోడ్రైవర్. మద్యం, గంజాయికి బానిసై ఈజీమనీ కోసం అర్ధరాత్రి రోడ్ల పక్కన మాటు వేస్తూ దారిన పోయేవారిని ఆపి డబ్బులు బలవంతంగా లాక్కొంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి జర్నలిస్టుకాలనీ కేబీఆర్ పార్కు వద్ద ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు బైక్‌పై వెళ్తుండగా వారిని ఆపి రూ.5 వేలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చి వెళ్తుండగా ఇంకో వెయ్యి కావాలని డిమాండ్ చేశాడు. తమవద్ద డబ్బులు లేవని చెప్పగా వీరిని కొట్టాడు. అదే సమయంలో జుబేర్ అనే వ్యక్తి అటు నుంచి వెళ్తూ విషయం తెలుసుకుని తనకు రూ.1000 ఫోన్‌పే చేస్తే నిందితుడు ఆటోడ్రైవర్‌కు ఇస్తానని చెప్పడంతో ఈ ముగ్గురూ జుబేర్‌కు రూ.1000 ఫోన్‌పే చేశారు. అందులో రూ.100 తన ఖర్చుల కోసం తీసుకున్న జుబేర్ రూ.900 వీరపన్‌కు ఇచ్చి జారుకున్నాడు. ఈ ఘటనపై బాధిత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పి.రాఘువేంద్ర బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోన్‌పే నెంబర్ ఆధారంగా జుబేర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు నిందితుడు వీరపన్‌ను పట్టుకున్నారు. వీరపన్‌పై గతేడాది జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో రాబరీ కేసు నమోదైంది. నిందితులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## అధికారులూ.. ఇదేం తీరు?



వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనం పక్కన కొట్టేసిన చెట్లు

బంజారాహిల్స్: ఓ వైపు ప్రభుత్వం మొక్కలు నాటాలంటూ ప్రకటనలు చేస్తుంటే అదే ప్రభుత్వ అధికారులు తమ భవనాలకు అడ్డుగా ఉన్నాయంటూ చెట్లను నరికేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెం. 12లోని మిథిలానగర్ కాలనీలో ఎటూ చూసినా పచ్చదనమే కనిపిస్తుంది. కాలనీవాసులు గత 20 ఏళ్లుగా భారీగా చెట్లను పెంచారు. ఇక్కడ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఉమెన్ కో-ఆపరేటివ్ సంస్థకు ప్రభుత్వం కేటాయించగా వారు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించారు. తాజాగా ఈ సంస్థ అధికారులు తమ భవనానికి అడ్డుగా ఉన్నాయంటూ భవనం ముందున్న నాలుగు భారీ చెట్లను కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ భవనాన్ని ఆనుకొని ఉన్న ఖాళీ స్థలం పక్కన చెట్లు మొత్తం కొట్టివేయించారని భవనం ముందున్న చెట్లను కూడా కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అడిగితే తమకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నివాసానికి కూతవేటు దూరంలోనే ఇలా చెట్లను కొట్టివేయడం ఎంత వరకు సబబు స్థానికులు ప్రశ్నిస్తున్నారు.




## హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను లెక్కించగా రూ16,34,396తో పాటు 22 యూఎస్ డాలర్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి



అభివాదం చేస్తున్న దళిత, గిరిజన సంఘాల నాయకులు

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్‌లో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఈ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని పలు దళిత, గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడారు. దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించేందుకు బడ్జెట్‌కు ముందు అసెంబ్లీని రెండు రోజులు కేటాయించాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లుగా ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు కేటాయించలేదని, ఎస్సీ కార్పోరేషన్‌ను మాల, మాదిగ, ఉపకులాల ప్రత్యేక కార్పొరేషన్లుగా విభజిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వివిధ దళిత సంఘాల నాయకులు జి.నర్సింహ, శివలింగం, సుబ్బారావు, అరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఈ రోజు ఇంకా రేపు మాత్రమే




## వ్యవస్థను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కృషి

సనత్‌నగర్: తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమా ఘాటుగా స్పందించారు. ఈమేరకు సోమవారం ఆమె ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఒక రోల్‌మోడల్‌గా మార్చిన పటిష్టమైన నాయకత్వం గురించి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసునన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రణాళికబద్ధమైన విధానాలు, బాధ్యతాయుతమైన పాలనతో వ్యవస్థను మెరుగు పరచేందుకు కృషి చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలిపెట్టిన ఆర్థిక గందరగోళాన్ని సరిజేయడానికి, తెలంగాణ సుస్థిర, సమ్మిళిత వృద్ధి దిశగా పయనిస్తుందని నిర్ధారించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని అణగదొక్కవద్దని కేటీఆర్‌ను కోరారు.

## ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి

సనత్‌నగర్: ప్రతిరోజూ ఎంతోకొంత సమయం వ్యాయానికి కేటాయిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. జెక్‌కాలనీ మహాత్మాగాంధీ పార్కులో రూ.4 లక్షల వ్యయంతో జీహెచ్ఎంసీ ఏర్పాటుచేసిన జిమ్ పరికరాలను ఆదివారం ఆమె కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌చందులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్ తేలికగా ఉండే వ్యాయామాలను చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెక్‌కాలనీ ఫెడరేషన్ ప్రతినిధులు సుబ్బరాజు, విశ్వనాథరాజు, శివారెడ్డి, నాగిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు కొలను బాల్‌రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

## ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేయాలి



వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న నేతలు

వెంగళరావునగర్: విద్యుత్ శాఖలోని నాలుగు డిస్కంలలో 23 వేల మంది వరకు ఆర్టిజన్లు వివిధ విభాగాల్లో పని చేస్తున్నారని, వారిని రెగ్యులరైజ్ చేయడంతో పాటు ప్రమోషన్లు కల్పించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) అధ్యక్షుడు కె. ప్రమోద్ కుమార్ అన్నారు. జీటీఎస్ కాలనీలోని టీజీఎస్‌పీడీసీఎల్ యూనియన్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 27వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. ఆర్టిజన్లలో 42 ఏళ్లు దాటిన వారు కూడా ప్రమోషన్ లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థలు కార్మికుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. ఆర్టిజన్లను ఎలాంటి స్క్రీనింగ్ లేకుండా రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కోటి, ఆశ్మి, సురేష్ రాజు, సాదర్, సోని, వసంత, అనిత, పద్మావతి, వెంకటయ్య, లింగం పాల్గొన్నారు.

## పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిపై కేసు

వెంగళరావునగర్: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రహమత్‌నగర్‌కు చెందిన యువతి 2021లో అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ సంస్థలో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తుంది. అదే సమయంలో కాకినాడకు చెందిన శివకోటి పవన్‌కుమార్ డెంటల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహించేవాడు. రెండు నెలల తర్వాత అతను ఆ యువతిని ప్రేమించానని చెప్పడంతో ఆమె అంగీకరించింది. అనంతరం ఇద్దరూ కలిసి రహమత్‌నగర్‌లోని ఒకే గదిలో ఉన్నారు. ఈ క్రమంలో అతని కుటుంబ సభ్యులకు ఆమెను పరిచయం చేశాడు. పెళ్లి చేసుకోవాలని సదరు యువతి చెప్పడంతో పవన్‌కుమార్‌ను తన తల్లి అంగీకరించడం లేదని తప్పించుకుని తిరుగుతున్నాడు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన పవన్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

## కాంగ్రెస్‌లో చేరిక



పార్టీ కండువా కప్పుతున్న హబీబా సుల్తానా

రహమత్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ చేపడుతన్న అభివృద్ధి పనులు చూసి స్వచ్ఛంగా పార్టీలోకి చేరుతున్నారని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా పేర్కొన్నారు. బోరబండ డివిజన్ భారత్‌నగర్ బస్తీ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌గౌస్‌మోయినోద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి ఆమె కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాజప్ప, అక్తర్, మొయిన్,రహమన్, సల్మాన్, పర్వీన్, షాహీన్‌వ మహేష్ గౌడ్, మున్నా పాల్గొన్నారు.

## సంఘం బలోపేతానికి కృషిచేస్తాం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం సభ్యులు

వెంగళరావునగర్: తమ సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని మున్నూరు కాపు సంఘం నేతలు పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో సోమవారం మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న సంఘాన్ని విస్తృత పరిచేందుకు చేయిచేయి కలపాలన్నారు. సంఘ సభ్యులు అన్ని విషయాల్లో ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, రవీందర్, తిరుపతి, సత్యం, సురేష్, శివకుమార్, రవీందర్ పాల్గొన్నారు.

## బస్తీల్లో తీరనున్న నీటి కష్టాలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఇంద్రానగర్ సాగర్ సొసైటీ, రోడ్డునెంబర్-14 టీడీపీ ఆఫీస్ బిల్డింగ్ వెనుక ఉన్న బస్తీల ప్రజలు గత 30 ఏళ్ల నుంచి పడుతున్న నీటి కష్టాలకు ఇన్నాళ్లకు మోక్షం లభించింది. తట్టిఖానా నుంచి వచ్చే నీటిని రోడ్డు నెంబర్-14 కేబీఆర్ పార్కు జంక్షన్ వద్ద నుంచి నూతన 450 ఎంఎం దయా పైప్‌లైన్ నిర్మించి టీడీపీ ఆఫీసు వద్ద ఉన్న పైప్‌లైన్‌కు లింక్ చేయడం ద్వారా ఇంద్రానగర్, జవహర్‌నగర్, సాగర్ సొసైటీ, ఆరారోకాలనీ, కమలాపురికాలనీలకు నీటి కొరత తీరనుంది. అంతేకాకుండా బస్తీలకు రాత్రిపూట కాకుండా ఉదయాన్నే నీటిని సరఫరా చేయడానికి వీలు కలుగుతుంది. నీటి కొరత సమస్యను బంజారాహిల్స్ పోలీసు, ట్రాఫిక్ పోలీస్ కమిషనర్లకు వివరించగా, వారు పైప్‌లైన్ నిర్మాణ పనులకు 10 రోజుల పాటు రాత్రి 11 గంట నుంచి ఉదయం 5 గంటల వరకు అనుమతి ఇచ్చారు.

## రహదారి ఆక్రమణల తొలగింపు



జేసీబీలతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

రహమత్‌నగర్: రహమత్‌నగర్ కూడలిలో రహదారి ఆక్రమణలను తొలగించాలని స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపై జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు ఎట్టకేలకు స్పందించి జేసీబీలతో తొలగించారు. నిమ్సమే ప్రధాన ద్వారా వద్ద నుంచి రహమత్‌నగర్ కూడలి వరకు రహదారిని ఆక్రమించి పాన్‌షాపులు, ఇతర చిల్లర కొట్లు ఏర్పాటు చేసుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు.దానికి తోడు మూల మలుపు వద్ద మద్యం దుకాణం వద్ద తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతుండేది.ఇదే సమస్యలపై బస్తీ వాసులు, వాహనదారులు కార్పొరేటర్ సీఎన్ రెడ్డికి పలుమార్లు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆక్రమణలను తొలగించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

## షార్ట్ టర్మ్ కోర్సు ప్రారంభం



**కేపీహెచ్‌బీకాలనీ:** అధ్యాపకులకు ఆధునిక అంశాల పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యూజీసీ ఇన్‌చార్జి డైరెక్టర్ సుష్మా తెలిపారు. జేఎన్‌టీయూహెచ్, యూజీసీ మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 'లర్నర్–సెంటర్ పెడగోజీ'అనే అంశంపై నిర్వహిస్తున్న షార్ట్ టర్మ్ కోర్సును సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్సు ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో స్టూడెంట్ ఎఫైర్ డీన్ ఆసిఫ్, అకాడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ రాజేందర్, ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్ వివేక్ కులకర్ణి, తదితరులు పాల్గొన్నారు.

## కీళ్ల పనితీరు మెరుగుతో చురుకైన జీవనం

● అపోలో ఆసుపత్రుల ఎండీ సంగీతారెడ్డి



**సాక్షి, సిటీబ్యూరో:** కీళ్ల పనితీరు మెరుగుపరచటానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా చురుకైన జీవనశైలిని కొనసాగించవచ్చని అపోలో ఆసుపత్రుల ఎండీ సంగీతారెడ్డి అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ ఆసుపత్రిలో జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రాంను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కీళ్ల నొప్పులు, క్షీణతకు అందుబాటులో ఉన్న చికిత్సా అవకాశాలను ఇది తెలియజేస్తుందని, అన్ని వయసుల వ్యక్తులకు దీని ద్వారా ప్రయోజనం చేకూరుతుందన్నారు. కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్, వాపు సమస్యలు, గాయాలతో బాధపడుతున్న రోగులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ అపోలో సీఈఓ తేజస్వీరావు, వైద్యులు బ్రెట్ ఫ్రిట్స్, కేజే రెడ్డి, రవితేజ రుద్రరాజు, కౌశిక్‌రెడ్డి, ప్రశాంత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు

## వృత్తి నైపుణ్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

– ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**నల్లకుంట:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్కిల్ యూనివర్సిటీ ద్వారా వృత్తి నైపుణ్య కోర్సులను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సూచించారు. సోమవారం నల్లకుంట సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలో గల రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్(ఆర్ఎస్‌టీ)లో వృత్తి నైపుణ్య కోర్సు పూర్తి చేసుకున్న ప్రత్యేక యువత స్నాతకోత్సవం జరిగింది. ఆర్ఎస్‌టీ సీఈవో, ఎండీ రంజిత్ కౌర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్ 60 మంది ప్రత్యేక విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న యువత వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉందని అన్నారు. ఆర్ఎస్‌టీ, సీఎంఎస్, సీఎస్ఆర్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక(వికలాంగులు) యువతకు వృత్తి పరమైన కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. బంగారు తెలంగాణ కల సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ఆర్ఎస్‌టీ, సీఎంఎస్, సీఎస్ఆర్ లాంటి సంస్థలు సహకారమందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ సబ్ రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భూక్యా ఖాసీం, సీఎంఎస్ ఫౌండేషన్, సీఎస్ఆర్ హెడ్ రుషన్ పటేల్, విద్యార్థులు పాల్గొన్నారు.

### నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎగ్జిబిషన్స్ ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామిక వేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలోని జేఎన్‌టీయూహెచ్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలల కోసం 'అవుట్ కం బేస్ట్ ఎడ్యుకేషన్ అండ్ అక్రిడిటేషన్'అనే అంశంపై నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్, జేఎన్‌టీయూహెచ్ సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహిస్తుంది.
- రామంతపూర్‌లోని జేఎన్‌జీపీటీలో ఉదయం 9.30 గంటలకు స్టేట్ లెవెల్ సృజన టెక్ ఫెస్ట్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.



నిషేధాజ్ఞలు..

# విద్యార్థుల ధిక్కరణ

ఓయూ క్యాంపస్‌లో ఉద్రిక్తం.. బంద్ పాక్షికం

- లైబ్రరీ బహిష్కరణ.. సర్క్యులర్ దహనం
- వీసీ కార్యాలయానికి బందోబస్తు
- ఐక్య విద్యార్థి నేతల ర్యాలీ.. 50 మంది అరెస్ట్



**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూలో ధర్నాలు, ఆందోళనలపై విధించిన నిషేధాజ్ఞలను విద్యార్థులు ధిక్కరిస్తూ సోమవారం రెండో రోజు ఆందోళన చేపట్టారు. ఓయూ బంద్‌కు ఏబీవీపీ పిలుపునివ్వడంతో పోలీసులు హాస్టళ్లలోకి చొరబడి విద్యార్థి నేతలను ముందస్తు అరెస్టు చేశారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, బీఆర్ఎస్‌వీ, ఎస్ఎస్‌యూ, ఓయూ విద్యార్థి జేఏసీ, ఎంఎస్ఎఫ్, అంసా, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, బీఎస్ఎఫ్, రీసెర్చ్ స్కాలర్స్ డీబీఎస్ఏ, ఏఐడీఎస్‌వో, జీవీఎస్ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ లైబ్రరీని బహిష్కరించారు. యూనివర్సిటీ న్యాయ కళాశాల ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేసి అంబర్‌పేట్, నల్లకుంట పోలీస్‌స్టేషన్లకు తరలించడంతో క్యాంపస్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసన కార్యక్రమాలపై నిషేధం విధిస్తూ ఈ నెల 13న ఓయూ అధికారులు జారీ చేసిన సర్క్యులర్ ప్రతులను దహనం చేశారు. విద్యార్థి నేతలు మాట్లాడుతూ గతంలో ఓయూ వేదికగా అనేక ఉద్యమాలు, ఆందోళనలు జరిగినా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లభించే ర్యాంకులకు ఎలాంటి ముప్పు కలగలేదని గుర్తు చేశారు. వందేమాతర ఉద్యమంతోపాటు ఇతర ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి, కొందరు సీఎంలు, ఇతర ఉన్నత హోదాలలో పనిచేసిన అధికారులు కూడా ఒకప్పుడు ఓయూ విద్యార్థులేనని గుర్తు చేశారు.

### ఓయూ భూములను కాజేయడానికే...



వ్యవసాయ వర్సిటీ, సెంట్రల్ వర్సిటీ భూములపై కన్నేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భవిష్యత్తులో ఓయూ భూములను కాజేసేందుకే ముందస్తుగా నిషేధాజ్ఞలను విధించింది.

–డాక్టర్ సత్యవతి–
ఓయూ పూర్వవిద్యార్థి నేత

### సర్క్యులర్‌ను రద్దు చేసే వరకు పోరు



ఆందోళనలపై నిషేధం విధిస్తూ విడుదల చేసిన సర్క్యులర్‌ను రద్దు చేసే వరకు పోరాడతాం. విద్యార్థుల హక్కులను హరించే విధంగా ఓయూ అధికారులు వ్యవహరించడం దారుణం.

–నెల్లి సత్య,
పీహెచ్‌డీ విద్యార్థి

### అరెస్టులు.. కేసులు.. జైళ్లకు భయపడం



ఓయూ భూముల రక్షణకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏబీవీపీ అరెస్టులు, కేసులు, జైళ్లకు భయపడకుండా నిరంతరం పోరాడుతుంది. నిషేధాజ్ఞల సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి.

–పృథ్వీతేజ,
ఏబీవీపీ నగర కార్యదర్శి

## మెరుగైన బోధనతోనే ఉజ్వల భవిత

లాలాపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ అనుదీప్



లాలాపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధస్సు బోధనను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**లాలాపేట:** మెరుగైన బోధనతోనే విద్యార్థులకు ఉజ్వల భవిత సాధ్యమవుతుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల ప్రారంభమైన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) బోధనపై ఆరా తీశారు. సంబంధిత ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఎఫ్ఎల్ఎన్ ఏఐ, ఏఎక్స్ఎల్ ల్యాబ్‌లలో పిల్లల అభ్యసన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యలో వెనుకబడిన పిల్లల అభ్యసనలో ఉపయోగపడే ఏఐ ఎక్స్ఎల్ అభ్యసన తీరును ప్రతిరోజు పరిశీలించాలన్నారు. విద్యపై పట్టు సాధించేలా మెరుగైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రోజుకు పదిమంది విద్యార్థులకు 5 గంటలపాటు విద్యాబోధన జరగాలన్నారు. కంప్యూటర్ గదిలో ప్రతి కంప్యూటర్ వద్ద విద్యార్థుల ఉపయోగార్థం ఇయర్ ఫోన్ తప్పక ఉండాలని సూచించారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు మెరుగైన సాంకేతిక బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రోహిణి, డిప్యూటీ డీఈఓ బాలూ నాయక్, హెచ్ఎం రమణమ్మ, ప్రతాప్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాజకీయ రిజర్వేషన్ల కోసం మైనారిటీల ఉద్యమం



**సాక్షి, సిటీబ్యూరో:** స్థానిక ఎన్నికల నాటికి మైనార్టీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని భారత్ మైనారిటీస్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (బీఎంఆర్‌పీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. సోమవారం అమీర్‌పేట్‌లో నిర్వహించిన ముఖ్యుల సమావేశంలో మైనారిటీల సంక్షేమం, విద్యాప్రమాణాలు, పేదరిక నిర్మూలన, రాజకీయ ప్రాధాన్యం, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై చర్చించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల న్యాయమైన హక్కులకోసం ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. రాజకీయ పార్టీలన్నీ వచ్చే ఎన్నికల్లో మైనారిటీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ నుంచి క్షేత్ర స్థాయి నిర్మాణం, హక్కుల సాధన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం ఉమ్మడి నిర్ణయాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### హోటల్‌లో ఖరీదైన వజ్రపు ఉంగరం చోరీ


**అమీర్‌పేట:** ఖరీదైన వజ్రపు ఉంగరం చోరీకి గురైన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సైనిక్ పురికి చెందిన గట్టు నాగేందర్ అఖిల్ ఈ నెల 15వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి అమీర్‌పేట సత్యం మాల్‌లోని ఫుడ్ కోర్టులో డిన్నర్ చేసేందుకు వచ్చారు. భోజనం చేస్తున్న సమయంలో అతడికి అసౌకర్యంగా ఉండటంతో చేతి వేలికి ఉన్న వజ్రపు ఉంగరాన్ని తీసి టేబుల్‌పై పెట్టాడు. కొద్ది సేపటి తర్వాత ఉంగరం కనిపించకుండా పోవడంతో హోటల్ సిబ్బంది, యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాడు. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. వజ్రపు ఉంగరం విలువ దాదాపు రూ.2 లక్షల వరకు ఉంటుందని చెప్పారు.

### గవర్నర్‌ను కలిసిన ఇఫ్లూ కొత్త వీసీ

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఇఫ్లూ నూతన వైస్ చాన్స్‌లర్ ప్రొ.నాగరాజు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను సోమవారం మర్యాదపూర్వకంగా కలసి సీతారాముల ప్రతిమను బహూకరించారు. గత వారం వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.నాగరాజు గవర్నర్‌తో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. పాలనా వ్యవహారాలలో సహరించాలని గవర్నర్‌ను కోరినట్లు వీసీ ప్రొ.నాగరాజు పేర్కొన్నారు.

## తొలి దళిత సాహిత్యోద్యమ కవి దున్న ఇద్దాసు

– ఆచార్య కొలకలూరి ఇనాక్



**చిక్కడపల్లి:** సాహిత్యం, సంస్కృతి, సామాజిక సమైక్యత కోసం కృషి చేసిన మహనీయులలో అగ్రగణ్యుడు దున్న ఇద్దాసు అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్స్‌లర్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో 'ఎందరో మహానుభావులు'మధురస్మృతులలో భాగంగా తొలి దళితకవి, తెలంగాణ వేమన దున్న ఇద్దాసు సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి పరిశోధకులు ఇద్దాసును మాదిగ మహాయోగిగా కీర్తించారని, సుంకిరెడ్డి నారాయణరెడ్డి వంటి చరిత్రకారులు, సాహిత్య చరిత్ర రచయితలు ఇద్దాసును తొలి దళిత కవిగా గుర్తించారని అన్నారు. అచల యోగిగా, సంకీర్తనాకారుడిగా, తత్వకవిగా ప్రసిద్ధుడైన దున్న ఇద్దాసు అట్టడుగు కులాల్లో చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడని కీర్తించారు. ఈ కార్యక్రమంలో కళాపోషకులు వడ్లకొండ వెంకట్‌రావు, నటులు జంగయ్యాగౌడ్, గానసభ కమిటీ సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 8 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన బీజేపీ



నిరంజన్ యాదవ్



రాజ్ భూపాల్ గౌడ్



శ్రీనివాస్‌రెడ్డి



రాజశేఖర్ రెడ్డి

**సాక్షి, సిటీబ్యూరో:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం 8 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించింది. రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి రూరల్ అధ్యక్షుడిగా రాజ్ భూపాల్ గౌడ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా గద్వాలకు చెందిన రాజశేఖర్ రెడ్డి, నాగర్ కర్నూల్‌కు నరేందర్ రావు, గద్వాల జిల్లాకు రామాంజనేయులు, ఖమ్మం జిల్లాకు కోటేశ్వర రావు, భద్రాద్రి జిల్లాకు ప్రభాకర్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా నిరంజన్ యాదవ్‌లను నియమించింది మేడ్చల్ అర్బన్, కరీంనగర్ రెండు జిల్లాలను మాత్రం పెండింగ్‌లో పెట్టింది. సంస్థాగతంగా 38 జిల్లాలను ఏర్పాటు చేసుకున్న బీజేపీ ఇప్పటికి 36 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించింది. ఇది ఇలా ఉండగా స్థానికేతరుడిని అధ్యక్షుడిగా నియమించడంపై వికారాబాద్ జిల్లా బీజేపీలో అసంతృప్తి వెల్లడైంది.

## భూముల పరిరక్షణపై బ్యానర్లు

ఏర్పాటు చేసిన హెచ్‌సీయూ విద్యార్థి సంఘం




**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో భూముల పరిరక్షణ కోసం బ్యానర్లు వెలిశాయి. హెచ్‌సీయూలోని విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి వరకు ఈ బ్యానర్లను ఏర్పాటు చేశారు. క్యాంపస్‌లోని ప్రధాన కూడళ్ళు, ఇతర ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసి తమ నిరసనను తెలపడమేకాకుండా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎన్ఎస్‌యూఐ తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరుతూ కూడా బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పరంగా అందించే విద్యావకాశాలను మరింత మెరుగ్గా విద్యార్థుల దరి చేరేలా చేయడానికి చర్యలు తీసుకోవాలే, కానీ ఇలా ప్రభుత్వ విద్యాసంస్థల భూములను తీసుకోవడం న్యాయం కాదని విద్యార్థి సంఘం పేర్కొంది.

## భిన్నత్వంలో ఏకత్వమే భారతీయత

– రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**కంటోన్మెంట్:** భిన్నత్వంలో ఏకత్వమే భారతీయత అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం బోయిన్‌పల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ది పర్సన్స్ విత్ మల్టీపుల్ డిజెబిలిటీస్(నీపిడ్- దివ్యాంగ్జన్) ఆడిటోరియంలో 'భారత్ భారతి'నిర్వహించిన భారత్ కళా సంఘమమ్ –2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ దివ్యాంగుల స్వావలంబనకు దివ్యాంగ్జన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సాంస్కృతిక వైభవం, భిన్న కళలను ఏకతాటిపైకి తెచ్చేందుకు భారత్ భారతి కృషి చేస్తోందని పేర్కొన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయన్నారు. భారతీయ జీవనశైలి ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. బలహీనులకు తగిన అవకాశాలు ఇచ్చి ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో నీపిడ్ డైరెక్టర్, డాక్టర్ బీవీ రామ్ కుమార్, భారత్ భారతి ఫౌండర్ ప్రెసిడెంట్ బి. శ్రీనివాస్, జాతీయ అధ్యక్షులు వినయ్ పత్రాలే తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రజావాణి' సమస్యలకు తక్షణ పరిష్కారం

- అధికారులకు జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ ఆదేశాలు
- జీహెచ్ఎంసీ వ్యాప్తంగా అందిన 165 అర్జీలు

**లక్డీకాపూల్:** ప్రజావాణి విన్నపాల పరిష్కారంలో జాప్యం తగదని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘుప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, అడిషనల్ సీసీపీ గంగాధర్ ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శివకుమార్ నాయుడు వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారో అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాధానం పంపించాలని సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 85 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 36, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్ విభాగం 8, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్ విభాగాలకు మూడు చొప్పున, యు.సి.డి, ఎలక్ట్రికల్, అడ్వర్టైజ్ మెంట్, స్పోర్ట్స్ విభాగాలకు రెండు చొప్పున, సి.టి.ఓ, హెల్త్, లేక్స్, ల్యాండ్ అక్విజిషన్, ఎస్టేట్స్, వెటర్నరీ, ఆర్.టి.ఐ సీపీఆర్ఓ, హౌసింగ్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. ఫోన్ ఇన్ ద్వారా 7 ఫిర్యాదులు అందాయి. కాగా, జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 80 అర్జీలు వచ్చాయి.

### 'ప్రజావాణి'కి 69 దరఖాస్తులు

**లక్డీకాపూల్:** ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి వెంటనే కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, డాక్టర్ ముకుందరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజల నుంచి 69 దరఖాస్తులు అందాయన్నారు. ఆయా అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని తెలిపారు. ప్రజావాణిలో గృహ నిర్మాణ శాఖకు 29, పెన్షన్ 12, ఇతర శాఖలకు సంబంధించినవి 28 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఈ.వెంకటాచారి, జిల్లా అధికారులు పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, సీపీఓ సురేందర్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### మే 17, 18లలో ఎడ్యుకేషన్ ఫెయిర్

**హబ్సిగూడ:** మే 17, 18 తేదీల్లో ఉప్పల్ శిల్పారామంలో తెలంగాణ బిగ్గెస్ట్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2025 జరగనున్నట్లు తెలంగాణ విద్యా సమితి అధ్యక్షుడు పెండెం తారక్ గౌడ్ తెలిపారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేంరెడ్డి నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఎడ్యుకేషన్ ఫెయిర్ వాల్ పోస్టర్‌ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం తారక్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ విద్యా సమితి, టిక్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి మన రాష్ట్రంతోపాటు దేశంలోని పలు కాలేజీలు, యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు.



## మహిళా కార్పొరేటర్‌పై అనుచిత వ్యాఖ్యలు

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు
- పోలీస్‌స్టేషన్‌లో కంటతడి పెట్టిన సుజాతా నాయక్



**నాగోలు:** హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్‌పై అసభ్య, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు సోమవారం ఎల్‌బీనగర్ సీఐ వినోద్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుజాతా నాయక్ మాట్లాడుతూ కొంత కాలంగా ఎమ్మెల్యే వేధింపులకు గురి చేస్తున్నారని, మాటలతో అవమానిస్తున్నారని ఆమె కంటతడిపెట్టారు. గిరిజన మహిళనైన తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తూ కుటుంబాన్ని బజార్లో పడేస్తూ సుధీర్‌రెడ్డి నీచంగా మాట్లాడుతూ మానసిక క్షోభకు గురిచేశారని ఆరోపించారు. 'గిరిజనులు రాజకీయాల్లో ఉండొద్దా.. గిరిజన బిడ్డనని ఇంత అలుసుగా మాట్లాడతావా.. ఎస్సీ, ఎస్టీలు అంటే ఇంత చులకనా'అని ప్రశ్నించారు. ఎక్కడో మన్సూరాబాద్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో తనను ఉద్దేశించి సుధీర్‌రెడ్డి మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. 'న్యాయం జరిగే వరకు సుధీర్‌రెడ్డిని వదిలి పెట్టను. వెంటనే పోలీసులు ఆయనపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ నడుస్తుంటే అక్కడికి వెళ్లకుండా సుధీర్‌రెడ్డి రోడ్లపై చిల్లర కొట్లాటలు చేస్తున్నారని విమర్శించారు. సుధీర్‌రెడ్డి వ్యవహారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగాల కిషోర్‌గౌడ్, రాజేశ్వరి, చెన్నగోని రవీందర్‌గౌడ్, కుట్ల నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





# అల్పాహారం.. ఆహ్వానం..



మంచి ఫుడ్ ఎంజాయ్ చేయడానికి ఇంటిల్లి పాదీ కలిసి పేరున్న రెస్టారెంట్/కేఫ్‌లకు లంచ్, డిన్నర్‌లకో వెళ్లడం తెలిసిందే. అయితే ప్రస్తుతం బ్రేక్ ఫాస్ట్ సమయం కూడా సిటిజనుల మీట్ అండ్ ఈట్‌లకు కేరాఫ్‌గా మారింది. లేట్‌నైట్స్‌లోనే బ్రేక్‌ఫాస్ట్ చేసే ప్లేసెస్ గురించి మాట్లాడుకుని ఉదయమే అక్కడ ప్రత్యక్షం అవుతున్నారు. ఈ నేపథ్యంలో సిటిజనులు తమ బ్రేక్ ఫాస్ట్, అల్పాహారం కోసం తరచూ ఎంచుకునే వాటిలో ఇవీ..

- సాక్షి, సిటీబ్యూరో

* నగరంలో చవులూరిస్తున్న బ్రేక్ ఫాస్ట్ వెరైటీలు
* గుడ్ మార్నింగ్ పార్టీలకు అడ్రస్‌లుగా మారుతున్న వైనం
* ఖాళీ కడుపుతో కమ్మని రుచులవైపు ఫుడ్ లవర్స్ ఆరాటం
* స్పెషల్ బ్రేక్ ఫాస్ట్ మెనూలతో ఆహ్వానం పలుకుతున్న రెస్టారెంట్స్



టేస్టీ ఫుడ్ ఆస్వాదించి సంతృప్తిగా రోజును ప్రారంభించడం కన్నా మంచి రోజు ఏముంది? అద్భుతమైన వంటల వారసత్వానికి ప్రసిద్ధి చెందిన మన నగరం, రుచికరంగా రోజును కిక్‌స్టార్ట్ చేయడానికి అనేక ఎంపికలను అందిస్తుంది. దోసెలు, ఇడ్లీల వంటి సంప్రదాయ దక్షిణ భారతీయ ఇష్టమైన వాటి నుంచి ఆమ్లెట్లు, వాఫ్ఫుల్స్ వంటి అంతర్జాతీయ వెరైటీల వరకు మన సిటీలోని అల్పాహార సమయం.. వైవిధ్యంగా ఉంటుంది. రుచులు అనుభవాల విందోదయాల కోసం అందుబాటులో కొన్ని..

- కోఠిలోని సందడిగా ఉండే వీధుల్లో ఉన్న ప్రగతి టిఫిన్ సెంటర్ దక్షిణ భారత అల్పాహార ప్రియుల సందడితో నిండి ఉంటుంది. క్రిస్పీ దోసెలు, మెత్తటి ఇడ్లీలు, ఊతప్పమ్‌లకు ఈ సెంటర్ ప్రసిద్ధి చెందింది. ఇక్కడ హైలైట్ ఏమిటంటే ప్రతి వంటకంతో పాటు అందించే చట్నీలు. ఉదయం 7గంటల నుంచి 9 గంటలలోపు హనుమాన్ టేక్డి, హెచ్‌వీఎస్ రోడ్‌లో ఉన్న ఈ సెంటర్‌ను సందర్శించం అంటే నోరూరించే దక్షిణాది వంటకాలను ఆస్వాదించినట్లే..

- సంప్రదాయ రుచులను కోరుకునే వారు గచ్చిబౌలిలోని ఇందిరా నగర్‌లో ఉన్న ఉడిపి ఉపహార్‌కు చలో అంటున్నారు. ఇడ్లీలు, వడలు, దోసెలు, ఊతప్పమ్ వంటి అనేక రకాల దక్షిణ భారతీయ ప్రధాన వంటకాలను అందిస్తుంది. మెనూలో డబుల్ కా మీఠా, బొబ్బట్లు వంటి స్వీట్ ట్రీట్‌లు కూడా ఉన్నాయి. ఇది ఇక్కడ అల్పాహారం ఉదయం 7 నుంచి 10.30గంటల మధ్య అందుబాటులో ఉంటుంది.

- మాదాపూర్‌లోని హమ్మింగ్ బర్డ్ కేఫ్‌లో కేఫ్ స్టైలిష్, ఆరోగ్యకరమైన అల్పాహారం కోరుకునే సిటిజనులు ఎంచుకుంటున్నారు. ఇక్కడ మష్రూమ్ ఆమ్లెట్‌ల నుంచి బ్రోకలీ చీజ్ ఆమ్లెట్‌ల వరకు రోజంతా అల్పాహారం అందించడం విశేషం. ఆహారం పోషకాలతో నిండిన సూప్‌లు, సలాడ్‌లతో పాటు కాఫీలూ ఎంజాయ్ చేయవచ్చు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11.30 దాకా అందుబాటులో ఉంటుంది.

- సిటీ జనులకు చిరపరిచితమైన పేరే మినర్వా కాఫీ షాప్. ఈ పేరు దక్షిణ భారతీయ వంటకాలకు పర్యాయపదంగా ఉంది. టమాటా చట్నీ రైతాతో కలిపిన రైస్ పొంగల్, నెయ్యితో నింపిన ఇడ్లీలు క్రిస్పీ దోసెలు ఇక్కడ స్పెషల్.. ఇక్కడి ఫిల్టర్ కాఫీ వావ్ అనిపిస్తుందంటారు కాఫీప్రియులు. ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకూ బ్రేక్‌ఫాస్ట్ సర్వ్ చేస్తారు.

- పిజ్జాదోస, పాస్తా దోస, మంచూరియా దోస వంటి వెరైటీ ఆధునిక దక్షిణ భారత బ్రేక్‌ఫాస్ట్‌లను కోరుకునేవారు బంజారాహిల్స్‌లోని రాయల్ టిఫిన్ సెంటర్‌ను ఎంచుకుంటున్నారు. వీరి మెనూలో ఉప్మా ఊతప్పమ్‌ల వంటి క్లాసిక్స్ కూడా ఉన్నాయి.

- ఆహ్లాదకరమైన అలంకరణ, ప్రత్యేకమైన మెనూతో జూబ్లీహిల్స్‌లోని ది హోల్ ఇన్ ది వాల్ కేఫ్ అల్పాహార ప్రియులను ఆకట్టుకుంటోంది. ఇంగ్లిష్ బ్రేక్ ఫాస్ట్ వెరైటీల్లో.. వెజ్జీ పిజ్జా ఆమ్లెట్, గోల్డెన్ ఫ్రిటాటా మిక్స్ ఇక్కడ హైలైట్స్‌గా చెప్పాలి. స్వీట్ టూత్ ఉన్నవారు ఇక్కడి చాక్లెట్ వాఫ్ఫుల్స్, బ్లూబెర్రీ చీజ్ వాఫ్ఫుల్స్ తప్పనిసరిగా టేస్ట్ చేయాలి. ఉదయం 8.30గంటల నుంచి అందుబాటులో ఉంటుంది.



- నగరంలోని దారుల్‌షిఫా, చట్టా బజార్‌లో ఉన్న హోటల్ నయాబ్ ఉదయం 5 గంటల నుంచే సంప్రదాయ అల్పాహారాన్ని అందిస్తుండటం ఎర్లీ బైకర్స్‌ను ఆకర్షిస్తోంది. బటర్ నాన్, లుక్మీతో పాటు భేజా ఫ్రై వంటి స్థానిక హైదరాబాదీ ప్రత్యేకతలతో బ్రేక్ ఫాస్ట్ చేయిస్తోంది. ఇరానీ చాయ్‌తో సహా మన అసలైన రుచులను ఇష్టపడేవారు నయాబ్‌ను సందర్శిస్తున్నారు. ఉదయం 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా ఇక్కడ బ్రేక్‌పాస్ట్ ప్రియుల సందడి కనిపిస్తుంది.



## ఆగయా.. అప్రిలియా..




సాక్షి, సిటీబ్యూరో: సరికొత్త స్పోర్ట్స్ బైక్.. అప్రిలియా ట్యునో 457 సిటీ మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. నగరంలో దీనిని విడుదల చేసినట్లు పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అజయ్ రఘువంశీ సోమవారం తెలిపారు. నగరం నుంచి తమ బ్రాండ్ స్కూటర్లు, బైక్స్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోందని, కొత్త బైక్ గురించి పెద్ద సంఖ్యలో ఎంక్వయిరీలు వచ్చాయని వివరించారు. లైట్ వెయిట్‌తో, గొప్ప రైడింగ్ అనుభూతిని అందిస్తూ సిటీలోని స్పోర్ట్స్ బైక్ ప్రియుల్ని ఆకట్టుకుంటుందని నమ్మకం వ్యక్తం చేశారు.



## స్నో ఫ్లేక్ లైట్ డెకరేషన్

ఫొటోలో కనిపిస్తున్న ఈ లైటింగ్ పేరు స్నో ఫ్లేక్. నగరంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా కనిపించేందుకు ఈ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. 6 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేసే ఈ లైటింగ్‌ను వీధి దీపాల పోల్స్‌కే ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే ఆయా జంక్షన్లను వివిధ థీమ్‌లతో ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దిన జీహెచ్‌ఎంసీ.. ఇప్పుడు వీధి దీపాలకే ఈ స్నో ఫ్లేక్ డెకరేషన్ చేయాలనుకుంటోంది. ఏర్పాటుకు సంబంధించి కొటేషన్లను ఆహ్వానించింది.

- సాక్షి, సిటీబ్యూరో

మహిళల ఆర్థిక అభివృద్ధికి

## మేళా

మాదాపూర్: మహిళల ఆర్థిక అభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి బజార్ ఎంతగానో ఉపయోగపడుతుందని సర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ తెలిపారు. మాదాపూర్‌లోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ మేళాను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.9 కోట్ల వ్యయంతో మహిళా బజార్‌ను సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. ఈ ఫెయిర్ 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 106 స్టాల్స్‌లో వివిధ రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.





## పీరియడ్ రెడీ..

### క్లాస్‌రూమ్స్‌తో అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: పాఠశాలలకు వెళ్లే బాలికల్లో శారీరక మార్పులు ఆరోగ్యం పట్ల వారి వైఖరిని ప్రభావితం చేస్తాయని, వారిలో రుతుక్రమంపై అవగాహన పెరగాల్సి ఉందని మెన్స్ట్రుపీడియా సహ వ్యవస్థాపకురాలు అదితిగుప్తా, కెన్వ్యూ ఇండియా ఎసెన్షియల్ హెల్త్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ మనోజ్ గాడ్గిల్ అభిప్రాయపడ్డారు. స్టేఫ్రీ బ్రాండ్‌తో చేతులు కలిపి పీరియడ్ రెడీ పేరిట తాము నిర్వహించిన అవగాహన కార్యక్రమ వివరాలను వీరు వెల్లడించారు. ఐదేళ్లలో 10వేలకు పైగా ఉపాధ్యాయులకు శిక్షణ అందించి, 12 లక్షలకు పైగా పుస్తకాలను పంపిణీ చేశామని 14,500పైగా వర్క్‌షాప్‌లను నిర్వహించామన్నారు. దేశవ్యాప్తంగా 36,500పైగా పాఠశాలలకు తమ కార్యక్రమాలను అందుబాటులోకి తెచ్చామన్నారు.

ఆయనో శాస్త్రవేత్త.. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)లో పనిచేసి, వృత్తిలో తన ప్రతిభను కనబర్చిన విజ్ఞాన వేత్త. భారతీయ సాహిత్యం, సంస్కృతి సంప్రదాయంలోని విశిష్టతను అవపోసన పట్టిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇందులో భాగంగానే తేనెలొలికే తెలుగు పదాలతో పుణ్య చరితుడు బమ్మెర పోతన రచించిన పద్య భాగవతాన్ని ఈ తరానికి మరింత చేరువ చేయాలనుకున్నారు. అంతటి బృహత్ గ్రంథమైన శ్రీమద్భాగవతాన్ని అచ్చు పుస్తక రూపంలో, ఇంటర్నెట్‌లోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయనే.. న్యూనల్లకుంటకు చెందిన మందడి కృష్ణారెడ్డి. - బంజారాహిల్స్



# వైవిధ్యభరితం..
# సమగ్ర సంకలన భాగవతం..

- పుస్తకరూపంలోకి, ఇంటర్నెట్‌లోకి శ్రీమద్భాగవతం
- బమ్మెర పోతన భాగవతానికి అధునాతన రూపం
- స్లయిడ్ షో ప్రెజెంటేషన్ ప్రోగ్రామ్‌తో కృష్ణారెడ్డి కృషి
- భారతీయ అంతరిక్ష పరిశోధనలోనూ ఆయన ప్రతిభ

ఇప్పటికే వివిధ రూపాల్లో లభ్యమవుతున్న భాగవత సంబంధిత సమాచారానికి ఆయన చేసిన ఆధునాతన రూపకల్పన ఈతరం భాగవత విశ్లేషకులకు, ఔత్సాహికులకు సులభతరం చేసింది. ఒక ఉన్నత శ్రేణి శాస్త్రవేత్తగా ఇస్రో ఐఐఎస్‌యూ తిరువనంతపురం నుంచి ఉద్యోగ విరమణ చేసిన ఆయన.. తర్వాత విశ్రాంత సమయాన్ని దైవకార్యంగా భావించి సాహిత్య విశిష్టతలను కలగలిపి ఉన్న శ్రీమద్భాగవతాన్ని అందరికీ సులువైన మార్గంలో అందించడానికి సమగ్ర సంకలన రూపకల్పనకు నాంది పలికారు. ఇందులో భాగంగా సాంకేతిక అభివృద్ధి ఆకాశాన్ని అంటుతున్న ఈ కాలంలో వినూత్నంగా 'స్లయిడ్ షో ప్రెజెంటేషన్ ప్రోగ్రామ్' అనే మార్గాన్ని ఎంచుకుని శ్రీమద్భాగవతంలోని 12 స్కందాలు, 688 ఘట్టాలలోని 10,061 పద్యాలకు భావాన్ని, పదోచ్చారణ నేర్చుకోవడానికి వీలుగా ఆ పద్యాల ఆడియోను రూపొందించారు. ప్రతి పద్యంలోని పదాలకు అర్థం, ఆ పద్యానికి సంబంధించిన వ్యాకరణ అంశాలు ఛందస్సు, అలంకారాల వివరాలన్నీ ఒక పద్యం నుంచి మరొక పద్యానికి

### విశ్రాంత సమయాన్ని దైవకార్యంగా..

విషయ సూచిక ఆధారంగా సులువుగా వెళ్లేలా సమకూర్చారు. ఇవన్నీ కేవలం ఒక ప్రధాన పవర్ పాయింట్ స్లయిడ్ నుంచి ఒక్క క్లిక్‌తో సాధ్యమయ్యేలా చేశారు. సాహిత్యం, శ్రీమద్భాగవతం వంటి గ్రంథ పఠనం కష్టతరమైన ప్రస్తుత కాలంలో ఇంత సులభతరంగా పాఠకులకు అందుబాటులోకి తీసుకురావడం అమృతప్రాయమైన విషయంగా భావిస్తున్నారు. ఈ అనితర సాధ్యమైన సాధనం ఉపయోగించడంలో ఒక ప్రధాన స్లయిడ్ నుంచి వేల పద్యాలకు సంబంధించిన పేజీలకు ఏర్పరచిన హైపర్ లింక్స్ ద్వారా సులువుగా వెళ్లేలా విస్తృతమైన 'స్లయిడ్ షో ప్రెజెంటేషన్ ప్రోగ్రామ్' చేయటం ఇదే ప్రథమం. మందడి చెన్నకృష్ణారెడ్డి, రంగనాయకమ్మ పుత్రుడైన కృష్ణారెడ్డి ఒకప్పటి ఆర్ఈసీ ఇప్పటి నిట్ వరంగల్ విశ్వవిద్యాలయం నుంచి బీటెక్, ఐఐటీ చెన్నై నుంచి ఎం.టెక్ పూర్తి చేశారు. అనంతరం పరిశోధనలోనూ తన ప్రతిభతో ఎన్నో అవార్డులు అందుకున్నారు.



### సమగ్ర సంకలనంగా రూపొందించా..

ఈ సంకలనానికి, 'శ్రీభాగవత సుధానిధి' అని నామకరణం చేశాను. ఎందరో మహానుభావులు పద్య భావాన్ని, ఆ పద్యాలకు సంబంధించిన ఎన్నో విశేషాలను క్రోడీకరించి అందుబాటులోకి తెచ్చారు. కానీ ఆ అంతర్యామి లీలా విశేష గ్రంథమైన శ్రీమద్భాగవతానికి సంబంధించి గ్రంథ విశేషాలను ఒక సమగ్ర సంకలనంగా రూపొందించాను. తెలుగు భాష, గ్రంథ పఠనంపై ఆసక్తి మాత్రమే అర్హతగా విద్యార్థులు మొదలుకొని పెద్దల వరకు ఎవరైనా అమృత తుల్యమైన పోతనామాత్యుల విరచిత శ్రీమద్భాగవత గ్రంథ విశేషాలను సులువైన మార్గంలో ఆకళింపు చేసుకునేలా రూప కల్పన చేశాను. ఈ ప్రయత్నంలో భాగంగా శ్రీమద్భాగవత పద్యాలు, ఆ పద్యాల భావాన్ని, పదోచ్చారణ, ప్రతిపదార్థం, పద్యాలలోని అలంకార విశేషాలు విడివిడిగా ప్రింట్ మీడియా, డిజిటల్ మీడియాలలో లభ్యమవుతున్న వాటిని సమగ్ర సంకలనంగా మార్పు చేశాను. - కృష్ణారెడ్డి



మతసామరస్యానికి ప్రతీక

## ఇఫ్తార్ విందు

- రాడిసన్ బ్లూ హోటల్ వేదికగా ఆత్మీయ ఇఫ్తార్ విందు
- ఇఫ్తార్‌లో సందడి చేసిన సినీనటుడు సయ్యద్ సోహెల్

సాక్షి, సిటీబ్యూరో: పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలో భాగంగా బంజారాహిల్స్ రాడిసన్ బ్లూ హోటల్ వేదికగా ఆత్మీయ మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన ఇఫ్తార్ విందు అలరించింది. ముస్లింల కోసం డాక్టర్ లయన్ కిరణ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సినీనటుడు సయ్యద్ సోహెల్‌తో పాటు విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్ కిరణ్ మాట్లాడుతూ.. నగరంలో మతసామరస్యాన్ని పెంపొందించడంలో భాగంగా ముస్లింలకు గౌరవప్రదమైన రంజాన్ మాసం ప్రత్యేక ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశామన్నారు. అనాథ ముస్లిం బాలలకు ఇఫ్తార్ విందుతో పాటు దుస్తులు అందించామని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మిసెస్ ఇండియా పోటీల్లో

## ప్రియాంక తారే

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ స్థాయిలో ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జాతీయ మిసెస్ ఇండియా పోటీల్లో ప్రియాంక తారే తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్ నుంచి వచ్చి నగరంలో స్థిరపడిన ఆమె మిసెస్ ఇండియా తెలంగాణ క్వీన్ 2025 అనే ప్రతిష్టాత్మక బిరుదుతో పాటు మిసెస్ ప్యాషనేట్ అవార్డు గెలుచుకుంది. ఈ నేపథ్యంలో జాతీయ వేదికపై మిసెస్ ఇండియా పోటీలో తెలంగాణ సౌందర్యాభిలాషను ప్రదర్శించడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.



## క్లుప్తంగా...

### ఎంపీ అరుణకు భద్రత పెంచండి

- పోలీసులకు సీఎం ఆదేశం
- ఎంపీకి ఫోన్ చేసిన రేవంత్

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు భద్రత పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ అరుణ నివాసంలో.. రెండు రోజుల క్రితం ఆగంతకుడి చొరబాటుపై సీఎం రేవంత్ ఆరా తీశారు. సోమవారం ఎంపీతో ఫోన్‌లో మాట్లాడిన రేవంత్ ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఘటన జరిగిన తీరుపై పలు అనుమానాలను అరుణ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో అరుణకు భద్రత పెంచాలని, ఘటనపై విచారణ వేగవంతం చేసి వాస్తవాలు తేల్చాలని సీఎం రేవంత్ ఆదేశించారు.

### 'దక్షిణ అయోధ్య'కు నిధులేవీ?

- రాజ్యసభలో ప్రస్తావించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: 'దక్షిణ అయోధ్య'గా పిలిచే భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం బాధాకరమని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో వద్దిరాజు మాట్లాడారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం, రైల్వేలైన్ ఏర్పాటు చేయకపోవడాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకువచ్చారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు మధ్య అనుసంధానంగా ఉన్న ఖాజీపేట రైల్వే కూడలిని డివిజన్‌గా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఉపరాష్ట్రపతికి వద్దిరాజు పరామర్శ**

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. సోమవారం రాజ్యసభకు వచ్చిన ధన్‌ఖడ్‌ను వద్దిరాజు మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

### ధర్నాలపై నిషేధం అన్యాయం

- అసెంబ్లీని ముట్టడించిన బీఆర్ఎస్వీ శ్రేణులు



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ధర్నాలు, నిరసనలు నిషేధిస్తూ వీసీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని బీఆర్ఎస్వీ డిమాండ్ చేసింది. సామాజిక, ప్రజా ఉద్యమాలకు వేదిక అయిన ఓయూలో నిరసన కార్యక్రమాలు రద్దు చేయడం తీవ్ర అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ ముట్టడికి బీఆర్ఎస్వీ నేతలు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తదితర నేతలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ వీసీ ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు విద్య, నిరుద్యోగ సమస్యల మీద ప్రశ్నిస్తే తప్పా అని ప్రశ్నించారు. కాగా, అంతకుముందు ఆందోళనలు, నిరసనలతో ఓయూ క్యాంపస్‌లో ఉద్రిక్తత నెలకొంది. ఐక్య విద్యార్థి సంఘాల నేతల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు 50 మందిని అరెస్ట్ చేశారు.

### 8 జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నాయకత్వం మరో ఎనిమిది జిల్లాలకు అధ్యక్షులను నియమించింది. రంగారెడ్డి అర్బన్ అధ్యక్షుడిగా వాణిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి రూరల్ అధ్యక్షుడిగా రాజ్‌భూపాల్‌గౌడ్, వికారాబాద్‌కు రాజశేఖర్ రెడ్డి, నాగర్‌కర్నూల్‌కు వేముల నరేందర్‌రావు, జోగుళాంబ గద్వాలజిల్లా అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఖమ్మంకు నెల్లూరి కోటేశ్వర్‌రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, భాగ్యనగర్ మలక్‌పేట అధ్యక్షుడిగా జె.నిరంజన్‌యాదవ్‌లను పార్టీ రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ నియమించినట్టు ఓ ప్రకటనలో తెలిపారు.

### హైడ్రా పేరిట లావాదేవీలు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైడ్రాకు ఎమ్మెల్యేలు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు లేఖలను అడ్డంపెట్టుకొని లావాదేవీలు నడిపిస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం శాసనసభ లాబీలో ఆయన మీడియాతో మాట్లాడారు. తన లెటర్‌హెడ్‌పై హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేయడానికి తన పీఏను పంపించానని, అయితే కనీసం స్టాంపు, లేదా తీసుకున్న అధికారి సంతకం ఏమీ లేకుండా ఒక తేదీ మాత్రమే వేసి కాగితం ఇచ్చారన్నారు. హైడ్రా పేరుతో బెదిరించి లావాదేవీలు చేస్తున్నారని ఆరోపించారు. ఖాజాగూడలో కబ్జాకు సంబంధించి పది మంది ఎమ్మెల్యేలం కలిసి హైడ్రాకు ఫిర్యాదు పంపిస్తే..అపార్ట్‌మెంట్‌వాసులు ఫిర్యాదు చేశారని అందుకే అక్రమ కట్టడాలను కూల్చి వేసినట్లు హైడ్రా కమిషనర్ ప్రకటించార న్నారు. ఎమ్మెల్యేల లేఖలకే విలువ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కమిషనర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం స్పందించరని అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. ఈ అంశంపై జీరో అవర్‌లో ప్రస్తావిస్తానన్నారు.

# పదేళ్లయినా పరిహారం చెల్లించరా?

**రైతు కుటుంబాన్ని ఆదుకోవడంలో ఇంత నిర్లక్ష్యమా? • ప్రభుత్వ తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం**

**ఆత్మకూరు తహసీల్దార్ జీతాన్ని నిలిపివేయాలని హనుమకొండ కలెక్టర్‌కు ఆదేశం**



సాక్షి, హైదరాబాద్: పంట నష్టంతో పెట్టుబడులు రాక ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబానికి పరిహారం చెల్లించడంలో ఇంత నిర్లక్ష్యమా అని ప్రభుత్వం తీరుపై హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. పదేళ్లయినా, కోర్టు ఆదేశించినా లెక్కలేకుండా వ్యవహరిస్తారా అని హనుమకొండ జిల్లా ఆత్మకూర్ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే తహసీల్దార్ జీతభత్యాలు, ప్రోత్సాహకాలను నిలిపివేయాలని కలెక్టర్‌ను ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తేల్చిచెప్పింది. రైతు ఆత్మహత్య చేసుకుని పదేళ్లయినా పరిహారం ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించింది. అన్ని అర్హతలు ఉంటే ప్రభుత్వం ప్రకటించిన పరిహారం చెల్లించాల్సిందేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు గతంలో తాము ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మండిపడింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

**ఉద్దేశపూర్వకంగా పరిహారం చెల్లించలేదు**

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన లక్కరుసు మొగిలి అప్పులు తీసుకుని పత్తిసాగు చేశాడు. పంట దిగుబడి రాక, అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందు తాగి 2014 జూలైలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం తెచ్చిన పథకంలో భాగంగా మొగిలి భార్య లక్ష్మి అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం.. నిబంధనల మేరకు దరఖాస్తు ఉంటే జీవో 173 ప్రకారం రూ.6 లక్షలను నాలుగు వారాల్లోగా చెల్లించాలని గత అక్టోబర్‌లో ఆదేశించింది. కోర్టు ఆదేశాలిచ్చి నెలలు గడుస్తున్నా అధికారులు పరిహారం ఇవ్వడం లేదంటూ లక్ష్మి.. ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ధిక్కార పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించగా.. ఫిబ్రవరి 13న రూ. 6 లక్షలు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు ఆ మొత్తాన్ని బాధితురాలికి చెల్లించాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తేలింది. తహసీల్దార్ ఉద్దేశపూర్వకంగా బాధితురాలికి పరిహారం చెల్లించలేదని న్యాయమూర్తి మండిపడ్డారు. పరిహారం చెల్లింపులో అసాధారణ జాప్యంతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని అభిప్రాయపడ్డారు. బాధితురాలికి వెంటనే సొమ్మును చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# శాస్త్రీయ విధానంతోనే పునర్విభజన



అఖిలపక్ష భేటీలో మాట్లాడుతున్న జానారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, కేశవరావు, కూనంనేని, జాన్‌వెస్లీ

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం, సీపీఎం, సీపీఐఎంఎల్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు హాజరయ్యారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన పేరుతో కేంద్రం ముందుకెళ్తున్న తీరుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రత్యేక రాజకీయ కారణాలతో హాజరుకాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యం కావాలని, ఈ క్రమంలో రాజకీయ పార్టీలు ఇచ్చే సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని చెప్పారు.

**సభ తీర్మానం చేయాలి: ఎంఐఎం నేత అక్బరుద్దీన్**

జానారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో కొత్త ఆందోళనకు దారి తీయకుండా కొంతకాలం ఇదే సీట్ల సంఖ్యను కొనసాగించాలని, ఈ విషయంలో కేంద్రం పునరాలోచించకపోతే ప్రమాదం పొంచి ఉంటుందన్న విషయాన్ని వారికి తెలియజేయాలని సూచించారు. ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపాలని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉత్తర భారతంలో పెరుగుతున్న లోక్‌సభ సీట్లకు అనుగుణంగా దక్షిణాదిలోనూ పెంచాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌తోపాటు సీపీఐ, సీపీఎం లాంటి జాతీయ పార్టీలు ఒక విధానంతో వెళ్లాలనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ప్రతి రాష్ట్రానికి సమాన హక్కు ఉండేలా నియోజకవర్గాల పునర్విభజన జరగాలని సీపీఐఎంఎల్ నేత హనుమేశ్ అభిప్రాయపడగా, ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతం ప్రకారమే దక్షిణాదిలోనూ పెంచాలని ఆర్‌పీఐ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పల్లా వెంకట్‌రెడ్డితోపాటు పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

# నేడు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు

- శాసనసభ ముందుకు మరికొన్ని బిల్లులు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ నాలుగో రోజు సమావేశంలో భాగంగా మంగళవారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుతో పాటు పలు ప్రభుత్వ బిల్లులు సభ ముందుకు రానున్నాయి. కీలక బిల్లులపై చర్చించి ఆమోదించాల్సిన నేపథ్యంలో ఉదయం జరగాల్సిన ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. సభ ప్రారంభమైన వెంటనే 'తెలంగాణ ఎస్సీ రిజర్వేషన్ బిల్లు 2025'ని ఆమోదించాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చను ప్రతిపాదిస్తారు. దీంతో పాటుగా 'తెలంగాణ చారిటబుల్ హిందూ రెలిజియస్ ఇనిస్టిట్యూషన్స్ ఎండోమెంట్ సవరణ బిల్లు 2025'బిల్లును ప్రవేశపెడతారు. అలాగే 'తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ సవరణ బిల్లు 2025'ప్రతిపాదిస్తారు. 'తెలంగాణ అడ్వకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ ఫండ్ సవరణ బిల్లు 2025', 'తెలంగాణ మున్సిపాలిటీ సవరణ బిల్లు 2025', 'తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లు 2025'ను కూడా ప్రవేశపెట్టనున్నారు. మంగళవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల అనంతరం సోమవారం శాసనసభలో ఆమోదం పొందిన విద్యాసంస్థలు ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల బిల్లు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లులు చర్చకు రానున్నాయి.

# నవజాత శిశువుకు నిప్పు

- ఎన్టీఆర్ స్టేడియం గేటు వద్ద దారుణం
- క్లూస్‌టీంతో వివరాలు సేకరించిన పోలీసులు



కాలిపోయిన శిశువు మృతదేహం

కవాడిగూడ (హైదరాబాద్): మానవత్వానికే మచ్చగా మిగిలే దారుణ సంఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. ఎన్టీఆర్ స్టేడియం వద్ద అప్పుడే పుట్టిన పసికందును కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకుప్పలో వేసి నిప్పంటించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో స్టేడియం గేటు సమీపంలోని సులభ్ కాంప్లెక్స్ వద్ద ఓ శిశువుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారన్న స్థానికుల సమాచారంతో దోమలగూడ ఇన్‌చార్జి ఏసీపీ గురురాఘవేంద్ర, ఎస్సై శాంతి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శిశువుకు నిప్పుపెట్టడానికి ఉపయోగించిన పెట్రోల్ బాటిల్‌ను క్లూస్ టీమ్ సేకరించింది. ఘటనపై మరిన్ని వివరాలు సేకరించేందుకు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించారు. అనంతరం శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏసీపీ మాట్లాడుతూ.. ఆడశిశువుగా ప్రాథమికంగా గుర్తించామని, బతికుండగానే తగలబెట్టారా.. మృతిచెందిన తరువాత ఆధారాలు లేకుండా చేసేందుకు నిప్పంటించారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఘటన స్థలంలో సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, త్వరలోనే దోషులను పట్టుకుంటామని ఆయన వెల్లడించారు.

**మైనర్ల పనేనా?**

కాగా, ఈ ఘటనకు స్థానికంగా ఉన్న ఓ మైనర్ బాలిక, ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలుడి మధ్య ఏర్పడిన శారీరక సంబంధం కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈనెల 14వ తేదీన మైనర్ బాలిక ఆడశిశువుకు జన్మనిచ్చిందని, 15వ తేదీన వారు శిశువుకు నిప్పంటించినట్లు భావిస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

# ఓయూలో విద్యార్థులపై నిర్బంధం సరికాదు

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు తెలపడంపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడం అప్రజాస్వామికమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పోకడలను పక్కన పెట్టి, విద్యార్థుల హక్కులను హరించేలా విడుదల చేసిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై వేధింపులను ఆపడంతోపాటు వారిపై పోలీసు నిర్బంధాన్ని ఉపసంహరించుకోవాలి. ఈ విషయంలో ఓయూ విద్యార్థులకు బీజేపీ సంపూర్ణ మద్దతు తెలియచేస్తోంది'అని కేంద్ర మంత్రి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, విద్యార్థుల హక్కులకు సంబంధించిన ఎన్నో పోరాటాల్లో కీలకపాత్ర పోషించింది ఓయూ విద్యార్థులేనని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. 'కనీస విద్య, నివాస వసతులు కూడా కల్పించలేని ఓయూ యాజమాన్యానికి తమ ఆందోళన తెలియజేయడం విద్యార్థుల హక్కు. కానీ, విద్యార్థులు కనీసం నిరసన తెలపకుండా పోలీసుల ద్వారా అణచివేయాలని చూస్తే.. తెలంగాణ సమాజం చేతులు ముడుచుకొని కూర్చోదు'అని స్పష్టంచేశారు.

# సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగానే..

**ఎస్సీ వర్గీకరణ బిల్లు ఉద్దేశాలు–కారణాల్లో ప్రభుత్వం వెల్లడి**

సాక్షి, హైదరాబాద్: షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణ కచ్చితంగా చేయాలన్న ఉద్దేశంతోనే బిల్లు ప్రవేశపెట్టామని సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన 'షెడ్యూల్డ్ కులాల(రిజర్వేషన్లు–హేతుబద్ధీకరణ) చట్టం 2025'ఉద్దేశాలు– కారణాల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. షెడ్యూల్డ్ కులాల్లో ప్రత్యేకించిన కేటగిరీలలో ఉప వర్గీకరణను అనుమతిస్తూ ఏడుగురు న్యాయమూర్తుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం 2024 ఆగస్టు 1న ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా ఈ బిల్లును సిద్ధం చేసినట్టు తెలిపింది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక కమిషన్‌ను నియమించామని తెలిపింది. ఆ కమిషన్ రాష్ట్రంలోని 59 షెడ్యూల్డ్ కులాల జనాభా, అక్షరాస్యత, ఉపాధి, ప్రవేశాలు, నియామకాలు, ఆర్థిక సహాయం, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన డేటాను సేకరించిందని వివరించింది. దీనితోపాటు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా, వ్యతిరేకంగా వచ్చిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని.. అన్ని అంశాలను విశ్లేషించి కమిషన్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందని తెలిపింది. మంత్రి మండలి ఆ నివేదికను పరిశీలించి ఆమోదించిందని వివరించింది. షెడ్యూల్డ్ కులాలను మూడు సమూహాలుగా విభజించామని.. తొలి కేటగిరీలో సామాజిక, ఆర్థిక, విద్యా విషయంలో అత్యంత వెనుకబడిన 15 కులాలు, రెండో కేటగిరీలో మధ్యస్థంగా ప్రయోజనం పొందిన 18 కులాలను, మూడో కేటగిరీలో మెరుగైన ప్రయోజనాలు పొందిన 20 కులాలను చేర్చామని వెల్లడించింది. మొదటి కేటగిరీలో జనాభా శాతం 3.28 శాతం, రెండో కేటగిరీలో 62.74 శాతం, మూడో కేటగిరీలో 33.96 శాతం ఉందని తెలిపింది.

# కుటుంబం ఇప్పుడు గుర్తుకొచ్చిందా?

▶ మొదటి పేజీ తరువాయి

ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు.

**ఆ విషయం అప్పుడు గుర్తుకురాలేదా?**

తనపై 15 కేసులు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజాస్వామ్య విలువలు, కుటుంబం ఇప్పుడు గుర్తుకువస్తున్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. ''మాపై అసహ్యకరమైన ఆరోపణలు చేసి సంబంధాలు అంటగట్టినప్పుడు, మా పిల్లలను రాజకీయాల్లోకి లాగిన రోజు మాకు కుటుంబాలు లేవా? మీకు విలువలు లేవా? ప్రస్తుతం తన భార్యాబిడ్డల గురించి మాట్లాడుతున్న రేవంత్‌కు.. మాకు కూడా కుటుంబాలు ఉంటాయనే విషయం గుర్తుకురాలేదా?''అని నిలదీశారు. పదేళ్ల అధికారంలో ఉన్న తమకు ఎవరేమిటో తెలుసని, బీజేపీ నేతల బాగోతాలు కూడా తమ వద్ద ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

**అందులో మూటల లెక్కలూ ఉన్నాయేమో!**

''ఈ ఏడాది రూ.70 వేల కోట్ల ఆదాయం తగ్గిందని సీఎం రేవంత్ అప్రూవర్‌గా మారి నిజం ఒప్పుకున్నారు. ఎలాంటి ఆర్థిక మాంద్యం, కోవిడ్ సంక్షోభం వంటివేవీ ఇప్పుడు లేకున్నా సీఎం రేవంత్ విధానాల వల్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. తెలంగాణ రైజింగ్ కాదు తెలంగాణ ఫాలింగ్. రాష్ట్ర అప్పులపై రేవంత్ చెప్పున్న కాకి లెక్కల్లో రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌లకు ఇచ్చిన మూటల లెక్కలు కూడా ఉన్నాయేమో''అని కేటీఆర్ విమర్శించారు. రేవంత్‌కు గాసిప్స్ మీద తప్ప గవర్నెన్స్ మీద దృష్టి లేదని మండిపడ్డారు. భూముల అమ్మకంపై సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న ఆందోళనలపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు.

**పాలన చేతకాదనే మాటలను నిజం చేస్తున్నారు..**

''తెలంగాణకు నాయకత్వ లక్షణాలు లేవు, పాలన చేతకాదనే సమైక్యాంధ్ర పాలకుల మాటలను రేవంత్ నిజం చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత ప్రజలు విచక్షణతో మాకు పగ్గాలు అప్పగించారు. కాబట్టే పునాదులు గట్టిగా పడ్డాయి. లేదంటే తెలంగాణ ఒక విఫల రాష్ట్రంగా మిగిలిపోయేది''అని కేటీఆర్ పేర్కొన్నారు. బీజేపీ నేతలతో సీఎం రేవంత్ రహస్య మీటింగ్‌లపై కాంగ్రెస్, బీజేపీ స్పందించడం లేదని.. ఆ ఆరోపణలు అవాస్తవమైతే రాజాసింగ్‌ను సస్పెండ్ చేసే దమ్ము బీజేపీకి ఉందా అని ప్రశ్నించారు.

**ఫార్ములా–ఈ రద్దుపై విచారణ జరిపిస్తాం..**

ఫార్ములా–ఈ రేసును తప్పుబడుతున్న రేవంత్ ప్రభుత్వం.. రూ.250 కోట్లతో అందాల పోటీలు ఎందుకు పెడుతోందని కేటీఆర్ నిలదీశారు. ''ఫార్ములా–ఈ'ను ఏకపక్షంగా రద్దు చేయడంతో ప్రభుత్వానికి జరిగిన నష్టంపై మా ప్రభుత్వం వచ్చిన తర్వాత విచారణ జరిపిస్తాం. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియాలో ఎండగడితే.. వారు జర్నలిస్టులే కాదంటూ, బట్టలు విప్పుతానంటూ సీఎం దూషణకు దిగుతున్నారు. గాడ్సే మూలాలు కలిగిన రేవంత్ జాతిపిత లాంటి కేసీఆర్‌పై చిల్లరగా మాట్లాడుతూ అభినవ గాడ్సేలా తయారయ్యారు''అని మండిపడ్డారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఎంఐఎం విషయంలో తమ వైఖరిపై పునరాలోచించుకుంటామని చెప్పారు.

### జిల్లా పర్యటనలకు కేటీఆర్

- 20న సూర్యాపేట, 23న కరీంనగర్‌లో కార్యకర్తలతో భేటీ
- అసెంబ్లీ సమావేశాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు
- పార్టీ ఆవిర్భావసభ నేపథ్యంలో యంత్రాంగాన్ని క్రియాశీలకం చేసే దిశగా చర్యలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో రజతోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 27న వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రజతోత్సవాల కోసం పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 20న సూర్యాపేట, 23న కరీంనగర్ జిల్లా ముఖ్య నేతలు, కార్యకర్తలతో కేటీఆర్ భేటీ అవుతారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఆయన పర్యటనలు చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ప్రణాళిక మేరకు జరిగే ఈ జిల్లాల పర్యటనలో పార్టీ ముఖ్య నాయకులు, కేడర్‌తో కేటీఆర్ సమావేశం అవుతారని.. వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయడంపై దిశానిర్దేశం చేస్తారని తెలిపాయి. పార్టీ బలోపేతంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన తీరు, ఇతర అంశాలపై కూడా కేటీఆర్ పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తారని వెల్లడించాయి. మొత్తంగా పార్టీ యంత్రాంగాన్ని క్రియాశీలకం చేయడం లక్ష్యంగా కేటీఆర్ పర్యటనలు ఉంటాయని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

### 2040 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ పవర్

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2040 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8,938 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. గ్రీన్ పవర్‌లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు సింగిల్ విండో పద్ధతుల్లో అనుమతులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. స్టాంప్ డ్యూటీని రీయింబర్స్ చేస్తున్నామని, నాలా కన్వర్షన్ సులభతరం చేశామని వివరించారు. సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపై ఎమ్మెల్సీలు బల్మూరు వెంకట్, మహేశ్‌కుమార్ గౌడ్, కల్వకుంట్ల కవిత, భానుప్రసాద్ అడిగిన ప్రశ్నలకు డిప్యూటీ సీఎం సమాధానం ఇచ్చారు. తక్కువ ధరతో, కాలుష్య రహితంగా విద్యుత్‌ను రాష్ట్రానికి అందించడమే లక్ష్యంగా సమగ్ర గ్రీన్ పవర్ పాలసీని ప్రజా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని భట్టి చెప్పారు. ఈ పాలసీకి ఆకర్షితులైన కంపెనీలు ఈ రంగంలో రూ.80 వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని చెప్పారు.

### 'తుమ్మిడిహెట్టి' పనులు ప్రారంభిస్తాం

- ఏప్రిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మహారాష్ట్ర సీఎంతో చర్చిస్తాం
- శాసనమండలిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి ఏప్రిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మహారాష్ట్ర ముఖ్యమంత్రితోపాటు అక్కడి నీటిపారుదల శాఖాధికారులతో సంప్రదింపులు జరపనున్నట్టు ఆయన వెల్లడించారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో భాగంగా సభ్యులు కోదండరాం, జీవన్‌రెడ్డి, తాత మధు, తీన్మార్ మల్లన్న తదితరులు సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు, తుమ్మిడి హెట్టి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటి సరఫరా అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ సమాధానమిచ్చారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టుకు తుదిరూపం ఇవ్వబోతున్నట్టు స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే నిధుల అంచనాలు పెరగడానికి కారణాలను మంత్రి ఉత్తమ్ వివరించారు. ముందుగా రూపొందించిన ప్రాథమిక నివేదికలో 9,000 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం 18,000 వేల ఎకరాల భూసేకరణ అవసరం కావడం, విద్యుత్ సబ్‌స్టేషన్లు, పెరిగిన జీఎస్టీలతో అంచనా వ్యయం రూ.13,057 కోట్ల నుంచి రూ.19,465 కోట్లకు చేరిందన్నారు. సీతారామ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్టు మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలు అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ 2024–25 ఖరీఫ్ సీజన్‌లో 156.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యిందని, అందులో 53.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. అందుకు సంబంధించి రూ.12,511.76 కోట్లు చెల్లించినట్టు మంత్రి పేర్కొన్నారు.

**సన్నాల సాగుతో పెరిగిన సీజన్**

రబీలో రైతులు అత్యధికంగా వరి సన్నరకాలు వేయడంతో సీజన్ 20 రోజులు పెరిగిందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఎండలు కూడా విపరీతంగా పెరగడంతో సాగునీటి సమస్య తలెత్తిందని చెప్పారు. ఆయన సోమవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడారు. నదీ జలాలు తగ్గడం, భూగర్భ జలాలు పడిపోవడం, బోర్లు, బావులు ఎండిపోతున్న నేపథ్యంలో పంటలు ఎండుతున్నాయని పేర్కొన్నారు.

### విదేశీ విద్యను నీరుగార్చారు.. మీది రాజకీయం

- విదేశీ విద్యాపథకంపై అసెంబ్లీలో గంగుల, మంత్రి సీతక్క మధ్య సంవాదం



సాక్షి, హైదరాబాద్: శాసనసభలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో విదేశీ విద్యాపథకంపై మంత్రి సీతక్క, బీఆర్ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్ మధ్య వాడీవేడి సంవాదం జరిగింది. విదేశీ విద్యాపథకాన్ని 2016లో నాటి సీఎం కేసీఆర్ ప్రారంభించి రూ.1000 కోట్లతో 6,700 మంది విద్యార్థులను విదేశాల్లో చదివిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చిందని గంగుల ఆరోపించారు. ఈ ఆరోపణలను సీతక్క తిప్పికొడుతూ.. ఈ పథకం కింద 1,913 మంది విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారని తెలపగా, ఈ–గవర్నెన్స్ వెబ్‌సైట్ ప్రకారం ఈ గణాంకాలు తప్పని గంగుల చెప్పారు. తాను చెప్పిందాంట్లో తప్పులేం లేవని, ఈ పథకంపై రాజకీయాలు చేయడమే గంగుల తపన అని సీతక్క ధ్వజమెత్తారు. అవసరమైతే లబ్ధిదారుల జాబితాను గంగులకు అందజేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని గంగుల చేసిన ఆరోపణలను ఆమె తోసిపుచ్చారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పుల బకాయిలు రూ.4332 కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.1108 కోట్లకు తగ్గాయని, త్వరలో వాటినీ చెల్లిస్తామన్నారు.

### మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో ఉంటుందనుకోను

- కౌన్సిల్ నుంచి అవకాశం ఇస్తారో లేదో !
- వర్సిటీ పేరు మార్చడంపై వివాదమెందుకు: మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించి తనకున్న సమాచారం మేరకు ఇప్పట్లో ఉంటుందని అనుకోవడం లేదని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. త్వరలో మరో మహిళ మంత్రివర్గంలోకి వస్తుందట కదా అన్న అంశంపై ఆమె పైవిధంగా స్పందించారు. అయినా కౌన్సిల్ నుంచి మంత్రివర్గంలోకి అవకాశం కల్పిస్తారో లేదో చూడాలని, శాసనమండలిలో చాలామంది సీనియర్లు ఉన్నారన్నారు. అసెంబ్లీ లాబీలోని మీడియాతో మాట్లాడుతూ తెలుగువర్సిటీ పేరుమార్పుపై బీజేపీ నేతలు వివాదం చేయడాన్ని ఆమె తప్పుపట్టారు.

### డీలిమిటేషన్‌పై కాంగ్రెస్‌కు స్పష్టత లేదు

- డీఎంకే కంటే ముందు నుంచే కొట్లాడుతున్నాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మాజీ మంత్రి జానారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష భేటీకి దూరంగా ఉన్న కేటీఆర్.. డీలిమిటేషన్ అంశంపై మీడియాతో మాట్లాడారు. 'డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాలకు, ప్రత్యేకించి తెలంగాణకు జరగబోయే నష్టం గురించి తొలిసారిగా గొంతు విప్పింది బీఆర్ఎస్ మాత్రమే. డీఎంకే కన్నా చాలా ముందు నుంచే డీలిమిటేషన్‌తో దక్షిణాదికి జరిగే నష్టం గురించి జాతీయ వేదికలపై మేము మాట్లాడుతున్నాం. ఈ విషయంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఉన్న బాధ్యత ఏమిటో చెప్పాలి. 22న చెన్నైలో డీఎంకే నిర్వహించే సమావేశానికి బీఆర్ఎస్ తరఫున హాజరై మా పార్టీ విధానాన్ని బలంగా వినిపిస్తాం' అని కేటీఆర్ వెల్లడించారు.

**కేటీఆర్‌తో తీన్మార్ మల్లన్న భేటీ**

శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న సోమవారం అసెంబ్లీ లాబీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు మద్దతు ఇవ్వాలని కోరుతూ కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా శాసనసభ లాబీలోని బీఆర్ఎస్ పక్షం కార్యాలయానికి వచ్చిన తీన్మార్ మల్లన్న చేతిలోని వినతిపత్రాన్ని చూసి.. 'ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నావా' అని కేటీఆర్ చమత్కరించారు. మల్లన్న స్పందిస్తూ.. 'సందర్భం వచ్చినపుడు కచ్చితంగా చేస్తా' అన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 18-3-2025

## చర్మంపై ముడతలు పోవాలంటే...

బ్యూటిప్



చర్మం వదులైతే ముడతలు పడుతుంది. చిన్న చిన్న చిట్కాలతో చర్మం బిగుతుగా ఉండేలా చూసుకోవచ్చు? ఆరు స్పూన్లు ఆలివ్ ఆయిల్ తీసుకుని కొద్దిగా వేడి చేసి అందులో చిటికెడు ఉప్పు కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని కంటి చుట్టూ భాగం వదిలేసి ముఖానికి అప్లై చేయాలి. 10-15 నిమిషాల పాటు చేతి వేళ్ళతో మృదువుగా మర్దన చేసి, గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

వికాసం

# సూపర్ కమ్యూనికేటర్స్



కొందరు అద్భుతంగా మాట్లాడుతుంటారు... వినే కొద్దీ వినాలనిపిస్తుంది. మాట్లాడడంలో కొందరు తడబడుతుంటారు. సామాజిక సంబంధాల నుంచి కెరీర్ వరకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంత ముఖ్యమైనవో మనకు తెలియనిది కాదు.

'అద్భుతంగా మాట్లాడడం అనేది కొందరికే పరిమితమై కళ కాదు. ప్రయత్నిస్తే అందరికీ సాధ్యం అవుతుంది' అంటుంది 'సూపర్‌కమ్యునికేటర్స్: హౌటు అన్‌లాక్ ది సీక్రెట్ లాంగ్వేజ్ ఆఫ్ కనెక్షన్' అనే పుస్తకం. పులిట్జర్ అవార్డు గ్రహీత, అమెరికన్ జర్నలిస్ట్, రచయిత చార్లెస్ డుహిగ్ రాసిన పుస్తకం ఇది.

'మీరు భావోద్వేగం, భావుకతతో మాట్లాడుతుంటే అవతలి వ్యక్తి తర్కంతో మాట్లాడవచ్చు. ఈ నేపథ్యంలో మీ కమ్యూనికేషన్‌కు ఎదురవుతున్న ప్రధాన అవరోధం ఏమిటో గుర్తించాలి'

'మనం ఎవరితోనైనా మాట్లాడుతుంటే...అవతలి వ్యక్తి కొత్త విషయాలు తెలుసుకునేలా ఉండాలి. హై ఇన్ఫర్మేషన్ ఇంటెంట్ మిమ్మల్ని సూపర్ కమ్యూనికేటర్‌ను చేస్తుంది'

'అద్భుతంగా మాట్లాడడం అంటే పెద్ద పెద్ద పదాలు, అరుదైన పదాలు ఉపయోగించడం కాదు. మనం ఏంచెప్పాలనుకుంటున్నాం అనే దానిపై స్పష్టత ఉండాలి. టోన్, బాడీ లాంగ్వేజ్ అనేవి ముఖ్యం'....ఇలాంటి సలహాలు ఎన్నో 'సూపర్ కమ్యూనికేటర్స్'లో కనిపిస్తాయి.

# రైల్.. రైట్స్



మహిళలు ఒంటరిగా రైలు ప్రయాణం చేస్తున్నట్టయితే ఈ రైల్వే యాక్ట్స్ గురించి తప్పక తెలుసుకోవాల్సిందే!

ద రైల్వే యాక్ట్ 1989, సెక్షన్ 139 ప్రకారం.. టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నా ఆందోళన చెందక్కర్లేదు. టికెట్ లేదని రైల్లోంచి దింపే అధికారం టీటీఈకి లేదు. ఫైన్ కట్టి ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. ఒకవేళ ఫైన్ కట్టేందుకు డబ్బుల్లేకపోయినా భయపడక్కర్లేదు. లేడీ కానిస్టేబుల్ లేకుండా రైలు దింపడానికి వీల్లేదు.సెక్షన్ 311 ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో మహిళల కంపార్ట్‌మెంట్లోకి మిలటరీ సహా పురుషులెవరూ ఎక్కడానికి వీల్లేదు. ఎక్కితే వారు శిక్షార్హులు. సెక్షన్ 162 ప్రకారం.. పన్నెండేళ్ల లోపు మగపిల్లలు మాత్రం తల్లి, సోదరి, అమ్మమ్మ, నానమ్మ లాంటి వాళ్లతో కలసి మహిళల కంపార్ట్‌మెంట్లో ప్రయాణించవచ్చు. అలాగే ప్రతి స్లీపర్ (మెయిల్, ఎక్స్‌ప్రెస్) క్లాస్‌లో, గరీబ్‌రథ్, రాజధాని, దురంతో లాంటి రైళ్ల లేదా మొత్తం ఎయిర్ కండిషన్డ్ రైళ్లలోని థర్డ్ ఏసీ (3 ఏసీ)లో మహిళలకు 6 బర్త్‌లు రిజర్వ్ అయి ఉంటాయి. గ్రూప్‌గా ప్రయాణిస్తున్న మహిళలూ వీటిని వినియోగించుకోవచ్చు. రైలు ఎక్కినప్పటి నుంచి గమ్యానికి చేరేవరకు మహిళా ప్రయాణికుల భద్రత కోసం 'మేరీ సహేలీ' యాప్‌నూ లాంచ్ చేశారు. అంతేకాదు రైల్వేస్టేషన్లలో సీసీటీవీ కెమేరాలు, మానిటరింగ్ రూమ్స్‌ను ఏర్పాటు చేశారు.అత్యవసర పరిస్థితుల్లో రైల్వే హెల్ప్‌లైన్ 139 ఉండనే ఉంది.



న్యూస్‌మేకర్

# ఈ వేదనకు జడ్జి గారి గుండె నీరయ్యింది

'ఆమె తండ్రి పరిహారం పెంచమని అడుగుతున్నాడు. ఆ అమ్మాయి వేదనను చేస్తే మనకే గుండె తరుక్కుపోతోంది. కన్నవారికి ఎలా ఉంటుంది?' అని ఆవేదన చెందారు ముంబై హైకోర్టు బెంచ్ మీదున్న ఇద్దరు జడ్జిలు. 2017లో రైల్వే వారి కారు ఢీకొనగా కోమాలోకి వెళ్లిన 17 ఏళ్ల నిధి జత్మలాని కేసుకు ముగింపు పలుకుతూ రైల్వే మంత్రిని 5 కోట్ల పరిహారం ఇవ్వడం గురించి సానుభూతితో ఆలోచించమని కోరింది కోర్టు. వివరాలు...

ఒక జీవితానికి పరిహారం ఎంత? ఒక తూనీగకు రెక్కలు విరిగిపడితే నష్ట పరిహారం ఎంత? కోయిల గొంతును నులిమి పాట రాకుండా చేస్తే ఆ నష్టాన్ని ఏమి ఇచ్చి భర్తీ చేయగలం? ఒక ఎగిరి దుమికే జలపాతాన్ని ఎండపెట్టే శాక ఎన్ని డబ్బులు ధారబోస్తే జల ఊరుతుంది?

నష్టపరిహారం ఏ నష్టాన్ని పూర్తిగా పూడ్చలేదు. కాకపోతే కొంత సాయం చేయగలదు అంతే. అందుకే ముంబై హైకోర్టుకు చెందిన జడ్జీలు గిరిష్ కులకర్ణి, అద్వైత్ సెత్నా ఒక అమ్మాయికి వచ్చిన కష్టాన్ని లెక్కలతో కాకుండా హృదయంతో చూడమని రైల్వే మినిస్టర్‌ని కోరారు. పరిహారం పెంచే అవకాశాన్ని పరిశీలించమన్నారు. జడ్జీలను కదిలించిన ఆ కేస్ ఏమిటి?

### రెక్కలు తెగిన పిట్ట

2017, మే 28. ముంబై మెరైన్ డ్రైవ్‌లో 17 ఏళ్ల నిధి జెత్మలాని రోడ్డు దాటుతోంది. ఆ రోడ్డులోనే ఉన్న కేసీ కాలేజ్‌లో ఆ అమ్మాయి ఇంటర్ చదువుతోంది. ఆమె రోడ్డు దాటడం మొదలుపెట్టగానే అతివేగంతో వచ్చిన ఇన్నోవా ఆమెను ఢీకొట్టింది. నిధి ఎగిరి దూరం పడింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఢీకొట్టాక ఇన్నోవా రోడ్డు డివైడర్‌ను కూడా ఢీకొట్టి ఆగింది. అప్పటి వరకూ ఎగురుతూ తుళ్లుతూ చదువుకుంటూ ఉన్న నిధి ఆ రోజు నుంచి మళ్లీ మాట్లాడలేదు. నవ్వలేదు. నడవలేదు. నిలబడలేదు. జీవచ్ఛవంలా మారింది. కొన్నాళ్లు కోమాలో ఉండి ఆ తర్వాత పడక్కుర్చీకి పరిమితమైంది. ఇంత పెద్ద నష్టం చేకూర్చిన ఈ కేసులో నష్టపరిహారం కోసం పోరాటం మొదలైంది.

నిధి జెత్మలాని



యాక్సిడెంట్‌కు ముందు | యాక్సిడెంట్ తర్వాత

### నిధి వెర్సస్ వెస్టన్ రైల్వేస్

నిధిని ఢీకొట్టిన ఇన్నోవా వెస్టన్ రైల్వేస్ వారి సిగ్నలింగ్ సర్వీసెస్ విభాగానికి చెందినది. కనుక దీనిలో ప్రతివాది ఆ సెక్షన్‌కు చెందిన సీనియర్ ఇంజనీర్ అయ్యాడు. కేసు నమోదయ్యాక 'మోటార్ యాక్సిడెంట్స్ క్లైమ్స్ ట్రిబ్యునల్' 2021లో 69,92,156 రూపాయల (సుమారు 70 లక్షలు) పరిహారం వడ్డీతో సహా నిధి తల్లిదండ్రులకు ఇవ్వాలని, కోర్టుకు ఒకటిన్నర కోటి రూపాయలు డిపాజిట్ చేసి ఆ వచ్చే వడ్డీని నెల నెలా నిధి వైద్య అవసరాలకు ఇవ్వాలని రైల్వేశాఖను ఆదేశించింది. రైల్వే శాఖ ఒకటిన్నర కోటి డిపాజిట్ చేసింది. అయితే ఈ పరిహారం చాలదని నిధి తండ్రి హైకోర్టుకు వెళ్లాడు.

### ఆమె తప్పు ఉంటే?

హైకోర్టులో నష్టపరిహారానికి సంబంధించి వాదనలు మొదలైనప్పుడు రైల్వే శాఖ తరఫు అడ్వకేటు రోడ్డు దాటే సమయంలో నిధి పెడస్ట్రియన్ క్రాసింగ్‌లో నడవలేదని, పైగా ఆ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతోందని వాదనలు వినిపించాడు. అయితే కోర్టు పట్టించుకోలేదు. నిధి తరఫు లాయర్లు ఇప్పుడు నిధికి 25 సంవత్సరాలని జీవితాంతం ఆమె వీల్‌చైర్ మీద మాటా పలుకూ లేకుండా జీవచ్ఛవంలా బతకాలని అందుకు చాలా డబ్బు అవసరమవుతుందని అందువల్ల నష్టపరిహారం కనీసం 7 కోట్లు ఇవ్వాలని కోరారు. ప్రతివాదులు 'ఇది చాలా ఎక్కువ' అని అభ్యంతరం చెప్పారు. ఇదంతా పరిశీలించిన న్యాయమూర్తులు 'మేము ఆ అమ్మాయివి యాక్సిడెంట్‌కు ముందు ఫొటోలు ఇప్పటి ఫొటోలు చూశాం. మా గుండె తరుక్కుపోయింది. ఒక ఆడేపాడే అమ్మాయి ఈ వ్యథను ఎలా భరించగలదు? మాకే ఇలా ఉంటే తల్లిదండ్రులు ఈ బాధను ఎలా తట్టుకుంటారు. వారు ఇప్పటికే చేయవలసిందల్లా చేశారు. ఇకపైనా చేయాలి. ఇది ఎంతో వ్యథ. ఇది అరుదైన కేసుల్లోకెల్లా అరుదైనది. అందుకే సహానుభూతిని చూపాలి. అందుకే మేము రైల్వే మంత్రిని ఇప్పటి వరకూ ఇచ్చిన దానితో సహా అంతా కలిపి ఐదు కోట్ల రూపాయల పరిహారంతో కేసును సెటిల్ చేసుకునే అవకాశం పరిశీలించమని కోరుతున్నాం' అన్నారు.

బహుశా రైల్వే మంత్రి స్పందించవచ్చు. స్పందించకపోవచ్చు. కాని రోడ్డు సెఫ్టీ గురించి మన దేశంలో ఎంత చైతన్యం రావాలో మాత్రం ఈ కేసు తెలియచేస్తూ ఉంది. పిల్లలకు తల్లిదండ్రులు జాగ్రత్త చెప్పాలి. రోడ్డు మీద నడిచినా, వారికి వాహనాలు కొనిచ్చి పంపినా ఎంత భద్రం చెప్పాలో అంతా చెప్పాలి. జర భద్రం.

## ఇంటిప్స్

వర్క్ ఏరియా, పిల్లలు ఆడుకునే ప్లేస్, చదువుకునే స్థలం ఏదైనా ఒకే గదిలో రకరకాలమూడ్స్‌ని క్రియేట్ చేయాలంటే మంచి ఛాయిస్ వాల్‌పేపర్స్. గోడకు వేసిన రంగును మార్చేయడం వీలు కావట్లేదు అనుకుంటే సింపుల్‌గా నచ్చిన వాల్‌పేపర్‌ని తెచ్చి అతికిస్తే సరి.

- లివింగ్ రూమ్, డైనింగ్ హాల్, బెడ్‌రూమ్... ప్రతి గదీ ఓ కొత్తగా కనిపించాలంటే డిజైన్‌లో, ప్యాట్రన్‌లో, రంగులో విభిన్న తరహాలలో ఉన్న వాల్‌పేపర్స్‌ని ఎంచుకోవాలి. సీజన్‌కు తగ్గ వాల్ పేపర్స్ కంటికి, మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తాయి.
- వాల్‌పేపర్స్‌పై పడిన మరకలు పోగొట్టడం చాలా సులువు. గోరువెచ్చని నీటిలో డిటర్జంట్ పౌడర్ వేసి స్పాంజితో అద్ది తుడవాలి. ఆ తర్వాత మెత్తని వస్త్రంతో తుడిస్తే డల్ అయిన వాల్‌పేపర్స్ కొత్త కళతో మెరిసిపోతాయి.
- ఇద్దరు పిల్లలున్న ఇంట్లో చెరో గదిని కేటాయించడం వీలు కాకపోతే పార్టిషన్ చేసి వారికి నచ్చిన వాల్‌పేపర్‌తో కవర్ చేయడం సులువైన కిటుకు.
- కిచెన్, బాత్రూమ్స్ నీరు, చెమ్మ ఎక్కువగా తగిలే చోట్లు. అందుకని ఈ గదులలో వాల్‌పేపర్స్‌ని వాడకపోవడమే మంచిది.



సాగుబడి
ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 18 నుంచి

# డాన్ ఆఫ్ ఫ్రూట్స్.. అవొకాడో!




మన దేశంలో పట్టణ ప్రాంత ప్రజల్లో ఆహార – ఆరోగ్య స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని రకాల దేశ, విదేశీ జాతుల పండ్లకు మార్కెట్‌లో గిరాకీ పెరుగుతోంది. అందులో ఒకటి అవొకాడో. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్‌ఆర్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి. కరుణాకరన్ మాటల్లో చెప్పాలంటే.. అవొకాడో, డ్రాగన్ సహా పన్నెండు రకాల దేశ, విదేశీ ఖరీదైన పండ్ల జాతుల సాగు విస్తీర్ణం మన దేశంలో గత మూడేళ్లుగా పెరుగుతోంది. ఈ మొక్కలకు గిరాకీ 30% పెరిగింది. పరిమిత నీరు, పోషకాలు, శ్రమతో సాగు చేయదానికి అవకాశం ఉండటం.. ధాన్యపు పంటలతో పోల్చితే అధికాదాయం రావటం.. యాంత్రీకరణకు అనుకూలం కావటం.. పౌష్టిక విలువలతో కూడిన ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉండటం.. మార్కెట్‌లో డిమాండ్ ఉండటం వంటి అంశాలు ఇందుకు దోహదం చేస్తున్నాయి. అయితే, అవొకాడో పండ్ల తోటలు ఏయే భూముల్లో సాగు చెయ్యాలి? ఏయే రకాలు అనువైనవి? వంటి ప్రశ్నలకు సమాధానాలు డా. కరుణాకర్ మాటల్లోనే చదవండి..

అవొకాడో సాగు మనకు కొత్తది కాదు. 70 ఏళ్లుగా కర్ణాటక, కేరళ, తమిళనాడు, సిక్కిం, మహారాష్ట్రల్లో సాగవుతోంది. అయితే, ఇప్పుడు ఆంధ్ర, తెలంగాణ సహా దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ అవొకాడో తోటలను తామర తంపరగా నాటుతున్నారు. గత మూడేళ్లలోనే 8-10 లక్షల అవొకాడో మొక్కలు నాటారు. ఉష్ణమండలం, తేమ ఎక్కువగా ఉండే ఉప-ఉష్ణమండల ప్రాంతాలు అనుకూలం. విభిన్న వాతావరణ పరిస్థితుల్లోనూ పెరిగే లక్షణం దీనికి ఉన్నప్పటికీ, తగిన వాతవరణం, నేలల గురించి పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవలసిందిగా రైతులను కోరుతున్నాను. 18-33 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతలు, 700-1500 ఎం.ఎం. వర్షపాతం ఉన్న ప్రాంతాలు.. 5.5 - 8 వరకు ఉదజని సూచిక (పిహెచ్) ఉన్న భూములు అనుకూలం. మొక్కలు నాటిన 5 ఏళ్లకు పూర్తిస్థాయి దిగుబడినిచ్చే స్థితికి పెరుగుతుంది.

ప్రస్తుతం మంచి మార్కెట్ డిమాండ్ ఉంది. అందుకే రైతులు, వ్యాపారులు, వినియోగదారులు అమితంగా ఆసక్తి చూపుతున్నారు. అయితే, అవొకాడో ఖరీదైన పండు కాబట్టి మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్‌లు, డిసర్ట్ స్వీట్ల తయారీలో మాత్రమే వాడుతున్నారు. ముందు దిగుబడి పెరిగే నాటికి ప్రాసెసింగ్ సదుపాయాలు పెరిగి వేర్వేరు రూపాల్లో వాడకం పెరగాలి. లేదంటే మార్కెట్ పడిపోయే ముప్పు ఉంటుంది.

ఇక రైతుల విషయానికొస్తే.. తోటలు నాటేటప్పుడు అది ఏ రకమో తెలియకుండానే, ఏయే నేలలకు సరిపోతుందో తెలుసుకోకుండానే స్థానిక నర్సరీల నుంచి కొనుగోలు చేసిన మొక్కలు నాటుతున్నారు. దీంతో సాగులో చాలా సమస్యలు వస్తున్నాయి.

### 'హాస్' రకం మొక్కలు వద్దు

బెంగళూరులోని ఐఐహెచ్‌ఆర్‌లో 16 రకాల అవొకాడో మొక్కలున్నాయి. మీ భూమి, నీరు, వాతావరణానికి అనువైన రకాన్ని ఎంచుకోవటంపై శ్రద్ధ పెడితే విజయం సాధించవచ్చు. అర్క సుప్రీం, అర్క రవి, లాంబ్ హాస్, పింకర్‌టన్ రకాలు మేలైనవి. చాలా మంది హాస్ రకం సాగు చేస్తున్నారు. ఇది మనకు సూట్ కాదు.

### నెర్రెలిచ్చే భూముల్లో వద్దు

అవొకాడో చాలా సున్నితమైన పంట. నీటి నిల్వను అసలు తట్టుకోలేదు. అవొకాడోకే కాదు ఏ పండ్ల తోటలకైనా ఎండా కాలం నెర్రెలిచ్చే నల్లరేగడి నేలలు పనికిరావు. వేర్లు తెగిపోతాయి. నీరు నిలవని, బాగా గాలి సోకే ఎర్ర గరప నేలలు (రెడ్ శాండీ సాయిల్) మేలు. 40% ఇసుక కలిసిన చెరువు మట్టిలో కూడా బాగా పెరుగుతుంది. బంక మట్టి నేల (క్లే సాయిల్) అసలు పనికిరాదు. ఈ నేలలో సాగు చేయాలంటే... 4 x 3 అడుగుల గుంతల్లో ఎర్ర మట్టి పోసి, మొక్కలు నాటుకోవాలి. పిహెచ్ సమతుల్యంగా ఉండాలి. నీటిలో ఈసీ 1 కన్నా ఎక్కువ ఉంటే సరిగ్గా పెరగదు. అందుకని, అవొకాడో మొక్కలు నాటే ముందు మట్టి, నీటి పరీక్షలు చేయించి ప్రణాళికాబద్ధంగా పెట్టుబడి పెట్టే నిర్ణయం తీసుకోవాలి.


పిహెచ్ 7 కన్నా ఎక్కువ ఉంటే, కాల్షియం కార్బొనేట్ 20% కన్నా ఎక్కువ ఉన్న నేలలు అనుకూలం కాదు. నీరు తగుమాత్రంగా ఇవ్వాలి. ఎక్కువ ఇస్తే ఐరన్ లభ్యత సమస్య వస్తుంది. నీటి ఉప్పదనం 2% కన్నా ఎక్కువ ఉంటే పనికిరాదు. క్లోరైడ్ సాంద్రత ఎక్కువగా ఉన్న నేలలకు తగిన రకాల మొక్కలను ఎంపిక చేసుకోవాలి.

### ఏటా రెండు సీజన్లు

అవొకాడో పూత వచ్చిన తర్వాత 120-150 రోజుల్లో పండ్లు కోతకు వస్తాయి. ఏప్రిల్-జూలై, అక్టోబర్- ఫిబ్రవరి సీజన్లలో రెండు దఫాలుగా పండ్ల దిగుబడి వస్తుంది. విత్తనం నాటితే 5-6 ఏళ్లలో, అంటు మొక్కలు నాటితే 3-4 ఏళ్లలో కాపుకొస్తాయి. చెట్టుకు 100 నుంచి 500 కాయలు కాస్తాయి. కాయలు పక్వానికి వచ్చినా చెట్టు మీద గట్టిగానే ఉంటాయి. కోసిన తర్వాత మెత్తబడతాయి. ముదురు రంగులోకి మారితే పక్వానికి వచ్చినట్లు గుర్తించి కోయాలి. పక్వ దశను గుర్తించడానికి ఇతర దేశాల్లో చిన్నపాటి యంత్రాలను వాడుతున్నారు. మన శరీర ఉష్ణోగ్రతను సెన్సార్లతో గుర్తించే పరికరంతోనే అవొకాడో పక్వ దశను తెలుసుకోవచ్చు. 24% ఆర్గానిక్ కంటెంట్ ఉన్న దశలో పండును కోయాలి. కాయ కోసిన తర్వాత రంగు మారుతుంది. అవొకాడోతో ఒక ఉపయోగం ఏమిటంటే పండు పక్వానికి వచ్చిన తర్వాత కూడా మార్కెట్ ధర లేకపోతే చెట్టు మీదే 1-2 నెలల వరకు కాయ కోతను వాయిదా వేసుకోవచ్చు!

### మరికొన్ని మెళకువలు

సముద్రతలం నుంచి 1,000 మీటర్ల ఎత్తుగల ప్రదేశాల్లో వెస్ట్ ఇండియన్ అవొకాడో వెరైటీలను నాటుకోవాలి. వీటి కొమ్మలు, విత్తనాల ద్వారా మొక్కలు తయారు చేసుకోవచ్చు. మొదటి 5 ఏళ్లూ మధ్యాహ్నపు ఎండ నుంచి మొక్కల్ని కాపాడాలి. 5 ఏళ్ల వరకు ఎట్టిపరిస్థితుల్లోనూ పూత, కాతను ఉంచకూడదు. తీసెయ్యాలి. 5 మీ.× 5 మీ. సైజులోగొయ్యి తవ్వి, అది 3 నెలలు ఎండిన తర్వాత మొక్కలు నాటుకోవాలి. అవొకాడో పండ్లను ప్రాసెస్ చేసి అనేక ఉత్పత్తుల తయారు చేయటం, స్ప్రే డ్రయ్యింగ్ ద్వారా పొడిని తయారు చేసే టెక్నాలజీని ఐఐహెచ్‌ఆర్ రూపొందించింది. విలువ జోడించి ఉత్పత్తులు అమ్ముకోగలిగితే మంచి ఆదాయం వస్తుంది.




అవొకాడో 2 – నీరు నిలవని ఎర్ర గరప నేల (రెడ్ శాండీ సాయిల్)లో అవొకాడో చెట్టు చక్కగా పెరుగుతుంది. బంక మన్ను (క్లే సాయిల్) దీనికి సరిపడదు. ఐఐహెచ్‌ఆర్ ప్రధాన శాస్త్రవేత్త డా. కరుణాకరన్ ఈ విషయాన్ని ఈ చిత్రంలో చక్కగా చెప్పారు. బంక మన్ను నేలలో అవొకాడో సాగు చేయదలిస్తే 4 అడుగుల లోతు, 3 అడుగుల వెడల్పున గొయ్యి తీసి, ఆ గోతిలో 90% వరకు (చిత్రంలో ఎడమ వైపున చూపిన విధంగా) ఎర్ర గరప మట్టి, ఎరువుల మిశ్రమాన్ని నింపి సాగు చేయవచ్చని ఆయన తెలిపారు. గుంతలో సగం వరకే ఎర్ర గరప మట్టిని నింపితే.. చెట్టు కొన్ని సంవత్సరాలు పెరిగిన తర్వాత వేర్లు బంకమన్నులోకి విస్తరించినప్పుడు పోషకాలు, నీరు అందక (చిత్రంలో కుడి వైపున చూపిన విధంగా) నిలువునా ఎండిపోతుందని వివరించారు.

### 5 అడుగుల ఎత్తు మడులపై మొక్కలు నాటాలి



అవొకాడో చాలా సున్నితమైన పంట. వేరుకుళ్లు బెడద ఉంటుంది. అవొకాడో మొక్కల్ని (ఆ మాటకొస్తే ఏ పండ్ల తోటైనా) 5 అడుగుల ఎత్తుమడి (రెయిజ్డ్ బెడ్) పైనే నాటుకోవాలి. ట్రాక్టర్‌తో అంతర సేద్యం చేసినా బెడ్ దెబ్బతినదు. సాళ్ల మధ్య వర్షపు నీరు బయటకు త్వరగా వెళ్లిపోవటానికి కందకం తియ్యాలి. ఇజ్రాయెల్, సౌతాఫ్రికాలో కూడా ఎత్తు మడులపైనే నాటుతారు.




ముందుగా/ఆలస్యంగా కోతకు రావటం.. మంచి సువాసనతో అధిక గుజ్జు ఉండటం.. ఎక్కువ రోజులు నిల్వ ఉండటం.. మార్కెట్‌లో గిరాకీ ఉండటం.. కోసుకు తినటానికి లేదా ప్రాసెసింగ్‌కు అనువుగా ఉండటం.. వంటి అనేక అంశాలను పరిశీలించి అవొకాడో సాగుచేసే రకాలను ఎంపిక చేసుకోవటం కీలకం.

### థాంక్స్ టు 'టొక్సోడాన్'!



అవొకాడో.. అమెజాన్, మెక్సికన్ అటవీ ప్రాంతాల్లో నివసించే భారీ శాకాహార జంతువు 'టొక్సోడాన్'కు పండ్లు తినే అలవాటుంది. అయితే, దానికి ఏ పండూ సరిగ్గా నచ్చేది కాదు. అవొకాడో పండు టొక్సోడాన్‌కు తెగ నచ్చేసిందట. అందులో పుష్కలంగా ఉండే మోనో అన్ శాచ్యురేటెడ్ ఫాటీ యాసిడ్సే అందుకు కారణమట. ఇందులో 20% కొవ్వు ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైనదే కాకుండా 'సంతృప్తిని చ్చేది' కూడానట! అందుకే దీనికి 'వెన్న పండు' అని పేరు. ఆ విధంగా దీని గొప్పతనాన్ని జనానికి తెలిసేలా చేసినందుకు టొక్సోడాన్‌కి థాంక్స్ చెప్పాలి అన్నారు ఐఐహెచ్‌ఆర్ (బెంగళూరు)లో పండ్ల పరిశోధనా విభాగాధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డా. జి. కరుణాకరన్! అదే విధంగా, 1950లలో కూర్గ్, వయనాడ్ ప్రాంతాల్లో టీ ఎస్టేట్ల యజమానులు వ్యాహ్యాళికి వెళ్తూ పెంపుడు కుక్కలను వెంట తీసుకెళ్లేవారు. దారి పక్కన చెట్ల కింద రాలినపడి ఉన్న అవొకాడో పండ్లను కుక్కలు ఇష్టంగా తినటం గమనించారు. అప్పటి వరకు ఇవి తినదగిన పండ్లని చాలా మందికి తెలియదు. ఇప్పుడు బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. మన దేశంలో 'డాన్ ఆఫ్ ఫ్రూట్స్' అయ్యింది!

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

## అనంతపురంలో 22 నుంచి 3 రోజుల పాటు 'మన పంటలు- మన వంటల'పై సదస్సులు

మారుతున్న వాతావరణం నేపథ్యంలో 'మన పంటలు – మన వంటలు' అనే శీర్షికతో అనంతపురంలోని పోలీస్ కళ్యాణ మండపంలో ఈ నెల 22 నుంచి 3 రోజుల పాటు ఎగ్జిబిషన్, సదస్సులు నిర్వహించనున్నట్లు అనంత సుస్థిర వ్యవసాయ వేదిక కన్వీనర్ డా. వై.వి. మల్లారెడ్డి తెలిపారు. ఆహారమే ఆరోగ్యం అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లటంతో పాటు.. వర్షాధార ప్రకృతి వ్యవసాయంలో పంటలు, వంటల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు మూడు రోజులూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. 23 (ఆదివారం) న ఉ.10.30 గం.కు డా. ఖాదర్ వలి ప్రసంగం ఉంటుందన్నారు. 20 స్వచ్ఛంద సంస్థలు కలిసి వరుసగా రెండో ఏడాది ఈ సదస్సులు నిర్వహిస్తుండటం విశేషం.



## 22,23 తేదీల్లో బయోచార్‌పై శిక్షణ

వ్యవసాయ వ్యర్థాలతో బయోచార్ (బొగ్గు పొడి)ని తయారు చేసి పొలంలో తగిన మోతాదులో చల్లితే భూసారం పెరుగుతుంది. ఈ విషయమై రైతులకు లోతైన అవగాహన కల్పించటం కోసం ఘట్‌కేసర్ సమీపంలోని పిట్టల ఆర్గానిక్ ఫామ్ (ఎన్‌ఎఫ్‌సి నగర్ – అంకుష్‌పూర్ మధ్య)లో జరగనుంది. ప్రసిద్ధ బయోచార్ నిపుణులు డా. నక్కా సాయిభాస్కర్ రెడ్డి శిక్షణ ఇస్తారని నిర్వాహకులు పిట్టల శ్రీశైలం తెలిపారు. ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఇతర వివరాలకు.. 70137 84740.

## ఢిల్లీ క్యాపిటల్స్ వైస్ కెప్టెన్‌గా డు ప్లెసిస్



న్యూఢిల్లీ: మరో నాలుగు రోజుల్లో మొదలయ్యే ఐపీఎల్ 18వ సీజన్‌లో పాల్గొనే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా దక్షిణాఫ్రికా సీనియర్ క్రికెటర్ ఫాఫ్ డు ప్లెసిస్‌ను నియమించారు. 40 ఏళ్ల డు ప్లెసిస్ గత ఏడాది రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. గత టోర్నీ తర్వాత డు ప్లెసిస్‌ను ఆర్‌సీబీ జట్టు విడుదల చేసింది. మెగా వేలంలో ఢిల్లీ జట్టు రూ. 2 కోట్లకు డు ప్లెసిస్‌ను సొంతం చేసుకుంది. 2012లో ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు తరఫున అరంగేట్రం చేసిన డు ప్లెసిస్ 2015 వరకు ఆ జట్టుతోనే ఉన్నాడు. బెట్టింగ్ వివాదం నేపథ్యంలో 2015లో చెన్నై జట్టుపై రెండేళ్ల నిషేధం పడటంతో డు ప్లెసిస్ ఆ సమయంలో రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ జట్టుకు ఆడాడు. చెన్నై జట్టుపై రెండేళ్ల నిషేధం గడువు ముగిశాక 2018లో డు ప్లెసిస్ మళ్లీ చెన్నై చెంతకు చేరాడు. 2021 వరకు చెన్నై జట్టుతో కొనసాగిన డు ప్లెసిస్ 2022 నుంచి 2024 వరకు ఆర్‌సీబీ జట్టు తరఫున బరిలోకి దిగి కెప్టెన్‌గా వ్యవహరించాడు. డు ప్లెసిస్ నాయకత్వంలో ఆర్‌సీబీ 2022, 2024లలో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఓవరాల్‌గా డు ప్లెసిస్ ఐపీఎల్‌లో 145 మ్యాచ్‌లు ఆడి 136.37 స్ట్రయిక్ రేట్‌తో 4571 పరుగులు చేశాడు. ఇందులో 37 అర్ధ సెంచరీలు ఉన్నాయి.



## 'సారథిగా రజత్ రాణిస్తాడు'

**పాటీదార్ సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా ఉంటాడన్న కోహ్లి**

**బెంగళూరు:** యువ ఆటగాడు రజత్ పాటీదార్ సుదీర్ఘ కాలం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు కెప్టెన్‌గా కొనసాగుతాడని స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అభిప్రాయపడ్డాడు. గత సీజన్‌లో డు ప్లెసిస్ ఆర్‌సీబీ కెప్టెన్‌గా వ్యవహరించగా... ఈ సీజన్ ఆరంభానికి ముందు ఫ్రాంచైజీ సారథ్య బాధ్యతలను రజత్ పాటీదార్‌కు అందించింది. 'రజత్ పెద్ద బాధ్యతలు అందుకున్నాడు. సుదీర్ఘ కాలం అతడు సారథిగా కొనసాగుతాడు. జట్టును నడిపించేందుకు అతడికి తగిన వనరులు అందుబాటులో ఉన్నాయి' అని విరాట్ అన్నాడు. ఇక లీగ్ ఆరంభం (2008) నుంచి ఒకే ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న విరాట్ కోహ్లి... ఇదంతా ఆర్‌సీబీ అభిమానుల ప్రేమాభిమానాల వల్లే సాధ్యమైందని అన్నాడు. '18 సంవత్సరాలుగా ఆర్‌సీబీకి ఆడుతున్నా. ఇదో అద్భుతమైన అనుభూతి. ప్రతి సీజన్‌కు ముందు అదే ఉత్సాహం నన్ను మరింత ఉత్తేజపరుస్తోంది. జట్టులో నైపుణ్యానికి కొదవ లేదు. ఈ బృందంతో కలిసి ఆడేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా' అని అన్నాడు. గతేడాది టి20 ప్రపంచకప్ గెలిచాక అంతర్జాతీయ స్థాయిలో ఈ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లి ఆ తర్వాత తొలిసారి ఐపీఎల్ ఆడనున్నాడు. బెంగళూరు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నానని రజత్ పాటీదార్ అన్నాడు. 'విరాట్, డివిలియర్స్, క్రిస్ గేల్ వంటి దిగ్గజ ఆటగాళ్ల ప్రాతినిధ్యం వహించిన జట్టుకు సారథిగా వ్యవహరించడం చాలా ఆనందంగా ఉంది. వీళ్ల ఆటను చూస్తూనే పెరిగా. చిన్నప్పటి నుంచే ఆర్‌సీబీ అంటే ప్రత్యేక అభిమానం. కెప్టెన్సీ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తా' అని ఆర్‌సీబీ జట్టు సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పాటీదార్ వ్యాఖ్యానించాడు.

# 'విన్'రైజర్స్ అయ్యేనా!

**రెండో టైటిల్‌పై గురి పెట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్**

- దూకుడే మంత్రంగా బరిలోకి ప్యాట్ కమిన్స్ బృందం
- ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, క్లాసెన్, నితీశ్ రెడ్డిపై భారీ ఆశలు

**మరో 4 రోజుల్లో ఐపీఎల్**

మొదట ఓ మాదిరి స్కోరు చేయడం... ఆ తర్వాత కట్టుదిట్టమైన బౌలింగ్‌తో దాన్ని కాపాడుకోవడం ఇది ఒకప్పుడు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తీరు!

కానీ గతేడాది బౌలింగ్ బలాన్ని పక్కన పెట్టిన రైజర్స్... బ్యాటింగ్‌తో లీగ్‌లో ప్రకంపనలు సృష్టించింది. ఒకటికి మూడుసార్లు 250 పైచిలుకు పరుగులు చేసిన సన్‌రైజర్స్... ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా... పవర్‌ప్లేలో అత్యధిక పరుగులు పిండుకున్న టీమ్‌గా రికార్డుల్లోకెక్కింది!!

లీగ్ ఆసాంతం రాణించిన బ్యాటర్లు ఆఖర్లో విఫలమవడంతో గత సీజన్‌లో రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్న హైదరాబాద్ ఫ్రాంచైజీ ఈసారి కప్పు కొట్టాలని కృతనిశ్చయంతో ఉంది. కమిన్స్ కెప్టెన్సీకి... అభిషేక్ శర్మ, హెడ్ ఆరంభ మెరుపులు... క్లాసన్, నితీశ్ కుమార్ రెడ్డి ఫినిషింగ్ టచ్ తోడైతే సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఆపడం ప్రత్యర్థులకు శక్తికి మించిన పనే!!!

–సాక్షి క్రీడావిభాగం


కమిన్స్


నితీశ్ రెడ్డి


అభిషేక్ శర్మ


ట్రావిస్ హెడ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో నాణ్యమైన బౌలింగ్‌కు పెట్టింది పేరైన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్టు... గతేడాది అందుకు పూర్తి భిన్నంగా బాదుడే పరమావధిగా విజృంభించి కొత్త గుర్తింపు తెచ్చుకుంది. గత సీజన్‌లో సన్‌రైజర్స్ సాగించిన విధ్వంసకాండ మాటలకు అందనిది. అరాచకం అనే పదానికి అర్థం మారుస్తూ... ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తిస్తూ సన్‌రైజర్స్ బ్యాటర్లు సాగించిన ఊచకోత గురించి ఎంత చెప్పినా తక్కువే! ఒకరి తర్వాత ఒకరు అన్నట్లు వంతులు వేసుకొనిమరీ వీరబాదుడు బాదడంతోనే రైజర్స్... లీగ్ చరిత్రలోనే అత్యధిక స్కోరు తమ పేరిట లిఖించుకుంది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి... ఈ 'రన్' చతుష్టయానికి ఇప్పుడు మరో పిడుగు తోడయ్యాడు. 'పాకెట్ డైనమైట్' ఇషాన్ కిషన్ ఈ ఏడాది నుంచి రైజర్స్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇప్పటికే హిట్టర్లతో దట్టంగా ఉన్న హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్... ఇషాన్ రాకతో మరింత రాటుదేలనుంది. వేలంలో అత్యధికంగా 25 మందిని తీసుకునే అవకాశం ఉన్నా... కేవలం 20 మంది ప్లేయర్లనే కొనుగోలు చేసుకున్న రైజర్స్... అట్టిపెట్టుకున్న ఆటగాళ్ల కోసమే భారీగా ఖర్చు పెట్టింది. క్లాసెన్‌కు రూ. 23 కోట్లు, కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు రూ. 18 కోట్లు... అభిషేక్ శర్మ, హెడ్‌లకు రూ. 14 కోట్ల చొప్పున ఇచ్చిన రైజర్స్... రూ. 6 కోట్లకు నితీశ్ కుమార్ రెడ్డిని కొనసాగించింది. 2016లో తొలిసారి టైటిల్ సాధించిన ఎస్‌ఆర్‌హెచ్... 2018, 2024లో రన్నరప్‌గా నిలిచింది. ఈసారి అటు బ్యాటింగ్‌తో పాటు ఇటు బౌలింగ్ దళాన్ని కూడా మరింత పటిష్ట పరుచుకున్న హైదరాబాద్.. రెండోసారి కప్పు చేజిక్కించుకోవాలని తహతహలాడుతోంది.

### నాలుగో ఆటగాడు ఎవరో?

కెప్టెన్ కమిన్స్‌తో పాటు క్లాసెన్, హెడ్ తుది జట్టులో ఉండటం ఖాయమే కాగా... గతేడాది నాలుగో విదేశీ ప్లేయర్‌గా మార్క్‌రమ్‌ను ఎంచుకుంది. అయితే ఈసారి మాత్రం ఆడమ్ జాంపా, ముల్డర్, కమిందు మెండిస్ రూపంలో పరిమిత వనరులే ఉన్నాయి. దీంతో హెడ్ కోచ్ డానియల్ వెటోరీ... ఆసీస్ స్పిన్నర్ జాంపా వైపే మొగ్గుచూపే అవకాశాలున్నాయి. అయితే రాహుల్ త్రిపాఠి, అబ్దుల్ సమద్, షాబాజ్ అహ్మద్ వంటి దేశీయ ఆటగాళ్లు ఈసారి అందుబాటులో లేకపోవడం రైజర్స్‌కు ప్రతిబంధకంగా మారింది. అభినవ్ మనోహర్, అనికేత్ వర్మ, అథర్వ తైడె, సచిన్ బేబీకి తుది జట్టులో అవకాశం దక్కుతుందో లేదో వేచి చూడాలి. గత సీజన్‌లో తొలి ఏడు మ్యాచ్‌ల్లో ఐదింట నెగ్గి ఆరంభంలోనే ఆధిపత్యం కనబర్చిన హైదరాబాద్ జట్టు... పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్‌కు చేరింది. క్వాలిఫయర్-1లో కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓడిన రైజర్స్... క్వాలిఫయర్-2లో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచినా... ఫైనల్లో మరోసారి కోల్‌కతా చేతిలోనే ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. తమదైన రోజులో అరవీర భయంకరంగా రెచ్చిపోయి రికార్డులు తిరగరాసే రైజర్స్... టాపార్డర్ విఫలమైతే మాత్రం తేలిపోతోందని గత సీజన్‌తోనే అర్థమైంది. దీంతో ఈసారి ఎలాంటి ప్రణాళికతో ముందడుగు వేస్తుందో చూడాలి.


క్లాసెన్


ఇషాన్ కిషన్


షమీ

### షమీ రాకతో రాత మారేనా!

సుదీర్ఘ కాలంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ తురుపుముక్కగా ఉన్న భువనేశ్వర్ కుమార్‌తో పాటు యార్కర్ కింగ్ నటరాజన్‌ను వదిలేసుకున్న జట్టు... గతేడాది వేలంలో టీమిండియా సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ, హర్షల్ పటేల్‌లను ఎంపిక చేసుకుంది. కమిన్స్, జైదేవ్ ఉనాద్కట్‌లకు ఈ ఇద్దరూ తోడవడంతో మన బౌలింగ్ మరింత రాటుదేలనుంది. అవకాశం వస్తే పేస్ బౌలింగ్ బాధ్యతలు నిర్వర్తించేందుకు ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఉండనే ఉన్నాడు. ఆడమ్ జాంపా, రాహుల్ చహర్ స్పిన్ బాధ్యతలు మోయనున్నారు. అయితే తుది 11 మందితో కూడిన జట్టులో అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, సచిన్ బేబీలలో ఇద్దరికి అవకాశం దక్కొచ్చు. రైజర్స్ తరఫున తొలిసారి ప్రాతినిధ్యం వహిస్తున్న వీరు కూడా మేనేజ్‌మెంట్ అంచనాలను అందుకుంటే జట్టుకు తిరుగుండదు. పవర్‌ప్లేలో జట్టుకు వికెట్లు అందించాల్సిన బాధ్యత మాత్రం షమీపైనే ఉంది. 2022, 2023 సీజన్‌లలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన షమీ... గాయం నుంచి తిరిగి వచ్చిన అనంతరం అదే తీవ్రత కొనసాగిస్తే జట్టుకు అదనపు బలం చేకూరినట్లే. గాయం కారణంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సుదీర్ఘ విరామం తర్వాత టి20 ఫార్మాట్‌లో బరిలోకి దిగనున్నాడు. అతడు జట్టును ఎలా నడిపిస్తాడనేది కీలకం. గాయంతో జట్టుకు దూరమైన కార్స్ స్థానంలో దక్షిణాఫ్రికా ప్లేయర్ ముల్డర్‌ను రైజర్స్ ఎంపిక చేసుకుంది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు:** కమిన్స్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, అథర్వ తైడె, అభినవ్ మనోహర్, అనికేత్ వర్మ, సచిన్ బేబీ, హర్షల్ పటేల్, కమిందు మెండిస్, ముల్డర్, షమీ, రాహుల్ చాహర్, ఆడమ్ జాంపా, సిమర్‌జీత్ సింగ్, జీషాన్ అన్సారీ, జైదేవ్ ఉనాద్కట్, ఇషాన్ మలింగ.

**అంచనా:** గతేడాది కళ్లుచెదిరే ఆటతీరుతో రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్... ఈసారి కూడా హిట్టర్లు దంచికొడితే ప్లే ఆఫ్స్ చేరడం దాదాపు ఖాయమే!

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



## అందరికీ ఎందుకు కనపడవు?


● 'అల్లరి' నరేశ్

'అల్లరి' నరేశ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకి '12ఏ రైల్వే కాలనీ' అనే టైటిల్ ఖరారైంది. 'పొలిమేర, పొలిమేర 2' చిత్రాల ఫేమ్ అనిల్ విశ్వనాథ్ ఈ సినిమాకు కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించడంతో పాటు, షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. నాని కాసరగడ్డ దర్శకత్వంలో పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్‌స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమా టైటిల్ టీజర్‌ను విడుదల చేసి, వేసవిలో మూవీని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. 'ఈ స్పిరిట్‌లు, ఆత్మలు కొందరికే ఎందుకు కనిపిస్తాయి? అందరికీ ఎందుకు కనపడవు?', 'ప్రాణాలతో బయటకు పోవుడు అవసరం లేదన్నా...!' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. కామాక్షీ భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో 'వైవా' హర్ష, 'గెటప్' శ్రీను, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

## పుట్టినరోజు కానుకగా...

**విష్ణు** మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రూపొందిన చిత్రం 'కన్నప్ప'. ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, ప్రభాస్, బ్రహ్మానందం, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ముకేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై డా. మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న రిలీజ్ కానుంది. కాగా ఈ మూవీలో మహదేవ శాస్త్రి పాత్రలో మోహన్ బాబు నటించారు. ఈ నెల 19న ఆయన పుట్టినరోజు సందర్భంగా 'కన్నప్ప'లోని మహదేవ శాస్త్రి పరిచయ గీతాన్ని రిలీజ్ చేయనున్నారు మేకర్స్.


● మోహన్ బాబు

## అదే పౌరుషం.. అదే రోషం

**- విజయశాంతి**

''సరిలేరు నీకెవ్వరు' సినిమా తర్వాత ఒక యాక్షన్ సినిమా చేయమని చాలామంది నన్ను కోరారు. 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' చిత్రంలో అలాంటి యాక్షన్ కుదిరింది. నా అభిమానులకి ఈ సినిమాతో ఫుల్ మీల్స్ దొరుకుతుంది. చాలా రోజుల తర్వాత యాక్షన్ చేశాను.. నేను చేస్తానని యూనిట్ వాళ్లు ఊహించలేదు. అయితే అదే పౌరుషం.. అదే రోషం. తగ్గేదేలే. ఎంత వయసు అయినా ఇలానే స్ట్రాంగ్‌గా ఉంటాను. క్రమశిక్షణగా ఉండటం వల్లే ఇది సాధ్యమైంది'' అని నటి విజయశాంతి చెప్పారు. కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా, విజయశాంతి కీలక పాత్రలో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ టీజర్ లాంచ్‌లో విజయశాంతి మాట్లాడుతూ– ''కల్యాణ్‌రామ్‌కి సినిమా అంటే చాలా ప్యాషన్. రామారావు గారు నేర్పించిన అంకితభావం అది. ఈ సినిమాని పెద్ద బ్లాక్ బస్టర్ చేయాలి''అన్నారు. **కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ–**'' అమ్మ (విజయశాంతి) చేసిన 'కర్తవ్యం' సినిమాని ఎవరూ మర్చిపోలేం. ఆ మూవీలోని వైజయంతి పాత్రకి కొడుకు పుడితే ఎలాంటి ఘటనలు జరుగుతాయి? అనేది ఈ చిత్ర కథ. నేను నటించిన 'అతనొక్కడే' సినిమా ఎప్పటికీ గుర్తుంటుంది. అలాగే 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' కూడా మరో 20 ఏళ్ల పాటు గుర్తుండిపోతుంది'' అని తెలిపారు. **ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ–**''కల్యాణ్ రామ్‌గారు ఈ కథ విని.. విజయశాంతిగారు ఒప్పుకుంటేనే చేద్దామన్నారు. మేడంగారు ఒప్పుకోవడంతో ఈ ప్రాజెక్టు ముందుకెళ్లింది'' అని పేర్కొన్నారు. ''ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది'' అన్నారు నిర్మాత **సునీల్ బలుసు**. ఈ కార్యక్రమంలో నటుడు పృథ్వీరాజ్, రచయిత శ్రీకాంత్ విస్సా మాట్లాడారు.


● సునీల్ బలుసు, అశోక్ వర్ధన్, కల్యాణ్‌రామ్, విజయశాంతి, ప్రదీప్ చిలుకూరి

## క్రేజీ కాంబినేషన్?


● విజయ్ సేతుపతి

**హీరో** విజయ్ సేతుపతి, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో ఓ మూవీ తెరకెక్కనుందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్ నగర్ వర్గాలు. విజయ్ సేతుపతికి ఇటీవల ఓ కథ వినిపించారట పూరి జగన్నాథ్. కథ నచ్చడంతో వెంటనే ఈ సినిమాని అంగీకరించారట విజయ్. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుందని టాక్. ఈ ఏడాదే చిత్రీకరణను ప్రారంభించి, వచ్చే ఏడాది సినిమాని విడుదల చేయాలని పూరి భావిస్తున్నారట. త్వరలోనే ఈ క్రేజీ కాంబినేషన్‌లో రానున్న సినిమాపై ప్రకటన రానుందని తెలిసింది. కాగా ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


● పూరి జగన్నాథ్

## షణ్ముఖ ఓ మంచి ప్రయత్నం

**- ఆది సాయికుమార్**

''గొప్ప నటుడైన సాయికుమార్ వారసుడిగా ఆదికి మంచి పేరు ఉంది. 'షణ్ముఖ' టైటిల్‌లోనే ప్రత్యేకత ఉంది. ఆది కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రంగా 'షణ్ముఖ' ఉండాలని కోరుకుంటున్నాను. అలాగే ఈ చిత్రం అందరికీ మంచి విజయాన్ని అందిస్తుందని నమ్ముతున్నాను'' అని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటించిన డివోషనల్ థ్రిల్లర్ మూవీ 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వంలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఎంపీ రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. **ఆది సాయికుమార్ మాట్లాడుతూ–** ''మేం అందరం కష్టపడి చేసిన ఓ మంచి ప్రయత్నం ఈ సినిమా. ఆడియన్స్ మాకు మంచి విజయాన్ని అందిస్తారని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. ఈ సినిమాకు మరో నిర్మాత అయిన మా అన్నయ్య తులసీరామ్ బర్త్ డే సందర్భంగా ఈ నెల 21న రిలీజ్ చేస్తున్నాం'' అని తెలిపారు **షణ్ముగం సాప్పని**. తులసీ రామ్ సాప్పని, రమేష్ యాదవ్, అవికా గోర్, సంగీత దర్శకుడు రవి బస్రూర్, లైన్ ప్రొడ్యూసర్ దుర్గా ప్రసాద్ శెట్టి, నటులు కృష్ణుడు, మనోజ్ నందం తదితరులు మాట్లాడారు.


● తులసీరామ్, రవి బస్రూర్, ఆది సాయికుమార్, అవికా గోర్, షణ్ముగం


## ప్రేమ కథ పూర్తి

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రీకరణ పూర్తి అయింది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నారు. యువీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు తెలిపారు మేకర్స్. ''మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా రూపొందిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ. మా మూవీ తెలుగు, తమిళ ఆడియో రైట్స్‌ను ఆదిత్య మ్యూజిక్ సొంతం చేసుకుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● సంతోష్ శోభన్, మానస

## ఆ యాడ్‌తో టుక్ టుక్ ఆలోచన వచ్చింది

**- సి.సుప్రీత్ కృష్ణ**



''ఓ వాహనానికి జీవితం ఉంటే ఎలా ఉంటుంది? అనే పాయింట్‌తో 'టుక్ టుక్' సినిమా చేశాను. మ్యాజికల్ పవర్స్ ఉన్న 'టుక్ టుక్' అనే వెహికల్ హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధుల దగ్గరకు ఎలా వచ్చింది?. ఆ వాహనం వారి జీవితాల్లోకి వచ్చిన తర్వాత ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి? అనేది ఈ చిత్ర కథ'' అని డైరెక్టర్ సి.సుప్రీత్ కృష్ణ చెప్పారు. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య పాత్రల్లో సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. ఆర్‌వైజీ సినిమాస్ పతాకంపై రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీ రాములరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ–''మా స్వస్థలం చిత్తూరు. పూరి జగన్నాథ్‌గారి దగ్గర రచయితగా చేశాను. ఆ తర్వాత 'అలనాటి సిత్రాలు' అనే ఓటీటీ ప్రాజెక్ట్ చేశాను. 'టుక్ టుక్' నా తొలి ఫీచర్ ఫిల్మ్. క్రికెట్ యాడ్‌లో ఓ వాహనాన్ని చూసినప్పుడు ఈ సినిమా ఆలోచన వచ్చింది. 'టుక్ టుక్' వెనకాల ఉన్నది దెయ్యమా? దేవుడా? అనే పాయింట్ సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది. వెహికల్ కాకుండా ఈ చిత్రంలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఈ సినిమా సక్సెస్ అయితే 'టుక్ టుక్' ఫ్రాంచైజీ ప్లాన్ ఉంది'' అన్నారు.

## ఏప్రిల్‌లో జాతకం


● ప్రియదర్శి, రూప

**'జెంటిల్‌మన్'**, 'సమ్మోహనం' వంటి హిట్ చిత్రాల తర్వాత డైరెక్టర్ మోహనకృష్ణ ఇంద్రగంటి, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందిన మూడో సినిమా 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించారు. శ్రీదేవి మూవీస్ పతాకంపై రూపొందిన ఈ సినిమాని ఏప్రిల్ 18న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''మోహనకృష్ణ ఇంద్రగంటి 'సారంగపాణి జాతకం'ని అద్భుతంగా తీశారు. మా సారంగపాణి ప్రపంచం ఎలా ఉంటుందో ఇటీవల విడుదలైన టీజర్ ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేశాం. వేసవిలో హాయిగా కుటుంబ సమేతంగా నవ్వించే వినోదాత్మక చిత్రమిది. మా మూవీ ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది'' అన్నారు.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|---|
| | 341 | 112 |
| | 74,170 | 22,509 |

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 17,750 | ▲ | 5 |
| డోజోన్స్ | 41,784 | ▲ | 296 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 8,680 | ▲ | 48 |
| డాక్స్ | 23,155 | ▲ | 168 |
| షాంఘై | 3,426 | ▲ | 7 |
| నికాయ్ | 36,397 | ▲ | 343 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 88,101 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 87,748 |
| వెండి (కిలో) | 99,767 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | | 86.50 | 87.52 |
| £ | బ్రిటన్ పౌండ్ | | 111.10 | 113.98 |
| € | యూరో | | 93.33 | 96.00 |
| ¥ | జపాన్ ఎన్ (100) | | 57.79 | 59.27 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | | 53.92 | 56.17 |
| S$ | సింగపూర్ డాలర్ | | 62.84 | 67.52 |
| SAR | సౌదీ రియాల్ | | 22.25 | 23.80 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | | 22.74 | 24.52 |
| ¥ | చైనా యువాన్ | | 11.12 | 12.95 |

# బంగారం కొత్త రికార్డ్..

**ఒకే రోజు రూ.1,300 పెరుగుదల ● 10 గ్రాములకు రూ.90,750 ● ఈ ఏడాది 14 శాతం ర్యాలీ**



**న్యూఢిల్లీ:** పసిడి ధరలు కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. ఢిల్లీ మార్కెట్లో వరుసగా నాలుగో రోజు పసిడి పరుగు కొనసాగింది. సోమవారం ఒక్క రోజే 10 గ్రాములకు రూ.1,300 పెరిగి నూతన గరిష్టాలకు చేరింది. 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.90,750కు, 99.5 శాతం స్వచ్ఛత బంగారం రూ.89,450 స్థాయిని చేరుకుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు పసిడి 10 గ్రాములకు రూ.11,360 లాభపడడం గమనార్హం. అంటే నికరంగా 14 శాతం ర్యాలీ చేసింది. జనవరి 1న రూ.79,390 వద్ద ఉంది. ఢిల్లీ మార్కెట్లో వెండి ధర సైతం కిలోకి రూ.1,300 పెరిగి రూ.1,02,500కు చేరుకుంది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఏప్రిల్ డెలివరీ గోల్డ్ కాంట్రాక్టు ధర రూ.13 పెరిగి రూ.88,004 స్థాయిలకు తాకింది. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ మార్కెట్లో బంగారం ధర పెద్దగా మార్పు లేకుండా 3,000 డాలర్ల స్థాయిల వద్ద కొనసాగింది. ''ద్రవ్యోల్బణం శాంతించడంతో యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై అంచనాలు బలపడ్డాయి. దీంతో బంగారం ధరలు రికార్డు గరిష్టాలకు చేరాయి''అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. రెడ్‌సీ మార్గంలో దాడులను నిలిపివేసే వరకు హౌతీలపై తమ చర్యలు కొనసాగుతాయని అమెరికా ప్రకటించడం కూడా బంగారం ధరల ర్యాలీకి కారణమైనట్టు చెప్పారు.

# బ్యాంకింగ్ సమ్మె సైరన్

**23 అర్ధరాత్రి నుంచి రెండు రోజుల పాటు సమ్మె**

- డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఆందోళనలు
- బ్యాంకు సంఘాల ఐక్య సమాఖ్య పిలుపు

**న్యూఢిల్లీ:** బ్యాంకింగ్ రంగంలో సమ్మె సైరన్ మోగింది. తమ డిమాండ్ల సాధనే లక్ష్యంగా బ్యాంక్ సంఘాల ఐక్య సమాఖ్య (యూఎఫ్‌బీయూ) సారథ్యంలో ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి 25 అర్ధరాత్రి వరకు రెండు రోజుల పాటు సమ్మె చేయనున్నట్లు యూనియన్లు ప్రకటించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రైవేటు బ్యాంకులు, విదేశీ బ్యాంకులు, కో–ఆపరేటివ్ బ్యాంకులు, రీజినల్ రూరల్ బ్యాంకులకు సంబంధించిన 9 బ్యాంకు యూనియన్లకు యూఎఫ్‌బీయూ ప్రాతినిధ్యం వహిస్తోంది. మొత్తం 8 లక్షల మందికి పైగా ఉద్యోగులు, అధికారులు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. కాగా, సమ్మె సందర్భంగా రెండు రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయని యూనియన్ వర్గాలు పేర్కొన్నాయి. దీనివల్ల బ్యాంకు సేవలకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉంది.

**నియామకాలు పెంచాలి...**

పెరుగుతున్న ఖాతాదారులకు అనుగుణంగా బ్యాంకుల్లో తగినంత మంది సిబ్బందిని నియమించాలని యూనియన్లు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నాయి.




గడిచిన దశాబ్దకాలానికి పైగా నియామకాలు సరిగ్గా జరగకపోవడంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని అంటున్నాయి. దీంతో ప్రస్తుత ఉద్యోగులపై తీవ్ర పనిభారం పడుతోందని, కస్టమర్లకు సరిగ్గా సేవలు అందించలేకపోతున్నామనేది యూనియన్ల వాదన. అనేక సర్కారీ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)లకు ఇప్పుడున్న అరకొర సిబ్బంది ఏమాత్రం సరిపోరని, అన్ని క్యాడర్లలో నియామకాలు చేపట్టాలని బ్యాంకు సంఘాలు స్పష్టం చేశాయి. 2013లో 3,98,801 మంది క్లర్కులు ఉండగా.. 2024 నాటికి వారి సంఖ్య 2,46,965 మందికి పడిపోయిందని, అంటే ఏకంగా 1,51,836 మంది తగ్గిపోయారని వారు లెక్కలతో సహా చెబుతున్నారు. ఇక మొత్తం సిబ్బంది సంఖ్య 2013లో 8,86,490 మంది ఉంటే, 2024 నాటికి 7,46,679 మందికి (1,39,811 తగ్గుదల) చేరిందని యూఎఫ్‌బీయూ పేర్కొంది.

**ఇతర ప్రధాన డిమాండ్లు ఇవీ...**

- → బ్యాంకింగ్ పరిశ్రమ అంతటికీ వారానికి 5 రోజుల పని దినాల డిమాండ్‌కు ఏడాది క్రితం బ్యాంకు యాజమాన్యాలు అంగీకరించి, ప్రభుత్వానికి సిఫార్సు చేసినప్పటికీ అమలుకు మాత్రం నోచుకోలేదు, ఇక ఏమాత్రం జాప్యం లేకుండా దీన్ని అమలు చేయాలి.
- → సిబ్బంది పనితీరుకు సంబంధించి నెలవారీ సమీక్ష విషయంలో ప్రభుత్వ ఆదేశాలను, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల్లో మార్పులను తక్షణం ఉపసంహరించుకోవాలి.
- → బ్యాంకు అధికారులు/సిబ్బందిపై దాడులను అరికట్టేలా తగిన రక్షణ కల్పించాలి.
- → గ్రాట్యుటీ పరిమితిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అనుగుణంగా రూ.25 లక్షలకు పెంచడంతో పాటు ఆదాయ పన్ను మినహాయింపు ఇచ్చేలా గ్రాట్యుటీ చట్టాన్ని సవరించాలి.
- → తాత్కాలిక సిబ్బందిని పర్మనెంట్ చేయడంతో పాటు పర్మనెంట్ ఉద్యోగాలకు అవుట్‌సోర్సింగ్‌ను నిలిపివేయాలి.
- → ఐడీబీఐ బ్యాంకులో ప్రభుత్వం కనీసం 51% వాటాను కొనసాగించాలి.

## అలయెంజ్ వాటా బజాజ్ చేతికి

**బీమా సంస్థలలో 26% వాటా కొనుగోలుకి సై**

**న్యూఢిల్లీ:** బీమా రంగ భాగస్వామ్య కంపెనీ(జేవీ)లలో బజాజ్ అలయెంజ్‌కుగల 26% వాటాలను బజాజ్ ఫిన్‌సర్వ్ కొనుగోలు చేయనుంది. జర్మన్ కంపెనీ అలయెంజ్ ఎస్ఈతో ఇందుకు వాటా కొనుగోలు ఒప్పందాలు(ఎస్‌పీఏ) కుదుర్చుకుంది. దీంతో బజాజ్ అలయెంజ్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ అలయెంజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో అలయెంజ్‌కు గల 26% వాటాలను బజాజ్ ఫిన్‌సర్వ్ సొంతం చేసుకోనుంది. వెరసి 24 ఏళ్ల భాగస్వామ్యానికి తెర పడనుంది. కాగా.. ఈ లావాదేవీల తదుపరి రెండు బీమా సంస్థలలోనూ బజాజ్ గ్రూప్ వాటా 100%కి పెరగనున్నట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ పేర్కొంది. అయితే ఇందుకు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ), బీమా నియంత్రణ సంస్థ (ఇరెడా) తదితరాల నుంచి అనుమతి పొందవలసి ఉంటుంది. సాధారణ బీమా సంస్థలో వాటాకు రూ. 13,780 కోట్లు, జీవిత బీమా కంపెనీలో వాటాకు రూ. 10,400 కోట్లు చొప్పున బజాజ్ గ్రూప్ వెచ్చించనుంది.

**'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..**

| | |
|---|---|
| ఏప్రిల్ నుంచి కార్ల ధరలు అప్ | స్వల్పంగా పెరిగిన టోకు ద్రవ్యోల్బణం |

# ఫిబ్రవరిలో ఎగుమతులు డౌన్

- 11 శాతం తగ్గి 37 బిలియన్ డాలర్లు
- 51 బిలియన్ డాలర్లకు తగ్గిన దిగుమతులు
- మూడేళ్ల కనిష్టానికి వాణిజ్య లోటు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో దేశ ఎగుమతులు వరుసగా నాలుగో నెలలోనూ క్షీణతను చవిచూశాయి. ఫిబ్రవరిలో 36.91 బిలియన్ డాలర్ల ఎగుమతులు (రూ.3.21 లక్షల కోట్లు) నమోదయ్యాయి. క్రితం ఏడాది ఫిబ్రవరిలో ఎగుమతులు 41.41 బిలియన్ డాలర్లతో (రూ.3.60 లక్షల కోట్లు) పోల్చి చూస్తే 11 శాతం తగ్గిపోయినట్టు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో ఎగుమతులు 36.43 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఫిబ్రవరి నెలలో దిగుమతులు సైతం 50.96 బిలియన్ డాలర్లకు (రూ.4.43 లక్షల కోట్లు) తగ్గుముఖం పట్టాయి. 2024 ఫిబ్రవరిలో దిగుమతులు 60.92 బిలియన్ డాలర్లుగా (రూ.5.30 లక్షల కోట్లు) ఉంటే, ఈ ఏడాది జనవరి నెలలో 59.42 బిలియన్ డాలర్ల మేర ఉండడం గమనార్హం. దీంతో వాణిజ్య లోటు (ఎగుమతులు–దిగుమతుల మధ్య వ్యత్యాసం) 14.05 బిలియన్ డాలర్లకు తగ్గుముఖం పట్టింది. 2021 ఆగస్ట్ తర్వాత అత్యంత కనిష్ట వాణిజ్య లోటు ఇదేనని వాణిజ్య శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఒక నెలలో కనిష్ట దిగుమతులు 2023 ఏప్రిల్ తర్వాత మళ్లీ 2025 ఫిబ్రవరిలోనే నమోదు కావడం గమనించొచ్చు.



**స్వల్పంగా తగ్గిన పసిడి దిగుమతులు**

- ఫిబ్రవరి నెలలో బంగారం దిగుమతుల విలువ 2.3 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఏడాది జనవరిలో 2.68 బిలియన్ డాలర్ల విలువైన పసిడి దిగుమతి అయింది.
- జెమ్స్ అండ్ జ్యుయలరీ ఎగుమతులు 21 శాతం తగ్గి 2.53 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.
- జనవరితో పోల్చి చూస్తే చమురు దిగుమతులు 13.4 బిలియన్ డాలర్ల నుంచి 11.8 బిలియన్ డాలర్లకు తగ్గాయి.
- ఫిబ్రవరి నెలకు సేవల ఎగుమతులు 35 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. జనవరిలో ఈ మొత్తం 38.55 బిలియన్ డాలర్లుగా ఉంది.
- ఫిబ్రవరిలో సేవల దిగుమతుల విలువ 16.55 బిలియన్ డాలర్లుగా ఉంది. జనవరిలో ఈ మొత్తం 18.22 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

**800 బిలియన్ డాలర్ల ఎగుమతులు..**

2024–25లో సవాళ్లు నెలకొన్నప్పటికీ 800 బిలియన్ డాలర్ల విలువైన వస్తు, సేవల ఎగుమతులు సాధిస్తామన్న విశ్వాసాన్ని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భర్త్వాల్ వ్యక్తం చేశారు. వాణిజ్య లోటు తగ్గుముఖం పట్టడం అన్నది ప్రధానంగా చమురు, బంగారం, వెండి దిగుమతుల క్షీణతవల్లేనని ఇక్రా చీఫ్ ఎకనమిస్ట్ అదితి నాయర్ తెలిపారు.

## బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్

- అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల దన్ను
- సెన్సెక్స్ అయిదురోజుల నష్టాలకు చెక్
- 22,500 స్థాయిపైకి నిఫ్టీ



**ముంబై:** బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ అయిదు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కింది. సోమవారం 341 పాయింట్లు పెరిగి 74,170 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 112 పాయింట్లు బలపడి 22,509 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల అనూహ్య ర్యాలీతో లాభాలు గడించాయి. ఒక దశలో సెన్సెక్స్ 547 పాయింట్లు పెరిగి 74,376 వద్ద, నిఫ్టీ 180 పాయింట్లు ఎగసి 22,577 వద్ద గరిష్టాలను తాకాయి. స్టాక్ మార్కెట్ స్థిరీకరణలో భాగంగా మిడ్ క్యాప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా, చిన్న షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.77%, స్మాల్ క్యాప్ సూచీ 0.10% నష్టపోయింది. డాలర్ ఇండెక్స్ బలహీనత, దేశీయ ఈక్విటీ మార్కెట్లో కొనుగోళ్ల దన్నుతో డాలర్ మారకంలో రూపాయి విలువ 24 పైసలు పెరిగి 86.81 వద్ద స్థిరపడింది.

- డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకల నేపథ్యంలో 'బ్యాంకు ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది' అంటూ ఆర్‌బీఐ భరోసాతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు కోలుకుంది. బీఎస్ఈలో ఈ షేరు 1% పెరిగి రూ.677 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభంలో 5 శాతానికి పైగా ఎగసి రూ.708 వద్ద గరిష్టాన్ని అందుకుంది.
- ఓలా ఎలక్ట్రిక్ షేరు 7% నష్టపోయి రూ.47 వద్ద స్థిరపడింది. అనుబంధ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీస్‌పై రోస్‌మెర్టా డిజిటల్ సర్వీసెస్ దివాలా పరిష్కార ప్రక్రియను కోరుతూ ఎన్‌సీఎల్‌టీకి దరఖాస్తు సమర్పించడంతో ఈ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఇంట్రాడేలో 8%కి పైగా క్షీణించి రూ.46.4కు జారింది.

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

## విద్య, ఉద్యోగ సమాచారం

### జేఎన్‌సీఏఎస్ఆర్, బెంగళూరులో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ (జేఎన్‌సీఏఎస్ ఆర్) 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ, రీసెర్చ్ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సుల వివరాలు:** రీసెర్చ్ ప్రోగ్రామ్స్ (పీహెచ్‌డీ/ఎంఎస్(ఇంజనీరింగ్)/ఎంఎస్ (రీసెర్చ్), మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎమ్మె స్సీ) ఇన్‌కెమిస్ట్రీ, మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎమ్మె స్సీ) ఇన్ ఇంటర్–డిసిప్లినరీ బయోసైన్స్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మెటీరియల్ సైన్స్ (పీజీడీఎంఎస్).
- » **అర్హత:** కోర్సును అనుసరించి 55 శాతం మార్కులతో సైన్స్ విభాగంలో డిగ్రీ, కెమిస్ట్రీ తప్పనిసరిగా ఒక సబ్జెక్టు ఉండాలి. బీఎస్సీ/ఎమ్మెస్సీ, బీఈ/బీటెక్/బీఎస్ లేదా ఎంఈ/ఎంటెక్ లేదా బీవీఎస్సీ/ఎంవీఎస్సీ/ఎంబీబీఎస్, ఎండీ ఉత్తీర్ణతతో పాటు గేట్/జేఈఎస్‌టీ/జీపీఏటీ/ యూజీసీ/జేఆర్‌ఎఫ్/సీఎస్ఐఆర్–జేఆర్ఎఫ్/నెట్–జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్–జేఆర్ఎఫ్/ ఇన్‌స్పైర్ స్కోర్–జేఆర్ఎఫ్, జేఏఎం ఏదైనా ఒక ప్రవేశ పరీక్షలో స్కోర్ సాధించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 10.04.2025.
- » **వెబ్‌సైట్:** https://www.jncasr.ac.in/

### కేంద్రీయ విద్యాలయాల్లో బాలవాటిక ప్రవేశాలు

కేంద్రీయ విద్యాలయ సంఘటన(కేవీఎస్).. కేంద్రీయ విద్యాలయాల్లో బాల్‌వాటిక 1, 2, 3ల్లో ప్రీ ప్రైమరీ, ఒకటి, రెండో తరగతుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- » **అర్హత:** మూడేళ్లకు పైబడి ఆరేళ్లలోపు వయసు కలిగిన బాలబాలికలు ప్రవేశాలు పొందవచ్చు.
- » **వయసు:** బాల్‌వాటిక–1కు బాలబాలికల వయసు 13.03.2025 నాటికి మూడేళ్లు పూర్తయి నాలుగేళ్లు మించకుండా ఉండాలి. బాల్‌వాటిక–2కు నాలుగేళ్లు పూర్తయి, ఐదేళ్లు మించకూడదు. బాల్‌వాటిక–3లో ప్రవేశాలకు ఐదేళ్లు నిండి ఆరేళ్లు మించకూడదు. ప్రత్యేకావసరాలు కలిగిన వారికి రెండేళ్ల వయో సడలింపు ఉంటుంది.
- » **ఆన్‌లైన్‌లో బాల్‌వాటిక 1, 3, తరగతి ఒకటి–రిజిస్ట్రేషన్ తేదీలు:** 07.03.2025 నుంచి 21.03.2025 వరకు
- » **బాల్‌వాటిక 1, 3 తొలి ప్రొవిజనల్ జాబితా వెల్లడితేది:** 26.03.2025.
- » **బాల్‌వాటిక 1, 3 రెండో ప్రొవిజనల్ జాబితా వెల్లడి తేది:** 02.04.2025.
- » **బాల్‌వాటిక 1, 3 మూడో ప్రొవిజనల్ జాబితా వెల్లడితేది:** 07.04.2025.
- » **ఆఫ్‌లైన్ విధానంలో బాల్‌వాటిక 2, తరగతి 2 రిజిస్ట్రేషన్ తేదీలు:** 18.04.2025 నుంచి 21.04.2025.
- » **వెబ్‌సైట్:** https://kvsangathan.nic.in/en/admission/

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్ట్స్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

# విద్య, వికాసానికి కేరాఫ్.. కేవీలు!

**యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులకు విద్య, విజ్ఞానం అందించడంతోపాటు మానసిక వికాసానికి దోహదం చేస్తున్న విద్యా సంస్థలు.. కేంద్రీయ విద్యాలయాలు! ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ స్థాయి వరకూ.. వినూత్న బోధన పద్ధతుల ద్వారా విద్యార్థులకు బహుముఖ నైపుణ్యాలు అందిస్తున్నాయి!! తాజాగా.. కేంద్రీయ విద్యాలయాల్లో 2025-26 సంవత్సరానికి ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. కేవీల్లో ప్రవేశ విధానాలు, వినూత్న విద్యా బోధన, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, దరఖాస్తు విధానం తదితర వివరాలు..**

- » కేవీల్లో 2025-26 ప్రవేశ ప్రక్రియ ప్రారంభం
- » ఒకటి నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్స్
- » క్రియేటివ్ లెర్నింగ్, యాక్టివిటీలకు ప్రాధాన్యం



కేంద్రీయ విద్యాలయాలు

కేంద్రీయ విద్యాలయాలను తొలుత దేశంలోని వివిధ ప్రాంతాల్లో దేశ భద్రత (రక్షణ శాఖ) విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పిల్లల చదువుల కోసం ఏర్పాటు చేశారు. మొదట వీటిని సెంట్రల్ స్కూల్స్‌గా పిలిచేవారు. ఆ తర్వాత కేంద్రీయ విద్యాలయాలు(కేవీ)గా పేరు మార్చారు. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటైన కేవీలను పర్యవేక్షించేందుకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అనే పేరుతో ప్రత్యేక పర్యవేక్షణ సంస్థను సైతం నెలకొల్పారు.

**ఒకటి నుంచి పదో తరగతి వరకు..**

ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ప్రకటన విడుదల చేశారు. ఒకటో తరగతిలో ప్రవేశించాలంటే.. మార్చి 31, 2025 నాటికి కనిష్ఠంగా ఆరేళ్లు, గరిష్ఠంగా ఎనిమిదేళ్ల మధ్యలో వయసు ఉండాలి. తొలుత దేశ రక్షణ, భద్రత దళాల ఉద్యోగుల పిల్లల చదువుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయాల్లో.. ఇప్పుడు అన్ని వర్గాల వారు ప్రవేశం పొందే అవకాశం ఉంది. దీనికి సంబంధించి పలు ప్రాథమ్యతల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు.

**అయిదు కేటగిరీలుగా..**

కేంద్రీయ విద్యాలయాల్లోకి విద్యార్థులను ఎంపిక చేసే క్రమంలో అయిదు కేటగిరీలుగా ప్రాధాన్యతలను పేర్కొని ప్రవేశాలు కల్పిస్తున్నారు. బదిలీయైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఆఫ్ ది ఇండియన్ గవర్నమెంట్‌కు సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు. అదేవిధంగా బదిలీయైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ ఉద్యోగుల పిల్లలు, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌కు సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు, పై కేటగిరీలకు చెందని ఇతర వర్గాల పిల్లలు. ఇలా వివిధ కేటగిరీలుగా పేర్కొని అడ్మిషన్స్ కల్పిస్తున్నారు.

**ఎంపికలోనూ ప్రాధాన్యత**

ప్రవేశాల ఖరారు, ఎంపిక విషయంలోనూ ప్రాధాన్యత విధానాన్ని అమలు చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఒకే ఆడపిల్లగా ఉన్న విద్యార్థినికి, రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లు/సీబీఎస్ఈతోపాటు జాతీయ/రాష్ట్ర స్థాయి క్రీడల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. స్పెషల్ ఆర్ట్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందిన విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రాధాన్యం ఉంటుంది.

**ఒకటో తరగతికి ఆన్‌లైన్ దరఖాస్తు**

ఒకటో తరగతిలో ప్రవేశాలకు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా గరిష్ఠంగా మూడు కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పూర్తిగా లాటరీ విధానంలో సంబంధిత కేంద్రీయ విద్యాలయ అధికారులు విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ లాటరీ విధానంలో సైతం ప్రాధాన్యతల వారీ విధానాలను అనుసరిస్తున్నారు. ఇది కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది.

**వయో పరిమితి నిబంధనలు**

- ఒకటో తరగతి: 6–8 ఏళ్లు, రెండో తరగతి: 7–9 ఏళ్లు, మూడో తరగతి: 8–10 ఏళ్లు, నాలుగో తరగతి: 9–11 ఏళ్లు, ఐదో తరగతి: 9–11 ఏళ్లు, ఆరో తరగతి: 10–12 ఏళ్లు, ఏడో తరగతి: 11–13 ఏళ్లు, ఎనిమిదో తరగతి: 12–14 ఏళ్లు, తొమ్మిదో తరగతి: 13–15 ఏళ్లు, పదో తరగతి: 14–16 ఏళ్లు. –పీడబ్ల్యూడీ విద్యార్థులకు రెండేళ్ల వయో సడలింపు ఉంటుంది.
- **రిజర్వేషన్:** తాజా ప్రవేశాలకు సంబంధించి ఎస్సీలకు 15 శాతం సీట్లు, ఎస్టీలకు 7.5 శాతం సీట్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 3 శాతం సీట్లు కేటాయిస్తారు.

**ఇంటర్ వయోపరిమితి లేకుండానే**

ఇంటర్మీడియెట్‌లో మాత్రం ఎలాంటి వయో పరిమితి నిబంధనలు లేకుండానే ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి ఎలాంటి వయో పరిమితి లేదు. అయితే ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన సంవత్సరంలోనే ఇంటర్ ప్రథమ సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్ ప్రథమ సంవత్సరం తర్వాత బ్రేక్ లేని వారికే ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. అందుబాటులో ఉన్న సీట్లు, నిబంధనల ఆధారంగా ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

**తొమ్మిదో తరగతికి.. ప్రవేశ పరీక్ష**

తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి మాత్రం అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. మూడు గంటల వ్యవధిలో వంద మార్కులకు జరిగే ఈ అడ్మిషన్ టెస్ట్‌లో హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సోషల్‌సైన్స్, సైన్స్ సబ్జెక్ట్‌లలో ఒక్కో సబ్జెక్ట్ నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 33 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఆ తర్వాత సంబంధిత కేంద్రీయ విద్యాలయ అధికారులు మెరిట్ జాబితా రూపొందించి పైన పేర్కొన్న కేటగిరీల వారీగా ప్రాధాన్యత క్రమంలో ప్రవేశాలు కల్పిస్తారు.

**స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్**

కేంద్రీయ విద్యాలయాల్లో కొత్తగా చేరే పిల్లలు స్కూల్ వాతావరణానికి అలవాటుపడేలా చేసేందుకు ఆరు వారాల వ్యవధితో 'స్కూల్ రెడీనెస్ ప్రో గ్రామ్'ను రూపొందించాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తయిన అనంతరం టీచర్లు విద్యార్థుల్లో పలు దృక్పథాల్లో ఆశించిన ఫలితాలు వచ్చాయా లేదా అనే విషయాలను పరీక్షిస్తారు. ముఖ్యంగా పరిసరాలను అర్థం చేసుకోవడం, ఆత్మవిశ్వాసం, పరిశీలన, పరస్పర సంబంధాలు, వర్గీకరణ, ప్యాట్రన్‌లను అర్థం చేసుకొని అనుకరించగలగడం, భావ వ్యక్తీకరణ, అవగాహన, క్రియేటివ్ స్కిల్స్. దీంతోపాటు ఒకటి నుంచి అయిదో తరగతి విద్యార్థులకు ఐదు పాయింట్ల సూచీని పాటిస్తున్నారు.

**నామ మాత్రపు ఫీజులు**

కేంద్రీయ విద్యాలయాలు నామ మాత్రపు ఫీజులను వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్ ఫీజు రూ.25. విద్యాలయ వికాస నిధి(రూ. 500), ట్యూషన్ ఫీజు, కంప్యూటర్ ఎడ్యుకేషన్ తదితర ఫీజులు ఉంటాయి. ఒకటి నుంచి అయిదో తరగతి విద్యా ర్థులకు అన్ని ఫీజులు కలిపి నెలకు రూ.500–600, ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1000 లోపు అవుతుంది. బాలికలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయ ఉద్యోగుల పిల్లలకు ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

**ముఖ్య సమాచారం**

- ఒకటో తరగతికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: 2025, మార్చి 21
- ఎంపికైన విద్యార్థుల మొదటి జాబితా: మార్చి 26, రెండో జాబితా: ఏప్రిల్ 2, మూడో జాబితా: ఏప్రిల్ 7.
- 2వ తరగతి నుంచి(ఇంటర్ ఫస్టియర్ మినహా) ఆఫ్‌లైన్ దరఖాస్తు తేదీలు: ఏప్రిల్ 2 –11, జాబితా వెల్లడి: ఏప్రిల్ 17.
- పదకొండో తరగతి మినహా అన్ని తరగతులకు ప్రవేశాలకు చివరి తేదీ: జూన్ 30.
- ఇంటర్ ప్రథమ సంవత్సరం రిజిస్ట్రేషన్: ఇప్పటికే కేవీల్లో చదువుతున్న విద్యార్థులు ఎస్ఎస్‌సీ ఫలితాలు వచ్చిన పది రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి. వీరికి పదో తరగతి ఫలితాలు వచ్చిన ఇరవై రోజుల్లోగా ఎంపిక జాబితా విడుదల చేస్తారు.
- కేవీ విద్యార్థులు కాని వారు సీబీఎస్ఈ ఫలితాలు వచ్చిన 30 రోజుల్లోగా ఆన్‌లైన్ అడ్మిషన్‌ను ఖరారు చేసుకోవాలి.
- వెబ్‌సైట్: https://kvsangathan.nic.in/en/ admission/.

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

**నేటి భవిత ఈ పేపర్‌లో..**

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- పాలిటీ » పోటీ పరీక్షల ప్రత్యేకం- బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-సైన్స్ అండ్ టెక్నాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

# ప్రైవేటుతో పర్యాటక శోభ..

ప్రత్యేక పర్యాటక పాలసీని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

భారీగా పెట్టుబడులు వచ్చేలా ప్రోత్సాహకాలు

**రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం.. 3 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి**

**టూరిస్టు ప్రదేశాలు భద్రమేనన్న నమ్మకం కలిగించే చర్యలు**

**అన్ని చోట్లా సీసీ కెమెరాలతో నిఘా.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం ప్రైవేటు సంస్థల పెట్టుబడులతో వర్ధిల్లుతోంది. మన దేశంలోనూ ప్రధాన పర్యాటక ప్రాజెక్టులు ప్రైవేటు సంస్థల చేయూతతోనే ముందుకు సాగుతున్నాయి. దేశ విదేశీ పర్యాటకులను ఆకట్టుకునే ప్రాంతాలు తెలంగాణలో ఎన్నో ఉన్నా.. కనీస వసతులు లేక పర్యాటకులు కన్నెత్తి చూడటం లేదు. ఈ క్రమంలో రాష్ట్రంలో పర్యాటకానికి ఊపు ఇచ్చేందుకు ప్రత్యేక టూరిస్టు పాలసీని ప్రభుత్వం రూపొందించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2030 నాటి అవసరాలకు సరిపోయేలా పాలసీని రూపొందించినట్టు పేర్కొంది. ఆధ్యాత్మిక, వారసత్వ, సాంస్కృతిక, సాహసక్రీడలు, మెడికల్, వెల్‌నెస్, ఎకో–టూరిజం.. ఇతివృత్తాలుగా ఆయా సెక్టార్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పర్యాటక ప్రాజెక్టులు చేపట్టే ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహకాలివ్వాలని నిర్ణయించింది.

**భద్రమైన గమ్యం**

పర్యాటకులు ముందుగా గమనించేది ఆ ప్రాంతం భద్రమేనా, కాదా అన్నది. దీని కి పాలసీలో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ భద్రమైన ప్రాంతమన్న భావన పర్యాటకుల్లో వచ్చేలా ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. పర్యాటకులతో స్థానికులు, గైడ్లు, దుకాణదారులు ఫ్రెండ్లీగా మెలిగేలా చర్యలు తీసుకోవటంతోపాటు ఆయా ప్రాంతాలను సీసీ కెమె రాల నిఘా పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

**ప్రోత్సాహకాలు ఇలా..:** అడ్వెంచర్ టూరిజం కేంద్రాల్లో కనీస పెట్టుబడి మొత్తం రూ.25లక్షలుగా నిర్ధారించారు. దీనికి ఈపీసీపై సబ్సిడీ మొత్తం 25శాతంగా ఖరారు చేశారు. కారవాన్ పార్క్ ప్రాజెక్టుల్లో కనీసం పెట్టుబడి రూ.25 లక్షలు, సబ్సిడీ 25 శాతం, టూర్ ఆపరేటర్ల కారవాన్‌లలో కనీస పెట్టుబడి రూ.25 లక్షలు సబ్సిడీ 25శాతం, హౌస్ బోట్ ప్రాజెక్టుల్లో కనీస పెట్టుబడి రూ.కోటి, ఈపీసీ సబ్సిడీ 25 శాతం, వే సైడ్ ఎమినిటీస్ విషయంలో కనీస పెట్టుబడి రూ.2 కోట్లు, సబ్సిడీ 10 శాతంగా ఖరారు చేశారు. వీటికితోడు నెట్ స్టేట్ జీఎస్టీని పెట్టుబడిదారులకు ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. స్పెషల్ టూరిజం ఏరియా (ఎస్‌టీఏ)ల విషయంలో ఆయా ప్రాజెక్టుల ఆధారంగా వయబిలిటీ గ్యాప్ ఫండ్ (బేసిక్ ఎమినిటీస్ కోసం), ఎస్‌జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, భూములకు తక్కువ లీజు మొత్తం వంటి రాయితీలు కల్పిస్తారు. కొన్ని రకాల ప్రాజెక్టుల్లో ఇండస్ట్రియల్ పవర్ శ్లాబ్స్, ప్రాపర్టీ ట్యాక్సుల్లో రాయితీలుంటాయి. నిర్ధారిత ప్రాజెక్టులకు ల్యాండ్ కన్వర్షన్ చార్జీలను రీయింబర్స్ చేస్తారు.

**సర్కారు పెట్టుకున్న లక్ష్యాలివీ..**

- వచ్చే ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు సాధించాలి. ఈ ఐదేళ్లలో కనీసం 3 లక్షల మందికి అదనంగా ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య ఆధారంగా తెలంగాణను దేశంలో మొదటి ఐదు రాష్ట్రాల్లో ఒకటిగా నిలపాలి.
- అంతర్జాతీయ పర్యాటక పటంలో తెలంగాణ సమున్నతంగా నిలిచేలా డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా ద్వారా ప్రభావం చూపాలి. రాష్ట్ర జీఎస్‌డీపీలో పర్యాటక రంగం వాటా 10 శాతానికి మించి ఉండాలి.

**స్పెషల్ టూరిజం ఏరియాలు.. అద్భుత వసతులు**

- సాక్షి ప్లస్(ఈ-పేపర్)లో

## ఎస్సీల వర్గీకరణపై కమిషన్ నివేదికకు ఆమోదం

వైఎస్సార్ జిల్లా.. వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్పు

ఏపీ కేబినెట్ సమావేశంలో నిర్ణయాలు..

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణపై ఏర్పాటైన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సమర్పించిన నివేదికకు మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు కమిషన్ సిఫార్సుల అమలుకు పచ్చజెండా ఊపింది. వైఎస్సార్ జిల్లాను వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వైఎస్సార్ తాడిగడప మున్సిపాల్టీ పేరులో వైఎస్సార్ పేరును తొలగించి తాడిగడప మున్సిపాల్టీగా చట్ట సవరణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.

## ఇష్టారాజ్యంగా 'డీమ్డ్' ఇవ్వడంపై స్టే ఇవ్వండి

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలకు ఇష్టారాజ్యంగా డీమ్డ్ యూనివర్సిటీ హోదా ప్రకటించడం సరికాదని, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలపై స్టే విధించాలని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఇలాంటి వర్సిటీలతో విద్యార్థుల భవిష్యత్ ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ఇరుపక్షాల వాదనలు వినకుండా స్టే ఇవ్వలేమని సీజే ధర్మాసనం తేల్చిచెప్పింది. యూజీసీ సహా రాష్ట్రంలోని ఏడు డీమ్డ్ యూనివర్సిటీలకు నోటీసులు జారీ చేసింది. అరోరా ఉన్నత విద్య– పరిశోధన అకాడమీ, చైతన్య, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్, కేఎల్ విశ్వవిద్యాలయం (అజీజ్‌నగర్, బౌరంపేట్ క్యాంపస్‌లు), సింబయాసిస్ ఇంటర్నేషనల్, విజ్ఞాన్ ఫౌండేషన్ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌లను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ 15 రోజులకు వాయిదా వేసింది. 2010, 2016, 2019లో యూజీసీ నిబంధనలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అధికార పరిధిని ఉల్లంఘించి, రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా డీమ్డ్ యూనివర్సిటీగా ప్రకటించడాన్ని తప్పుబట్టింది. అలాగే, యూజీసీ నిబంధనలపై స్టే ఇవ్వాలంటూ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. ఈ ఐఏపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

## విమానంలో అత్యవసర ద్వారం తెరిచేందుకు యత్నం

**శంషాబాద్:** విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో ఓ ప్రయాణికుడి ప్రవర్తన కారణంగా విమానాన్ని నిలిపివేశారు. ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్‌పోస్టు సీఐ జె.బాలరాజు వివరించారు. వారణాసి వెళుతున్న విమానంలో కూర్చున్న బిహార్‌కు చెందిన సౌరభ్ కుమార్ చల్లే (26) అనే ప్రయాణికుడు విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో అత్యవసర ద్వారం ప్యానెల్ ప్లేటు తీసేందుకు యత్నించాడు. గమనించిన విమాన సిబ్బంది పైలట్‌కు సమాచారం అందించడంతో టేకాఫ్‌ను నిలిపివేశారు. అనంతరం యువకుడిని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు.

# రిజిస్ట్రేషన్లకు 'ఈజీ స్లాట్ బుకింగ్'

10–15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తయ్యేలా పైలట్ ప్రాజెక్టు.. వచ్చే నెల మొదటివారంలో అమలు.. బయోమెట్రిక్ కూడా

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

**సాక్షి, హైదరాబాద్:** ప్రజలకు సులువైన, పారదర్శక, అవినీతి రహిత సేవలు అందించేందుకు వీలుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పనితీరును మార్చాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఇందుకోసం ఏప్రిల్ నెల మొదటివారంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేయాలని, వేలిముద్రలు వేసేందుకు బయో మెట్రిక్ విధానాన్ని కూడా అప్పటి నుంచే అమల్లోకి తేవాలని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో స్టాంపులు, రిజిస్ట్రే షన్ల శాఖపై ఆయన దాదాపు మూడు గంటలపాటు సమీక్షించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, సీఎంఆర్వో పీడీ మంద మకరందర్, ఐటీ శాఖ కార్యదర్శి బావేశ్‌లతో పాటు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన డీఐజీలు, ఉమ్మడి జిల్లాల రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగు లేటి మాట్లాడుతూ ప్రస్తుతం ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు కనీ సం 45 నిమిషాల నుంచి గంటకు పైగా సమయం పడుతోందని, కొత్తగా తెస్తున్న ఈజీ స్లాట్ బుకింగ్ విధానం ద్వారా 10–15 నిమి షాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయొచ్చని చెప్పారు. సామాన్యులెవరూ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కోసం నిరీక్షించే పరిస్థితి లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి తెచ్చి ఆధునీకరిస్తున్నామని చెప్పారు. నిషేధిత జాబితాల్లో ఉన్న భూములను ఎట్టి పరిస్థితుల్లో సబ్‌రిజిస్ట్రార్లు రిజి స్ట్రేషన్లు చేయొద్దని ఆదేశించిన మంత్రి పొంగులేటి, అలాంటి చర్య లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భూభారతి తరహాలో ఓ ప్రత్యేక పోర్టల్‌ను నిషేధిత భూముల జాబితా కోసం రూపొందించి రెవెన్యూ శాఖకు అనుసంధానం చేయాలని చెప్పారు. నిషేధిత జాబితా భూములు రిజిస్ట్రేషన్ చేస్తే క్షణాల్లో ప్రధాన కార్యాలయంలో డిస్‌ప్లే అయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఎల్‌ఆర్‌ఎస్ కారణంగా లక్షలాది మందికి లబ్ధి కలుగుతుందని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ దరఖాస్తులు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో పెట్టొద్దని మంత్రి పొంగులేటి ఆదేశించారు.

## గురుకుల విద్యార్థి అదృశ్యం

విచిత్రంగా వ్యవహార శైలి

పౌర్ణమి రాత్రి రెక్కలొస్తాయని వ్యాఖ్యలు



**కుల్కచర్ల:** గురుకుల విద్యార్థి అదృశ్యమయ్యాడు. వికారాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. చౌడాపూర్ మండలం పాచావ్‌కుంటతండాకు చెందిన మూడవత్ శంకర్ కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 14న రాత్రి 10.50 గంటలకు హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. సిబ్బంది మహారాష్ట్రలో ఉంటున్న అతని తల్లిదండ్రులకు తెలియజేయడంతో పాటు చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శంకర్ వ్యవహార శైలి విచిత్రంగా ఉండేదని, ఎప్పుడూ ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడేవాడని సహ విద్యార్థులు తెలిపారు. పౌర్ణమి రోజు రాత్రి వేళ తనకు రెక్కలు వస్తాయని స్నేహితులతో చెప్పేవాడని తెలుస్తోంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనేష్‌రెడ్డి తెలిపారు.



ఆదిలాబాద్ జిల్లాలో మార్చిలోనే రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులు ఇబ్బంది పడకుండా మావల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నీటిగంట మోగిస్తున్నారు. గంటకోసారి నీటి గంట కొడుతూ.. విద్యార్థులు నీళ్లు తాగేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



దక్షిణకాశీ వేములవాడ రాజన్న ఆలయంలో సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 10.50 గంటలకు మంత్రోచ్చారణల మధ్య వివాహం జరిగింది. మున్సిపాలిటీ తరఫున కమిషనర్ అన్వేశ్, మేనేజర్ సంపత్, మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల పట్టువస్త్రాలు, ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తలంబ్రాలు సమర్పించారు. చేతిలో త్రిశూలం, బాసింగం, నెత్తిన జీలకర్రలతో రాజన్నను.. శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు పెళ్లాడారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం రథోత్సవం జరగనుంది. – వేములవాడ

## జర్మనీకి పెరుగుతున్న భారత విద్యార్థులు

పదేళ్లలో ఆరు వేల నుంచి 50 వేలకు పెరిగారు

ఇరుదేశాల మధ్య విద్య, ఆర్థిక, రాజకీయ సత్సంబంధాలే కారణం

జర్మనీ కాన్సుల్ జనరల్ కేథరీన్ మిసెరాలాంగ్ వెల్లడి



**సాక్షి, ఎడ్యుకేషన్:** జర్మనీలో అడుగుపెడుతున్న భారత విద్యార్థుల సంఖ్య విస్తృత స్థాయిలో పెరుగుతోందని భారత్‌లోని జర్మనీ కాన్సుల్ జనరల్ కేథరీన్ మిసెరాలాంగ్ చెప్పారు. ఇరుదేశాల మధ్య విద్య, ఆర్థిక, రాజకీయ అంశాల్లో సుహృద్భావ వాతావరణం కొనసాగుతుండటమే దీనికి కారణ మన్నారు. భారత్‌లో విశిష్టమైన ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయని, వీటి ద్వారా ఎందరో నిపుణులు తయారవుతున్నారని చెప్పారు. జర్మనీకి చెందిన డాడ్ (జర్మన్ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్) భారత్‌తో భాగస్వామి అయి 65 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'డాడ్' నేతృత్వంలో జర్మనీకి చెందిన 18 వర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల వైస్ చాన్స్‌లర్స్, ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లోని ఐఐటీ, ట్రిపుల్ ఐటీలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వ హించిన సమావేశంలో కేథరీన్ మాట్లాడుతూ.. 'జర్మనీలో ప్రస్తుతం 50 వేలకు పైగా భారత విద్యా ర్థులు ఉన్నారు. 2015లో ఈ సంఖ్య ఆరు వేలు మాత్రమే. భారత విద్యార్థులు స్టెమ్ కోర్సులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అదేవిధంగా ఇరు దేశాల మధ్య సైన్స్ అండ్ టెక్నాలజీ, అకడమిక్, రీసెర్చ్ భాగస్వామ్యం ఫలవంతంగా సాగుతోంది. జర్మనీకి చెందిన పలు కంపెనీలు భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తూ.. ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి' అని చెప్పారు.

**ఏటా వేల మందికి స్కాలర్‌షిప్**

డాడ్ సెక్రటరీ జనరల్ డాక్టర్ కై సిక్స్ మాట్లాడుతూ.. 'డాడ్' ఫెలోషిప్ వల్ల ఏటా వేల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం కల్పిస్తున్నామని.. దీంతో జర్మనీలో అడుగుపెడుతున్న భారత విద్యార్థులు ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. మరిన్ని సంస్థలతో అకడమిక్, రీసెర్చ్ ఒప్పందాలు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇప్పటికే ఐఐటీ–హెచ్, ట్రిపుల్ ఐటీ–హైదరాబాద్‌లను సందర్శించామని.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇటీవలే హెచ్–క్యూబ్ ఏసీ పేరుతో రిసెర్చ్ సెంటర్ నెలకొల్పినట్లు తెలిపారు.

## పాతికేళ్ల జెండా యాదిలో..



నాటి ఎన్నికల ప్రచార బ్యానర్‌ను పునరావిష్కరిస్తున్న కేసీఆర్. చిత్రంలో పల్లా, నరేందర్, పెద్ది, ఎర్రబెల్లి, గండ్ర, రాజయ్య, దాస్యం, సుభాష్‌రెడ్డి తదితరులు

2001 నాటి జెండాను భద్రంగా దాచిన పెద్ది సుదర్శన్‌రెడ్డి

సోమవారం కేసీఆర్‌తో పునరావిష్కరణ


**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుత బీఆర్‌ఎస్) స్థాపించిన తొలినాళ్లలో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో నల్లబెల్లి స్థానం నుంచి రైతు నాగలి గుర్తుపై పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆనాటి గులాబీ జెండా, పోస్టర్‌ను అధినేత కేసీఆర్ ద్వారా పునరావిష్కరణ చేయించారు. ఈ సందర్భంగా 2001 నాటి సంగతులను కేసీఆర్, మాజీ మంత్రులు గుర్తు చేసుకున్నారు. 2001 ఏప్రిల్ 27న టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించగా, ఆ తరువాత రెండు నెలలకే జరిగిన జెడ్పీ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభంజనం సృష్టించింది. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆనాడు నల్లబెల్లి స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ సందర్భంగా క్లాత్ మీద రాయించిన ఎన్నికల ప్రచార బ్యానర్‌ను, జెండాను పార్టీ 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకల నేపథ్యంలో సోమవారం పార్టీ అధినేత కె.చంద్రశేఖరరావు చేత పునరావిష్కరణ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు రాజయ్య, ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎంఎల్‌ఏ పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌జీలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు!

ప్రభుత్వానికి పీఆర్ మంత్రి సీతక్క ప్రతిపాదనలు



**సాక్షి, హైదరాబాద్:** ఇందిరా మహిళాశక్తిలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. ఇప్పటికే మహిళాసంఘాల సభ్యులకు ఆర్టీసీకి అద్దెకు బస్సులు, సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటు ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలను అప్పగిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో, వీటి ఏర్పాటులో మహిళా సంఘాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వానికి మంత్రి సీతక్క ప్రతిపాదనలు పంపించారు. సీఎం ఆమోదం పొందిన వెంటనే వీటి ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్టు అధికారవర్గాల సమాచారం. మూడుదశల్లో 2,500 యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.




Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం। 18-3-2025

# స్పెషల్ టూరిజం ఏరియాలు.. అద్భుత వసతులు



## ప్రత్యేక పర్యాటక పాలసీలో పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం కొత్త పాలసీని తెచ్చిన ప్రభుత్వం.. కొన్ని కీలక విధానాలను అమలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ టూరిజం ఏరియా (ఎస్‌టీఏ)లను గుర్తించి వాటి ప్రత్యేకతల ఆధారంగా ఆయా ప్రాంతాలకు పర్యాటకులు వచ్చేలా ప్రత్యేక పర్యాటక షెడ్యూల్ రూపొందించనున్నట్టు పేర్కొంది. తొలిదశలో అలాంటి 27 కేంద్రాలను గుర్తించారు. వీటిల్లో ఆధ్యాత్మిక, వారసత్వ, ఎకో–వెల్‌నెస్, హస్తకళలు, జలపాతాలు, బుద్ధిస్ట్ ప్రాంతాలు ఉన్నాయి.. అదే సమయంలో అవసరమైన మౌలిక సదుపాయాలనూ నిర్ధారించింది.

**స్పెషల్ టూరిజం ఏరియాలు..**

**యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట దేవాలయం, భువనగిరి కోట, బస్వాపూర్, కొలనుపాక, మహదేవపురం.

**భద్రాచలం:** భద్రచాలం ఆలయం, పర్ణశాల, కిన్నెరసాని డ్యాం, అభయారణ్యం, కనకగిరి హిల్స్.

**బాసర:** జ్ఞాన సరస్వతి దేవాలయం, వ్యాస మహర్షి దేవాలయం, పరిసర ప్రాంతాలు

**వేములవాడ:** వేములవాడ దేవాలయం, కొండగట్టు దేవాలయం, కోటిలింగాల, ధర్మపురి

**అలంపూర్–సోమశిల:** అలంపూర్ శక్తిపీఠం, బీచుపల్లి, జటప్రోలు, కొల్లాపూర్, సోమశిల

**రామప్ప:** రామప్ప దేవాలయం, చెరువు, లక్నవరం సరస్సు, మేడారం, బొగత జలపాతం, ఏటూరునాగారం అభయారణ్యం, పాండవుల గుట్ట, ఘన్‌పూర్ దేవాలయ సమూహం.

**కాళేశ్వరం:** కాళేశ్వరం దేవాలయం, గాంధారి కోట, శివరామ్ అభయారణ్యం

**మెదక్:** మెదక్ చర్చి, కోట, పోచారం రిజర్వాయర్, వైల్డ్‌లైఫ్, ఏడుపాయల దేవాలయం, నర్సాపూర్ అటవీ ప్రాంతం, మంజీరా అభయారణ్యం, సింగూరు డ్యాం.

**వరంగల్:** వరంగల్ కోట, పరిసరాల్లోని దేవాలయాలు, పాకాల సరస్సు, గూడూరు అభయారణ్యం.

**నల్లగొండ:** పానగల్ దేవాలయ సమూహం, దేవరకొండ కోట

**పాలకుర్తి:** పాలకుర్తి దేవాలయం, బమ్మెర పోతన గ్రామం, పెంబర్తి హస్తకళలు, చేర్యాల పెయింటింగ్స్, వల్మిడి, జఫర్‌గడ్

**కరీంనగర్:** ఎలగందుల కోట, ఫిలిగ్రి, మంథని దేవాలయాలు, రామగిరి కోట.

**చార్మినార్ క్లస్టర్:** చార్మినార్, మక్కా మసీదు, లాడ్ బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్

**హైదరాబాద్ – రంగారెడ్డి – మేడ్చల్ క్లస్టర్:** గోల్కొండ కోట, కుతుబ్‌షాహీ సమాధులు, తారామతి బారాదరి, కీసరగుట్ట, నెట్ జీరో సిటీ–ఎకోపార్కు, షామీర్‌పేట సరస్సు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు

**సిద్దిపేట:** రంగనాయకసాగర్, గొల్లభామ హస్తకళలు, వర్గల్ రాక్ ఆర్ట్స్, అన్నపూర్ణ రిజర్వాయర్

**నల్లమల సర్క్యూట్:** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, ఫర్హాబాద్, సలేశ్వరం, మల్లెల తీర్థం, మన్ననూరు, ఉమామహేశ్వరం, మాధవస్వామి ఆలయం, బేడి ఆంజనేయ ఆలయం.

**శ్రీరాంసాగర్:** శ్రీరాంసాగర్ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ ప్రాంతం.

**జన్నారం:** కడెం, కవ్వాల్ టైగర్ రిజర్వ్, సప్తగుండాల జలపాతం.

**ట్రైబల్ క్లస్టర్:** జోడేఘాట్, ఉట్నూరు, కాగజ్‌నగర్ టైగర్ రిజర్వ్.

**నాగార్జునసాగర్:** బుద్ధిస్ట్ హెరిటేజ్, బ్యాక్‌వాటర్ ప్రాంతం.

**వికారాబాద్:** వికారాబాద్, అనంతగిరి హిల్స్, అనంత పద్మనాభస్వామి దేవాలయం, కోట్‌పల్లి, పరిగి దామగుండం.

**మహబూబ్‌నగర్:** కోయిల్‌సాగర్, పిల్లలమర్రి, మన్యంకొండ.

పోచంపల్లి, నారాయణపేట, గద్వాల్ కొత్త కోట వస్త్ర పరిశ్రమ.

కోరటికల్, కుంతాల, పొచ్చెర, గాయత్రి జలపాతాలు.

కొండాపూర్, ధూళికట్ట, కోరుకొండ, నేలకొండపల్లి, బుద్ధవనం, ఫణిగిరి, గాజులబండ బౌద్ధక్షేత్రాలు.

**టూరిజం మౌలిక వసతులు ఇలా..**

- శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కేవలం ఒకటి–రెండు గంటల్లో చేరుకునేలా ప్రత్యేక పర్యాటక గమ్యాలను ఏర్పాటు చేయాలి.
- బిజినెస్ టూరిజం అభివృద్ధి చెందాలంటే.. రీజినల్ రింగురోడ్డు చుట్టూ డ్రైపోర్టులు ఏర్పాటు చేయాలి. బందరు పోర్టుతో అనుసంధానించే ప్రత్యేక గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌తో వీటిని అనుసంధానించాలి. తద్వారా కావాల్సిన సరుకును సముద్రయానం ద్వారా సులభంగా తరలించే ఏర్పాటు ఉందన్న నమ్మకం పెట్టుబడిదారుల్లో కల్పించాలి.
- రీజినల్ రింగురోడ్డు చుట్టూ ప్రపంచస్థాయి షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేయాలి.
- ఔటర్ రింగురోడ్డు చుట్టూ మెగా రిటైల్‌మాల్స్‌ను పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేయాలి.
- గోదావరి, కృష్ణా నదుల్లో పర్యాటక పురోగతికి ఉపయోగపడే ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలి. రివర్ ఫెస్టివల్స్, బోట్ ఫెస్టివల్, హౌస్‌బోట్స్, వాటర్ స్పోర్ట్స్, జెట్టీలు, లాంచ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి.
- పట్టణాల్లో జలాశయాల వద్ద పర్యాటక విడిది కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- హెలిప్యాడ్లను అందుబాటులోకి తెచ్చి ప్రధాన పర్యాటక ప్రాంతాలను వాయు మార్గాలతో అనుసంధానించాలి.
- గోల్ఫ్ టూరిజంను విస్తృతం చేయాలి.
- బుద్ధవనం, నాగార్జున సాగర్‌లను ఆసరా చేసుకుని వెల్‌నెస్, మెడిటేషన్ కేంద్రాల ఏర్పాటుతో బౌద్ధ పర్యాటకులను ఆకర్షించే చర్యలు చేపట్టాలి.
- కార్పొరేట్ సంస్థలు కొన్ని పర్యాటక ప్రాంతాలను దత్తత తీసుకోవటం ద్వారా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగేలా చూడాలి.
- పర్యాటక ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలి, పార్కింగ్ ఏరియా, రెస్టారెంట్లు, కేఫ్‌లు, కియోస్క్‌లు, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్లు, ప్రాథమిక చికిత్స కేంద్రాలు, వేసైడ్ ఎమినిటీస్ ఉండాలి.
- దివ్యాంగులకు అనుకూల ఏర్పాట్లు ఉండాలి.
- స్పెషల్ టూరిజం ఏరియా(ఎస్‌టీఏ)ల పరిధిలో కనీసం 5 వేల గదులు అందుబాటులో ఉండాలి. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కనీసం 10 వేల గదులు పర్యాటకులకు అందుబాటులో ఉండాలి.

**పెట్టుబడులను బట్టి ప్రాజెక్టుల కేటగిరీ ఇలా..**

**ప్రత్యేక ప్రాజెక్టులు:** రూ.500 కోట్లు అంతకంటే ఎక్కువ పెట్టుబడి, 2 వేల మంది కంటే ఎక్కువ మందికి ప్రత్యక్ష ఉపాధి

**మెగా ప్రాజెక్టులు:** రూ.100 కోట్లు– రూ.500 కోట్లు మధ్య పెట్టుబడి, 500 నుంచి రెండు వేల మంది వరకు ప్రత్యక్ష ఉపాధి

**పెద్ద ప్రాజెక్టులు:** రూ.50 కోట్లు– రూ.100 కోట్లు మధ్య పెట్టుబడి

**మధ్యస్థ ప్రాజెక్టులు:** రూ.10 కోట్లు– రూ.50 కోట్ల మధ్య పెట్టుబడి

**సూక్ష్మ,చిన్న ప్రాజెక్టులు:** రూ.10 కోట్ల వరకు పెట్టుబడి

**తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్:** హైదరాబాద్ నగరం–ఔటర్ రింగురోడ్డు మధ్య పరిధి

**తెలంగాణ సెమీ అర్బన్ రీజియన్:** ఔటర్ రింగురోడ్డు–రీజినల్ రింగురోడ్డు మధ్య ప్రాంతం

**గ్రామీణ తెలంగాణ రీజియన్:** ఆర్ఆర్ఆర్ వెలుపలి ప్రాంతం

## అసెంబ్లీ వార్తలు

### కూరగాయలసాగు పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం : మంత్రి తుమ్మల



**సాక్షి, హైదరాబాద్:** ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి పలు రకాల కూరగాయలు దిగుమతి చేసుకుంటున్న విషయం వాస్తవమేనని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర అవసరాల మేరకు కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో నకిలీ విత్తన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు తుమ్మల స్పష్టం చేశారు. విత్తనోత్పత్తి అంశంపై మండలిలో ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, తీన్మార్ మల్లన్న, జీవన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రుణమాఫీపై అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ..నాలుగు దశల్లో మొత్తం 25,35,964 ఖాతాల్లో రూ.20616.89 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 29,14,692 మంది రైతులకు విద్యుత్‌శక్తిపై రూ.9,800.07 కోట్లు సబ్సిడీ ఇచ్చినట్టు తెలిపారు.

### హెచ్‌ఎండీఏ స్థలాల తనఖాతో రూ.20వేల కోట్ల ఆదాయం..

**సాక్షి, హైదరాబాద్:** హెచ్‌ఎండీఏ స్థలాలను తనఖా పెట్టి రూ.20వేల కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం వెల్లడించింది. హెచ్‌ఎండీఏ ద్వారా నిధుల సమీకరణకు అనుమతులిచ్చామని, ఇంకా ప్రక్రియ ప్రారంభం కాలేదని పేర్కొంది. బీఆర్‌ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్‌రావు, కేపీ వివేకానంద్, కాలేరు వెంకటేష్, మాధవరం కృష్ణారావుల ప్రశ్నలకు రాతపూర్వకంగా బదులిచ్చింది. లావాదేవీ సలహాదారుకి అంగీకార లేఖను గత ఫిబ్రవరి 25న జారీ చేశామని తెలిపింది. తనఖాపెట్టేందుకు అనువైన ఆస్తులతోపాటు విధివిధానాలను ఏజెన్సీ ఖరారు చేయనుందని తెలిపింది. బాండ్ల జారీకి మర్చంట్ బ్యాంకర్‌గా ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవహరిస్తుందని తెలిపింది.

### కేంద్రం నుంచి ఉపకారం బంద్



కేంద్ర ప్రభుత్వం 1–8 తరగతులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పులతోపాటు పీహెచ్‌డీ విద్యార్థుల ఉపకార వేతనాలను 2022 నుంచి నిలుపుదల చేయడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరిగిందని మంత్రి సీతక్క తెలిపారు. కేంద్రం చేయాల్సింది త్రిభాషా సూత్రం అమలుకు ఒత్తిడి కాదని, స్కాలర్‌షిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురుకుల వసతి గృహాల విద్యార్థుల డైట్ చార్జీలను గత నవంబర్ 1 నుంచి 40శాతం, కాస్మెటిక్ చార్జీలను 212 శాతం పెంచినట్టు సీతక్క తెలిపారు. 3–7 తరగతుల విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1330కి, 8–10 తరగతుల విద్యార్థులకు రూ.1100 నుంచి రూ.1540కి, ఇంటర్–పీజీ విద్యార్థులకు రూ.1500 నుంచి రూ.2100కు పెంచినట్టు తెలిపారు. 7,66,705 మంది విద్యార్థులకు రూ.499.51 కోట్ల లబ్ధిచేకూరిందని.. కాంగ్రెస్ సభ్యులు జాటోత్ రామ్‌చందర్ నాయక్ అడిగిన ఓ ప్రశ్నకు ఆమె బదులిచ్చారు.

### దళిత పారిశ్రామికవేత్తలకు రూ.1,900 కోట్ల బకాయిలు..

దళిత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన టీ–ప్రైడ్ పథకం కింద 2015–2023 మధ్యకాలంలో 62,342 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, రూ.2819.97 కోట్లను మంజూరు చేసినట్టు ప్రభుత్వం తెలిపింది. ఇందులో రూ.1,900 కోట్ల బకాయిలను త్వరలో విడుదల చేస్తామని కాంగ్రెస్ సభ్యుడు అనిరుధ్ రెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు బదులిచ్చింది.

### కొడంగల్‌కు రూ.1000 కోట్లు.. మాకు రూ.99 లక్షలే: పైడి రాకేష్ రెడ్డి



సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌కు రూ.1000 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులిచ్చి.. తన నియోజకవర్గానికి కేవలం రూ.99 లక్షలే ఇచ్చారని బీజేపీ సభ్యుడు పైడి రాకేష్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 119 నియోజకవర్గాలకు సైతం రూ.1000 కోట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేయగా, బీఆర్‌ఎస్ సభ్యులు సైతం బల్లలు చరిచి మద్దతు తెలిపారు. నియోజకవర్గానికి ఏం తెచ్చావని స్థానిక కాంగ్రెస్ నేతలు తనను ప్రశ్నిస్తున్నారని.. ప్రభుత్వం తనకు ఏమి ఇచ్చిందని, తాను తీసుకెళ్లేది ఏంటని వ్యాఖ్యానించారు.

### రైతాంగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు: మధుసూదనాచారి



**సాక్షి, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి దగాకోరు పాలన వల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూద నాచారి చెప్పారు. శాసనమండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. 'కేసీఆర్ పాలనలో రైతులు గుండెల మీద చేయి వేసుకొని నిద్రపోతే..కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా రైతుల హాహాకారాలు వినిపిస్తున్నాయి. అధికారంలోకి వస్తే క్వింటాల్ మిర్చి రూ.16 వేలకు కొంటామని చెప్పి, ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదు. రేవంత్ ప్రభుత్వానికి రైతాంగం పట్ల చిత్తశుద్ధి ఉంటే మిర్చి రైతులకు మద్దతు ధర ప్రకటించాలి' అని చారి అన్నారు.

### మంత్రులు మిర్చియార్డును సందర్శించలేదు: తాత మధు



'కాంగ్రెస్ మంత్రులు ఒక్కరు కూడా ఖమ్మం మిర్చి మార్కెట్ సందర్శించలేదు. మిర్చి పంటకు గిట్టుబాటు ధరలేక, కరెంట్, పంటలకు సాగునీరు లేక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. వెంటనే మిర్చి బోర్డు ఏర్పాటు చేసి, క్వింటాల్‌కు ధర రూ.16 వేలు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి' అని తాత మధు డిమాండ్ చేశారు.

## లాకప్‌డెత్‌పై విచారణ చేపట్టండి

**మానవ హక్కుల కమిషన్‌లో న్యాయవాది ఫిర్యాదు**

**సాక్షి, హైదరాబాద్:** పోలీసులు కస్టడీలోకి తీసుకొని చట్టపరంగా విచారించకుండా.. విచక్షణారహితంగా హింసించిన కారణంగానే పెద్దపల్లి జిల్లాకు చెందిన సంపత్ మరణించాడని జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో న్యాయవాది కారుపోతుల రేవంత్ ఫిర్యాదు చేశారు. సంపత్ మృతితో తన కుటుంబానికి జీవనాధారం లేకుండా పోయిందన్నారు. ఈ లాకప్ డెత్‌పై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించేలా సర్కార్‌ను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించాలన్నారు. జగిత్యాలలో శ్రీరామ్ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ నడుపుతున్న సంపత్.. దుబాయ్ పంపిస్తానని మోసం చేశాడని పలువురు యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నకిలీ వీసాల కేసులో పోలీసులు సంపత్‌ను అరెస్ట్ చేయగా.. కోర్టు రెండు రోజుల రిమాండ్ విధించింది. అయితే రిమాండ్‌కు తరలిస్తుండగా సంపత్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో పోలీసులు వెంటనే నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సంపత్ మృతి చెందాడు.

## పదేళ్లలో తెలంగాణకు అత్యధిక రైల్వే కేటాయింపులు

**రాజ్యసభలో బీజేపీ ఎంపీ డా.కె.లక్ష్మణ్**



**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణకు గత పదేళ్లలో రికార్డు స్థాయిలో రైల్వే కేటాయింపులు జరిగాయని బీజేపీ ఎంపీ డా.లక్ష్మణ్ తెలిపారు. యూపీఏ హయాంలో తెలంగాణకు ఏటా సుమారు రూ.886 కోట్లు మాత్రమే రైల్వే కేటాయింపులు జరగగా.. ఎన్డీఏ హయాంలో తెలంగాణకు రూ.5,337 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,147 కోట్ల కేటాయింపులు జరిగాయన్నారు. అంతేగాక 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో 753 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, 100 శాతం రైల్వే లైన్ల విద్యుదీకరణ జరిగిందని తెలిపారు. సోమవారం రాజ్యసభలో రైల్వే శాఖపై జరిగిన చర్చలో పాల్గొన్న లక్ష్మణ్.. తెలంగాణకు జరిగిన కేటాయింపులపై మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో 22 నూతన రైల్వే ప్రాజెక్టులు, 40 అమృత్ భారత్ స్టేషన్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కలిపి మొత్తం 13 వందేభారత్ రైళ్లను కేటాయించారని తెలిపారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రూ.715 కోట్లతో సుందరీకరణ పనులు జరుగుతున్నాయని వివరించారు.

## కేసీఆర్ జాతిపిత కాదు.. 'పీత'

- హరీశ్, కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన ఎంపీ చామల
- పదేళ్లలో రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ లూటీ చేసిందని ఆరోపణలు



**సాక్షి, న్యూఢిల్లీ:** కేసీఆర్ జాతిపిత అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. 'మీ మామ జాతి పిత కాదు. మీ మామ ఒక 'పీత'. ఆయనకు వాసన (సైగలు చేస్తూ) లేనిదే నిద్రపట్టదు' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హరీశ్ అంత పొడుగు పెరిగాడు కానీ ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో చామల మీడియాతో మాట్లాడారు. ఫేక్ జర్నలిస్టులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామంటూ అసెంబ్లీలో సీఎం రేవంత్ మాట్లాడితే.. బీజేపీ నేత అమిత్ మాలవీయ ఆ మాటలను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. 'నిజమే.. సీఎం హార్డ్‌గా మాట్లాడారు. అలా మాట్లాడుతూనే చట్టాల ద్వారా శిక్షిస్తాం' అని అన్నారు. ఈ మాటలన్నీ పక్కన పెట్టి ప్రజల్ని ఏదో అంటున్నారంటూ మీ ఇష్టం వచ్చినట్లు పేపర్ ప్రకటనలు ఇవ్వడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ పదేళ్లు లూటీ చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తుంచుకోవాలన్నారు.

## బీసీల రాజ్యాధికార సాధనలో చరిత్రాత్మక ఘట్టం: దాసు సురేశ్



**సాక్షి, హైదరాబాద్:** అసెంబ్లీలో బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను కల్పించే బిల్లుకు సభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలుపడం బీసీల రాజ్యాధికార సాధనలో చరిత్రాత్మక ఘట్టమని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ హామీ ఇచ్చిన విధంగా కులగణనకు కట్టుబడి 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టినందుకు బీసీ వర్గాల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం ఆయన ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టికల్ 15, 16లో జరగాల్సిన రాజ్యాంగ సవరణ కోసం అన్ని రాజకీయ పార్టీలు ఒక్క తాటిపై నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బిల్లుకు సహకరించి పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం తెలపడంతోపాటు, ఈ అంశాన్ని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చి బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేలా కృషి చేయాలని దాసు సురేశ్ కోరారు.

## బంగారు లక్ష్మణ్‌కు బీజేపీ నివాళి

**సాక్షి, హైదరాబాద్:** దివంగత నేత, బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ సామాన్య కుటుంబంలో పుట్టి.. అసామాన్య నాయకుడిగా ఎదిగారని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. బీజేపీ కార్యాలయంలో సోమవారం ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బంగారు లక్ష్మణ్ 86వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడ జనసేన, టీడీపీలతో జట్టు కడితే బీజేపీకే నష్టం: రాకేశ్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో జనసేన, టీడీపీలతో జట్టు కడితే బీజేపీకే నష్టం జరుగుతుందని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి వ్యాఖ్యానించారు. అధిష్టానం తెలంగాణలో కూటమి ఆలోచన చేయవద్దని సూచించారు. అంతర్రాష్ట్ర వ్యవహారాల్లో పార్టీకి ఇబ్బంది అవుతుందని, ఇలాంటి పరిణామం చోటుచేసుకుంటే బీఆర్‌ఎస్ వంటి పార్టీలకు లబ్ధి జరుగుతుందన్నారు. సోమవారం అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో ఆయన పిచ్చాపాటిగా మాట్లాడారు. ఇటీవల సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన కామెంట్స్‌ను గురించి ఓ విలేకరి ప్రస్తావించగా.. పాత ఇనుప సామాను అంటే తెలంగాణ ప్రజలకు అందరికీ తెలిసిందేనన్నారు. ఎవరైనా పార్టీ అంతర్గత వ్యవహారాలు ఇతర వేదికలపై కాకుండా ఎవరికి చెప్పాలో వారికి చెప్పాలని సూచించారు. తెలంగాణ బీజేపీకి రాజాసింగ్ 'ఓ అసెట్'వంటి వారన్నారు. ఇక్కడ ఏం జరుగుతున్నదో ప్రధాని మోదీకి ప్రతీ కదలికా తెలుస్తుందని చెప్పారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఈటల రాజేందర్, ఎంపీలు అరవింద్ ధర్మపురి, డీకే అరుణ, రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావులలో ఎవరో ఒకరు అవుతారని తెలిపారు. ప్రెసిడెంట్‌తో పాటు ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లు ఉంటే బాగుంటుందని రాకేశ్‌రెడ్డి సూచించారు.

## బట్టలు ఊడగొట్టి ఏం చేస్తారు?

**సీఎంను ప్రశ్నించిన కౌశిక్‌రెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారి బట్టలూడగొట్టి ఏం చేస్తారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పా లని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. జర్నలిస్టులను సీఎం బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని నిస్సిగ్గుగా స్టేషన్‌ఘన్‌పూర్ లో సీఎం నోటికొచ్చినట్లు మాట్లాడారన్నారు. దీని పై దమ్ముంటే మాట్లాడేందుకు సెక్యూరిటీ లేకుండా రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి రావాలని సవాల్ విసిరారు. డిసెంబర్ వరకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని, ఇప్ప టి వరకు ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేదని ఆరోపించారు. తన నియోజకవర్గంలో 100 శాతం రుణమాఫీ అయినట్లు చూపిస్తే రాజీనామా చేస్తానన్నారు. అభివృద్ధి కోసం పార్టీ మారానని కడియం అంటున్నారని, మరి ఎంపీగా ఉన్న ఆయన కూతురు అభివృద్ధి కోసం బీజేపీలోకి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు.

## గాంధీభవన్‌లో సంబురాలు

**బీసీ రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీలో పెట్టినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



**సాక్షి, హైదరాబాద్:** స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా గాంధీభవన్‌లో సంబురాలు మిన్నంటాయి. తెలంగాణ ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ నేతృత్వంలో పలువురు బీసీ నేతలు గాంధీభవన్ మెట్ల వద్ద పటాసులు పేల్చారు. డప్పు చప్పుళ్లతో నృత్యం చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు సాయి మాట్లాడుతూ సీఎం రేవంత్ బీసీల పక్షపాతి అని, ఆయన సారథ్యంలోనే తెలంగాణ బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శులు అల్లం భాస్కర్, కోట్ల శ్రీనివాస్, జక్కిలి అయిలయ్యయాదవ్ పాల్గొన్నారు.

- అంతకుముందు గాంధీభవన్‌లో మాజీఎంపీ వీహెచ్ విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని చెప్పారు. ఈ బిల్లు పార్లమెంటులో కూడా పాస్ అయ్యేలా అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అండగా నిలవాలని కోరారు,

## పసుపు బోర్డు వచ్చాక మద్దతు ధర తగ్గింది

**జీరో అవర్‌లో వేముల ప్రశాంత్‌రెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** పసుపు బోర్డు ఏర్పాటుకి ముందు నిజామాబాద్ జిల్లా పసుపు రైతులకు క్వింటాల్‌కి రూ. 15–16 వేలు గిట్టుబాటు ధర లభించగా, పసుపు బోర్డు ఏర్పాటైన తర్వాత రూ.8–9 వేలు మాత్రమే వస్తోందని బీఆర్‌ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు సిండికేట్‌గా మారి పసుపు ధరను క్వింటాల్‌కి రూ.8 వేలకి తగ్గించడంతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. శాసనసభలో సోమవారం జీరో అవర్‌లో ఆయన పసుపు రైతుల గోడును ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు.

**కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు..**

2027లో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ధర్మపురి లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో భక్తులకు సదుపాయాలు పెంచాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలని కోరారు.

**ప్యారనగర్‌లో డంప్‌యార్డ్ విరమించుకోవాలి: సునీతా లక్ష్మారెడ్డి**

గుమ్మడిదల మండలం ప్యారనగర్‌లో జీ హెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో డంప్‌యార్డ్ ఏర్పా టును విరమించుకోవాలని బీఆర్‌ఎస్ స భ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. డంప్‌యార్డు ఏర్పాటు చేస్తే తన నియో జకవర్గంలోని చెరువులు కలుషితం అవుతాయన్నారు.

**ఓడిపోయిన వారి ద్వారా పనుల మంజూరు: కాటేపల్లి**

తన నియోజకవర్గంలో పనులను తన ద్వారా కాకుండా ఓడిపోయిన అభ్యర్థి ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తోందని బీజేపీ సభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను నియంత్రించడానికే జిల్లా ఇన్‌చార్జి మంత్రులున్నారా అని ఆయన ప్రశ్నించారు.

- కల్వకుర్తి నియోజకవర్గంలో అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు.
- కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తన నియోజక వర్గంలోని ఆయకట్టుకు సాగునీరు అందించాలని బీఆర్‌ఎస్ జహీరాబాద్ సభ్యుడు కె.మాణిక్‌రావు విజ్ఞప్తి చేశారు.
- మహబూబాబాద్ నియోజకవర్గంలోని భీ మునిపాదం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బి.ము రళీనాయక్ విజ్ఞప్తి చేశారు. మహబూ బాబాద్‌లో దాశరథి స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు.

## విద్యార్థుల మరణాలపై రాజకీయాలా?

**సాక్షి, హైదరాబాద్:** వ్యక్తిగత కారణాలతోనే ఇటీవల దుబ్బాక బీసీ హాస్టల్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ప్రస్తుతం నిలోఫర్ ఆస్పత్రిలో కోలుకుంటున్నాడని సీతక్క చెప్పారు. ఈ ఘటనను బయటకు పొక్కకుండా స్థానిక అధికారులు దాచిపెట్టారని దుబ్బాకబీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆరోపించగా, ఆ అవసరం తమకు లేదని సీతక్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో 83 మంది గురుకులాల విద్యార్థులు మృతి చెందారని, వసతి గృహాల్లో దారుణపరిస్థితులు నెలకొని ఉన్నాయని ప్రభాకర్ రెడ్డి ఆరోపించగా, గత బీఆర్‌ఎస్ పాలనలో సైతం 114 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని సీతక్క బదులిచ్చారు. అప్పట్లో ఆసిఫాబాద్ జిల్లాలో 15 రోజుల్లోనే నలుగురు విద్యార్థులు చనిపోయారన్నారు. గురుకులాల్లో ఏదైన ఘటన జరిగితే బాధ్యులైన వార్డెన్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## బీఆర్‌ఎస్ అనేకమందిపై అక్రమ కేసులు పెట్టింది

**ఎంపీ బలరాం నాయక్**

**సాక్షి, న్యూఢిల్లీ:** బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అనేక మందిపై అక్రమ కేసులు పెట్టి, వేధింపులకు పాల్పడిందని కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలంగాణకు స్వేచ్ఛ లభించిందని, ఇప్పుడు అక్రమ కేసులు, వేధింపులు లేవని అన్నారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనలో మాట్లాడితే కేసులు పెట్టారని, చివరికి మైహోమ్ రామేశ్వరరావుపైనా అట్రాసిటీ కేసులు పెట్టి వేధించారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ హయాంలో అక్రమ కేసులకు ఆస్కారమే లేదన్నారు. మీడియా మిత్రులు, ప్రజా సేవకులకు కాంగ్రెస్ తగిన గౌరవం ఇస్తుందని తెలిపారు. కాగా, సీఎం రేవంత్‌కు ప్రజలు చేరువకావడాన్ని జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ ఆయనపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు.

## క్లుప్తంగా...

### విజయవాడకు ప్రజారోగ్య డైరెక్టర్ కార్యాలయం

సాక్షి, అమరావతి: గొల్లపూడిలో ఉన్న ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ డైరెక్టర్ కార్యాలయాన్ని విజయవాడకు మార్చడానికి అనుమతులిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులిచ్చారు. విజయవాడలోని ఏలూరు రోడ్డులో 19 వేల చదరపు అడుగుల భవనంలోకి కార్యాలయాన్ని మార్చనున్నారు. అద్దె కింద చదరపు అడుగుకు రూ.32, నిర్వహణకు చదరపు అడుగుకు రూ.5 చొప్పున కేటాయించారు.

### దేశీయ వైద్య వృత్తిదారుల నమోదు సవరణ బిల్లుకు ఆమోదం

సాక్షి, అమరావతి: 'దేశీయ (ఆయుర్వేద, హోమియో, యునాని) వైద్య వృత్తిదారుల రిజిస్ట్రేషన్' సవరణ బిల్లును ఆంధ్రప్రదేశ్ శాసనసభ సోమవారం నాడు ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బిల్లును ప్రవేశపెట్టారు.

### సభలో ఎమ్మెల్యేలు ఫోనులో మాట్లాడొద్దు: డిప్యూటీ స్పీకర్

సాక్షి, అమరావతి: శాసన సభ జరుగుతుండగా ఫోనులో మాట్లాడొద్దని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యేలకు సూచించారు. ఏదైనా అత్యవసరమైతే బయటకు వెళ్లి మాట్లాడుకోవాలని సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు.

### పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఉద్యోగుల అంశాలపై దృష్టి సారించకపోవడం బాధాకరమని ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు కేవీ శివారెడ్డి అన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన డీఏలను వెంటనే ఇవ్వాలని కోరారు. విజయవాడలోని ఏపీ ఎన్జీఓ భవన్‌లో సోమవారం ఏపీ ఉద్యోగుల జేఏసీ సెక్రటేరియట్ సమావేశం జరిగింది. అనంతరం శివారెడ్డి మీడియాతో మాట్లాడారు.

### జూపార్కులో వసతులకు రూ.1.97 కోట్లు

సాక్షి, అమరావతి: పునుగు పిల్లులను ప్రత్యేకంగా పెంచుతున్న ఎస్వీ జూపార్కులో అదనపు సౌకర్యాల కల్పనకు రూ.1.97 కోట్ల టీటీడీ నిధులు మంజూరుకు ప్రభుత్వం అనుమతి తెలిపింది. తిరుమల శ్రీవారికి అభిషేక ఆచారాల్లో ఉపయోగించే కస్తూరి స్రావానికి అవసరమైన పునుగు పిల్లులను ఎస్వీ జూపార్కులో పెంచుతున్న విషయం తెలిసిందే.

### ఎమ్మెల్సీ సోముకు ధ్రువీకరణ పత్రం అందజేత

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటాలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎన్నికైన సోము వీర్రాజుకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల అధికారి వనితారాణి సోమవారం అందజేశారు.

### మహిళా శిశు సంక్షేమ శాఖలో ముగ్గురికి పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ముగ్గురు చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారుల(సీడీపీఓ)కు అసిస్టెంట్ డైరెక్టర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రాజెక్ట్ హెచ్‌ఓడీ టి.శ్రీదేవి, శ్రీకాకుళం జిల్లా గార ప్రాజెక్ట్ సీడీపీఓ, డి.రాధామాధవి, గుంటూరు జిల్లా ఫిరంగిపురం ప్రాజెక్ట్ హెచ్ఓడీ పి.అనురాధ పదోన్నతులు పొందారు.

### రెండు వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీల నియామకం

సాక్షి, అమరావతి: కడపలోని యోగి వేమన వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా విక్రమ సింహపురి వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. కర్నూలులోని క్లస్టర్ వర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా రాయలసీమ వర్సిటీ వీసీ వి.వెంకట బసవరావుకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత క్లస్టర్ వర్సిటీ వీసీ సాయి గోపాల్ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఇన్‌చార్జి వీసీని నియమించారు.

### రాష్ట్రంలో కొత్తగా 8 కేంద్రీయ విద్యాలయాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా 8 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం అనుమతినిచ్చింది. అన్నమయ్య జిల్లా వలసపల్లి, సత్యసాయి జిల్లా పాలసముద్రం, గుంటూరు జిల్లా తాళ్లపల్లి, కృష్ణా జిల్లా నందిగామ, పల్నాడు జిల్లా రొంపిచర్ల, ఏలూరు జిల్లా నూజివీడు, నంద్యాల జిల్లా డోన్, అనకాపల్లి జిల్లా అనకాపల్లిలో ఈ కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.

### మహిళలను పిల్లలు పుట్టించే యంత్రాల్లా చూడొద్దు

సాక్షి, అమరావతి: మహిళలను పిల్లలు పుట్టించే యంత్రాల్లా భావించొద్దని సీఎం చంద్రబాబుకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హితవు చెప్పారు. చంద్రబాబు గతంలో కుటుంబానికి ఒక్క బిడ్డ చాలు అనేవారని, ఇప్పుడు ఎక్కువ మందిని కనండి అంటున్నారని పేర్కొన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. బాబు, పవన్ ఇద్దరూ ప్రధాని మోదీ కనుసన్నల్లో మెలుగుతున్నారనే విషయం రాష్ట్ర ప్రజలకు అర్థమవుతోందన్నారు.

# ఎస్వీయూలో కొత్త దిశగా.. కోర్సులు!

- 30 శాతం కంటే తక్కువ విద్యార్థులు ఉన్న కోర్సులపై ఆరా
- నివేదిక ఇవ్వాలంటూ విభాగాధిపతులకు ఆదేశాలు
- 2025-26 విద్యాసంవత్సరంలో పలు కోర్సులకు కత్తెర పడే అవకాశం




తిరుపతి సిటీ: రాయలసీమకే తలమానికంగా నిలిచిన సరస్వతీ నిలయం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం- ఎస్వీయూ. పేద విద్యార్థులను తన ఒడిలో చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత శిఖరాలకు చేర్చింది. అలాంటి వర్సిటీలో పలు కోర్సులలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణం చూపి కోత విధించేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**56 కోర్సులు... 3 వేల మంది విద్యార్థులు**

ఎస్వీయూలో ప్రస్తుతం ప్రధానంగా 56 విభాగాలలో 3 వేల మందికి పైగా విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. ఇందులో విద్యార్థుల సంఖ్య 30 శాతం కంటే తక్కువగా సుమారు 10 కోర్సులు ఉన్నట్లు తెలుస్తోంది. తక్కువగా ఉన్న కోర్సులను ఇతర కోర్సులలోకి మెర్జ్ చేయడం లేదా తొలగించాలనే ప్రయత్నంలో వర్సిటీ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. తక్కువ ప్రవేశాలు ఉన్న కోర్సుల వివరాలతో కూడిన జాబితాను తయారు చేసి సమర్పించాలని అధికారులకు లిఖిత పూర్వకంగా ఆదేశాలు అందాయి.

**సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులకు మంగళం**

పేద విద్యార్థులు తాము కలలుగన్న కోర్సులలో చేరేందుకు ఎంతో శ్రమించి పీజీసెట్ కోసం ఎదురుచూస్తుంటారు. 2025-26 ఏపీ పీజీసెట్‌లో గత 50 ఏళ్లుగా వర్సిటీలో కొనసాగుతున్న పలు కోర్సులు కనబడకపోవచ్చని అంచనా. ప్రధానంగా సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ విభాగాలలో సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులను తొలగించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అలాగే రెగ్యులర్ కోర్సులలో కొన్నింటిని మెర్జ్ చేయవచ్చని సమాచారం.

### ఉద్యమిస్తాం



అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రవేశాలను పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలి తప్ప, కోర్సులను తొలగించడం సరికాదు. ఇదే జరిగితే ఉద్యమిస్తాం. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందని ద్రాక్షగా చేసి కార్పొరేటీకరణ దిశగా అడుగులు వేస్తే సహించేదిలేదు.

– బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, తిరుపతి

### ప్రవేశాలను పెంచడం చేతగాకే...



ప్రవేశాలను పెంచుకోవడం చేతకాకనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్, తమిళ్, ఉమెన్ స్టడీస్ వంటి కోర్సులకు చరమగీతం పాడుతూ మరిన్ని కోర్సులను మెర్జ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే జరిగితే అన్ని విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏడీ బిల్డింగ్‌ను ముట్టడిస్తాం.

– ఎస్ చిన్న, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి, తిరుపతి

### స్వతహాగా పీజీసెట్ బెటర్



వర్సిటీ అభివృద్ధి పథంలో నడవాలంటే కోర్సులను తొలగించడం కాదు. ప్రవేశాలను ప్రోత్సహించి, స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇవ్వాలి. ఉపాధి, ఉద్యోగావకాశాలను పెంచే ప్రయత్నం జరగాలి. కామన్ పీజీసెట్‌ను రద్దు చేసి, వర్సిటీ స్వతహాగా పీజీసెట్ నిర్వహిస్తే అడ్మిషన్లు పెరుగుతాయి.

– భగవత్ రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

### హేయమైన నిర్ణయం



పేరొందిన వర్సిటీలో అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయన్న కారణంగా కోర్సుల కోత హేయమైన నిర్ణయం. ఇలాంటి ప్రయత్నాలను అధికారులు విరమించుకోవాలి. లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి గురికాకతప్పదు.

– శివ శంకర్ నాయక్, జీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తిరుపతి

### వర్సిటీకి చెడ్డపేరు



అధికారులు విద్యను ప్రోత్సహించాలే తప్ప కోర్సులను తొలగించడం దారుణం. వర్సిటీలో ఏ కోర్సును తొలగించినా ధర్నాలు, నిరసనలు తప్పవు. ఇలాంటి దుశ్చర్యలతో వర్సిటీకి చెడ్డపేరు తేవడం దారుణం.

– మల్లికార్జున, ఎస్ఎస్‌యూఐ, రాష్ట్ర కార్యదర్శి, తిరుపతి

# ఎస్సీ వర్గీకరణపై మరింత కసరత్తు!

**ప్రభుత్వానికి నివేదిక అందజేసిన రంగరాజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్**

- మూడు కేటగిరీలుగా రిజర్వేషన్ల అమలు
- రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ చేస్తే మేలని సూచన
- జిల్లా యూనిట్‌గా చేయాలన్న సీఎం, కొందరు మంత్రులు
- భిన్న వాదనలను పక్కన పెట్టి నివేదికను ఆమోదించిన మంత్రివర్గం

సాక్షి, అమరావతి : రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేయాలనే కొత్త డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ అంశంపై సోమవారం జరిగిన మంత్రివర్గంలో భిన్నవాదనలు వినిపించాయి. షెడ్యూల్డ్ కులాల్లోని ఉప కులాలను వర్గీకరణ చేసి.. రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం రంగరాజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించడంతోపాటు స్వయంగా, ఈ మెయిల్స్, లేఖల రూపంలో ఎస్సీలకు చెందిన అన్ని వర్గాల నుంచి విజ్ఞాపనలు స్వీకరించింది. గడువు ముగిసిన తరుణంలో ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఏకసభ్య కమిషన్ చేసిన సిఫార్సుల్లో ఎస్సీ ఉప కులాలను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించి.. మొత్తం 15 శాతం రిజర్వేషన్లలో రెల్లి ఉప కులాలకు ఒక శాతం, మాదిగ ఉప కులాలకు 6.5 శాతం, మాల ఉప కులాలకు 7.5 శాతం చొప్పున రిజర్వేషన్లు అమలు చేయాలని సూచించినట్లు తెలిసింది. రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయడం ద్వారా విద్య, ఉద్యోగాల విషయంలో న్యాయ పరమైన, ఇతర సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ సమావేశంలో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయడమే మేలని కొందరంటే.. జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారని మరికొందరు మంత్రులు గుర్తు చేసినట్లు సమాచారం. దీనిపై చర్చ ఎటూ తేలకపోవడంతో తొలుత కమిషన్ నివేదికను ఆమోదించి, ఆ తర్వాత ఏం చేయాలో చూద్దామని ముఖ్యమంత్రి స్పష్టం చేయడంతో మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇదిలా ఉండగా ఇప్పటికే కమిషన్ తన నివేదికను అందజేయగా.. మరింత అధ్యయనం చేసి అదనంగా సూచనలు చేయాలంటూ రంగరాజన్ మిశ్రా కమిషన్ మరో నెల రోజులపాటు కొనసాగేలా ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. మరోవైపు ఏక సభ్య కమిషన్ నివేదికపై అధ్యయనం చేసి సూచనలు చేసేలా ఐదుగురు మంత్రులతో ఉప సంఘం వేసింది.

### గతంలో నాలుగు కేటగిరీలుగా వర్గీకరణ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 59 ఎస్సీ ఉప కులాలను 2000 సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం నాలుగు కేటగిరీలుగా విభజించింది. ఏ- కేటగిరిలో 12 ఉప కులాలు, బీ-లో 18, సీ-లో 25, డీ- కేటగిరీలో నాలుగు ఉప కులాలను పొందు పరిచింది. ఎ- కేటగిరీకి ఒక శాతం, బీ-కి 7 శాతం, సీ-కి 6 శాతం, డీ కేటగిరీకి ఒక శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించడం గమనార్హం.

### పార్లమెంట్‌లో రెండు అరకు కాఫీ స్టాల్స్



సాక్షి, న్యూఢిల్లీ: 'అరకు కాఫీ' ప్రమోషన్స్‌లో భాగంగా పార్లమెంట్‌లో రెండు కాంప్లిమెంటరీ స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు పార్లమెంట్‌లోని నలంద లైబ్రరీకి వెళ్లే దారిలో సంగం-1, 2లకు ఇరువైపులా ఈ స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు లోక్‌సభ డిప్యూటీ సెక్రటరీ అజయ్‌కుమార్ సాహు అనుమతి ఇచ్చారు. వీటి ఏర్పాటుకు నిబంధనలతో కూడిన అనుమతి పత్రాన్ని ఆయన సోమవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకి పంపించారు.

### ఆర్థిక శాఖలో ఐఏఎస్‌లకు విభాగాల కేటాయింపు

**ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు**

సాక్షి, అమరావతి: ఆర్థిక శాఖలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులకు పలు విభాగాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శి (వ్యయం-మానవ వనరులు) ఎం. జానకి, ఆర్థిక శాఖ కార్యదర్శి (పే అండ్ అకౌంట్స్ ఆఫీస్) డి. రోనాల్డ్ రాస్, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె. నివాస్‌కు పలు విభాగాలను కేటాయించినట్లు ఉత్తర్వులు వెల్లడించాయి.

- ఆర్థిక వ్యవహారాల సమన్వయం, మార్గదర్శకత్వం, పర్యవేక్షణ వంటి కీలక విభాగాలు పీయూష్ కుమార్‌కు కేటాయించారు. ఇతరులకు కేటాయించని విభాగాలనుసైతం ఆయన పర్యవేక్షిస్తారు.
- ఇక వ్యయం, మానవ వనరుల నిర్వహణ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సంక్షేమం, పాఠశాల విద్య, ఉపాధి వంటి పలు విభాగాలు జానకికి కేటాయించారు
- బడ్జెట్, నగదు, రుణ నిర్వహణ, క్రీడలు, యువజన వ్యవహారాలు, పర్యాటకం, ఇంధనం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, పరిశ్రమలు, మధ్య-చిన్న నీటిపారుదల వ్యవహారాలుసహా పలు విభాగాలు డి. రోనాల్డ్ రాస్‌కు కేటాయించారు.
- జె.నివాస్‌కు డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్, వనరుల సమీకరణ, ఆదాయం పెంపుతోపాటు మరికొన్ని విభాగాల కేటాయింపు జరిగింది.

## ఏపీ ఇన్ పార్లమెంట్

### 2.41 లక్షల మంది గ్యాస్ సబ్సిడీ వదులుకున్నారు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 2.41లక్షల మంది గ్యాస్ సబ్సిడీ వదులుకున్నట్లు కేంద్ర సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు. ఐదేళ్లలో గ్యాస్ సబ్సిడీ వదులుకున్న వారి వివరాలు తెలపాలని రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబురావు అడిగిన ప్రశ్నకు సురేష్ గోపి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

**ప్రత్యేక హోదా ఇవ్వండి..**

ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికైనా ప్రత్యేక హోదా ఇవ్వాలని గొల్ల బాబూరావు ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. రాష్ట్ర విభజన సమయం నుంచి ఏపీకి జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం, స్టీల్ ప్లాంట్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**పరికరాలు పనిచేయని కారణంగా విమానాల్లో లోపం..**



విమానంలో అమర్చిన భాగాలు/పరికరాలు పనిచేయక పోవడంతో విమానాలు సాంకేతిక లోపాలకు గురవుతున్నట్లు కేంద్ర సహాయ మంత్రి మురళీధర్ మోహల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

**ఐదేళ్లలో 39.77లక్షల కుళాయి కనెక్షన్‌లు..**

గత ఐదేళ్లలో జలజీవన్ మిషన్ కింద ఏపీలో ఇంటింటికీ 39.77లక్షల కుళాయి కనెక్షన్‌లు ఇచ్చినట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ తెలిపింది. 2014-19 మధ్య 30.74లక్షలు ఉన్న కనెక్షన్‌ల కంటే ఈ సంఖ్య ఎక్కువని పేర్కొంది. కేంద్ర సహాయ మంత్రి సోమన్న లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

**ఏపీలో చెరకు రైతులకు రూ.44 కోట్ల బకాయిలు పెండింగ్**

ఆంధ్రప్రదేశ్‌లో కూడా చెరకు రైతులకు షుగర్ ఫ్యాక్టరీలు రూ.44 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని ఇటీవల రాజ్యసభలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ వెల్లడించింది. వీటిపై కేంద్ర ప్రభుత్వం అవసరమైనప్పుడు జోక్యం చేసుకుంటుందని.. క్రమం తప్పకుండా చెరకు రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

### తక్కువ వడ్డీతో రూ.3 లక్షల వరకు రైతులకు రుణాలు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రభుత్వం సవరించిన వడ్డీ రాయితీ పథకం కింద ప్రైవేట్ బ్యాంకులకు 1.5 శాతం వడ్డీ సబ్సిడీ అందిస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రూ.3 లక్షల వరకు తక్కువ వడ్డీ రేటుతో రైతులకు పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

**ఏపీలో 855 ఆదర్శ విద్యాలయాలు**



'ప్రధానమంత్రి శ్రీ' పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 855 పాఠశాలలను ఆదర్శ విద్యాలయాలుగా ఎంపిక చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఆదర్శ విద్యాలయాల ఏర్పాటు, నాణ్యమైన విద్య అంశాలపై లోక్‌సభలో వైఎస్సార్ సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

**క్రీడాకారుల్లో నైపుణ్యం పెంచేలా..**



దేశవ్యాప్తంగా క్రీడాకారుల్లో నైపుణ్యం పెంచేందుకు 'ఖేలో ఇండియా- జాతీయ క్రీడల అభివృద్ధి కార్యక్రమం'ను ప్రవేశపెట్టినట్లు కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు. వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ తనూజ రాణి అడిగిన ప్రశ్నకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. కాగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు లేకపోవడం బాధాకరమని తనూజ రాణి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పూర్తి రైల్వే నెట్‌వర్క్ అంతా సికింద్రాబాద్ కేంద్రంగానే పనిచేస్తోందన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్రం చేసిన అన్యాయమని విమర్శించారు. తిరుపతి-విశాఖపట్టణం మధ్య వందేభారత్ స్లీపర్ ట్రైన్‌ను కేటాయించాలని కోరారు. అరకులోయ రైల్వే స్టేషన్‌ను వాల్తేర్ రైల్వే డివిజన్‌లోనే ఉంచాలని డిమాండ్ చేశారు.

## మీడియా పాయింట్

### ఫీజులు కట్టలేక పిల్లలు కూలికి వెళుతున్నారు: టి.కల్పలతారెడ్డి, ఎమ్మెల్సీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 13 లక్షల మంది విద్యార్థులకు ఫీజు బకాయిలు ఇవ్వలేదు. వారి తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారు. ఫీజు కట్టలేని పిల్లలు చదువులు మానేసి పొలాల్లో కూలి పనులకు వెళుతున్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేవారు. పిల్లలందరూ చదువుకొనేవారు. గత ప్రభుత్వ బకాయిలనేవి సహజం. టీడీపీ హయాంలో బకాయిలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. అదే విధంగా కూటమి ప్రభుత్వమూ ఇవ్వాలి. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పీఎఫ్ రుణాలు సకాలంలో చెల్లించాలి.

### బాబు బకాయిలు జగన్ చెల్లించారు: ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మొత్తం ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. అరకొర నిధులతో ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తోంది. బకాయిల గురించి అడిగితే గత ప్రభుత్వంపై నెపం మోపుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారు. వైఎస్ జగన్ సృష్టించిన వలంటీర్ వ్యవస్థను ప్రజలెవరూ మర్చిపోలేరు. కరోనా కష్ట కాలంలోనూ, వరదల సమయంలోనూ వారు అందించిన సేవలు అమోఘం. అలాంటి గొప్ప వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వలంటీర్లను రోడ్డున పడేసింది.

### క్లాప్ వాహనాలను ఎందుకు తొలగించారు? : ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్



మౌలిక సదుపాయాలేమీ లేకుండా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ఎలా సాకారమవుతుంది? గత ప్రభుత్వంలో సుమారు రూ.4 వేల కోట్లతో క్లాప్ వాహనాలు కొన్నారు. ఈ ప్రభుత్వం రాగానే ఆ వాహనాలను తొలగించేసింది. వాటిని వినియోగించి క్లాప్ వాహనాల సిబ్బందిని ప్రభుత్వం ఆదుకోవాలి. చెత్తను శుభ్రం చేసే మనుషులు ఉండాలి కదా.

### జగన్ మళ్లీ సీఎం అయ్యింటే వలంటీర్లను రెన్యువల్ చేసేవారు: ఎమ్మెల్సీ రాచగొల్ల రమేష్



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అయ్యింటే రెండున్నర లక్షల మంది వలంటీర్ల సర్వీసును రెన్యువల్ చేసే వారు. కూటమి నేతలు ఎన్నికల్లో వలంటీర్ల వేతనాలు పెంచుతామని ఆశ చూపించారు. ఇప్పుడేమో 2023 జూన్ నుంచి రెన్యువల్ లేదంటున్నారు. రెన్యువల్ లేనప్పుడు వారిని ఎందుకు మభ్యపెట్టారు? కూటమి ప్రభుత్వంలోనూ వలంటీర్లకు జీతాలు పడ్డాయి. విజయవాడ వరదల్లో జీవో ఇచ్చి మరీ వారి సేవలు వాడుకున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొనసాగించేవారు. వారి సర్వీసు రెన్యువల్ చేయడం ఇష్టం లేదు కాబట్టే చంద్రబాబు ఇలా చేస్తున్నారు.

### మీరు పెట్టిన బకాయిలు మేం కట్టాం: ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



గత ప్రభుత్వం హయాంలో ఫీజు బకాయిలు ఉన్నాయని అంటున్నారు. అంతకు ముందు టీడీపీ పెట్టిన రూ.4 వేల కోట్లకు పైగా రెండేళ్ల బకాయిలను ఒకే రోజు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చెల్లించింది. అప్పటినుంచి 2024 మార్చి వరకూ ప్రతి మూడు నెలలకు నిధులు విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం చెల్లించింది. కానీ కూటమి ప్రభుత్వం బకాయిలు పెట్టేసింది. పీజీ విద్యార్థులకూ ఫీజు రియింబర్స్‌మెంట్ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టింది. ఇప్పుడు మోసం చేస్తోంది. ఫీజు చెల్లించక లక్షలాది మంది విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేకపోతున్నారు.

### ఆసుపత్రుల్లో చిన్న చిన్న సమస్యలను ఎమ్మెల్యేలే పరిష్కరించుకోవాలి

**మంత్రి సత్యకుమార్ సూచన**

సాక్షి, అమరావతి : పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, విలేజీ హెల్త్ క్లినిక్‌లలో ఎక్కడైనా ఫ్యాన్, టేబుల్స్ లేకపోవడం వంటి చిన్న చిన్న పనులను స్థానిక ఎమ్మెల్యేలే వివిధ మార్గాల్లో పూర్తి చేసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సూచించారు. సోమవారం శాసన సభ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పలువురు సభ్యులు పీహెచ్‌సీ నిర్మాణం- వసతులపై అడిగిన ఉప ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. రెండు మూడు నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు సొంత నిధులు, సీఎస్సార్ నిధులతో ప్రభుత్వాసుపత్రుల్లో వసతుల కల్పనకు జరిగిన ప్రయత్నాలు ఉదహరించారు. పీహెచ్‌సీలో చిన్న చిన్న విషయాలను చెబుతున్నారని అన్నారు. ఇటువంటి చిన్న సమస్యలను సభ్యులే పరిష్కరించుకోవాలని తెలిపారు. డయాగ్నొస్టిక్ పరికరాలు వంటివాటికి ప్రభుత్వం నుంచి ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు.

### అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటును విరమించుకోవాలి

సాక్షి, అమరావతి: అనకాపల్లిలో ప్రజల జీవనానికి, పర్యావరణానికి హానికరమైన అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను ఆయన సోమవారం విడుదల చేశారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్ నిర్మాణంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని, మళ్లీ అనకాపల్లి జిల్లాలో అణు విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదనతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారని తెలిపారు. కాగా, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దీనిపై ఈ నెల 18 నుంచి రాష్ట్రవ్యాప్త ధర్నాలతో నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వేరొక ప్రకటనలో తెలిపారు.

### పోలవరం పనుల్లో వేగం పెంచండి

**పీపీఏ సీఈవో అతుల్‌జైన్ ఆదేశం**

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో అతుల్‌జైన్ ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రం నిర్దేశించిన గడువు 2027 మార్చిలోగా పూర్తి చేయాలంటే షెడ్యూల్ ప్రకారం పనులు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై పీపీఏ సీఈవో అతుల్ జైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో జాప్యాన్ని ఎత్తిచూపుతూ.. ఆ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో కొత్తగా చేపట్టిన డయాఫ్రం వాల్ (డీ-వాల్) పనులపై లోతుగా సమీక్షించారు. షెడ్యూల్ ప్రకారమే పనులు చేస్తున్నామని వివరించిన అధికారులు ప్రస్తుతం రెండు కట్టర్లు, గ్రాబర్లతో డీ-వాల్ పనులు చేస్తున్నామని చెప్పారు. మూడో కట్టర్, గ్రాబర్ ఏప్రిల్‌లో అందుబాటులోకి వస్తుందని.. దాంతో పనులు వేగవంతం చేస్తామన్నారు. ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీ నియంత్రణకు బట్రెస్ బెర్మ్ పనులను కూడా ప్రారంభించామని చెప్పారు.

### రెండు డ్రోన్ సరఫరా కంపెనీల ఎంపిక

**కిసాన్ డ్రోన్ రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ సమావేశం**

సాక్షి, అమరావతి: రైతులకు కిసాన్ డ్రోన్స్ సరఫరా కోసం టెక్నికల్ సబ్ కమిటీ సిఫార్సు మేరకు రెండు కంపెనీలను ఎంపిక చేసినట్లు వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ తెలిపారు. సచివాలయంలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ సమావేశంలో డ్రోన్స్ తయారీ కంపెనీలు ప్రదర్శించిన డ్రోన్స్ పనితీరు, పరిశీలన చేసిన విధానంపై చర్చించారు. సమావేశంలో తొలుత వ్యవసాయశాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు మాట్లాడుతూ.. డ్రోగా డ్రోన్ ప్రైవేట్ లిమిటెడ్, విహంగా టెక్నాలజీస్ కంపెనీలకు డ్రోన్స్ నిర్దేశించిన ప్రమాణాల కనుగుణంగా ఉన్నట్లుగా గుర్తించామన్నారు.

• ఇన్ఫెక్షన్

# సెల్యు'లైట్' తీసుకోకండి!

ఓ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కారణంగా చర్మానికి సెల్యులైటిస్ అనే కండిషన్ వస్తుంది. ఇందులో కాలు లేదా చేయి విపరీతంగా వాచిపోయి, చర్మం ఎర్రగా అలాగే బాధితులకు వేడిగా అనిపిస్తుంటుంది. ముట్టుకుంటేనే నొప్పి (టెండర్‌నెస్)తో బాధాకరంగా ఉంటుంది. ఇది చేయి లేదా కాలు అంతటికీ వేగంగా వ్యాపిస్తుంది. ఈ దశలో కూడా చికిత్స సరిగా అందకపోతే చేయి/ కాలికి మాత్రమే పరిమితమైన ఆ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ శరీరమంతా పాకి ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టే ప్రమాదముంది. అందుకే సెల్యులైటిస్ లక్షణాలు కనిపించిన వెంటనే తప్పనిసరిగా చికిత్స తీసుకోవాలి. ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టగల **ఈ సెల్యులైటిస్‌పై** అవగాహన కోసం **ఈ కథనం.**







డా. స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

డా.జి. వెంకటేష్ బాబు
సీనియర్ కన్సల్టెంట్
ప్లాస్టిక్ & కాస్మటిక్ సర్జన్

సెల్యులైటిస్ సాధారణంగా దేహంలోని కాలు, చేయితో పాటు ఏ భాగానికైనా రావచ్చు. కానీ ఈ కండిషన్ కాలిలో కనిపించడమే ఎక్కువ. సెల్యులైటిస్‌తో ప్రభావితమైన కాలు బాగా వాచిపోతుంది. ఎర్రబారుతుంది. ఇలా జరగడాన్ని ఎరిథిమా అంటారు. వాపు వచ్చి ముట్టుకుంటే మంట (ఇన్‌ఫ్లమేషన్)తో, లోపల వేడిగా ఉన్న భావన కలుగుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌తో కూడిన సెల్యులైటిస్‌ను తీవ్రమైన పరిస్థితిగానే పరిగణించాలి. అది కేవలం పై చర్మానికి మాత్రమే పరిమితమైందా లేక లోపలి పొరలూ ప్రభావితమయ్యాయా అన్నదానిపై పరిస్థితి తీవ్రత ఆధార పడి ఉంటుంది. లోపలికి వ్యాపించిన కొద్దీ సెల్యులైటిస్‌లోని ఇన్ఫెక్షన్ రక్తప్రవాహంతో కలిసి లింఫ్‌నోడ్స్‌కూ వ్యాపిస్తుంది.

## సెల్యులైటిస్ కనిపించే సూక్ష్మక్రిములివే...



సెల్యులైటిస్ సోకిన కాలు నునుపుదనంతో ఎర్రగా మెరుస్తూ కనిపిస్తుంది. అంతకు ముందే కాలికేదైనా గాయం ఉండటం, చర్మం చీరుకుపోయి ఉండటం వంటివి జరిగితే దానికి సెల్యులైటిస్ వచ్చే అవకాశాలు మరింత ఎక్కువ. చర్మానికి ఏ కారణంగానైనా పుండ్లు పడి అవి దీర్ఘకాలికంగా ఉన్నప్పుడు అక్కడ బ్యాక్టీరియా చేరడంతో పాటు అది రెండో (సెకండరీ) దశకు చేరితే... అది సెల్యులైటిస్‌కు దారితీయవచ్చు. ఇందుకు చాలారకాల సూక్ష్మక్రిములు (బ్యాక్టీరియా) కారణమవుతాయి. ఉదాహరణకు... స్ట్రెప్టోకాక్సీ, స్టెఫాలోకాక్సీ, సూడోమొనాస్ ఎస్‌పీపీ, బ్యాక్టీరియోడీస్ వంటివి వీటిల్లో ప్రధానమైనవి. ఇవిగాక మరికొన్ని అప్రధాన రకాలకు చెందిన సూక్ష్మజీవులూ ఉంటాయి.

## సెల్యులైటిస్‌లో ఎలా వస్తుందంటే?



వాతావరణంలో ఉండే అనేక సూక్ష్మజీవులను చర్మమే మొదట ఎదుర్కొంటుంది. చర్మం మన లోపలి అవయవాలన్నింటినీ కప్పుతూ ఆ సూక్ష్మజీవులన్నింటి నుంచి మనకు రక్షణ కలిగిస్తుంటుంది. అయితే చర్మంలో ఎక్కడైనా గాయాలైనా, లేదా చీరుకుపోయి ఉన్నా బయటి సూక్ష్మజీవులు ఆ ప్రాంతం లోంచి... చర్మాన్ని దాటి లోపలికి ప్రవేశించగలుగుతాయి. ఉదాహరణకు అథ్లెట్స్ ఫుట్ (టీనియా పెడిస్) వంటి కండిషన్‌లో చర్మానికి ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు లోపలికి ప్రవేశించడమన్నది బ్యాక్టీరియాకు సులభంగా సాధ్యమవుతుంది. ఆ వెంటనే చర్మం తనను తాను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తుంది. ఇందులో భాగంగా ఆ వ్యక్తి తాలూకు వ్యాధి నిరోధక వ్యవస్థ / ఇమ్యూన్ సిస్టమ్ చర్మాన్ని ఎర్రబారుస్తుంది. ఇలా జరిగిన తర్వాత జరిగే పరిణామం సెల్యులైటిస్‌కు దారితీస్తుంది.

## లక్షణాలు



**చర్మం రంగు మారడం:** సెల్యులైటిస్ వచ్చిన భాగంలో చర్మం రంగు మారిపోతుంది. ప్రధానంగా ఎర్రబారుతుంది. అప్పటికే ఎర్రటి చర్మం ఉన్నవారిలో ఇలా ఎర్రబారడం జరిగితే దాన్ని గుర్తుపట్టడం కాస్తంత కష్టమవుతుంది. అదే కాస్త నల్లటి చర్మం ఉన్నవారిలో ఈ రంగు మార్పును వెంటనే గుర్తుపట్టడం సాధ్యమవుతుంది. దాంతో తగిన చికిత్స తీసుకోవడం సాధ్యమవుతుంది.

● **వాపు రావడం :** సాధారణంగా వాపు పాదం నుంచి మొదలై పై వైపునకు వ్యాపిస్తుంటుంది. కొన్నిసార్లు పిక్కల నుంచి కూడా వాపు మొదలు కావచ్చు. ● కాలికి ఎరుపుదనం వచ్చి బాగా వాచిన కారణంగా అది బాగా నునుపుగా అనిపిస్తూ, మెరుస్తూ కనిపిస్తుంది. వాపు కారణంగా చర్మం బాగా బిగుసుకుపోయినట్లుగానూ అనిపిస్తుంటుంది. ● ముట్టుకుంటే మంట / నొప్పితో పాటు లోపల వేడిగా ఉన్నట్లుగానూ అనిపిస్తుంటుంది. ● ఈ కాలివాపు రాక ముందు ఫ్లూ జ్వరం వచ్చినప్పటి లక్షణాలతో... చలితో కూడిన జ్వరం కూడా కనిపించవచ్చు. ● రక్త పరీక్ష చేయిస్తే తెల్లరక్తకణాల సంఖ్య బాగా పెరిగి కనిపిస్తుంది. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ఉందనడానికి ఇది ఒక సూచన. ● వాపు వచ్చిన కాలి భాగంలోని పుండ్ల నుంచి పసుపు రంగుతో కూడిన చీము స్రవిస్తుంటుంది.

## సెల్యులైటిస్‌కు తావిచ్చే కండిషన్స్

- ● చర్మానికి గాయమై అది దీర్ఘకాలికంగా మానకుండా ఉండటం. చర్మం చీరుకుపోయి ఆ గాయం చాలాకాలం మానకపోవడం, కాలి మీద పుండ్లు రావడం.
- ● దీర్ఘకాలంగా ఫంగల్ ఇన్ఫెక్షన్స్ ఉండి, అవి దీర్ఘకాలికంగా మానకుండా ఉండటం (ప్రధానంగా కాలికి... అథ్లెట్స్ ఫుట్ వంటివి).
- ● ఎగ్జిమా, సోరియాసిస్ వంటి చర్మసంబంధమైన రుగ్మతలతో బాధపడేవారిలో చర్మం పగుళ్లుబారి ఉంటుంది కాబట్టి అక్కడి నుంచి బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించే అవకాశాలు ఎక్కువ.
- ● కొద్దిగా అరుదుగా దీర్ఘకాలికంగా ఉండే తీవ్రమైన మొటిమల కారణంగా కూడా.
- ● చర్మం పగుళ్లుబారేలా చేసే కొన్ని రకాల ఇన్ఫెక్షన్స్ ఉందాహరణకు చికెన్‌పాక్స్, షింగిల్స్ వంటి జబ్బులు వచ్చాక సెల్యులైటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువ.



- ● డయాబెటిస్ ఉండి కాలిపై దీర్ఘకాలికంగా పుండ్లు పడటం (డయాబెటిస్ ఉన్నవారిలో సెల్యులైటిస్ వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ).
- ● రక్తనాళాలకు సంబంధించిన జబ్బులు ఉండటం (వేరికోసిక్ వెయిన్స్ వంటివి).
- ● పెరిఫెరల్ వ్యాస్క్యులార్ డిసీజ్ వంటి జబ్బుల కారణంగా.
- ● శరీరంలో లింఫ్ ప్రవాహం తగినంతగా లేకపోవడం వల్ల.
- ● దీర్ఘకాలికంగా కాలేయ సంబంధిత జబ్బులతో బాధపడుతూ ఉండేవారిలో. (అంటే... క్రానిక్ హెపటైటిస్, సిర్రోసిస్ వంటి జబ్బులు ఉన్నవారిలో సెల్యులైటిస్‌కు అవకాశాలెక్కువ).
- ● స్థూలకాయం ఉన్నవారిలో.
- ● ఏదైనా శస్త్రచికిత్స తర్వాత ఏర్పడ్డ గాయం కారణంగా.
- ● చాలా సందర్భాల్లో కాలిన గాయాల కారణంగా.
- ● చర్మంలో ప్రవేశపెట్టే సూదుల కారణంగా (ఇంట్రావీనస్‌గా మందులను పంపడానికి అమర్చే క్యాన్యులా వంటివి), ట్యూబ్స్, ఆర్థోపెడిక్ కేసుల్లో చర్మంలోపల అమర్చే ప్లేట్లు, రాడ్ల వంటి వస్తువుల కారణంగా.
- ● ఎముకలకు వచ్చే ఇన్ఫెక్షన్స్ వల్ల.
- ● కొన్ని కీటకాల కాటు కారణంగా (ప్రధానంగా సాలీడు వంటివి); కొన్ని జంతువులు కరవడం వల్ల.
- ● దీర్ఘకాలికంగా మందులు వాడుతున్నవారిలో వాళ్ల వ్యాధినిరోధక శక్తి (ఇమ్యూనిటీ) తగ్గడం వల్ల...

ఇలాంటి అనేక కారణాల వల్ల సెల్యులైటిస్ రావచ్చు.

## నివారణ

ఒకసారి సెల్యులైటిస్ కనిపించాక దానికి చికిత్స తప్పనిసరి. లేకపోతే అది ప్రాణాపాయానికీ దారితీయవచ్చు. అందువల్ల అది రాకముందే కొన్ని జాగ్రత్తలతో దాన్ని నివారించుకోవచ్చు. ఉదాహరణకు కాలిపై ఎలాంటి దీర్ఘకాలికమైన గాయాలుగానీ లేదా రంధ్రాలూ, పుండ్లు లేకుండా చూసుకోవడం అవసరం. అలాంటివేవైనా ఉంటే వాటిని తగ్గించుకునేందుకు ముందుగా చికిత్స తీసుకోవాలి. లేకపోతే అది సెల్యులైటిస్‌కు దారితీసి, ప్రమాదకరంగా పరిణమించవచ్చు. డయాబెటిస్‌తో బాధపడేవారు మరింత జాగ్రత్త వహించాలి. చర్మంపై ఉండే ఎలాంటి పుండ్లనూ, గాయాలను నిర్లక్ష్యం చేయకూడదు. పూర్తిగా తగ్గేవరకు చికిత్స తీసుకోవాలి.

### చర్మాన్ని పొడిగా ఉంచుకోవడం (డ్రై స్కిన్)

చర్మాన్ని ఆరోగ్యంగా, పొడిగా ఉంచుకోవడం వల్ల వీలైనంతగా సెల్యులైటిస్‌ను నివారించవచ్చు. సాఫ్ట్ పారఫిన్‌ను, లిక్విడ్ పారఫిన్‌ను సగం, సగం పాళ్లలో కలిపి, చర్మానికి (ప్రధానంగా కాళ్లకు) రాసుకోవడం వల్ల చర్మాన్ని సంరక్షించుకోవచ్చు. ఇలాంటి చర్మ సంరక్షణ చర్యలతో సెల్యులైటిస్‌ను చాలావరకు నివారించుకోవచ్చు.

### వాచిన కాలిని కాస్త ఎత్తున ఉంచడం...

సెల్యులైటిస్ కారణంగా వాపు వచ్చిన కాలిని... పడుకున్న సమయంలో మిగతా శరీరం కంటే కాస్త ఎత్తున ఉండేలా జాగ్రత్త తీసుకోవడం (కాలి కింద దిండు ఉంచడం లాంటి చర్యలతో) వల్ల కాస్త ఉపశమనం దొరుకుతుంది.

## ఒకసారి సెల్యులైటిస్ సోకాక...

● ఒకసారి సెల్యులైటిస్ సోకిన తర్వాత అది వ్యాపిస్తూ ఉంటుంది. ఎలాంటి స్రావాలు లేకుండా కేవలం వాపు మాత్రమే కనిపించే దాన్ని 'డ్రై సెల్యులైటిస్' అంటారు. ఈ దశలో సెల్యులైటిస్‌కు సరైన చికిత్స తీసుకోకపోతే అది వ్యాపించిన మేరకు కణజాలం నాశనమవుతుంటుంది. డ్రై సెల్యులైటిస్‌లో చర్మంపై ఎర్రటి మచ్చలు కూడా కనిపిస్తుంటాయి. డ్రై సెల్యులైటిస్‌కు వెంటనే చికిత్స తీసుకోకపోతే చర్మంపై సన్నటి పగుళ్ల వంటివి ఏర్పడి అందులోంచి నీరు స్రవిస్తుంటుంది. దీన్నే వెట్ సెల్యులైటిస్ అంటారు.

● సాధారణంగా కాలి బొటనవేలికి దీర్ఘకాలంగా ఉండే గాయం వల్ల సెల్యులైటిస్ వస్తుంటుంది. సెల్యులైటిస్ కాలి భాగం నుంచి పైకి విస్తరిస్తూ పోతుంటే దాన్ని అసెండింగ్ సెల్యులైటిస్ అంటారు. సాధారణంగా స్ట్రెప్టోకోకల్ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌లో ఇలా జరుగుతుంది. సెల్యులైటిస్ అన్నది ఒక కాలికే కనిపిస్తుంటే దీన్ని యూనిలేటరల్ సెల్యులైటిస్‌గా పేర్కొంటారు. ఈ యూనిలేటరల్ సెల్యులైటిస్ చాలా సాధారణం. కానీ కొంతమందిలో రెండుకాళ్లకూ సెల్యులైటిస్ కనిపించ వచ్చు. కాకపోతే ఇది కాస్తంత అరుదు. ఇలా రెండుకాళ్లకూ సెల్యులైటిస్ రావడాన్ని 'బైలేటర్ కాంకరెంట్ సెల్యులైటిస్' అంటారు.

## చికిత్స

### యాంటీబయాటిక్స్‌తో చికిత్స

స్ట్రెప్టోకాక్సి, స్టెఫాలోకాక్సి బ్యాక్టీరియాను మట్టుపెట్టే యాంటీబయాటిక్స్ మందులను నోటి ద్వారా తీసుకోవడం లేదా తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో నరానికి ఇంజెక్షన్ ద్వారా పంపడం వంటి చికిత్స అందిస్తారు.

### వ్యాయామం (ఫిజియోథెరపీ)

వాపు తగ్గేలా కాలి వేళ్లు కదిలించే కొన్ని వ్యాయామాలు చేయడం అవసరమవుతుంది.



## కొన్ని జాగ్రత్తలు

**సెల్యులైటిస్‌ను నివారించుకోడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు.**

- ● కాలిపై ఎలాంటి గాయాలూ లేకుండా చూసుకోవడం.
- ● కాలి గోళ్లను తీసుకునే సమయంలో గాయం కాకుండా జాగ్రత్త వహించడం.
- ● కీటకాలు, జంతువులు కుట్టకుండా / కరవకుండా వాటిని దూరంగా ఉంచడం.
- ● కాలిన గాయాలైనప్పుడు అవి పూర్తిగా తగ్గేవరకు జాగ్రత్తగా ఉండటం.
- ● కాలికి గాయాలు ఉన్నవారు, కాలిన గాయాలైన వారు మురికినీళ్లలోకి వెళ్లకపోవడం. గాయమైన కాలితో సముద్రపు నీటిలోకి వెళ్లకపోవడం.
- ● కాలికి సరిగ్గా సరిపోయి, సౌకర్యంగా ఉండే పాదరక్షలు / షూస్ ధరించడం. (కాలికి గాయాన్ని చేస్తూ, బాధను కలిగించే షూస్‌ను బలవంతంగా తొడగకూడదు. చెప్పులు లేదా షూ కరవడం, కాలికి గాయం చేయడం వంటివి జరుగుతుంటే ఆ పాదరక్షలను తొడగడం మానేసి, సౌకర్యంగా ఉండే వాటినే తొడుక్కోవాలి. పాదరక్షల వల్ల కాలికి గాయాలవుతున్నాయా అంటూ తరచూ పరీక్షించుకుంటూ ఉండాలి. ముఖ్యంగా డయాబెటిస్‌తో బాధపడేవారు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి)
- ● అథ్లెట్స్ ఫుట్ వంటి ఇన్ఫెక్షన్‌తోపాటు అన్ని రకాల ఫంగల్ ఇన్ఫెక్షన్స్‌కు తగిన చికిత్స తీసుకుని పూర్తిగా తగ్గేలా జాగ్రత్త వహించడం
- ● వేరికోస్ వెయిన్స్ వంటి సమస్య వస్తే అది తగ్గేలా చికిత్స తీసుకోవడం
- ● సెల్యులైటిస్ లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం.

చివరగా... సెల్యులైటిస్ వచ్చి, అది ప్రాణాంతకం అవడం కంటే ... కేవలం చిన్న చిన్న జాగ్రత్తలతో అసలది రాకుండానే చూసుకోవడం మేలు. ●

## బిజినెస్ రీల్

### ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ జోరు

100 కోట్లు దాటిన లావాదేవీలు

న్యూఢిల్లీ: ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ 2025 జనవరిలో 100 కోట్ల(బిలియన్) లావాదేవీల మార్క్‌ను అధిగమించింది. వార్షికంగా 47 శాతం వృద్ధి సాధించినట్లు కంపెనీ ఎండీ, సీఈవో అనుబ్రత విశ్వాస్ పేర్కొన్నారు. డిజిటల్ బ్యాంకింగ్, పేమెంట్ సొల్యూషన్లు కస్టమర్లను ఆకట్టుకుంటున్న విషయాన్ని లావాదేవీలు తెలియజేస్తున్నాయని చెప్పారు. గత కొన్నేళ్లుగా బ్యాంక్ నిర్మించుకున్న డైవర్స్ బిజినెస్ మోడల్‌ను ఇవి ప్రతిబింబిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ సేవలందిస్తున్న ప్రధాన కస్టమర్ విభాగాలలో పరిశ్రమలు, సంస్థలుసహా.. అర్బన్ డిజిటల్, బ్యాంకింగ్ సర్వీసులు అందుబాటులోలేని వ్యక్తులు (అండర్‌బ్యాంక్‌డ్) ఉన్నట్లు వివరించారు.

### మినిమలిస్ట్ కొనుగోలుకి ఓకే

హెచ్‌యూఎల్‌కు సీసీఐ అనుమతి



న్యూఢిల్లీ: సౌందర్యం, వ్యక్తిగత సంరక్షణ బ్రాండ్ మినిమలిస్ట్ కొనుగోలుకి ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్)కు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) ఇందుకు అనుమతించినట్లు హెచ్‌యూఎల్ పేర్కొంది. మాతృ సంస్థ అప్‌రైజింగ్ సైన్స్ నుంచి మినిమలిస్ట్‌లో తొలుత 90.5 శాతం వాటాను సొంతం చేసుకోనుంది. తదుపరి రెండేళ్లలో మిగిలిన 9.5 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఇందుకు రూ. 2,955 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో సెకండరీ వాటా కొనుగోలుకి రూ. 2,670 కోట్లు వెచ్చించనుంది. ఆపై మరో రూ. 45 కోట్లు ప్రైమరీ పెట్టుబడుల ద్వారా అందించనుంది.

### హెచ్‌పీసీఎల్ నూతన సీఎండీ

### వికాస్ కౌశల్ బాధ్యతల స్వీకరణ



ముంబై: ప్రభుత్వ రంగ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) కొత్త చైర్మన్, ఎండీగా వికాస్ కౌశల్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రైవేట్ రంగానికి చెందిన కన్సల్టెంట్..., దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థ అధిపతిగా పగ్గాలు చేపట్టడం ఇదే ప్రథమం. ఆయన గతంలో మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సంస్థ కెర్నీలో పని చేశారు. పంజాబ్ యూనివర్సిటీలో కెమికల్ ఇంజనీరింగ్, ఐఐటీ అహ్మదాబాద్‌లో ఎంబీఏ పూర్తిచేశారు. పీకే జోషి పదవీ విరమణ తర్వాత గత ఏడాది ఆగస్టు 31 నుంచి హెచ్‌పీసీఎల్ చైర్మన్ పదవి ఖాళీగానే ఉంది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

| 18-3-2025 | |
|---|---|
| విశాఖ | 415-00 |
| చిత్తూరు | 443-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 415-00 |
| విజయవాడ | 430-00 |
| రిటైల్ ధర (డజను) | 60.00 |
| హైదరాబాద్ | 405-00 |
| వరంగల్ | 407-00 |
| రిటైల్ ధర | 4.65 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| DRREDDY | 1,151.50 | 3.93 |
| SBILIFE | 1,439.50 | 3.89 |
| BAJAJFINSV | 1,875.10 | 3.74 |
| TRENT | 5,150.00 | 2.54 |
| AXISBANK | 1,034.00 | 2.36 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| WIPRO | 259.95 | -1.53 |
| BPCL | 261.41 | -1.13 |
| HEROMOTOCO | 3,490.00 | -1.11 |
| ITC | 407.8 | -1.03 |
| NESTLEIND | 2,171.00 | -0.96 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 4,423 |
| ఎన్ఎస్ఈ | 75,429 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,27,747 |
| ఎఫ్ఐఐ | - 793 |
| డీఐఐ | + 1,724 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 67.37 | $ 66.91 |
| బ్రెంట్ | 71.10 | $ 70.58 |

# బ్లాక్‌స్టోన్ చేతికి కోల్టేపాటిల్

- 26 శాతం వాటాకు ఓపెన్ ఆఫర్
- షేరుకి రూ. 329 ధరలో కొనుగోలు
- ప్రమోటర్ల నుంచి 40 శాతం వాటా
- 66% వాటాకు రూ. 1,800 కోట్లు



న్యూఢిల్లీ: దేశీ రియల్టీ కంపెనీ కోల్టే పాటిల్‌ను కొనుగోలు చేస్తున్న గ్లోబల్ పెట్టుబడుల దిగ్గజం బ్లాక్‌స్టోన్ తాజాగా సాధారణ వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఇందుకు షేరుకి రూ. 329 ధరలో దాదాపు రూ. 759 కోట్లు వెచ్చించనుంది. తొలుత ప్రమోటర్ల నుంచి 25.7 శాతం వాటా(2.28 కోట్ల షేర్లు) సొంతం చేసుకోనున్నట్లు గత వారం ప్రకటించిన విషయం విదితమే. ఇందుకు రూ. 750 కోట్లు వెచ్చించనుంది. మరోవైపు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో దాదాపు 1.27 కోట్ల ఈక్విటీ షేర్ల కోసం రూ. 417 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీంతో మరో 14.3 శాతం వాటా చేజిక్కించుకోనుంది. వెరసి 40 శాతం వాటాకు రూ. 1,157 కోట్లు వెచ్చించనుంది. ఈ బాటలో సాధారణ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలుకి తాజాగా ఓపెన్ ఆఫర్ ప్రకటించింది.

**2.3 కోట్ల షేర్లకు**

బ్లాక్‌స్టోన్ గ్రూప్ సంస్థలు పబ్లిక్ వాటాదారుల నుంచి 2.3 కోట్ల షేర్లు(26 శాతం వాటా) కొనుగోలు చేసేందుకు ఓపెన్ ఆఫర్ ప్రకటించినట్లు కోల్టే పాటిల్ తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. షేరుకి రూ. 329 ధరలో ఆఫర్ ఇచ్చినట్లు తెలియజేసింది. దీంతో కంపెనీలో బ్లాక్‌స్టోన్ మొత్తం 66 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు పేర్కొంది. ఇందుకు రూ. 1,800 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వెల్లడించింది. గత రెండు దశాబ్దాలలో దేశీయంగా 50 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసిన బ్లాక్‌స్టోన్.. పెట్టుబడులను 100 బిలియన్ డాలర్లకు పెంచనున్నట్లు ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో తాజా కొనుగోలుకి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా.. కోల్టే పాటిల్‌లో ప్రస్తుతం ప్రమోటర్లకు 69.45 శాతం వాటా ఉంది.

### ఆక్జో నోబెల్ రేసులో



దేశీ పెయింట్ల బిజినెస్‌ను విక్రయించే ప్రణాళికల్లో ఉన్న డచ్ దిగ్గజం ఆక్జో నోబెల్‌కు తాజాగా బ్లాక్‌స్టోన్ నాన్‌బైండింగ్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆక్జో నోబెల్ ఇండియా కొనుగోలుకి 1.2 బిలియన్ డాలర్ల(రూ. 10,400 కోట్లు) విలువైన బిడ్ దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వెరసి రేసులో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, పిడిలైట్ ఇండస్ట్రీస్ తదితర దేశీ దిగ్గజాలతో పోటీకి తెరతీసినట్లు పరిశ్రమ వర్గాలు తెలియజేశాయి. ప్రస్తుతం దేశీ పెయింట్ల సంస్థలో మాతృ సంస్థ ఆక్జో నోబెల్ ఎన్‌వీకు 74.76 శాతం వాటా ఉంది.

## 2.38 శాతానికి టోకు ద్రవ్యోల్బణం

ఫిబ్రవరిలో స్వల్ప పెరుగుదల ● జనవరిలో 2.31%



న్యూఢిల్లీ: టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం ఫిబ్రవరి నెలలో కాస్తంత ఎగసి 2.38 శాతానికి చేరింది. జనవరి నెలకు ఇది 2.31 శాతంగా ఉంది. ఆహార వస్తువుల ధరలు, తయారీ, వెజిటబుల్ ఆయిల్, పానీయాల ధరలు పెరగడం ద్రవ్యోల్బణం పెరిగేలా చేసింది. దీంతో మూడు నెలల వరుస క్షీణతకు బ్రేక్ పడింది. ఆహారోత్పత్తుల ధరల ద్రవ్యోల్బణం 11.06 శాతానికి పెరిగింది. వెజిటబుల్ ఆయిల్ ద్రవ్యోల్బణం 33.59 శాతానికి చేరింది. ఇక పానీయాలకు సంబంధించి 1.66 శాతానికి ఎగిసింది. తయారీ ఉత్పత్తుల టోకు ధరల సూచీఫిబ్రవరిలో 0.42 శాతం మేర పెరిగింది. కూరగాయల ధరల (బంగాళాదుంప సహా) ద్రవ్యోల్బణం జనవరిలో ఉన్న 74.28 శాతం నుంచి ఫిబ్రవరిలో 27.54 శాతానికి తగ్గింది. పాల ధరలకు సంబంధించి 5.40 శాతం నుంచి 1.58 శాతానికి దిగొచ్చింది. పండ్లకు సంబంధించి 20 శాతం, ఉల్లిపాయలకు సంబంధించి ద్రవ్యోల్బణం 48.05 శాతం చొప్పున ఇప్పటికీ గరిష్ట స్థాయిల వద్దే కొనసాగుతోంది. ఇంధనం, విద్యుత్ విభాగంలో ప్రతి ద్రవ్యోల్బణం (మైనస్ 0.71 శాతం) నమోదైంది. జనవరిలోనూ మైనస్ 2.78 శాతంగా ఉండడం గమనార్హం. రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం ఫిబ్రవరి నెలలో ఏడు నెలల కనిష్ట స్థాయి అయిన 3.61 శాతానికి తగ్గిపోవడం తెలిసిందే. పంటల దిగుబడి మెరుగ్గా ఉండడానికి తోడు, అధిక బేస్‌తో సమీప కాలంలో టోకు ద్రవ్యోల్బణం మరింత దిగొస్తుందన్న అభిప్రాయాన్ని ఇక్రా సీనియర్ ఆర్థికవేత్త రాహుల్ అగర్వాల్ వ్యక్తం చేశారు. 2025-26లో టోకు ద్రవ్యోల్బణం 2.5-3 శాతం మధ్య ఉండొచ్చన్నది ఇక్రా అంచనాగా ఉంది.

# డెట్ ఫండ్స్‌కు అమ్మకాల సెగ

- ఫిబ్రవరిలో రూ.6,525 కోట్ల ఉపసంహరణ
- అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో అమ్మకాలు
- చెక్కుచెదరని డెట్ ఫండ్స్ ఏయూఎం




న్యూఢిల్లీ: డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఫిబ్రవరి నెలలో నికరంగా పెట్టుబడులను కోల్పోయాయి. రూ.6,525 కోట్లను ఇన్వెస్టర్లు ఉపసంహరించుకున్నారు. అంతకుముందు నెల జనవరిలో రూ.1.28 లక్షల కోట్లను డెట్ ఫండ్స్ ఆకర్షించడం గమనార్హం. మొత్తం 16 విభాగాలకు గాను 10 విభాగాల నుంచి ఇన్వెస్టర్లు నికరంగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నట్టు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. "స్వల్పకాలానికి పెట్టుబడులను ఉపసంహరించుకున్నప్పటికీ పోర్ట్‌ఫోలియో పరంగా డెట్ ఫండ్స్ ఎంతో ముఖ్యమైనవి. మార్కెట్ పరిస్థితులు కుదుటపడితే రానున్న రోజుల్లో పెట్టుబడుల రాక స్థిరపడొచ్చు"అని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మెష్రామ్ తెలిపారు. నికరంగా పెట్టుబడులు బయటకు వెళ్లినప్పటికీ మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని మొత్తం డెట్ పెట్టుబడుల విలువ (డెట్ ఏయూఎం) ఫిబ్రవరి చివరికి రూ.17.08 లక్షల కోట్లకు చేరడం గమనార్హం. జనవరి చివరికి ఇది రూ.17.06 లక్షల కోట్లుగా ఉంది.

**పాజిటివ్–నెగెటివ్**

- లిక్విడ్ ఫండ్స్‌లోకి నికరంగా రూ.4,977 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- కార్పొరేట్ బాండ్ ఫండ్స్ రూ.1,065 కోట్లు, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ రూ.473 కోట్ల చొప్పున ఆకర్షించాయి.
- మీడియం టు లాంగ్ డ్యురేషన్ ఫండ్స్, గిల్ట్ ఫండ్స్‌లోకి స్వల్పంగా పెట్టుబడులు పెరిగాయి.
- అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ నుంచి రూ.4,281 కోట్లు బయటకు వెళ్లిపోయాయి.
- మనీ మార్కెట్ ఫండ్స్ రూ.276 కోట్లు, లో డ్యురేషన్ ఫండ్స్, ఓవర్‌నైట్ ఫండ్స్ నుంచి ఇన్వెస్టర్లు రూ.2,264 కోట్లను వెనక్కి తీసుకున్నారు. ఫిబ్రవరి నెల ఉపసంహరణల్లో ఈ నాలుగు విభాగాల నుంచే 90 శాతం ఉండడం గమనార్హం.

**వడ్డీ రేట్ల కోతపై అంచనాలు:** "ఆర్‌బీఐ రానున్న రోజుల్లో వడ్డీ రేట్లను తగ్గిస్తుందని ఇన్వెస్టర్లు అంచనా వేస్తున్నట్టున్నారు. దీనివల్ల లాంగ్ డ్యురేషన్ ఫండ్స్‌లో పెట్టుబడుల వృద్ధి జరుగుతుంది. తక్కువ క్రెడిట్ రిస్క్ కారణంగా గిల్ట్ ఫండ్స్‌కు ఆదరణ కొనసాగుతోంది. ఆర్థిక అనిశ్చితుల్లో పెట్టుబడులకు దీన్ని మెరుగైన విభాగంగా ఇన్వెస్టర్లు చూస్తున్నారు"అని మెష్రామ్ వివరించారు. ఫిబ్రవరి నెలలో ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడులు నికరంగా 26 శాతం తగ్గి (జనవరితో పోల్చి చూస్తే) రూ.29,303 కోట్లుగా ఉండడం గమనార్హం. అన్ని విభాగాలూ కలిపి ఫిబ్రవరిలో ఫండ్స్ పరిశ్రమ నికరంగా ఆకర్షించిన పెట్టుబడులు రూ.40,000 కోట్లుగా ఉన్నాయి.

## ప్రత్యక్ష పన్ను వసూళ్లలో జోరు

- రూ.21.26 లక్షల కోట్లు
- మార్చి 16 నాటికి 13% అధికం
- రిఫండ్‌లు సైతం పెరుగుదల




న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్నుల ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా జోరుచూపిస్తోంది. మార్చి 16 వరకు రూ.21.26 లక్షల కోట్లు నికరంగా వసూలైనట్టు ప్రభుత్వ డేటా వెల్లడిస్తోంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 13 శాతానికి పైగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులకు చివరి తేదీ మార్చి 15తో ముగిసింది. కార్పొరేట్ పన్ను విభాగంలో అడ్వాన్స్ ట్యాక్స్ 12 శాతానికి పైగా పెరిగి రూ.7.57 లక్షల కోట్లుగా ఉంది. నికర నాన్ కార్పొరేట్ ట్యాక్స్ (ఇందులో వ్యక్తిగత ఆదాయపన్ను ప్రధానమైనది) క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 17 శాతం ఎగిసి రూ.11.01 లక్షల కోట్లుగా ఉంది. నిబంధనల ప్రకారం ఒక ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన పన్ను రూ.10,000 మించితే వారు ముందస్తు పన్నును ఆర్థిక సంవత్సరం ముగింపులోపే చెల్లించాల్సి ఉటుంది. నాలుగు వాయిదాల్లో (జూన్ 15, సెప్టెంబర్ 15, డిసెంబర్ 15, మార్చి15) దీన్ని చెల్లించొచ్చు.

**భారీగా పెరిగిన ఎస్‌టీటీ ఆదాయం**

సెక్యూరిటీల లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) 56 శాతం వృద్ధితో రూ.53,095 కోట్లుగా నమోదైంది. రిఫండ్‌లు సైతం రూ.3.60 లక్షల కోట్లకు పెరిగాయి. మార్చి 16 నాటికి స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు (రిఫండ్‌లు సహా) 16 శాతం పెరిగి రూ.25.86 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.22.07 లక్షల కోట్ల ఆదాయపన్ను వసూళ్లను ప్రభుత్వం తొలుత అంచనా వేయగా, తర్వాత రూ.22.37 లక్షల కోట్లకు సవరించడం గమనార్హం.

# రీసెర్చ్‌పై ఐడియాఫోర్జ్ దృష్టి

ఈ ఏడాది అధిక పెట్టుబడులు




ముంబై: డ్రోన్ల తయారీ కంపెనీ ఐడియాఫోర్జ్ టెక్నాలజీస్ ఈ ఆర్థిక సంవత్సరంలో పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)పై అధిక దృష్టిని సారించనుంది. ఇందుకు అనుగుణంగా అత్యధిక పెట్టుబడులు వెచ్చించనుంది. అన్‌మ్యాన్‌డ్ ఏరియల్ వెహికల్(యూఏవీ) విభాగంలో టెక్నాలజీ, ప్రొడక్ట్ ప్లాట్‌ఫామ్స్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు ఐడియాఫోర్జ్ తెలియజేసింది. దేశీయంగా డ్రోన్ రీసెర్చ్‌ను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్న నేపథ్యంలో వీటి అభివృద్ధి, తయారీకి ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేసింది. యూఏవీ విభాగంలో వృద్ధి కొనసాగేందుకు ఉత్పత్తులు, మార్కెట్ రీసెర్చ్‌లో ఇన్నోవేషన్ తప్పనిసరని కంపెనీ పేర్కొంది. గత రెండేళ్లలో ఆర్‌అండ్‌డీపై ఆదాయంలో 22 శాతాన్ని వెచ్చించినట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఆదాయం ఆధారంగా పెట్టుబడులు కేటాయించనున్నట్లు తెలియజేసింది. అయితే 2023-24కంటే అధికంగా నిధులు వినియోగించనున్నట్లు ఐడియాఫోర్జ్ సహవ్యవస్థాపకుడు, సీఈవో అంకిత్ మెహతా వివరించారు. కాగా.. 2023-24లో కంపెనీ రూ. 314 కోట్ల ఆదాయం, రూ. 45 కోట్ల నికర లాభం ఆర్జించిన సంగతి తెలిసిందే.

### బ్లూస్మార్ట్‌పై ఉబర్ కన్ను

ఈవీ క్యాబ్ సర్వీసుల కంపెనీ కొనుగోలుకి చర్చలు




న్యూఢిల్లీ: క్యాబ్ సర్వీసుల అగ్రిగేటర్ ఉబర్ తాజాగా బ్లూస్మార్ట్ కొనుగోలుకి చర్చలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) ఆధారిత క్యాబ్ సర్వీసుల కంపెనీ బ్లూస్మార్ట్ నుంచి మాతృ సంస్థ జెన్సాల్ ఇంజినీరింగ్ బయటపడే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల కొద్ది రోజులుగా లిక్విడిటీ సమస్యలు ఎదుర్కొంటున్న జెన్సాల్ వాటా విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశాయి. అయితే ఉబర్‌తో చర్చల అంశాన్ని బ్లూస్మార్ట్ తోసిపుచ్చడం గమనార్హం! ప్రస్తుతం కార్యకలాపాల విస్తరణపై దృష్టి సారించినట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలియజేశారు. కాగా.. ఈపీసీ సంస్థ జెన్సాల్ 2019లో ఈవీ బిజినెస్‌లోకి ప్రవేశించింది. బ్లూస్మార్ట్ ద్వారా పూర్తి ఎలక్ట్రిక్ క్యాబ్‌లతో ఉబర్, ఓలాకు పోటీగా ట్యాక్సీ సర్వీసులకు తెరతీసింది. పట్టణ ప్రాంతాలలో వేగంగా వృద్ధి చెందుతున్న వ్యక్తిగత ప్రయాణ సర్వీసులపై దృష్టిపెట్టి బ్లూస్మార్ట్‌ను ఆవిష్కరించింది.

### స్పైస్‌జెట్‌లో సింగ్ వాటా విక్రయం

- 2 కోట్ల షేర్ల విక్రయం
- డీల్ విలువ రూ. 90 కోట్లు



న్యూఢిల్లీ: చౌక ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌లో చైర్మన్, ఎండీ అజయ్ సింగ్ తాజాగా 1.6 శాతం వాటా విక్రయించారు. ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా షేరుకి రూ. 45 ధరలో 2 కోట్ల షేర్లు అమ్మివేశారు. వీటి విలువ రూ. 90 కోట్లుకాగా.. బోటిక్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఫ్లూటస్ వెల్త్‌మేనేజ్‌మెంట్ 75 లక్షల షేర్లు కొనుగోలు చేసింది. ఇతర కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. గత వారం సైతం సింగ్ దాదాపు 1 శాతం వాటాను రూ. 52 కోట్లకు విక్రయించారు. కాగా.. ప్రమోటర్ గ్రూప్ ద్వారా అజయ్ సింగ్ కంపెనీలో రూ. 294 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు స్పైస్‌జెట్ వెల్లడించింది. వారంట్లను ఈక్విటీ రూపంలో మార్పిడి చేసుకోవడం ద్వారా నిధులను అందించనున్నట్లు తెలియజేసింది. దీంతో ప్రమోటర్ గ్రూప్ వాటా 33 శాతానికి పెరగనుంది.

# ఏప్రిల్ నుంచి కార్ల ధరలు అప్

జాబితాలో మారుతీ సుజుకీ, టాటా మోటార్స్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజాలు వచ్చే నెల(ఏప్రిల్) నుంచి వాహన ధరలను పెంచే సన్నాహాల్లో ఉన్నాయి. పెరిగిన ముడిసరుకుల వ్యయాలను కొంతవరకూ సర్దుబాటు చేసుకునే ప్రణాళికల్లో భాగంగా ధరలు పెంచనున్నట్లు చెబుతున్నాయి. ప్రధానంగా కార్ల తయారీ కంపెనీలు ధరల పెంపు యోచనను వెల్లడించాయి. అన్ని మోడళ్ల కార్ల ధరలనూ 4 శాతం వరకూ పెంచే యోచనలో ఉన్నట్లు మారుతీ సుజుకీ పేర్కొంది. వాణిజ్య వాహన ధరలను 2 శాతంవరకూ పెంచనున్నట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. ఈ బాటలో హోండా కార్స్ సైతం ధరల పెంపువైపు చూస్తున్నట్లు తెలియజేసింది. వెరసి కొత్త ఏడాది(2025)లో రెండోసారి ధరల పెంపును చేపట్టనున్నాయి.

**ముడివ్యయాల సర్దుబాటు**

ముడిసరుకులతోపాటు నిర్వహణ వ్యయాలు పెరగడంతో కార్ల ధరలను సవరించనున్నట్లు మారుతీ సుజుకీ పేర్కొంది. మోడల్ ఆధారంగా గరిష్టంగా 4 శాతంవరకూ ధరల పెంపు ఉండొచ్చని తెలియజేసింది. కస్టమర్లపై వ్యయ ప్రభావాన్ని కనీసస్థాయికి పరిమితం చేసే బాటలో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. ప్రస్తుతం మారుతీ ఎంట్రీలెవల్ ఆల్టో కే10సహా ఎంపీవీ.. ఇన్విక్టో వరకూ పలు మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరలు(ఢిల్లీ ఎక్స్‌షోరూమ్) రూ. 4.23 లక్షల నుంచి రూ. 29.22 లక్షలవరకూ ఉన్నాయి. ఫిబ్రవరి 1 నుంచి మారుతీ కార్ల ధరలను గరిష్టంగా రూ. 32,500 వరకూ పెంచిన సంగతి తెలిసిందే. ఈ బాటలో టాటా మోటార్స్ సైతం ఏప్రిల్ నుంచి వాణిజ్య వాహన ధరలను 2 శాతంవరకూ పెంచనున్నట్లు ప్రకటించింది. ఇక హోండా కార్స్ ఇండియా సైతం వాహన ధరలను పెంచే యోచనలో ఉన్నట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

## ఎరిక్‌సన్, వోల్వో, ఎయిర్‌టెల్ జత

తయారీలో ఏఐ తదితర టెక్నాలజీల వినియోగంపై దృష్టి

న్యూఢిల్లీ: సాంకేతిక పరిశోధనల కోసం దిగ్గజాలు ఎరిక్‌సన్, వోల్వో గ్రూప్, భారతీ ఎయిర్‌టెల్ చేతులు కలిపాయి. తద్వారా ఎక్స్‌టెండెడ్ రియల్టీ, డిజిటల్ ట్విన్ టెక్నాలజీస్, తయారీ రంగంలో ఏఐకున్న అవకాశాలను అన్వేషించనున్నట్లు పేర్కొన్నాయి. 5జీ, 5జీ అడ్వాన్స్‌డ్ వినియోగం ద్వారా పారిశ్రామిక కార్యకలాపాల ట్రాన్స్‌ఫార్మేషన్, సిబ్బంది శిక్షణను మెరుగుపరచడం, రియల్ టైమ్ ప్రాసెస్‌ను పటిష్టపరరచడానికి తాజా భాగస్వామ్యం ప్రయత్నించనున్నట్లు తెలియజేశాయి. బెంగళూరులోని వోల్వో గ్రూప్ ఫ్యాక్టరీ, ఆర్‌అండ్‌డీ సెంటర్ వద్ద రీసెర్చ్ కార్యకలాపాలకు తెరతీయనున్నట్లు వెల్లడించాయి. మానవ, మెషీన్ సంబంధ, సహకార తదితర భవిష్యత్ ఇండస్ట్రియల్ మెటావర్స్ అప్లికేషన్లపై పనిచేయనున్నాయి.

# జీడీపీలో 50 శాతానికి ఎంఎస్ఎంఈ వాటా

- ఏఐ, ఎంఎల్‌తో పెరగనున్న ఉత్పాదకత
- 17.5 కోట్లకు ఉపాధి అవకాశాలు
- 'ఆఫ్‌బిజినెస్' సంస్థ అంచనా

రాంచీ: స్థూల ఉత్పాదకతలోనూ, ఉపాధి కల్పనలోనూ కీలక భూమిక పోషిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) పాత్రను కృత్రిమ మేథ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) మరింత ఇనుమడింపజేస్తాయని 'ఆఫ్‌బిజినెస్' అంటోంది. ప్రస్తుతం జీడీపీలో 30 శాతం ఎంఎస్ఎంఈ రంగం నుంచే సమకూరుతుండగా.. ఏఐ, ఎంఎల్ సాయంతో వీటి ఉత్పాదకత వాటాను 50 శాతానికి చేర్చొచ్చని అంచనా వేసింది. అలాగే, ఈ రంగంలో ప్రస్తుతం 11 కోట్లుగా ఉన్న ఉపాధి అవకాశాలను 17.5 కోట్లకు పెంచొచ్చని బీ2బీ ఈకామర్స్ సంస్థ అయిన ఆఫ్‌బిజినెస్ తన తాజా నివేదికలో తెలిపింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చేయగలదని పేర్కొంది. ఎస్ఎంఈల్లో చాలా వరకు తమ ఉత్పత్తిని పెంచుకునేందుకు ఏఐ, ఎంఎల్ అప్లికేషన్లను తమ కార్యకలాపాల్లో అమలు చేయాలని అనుకుంటున్నట్టు తెలిపింది. ముడి సరుకుల కొనుగోళ్లు, అనుసంధానత, పంపిణీ నెట్‌వర్క్, వినూత్నమైన ఉత్పత్తులు, సిబ్బందికి శిక్షణ, వ్యర్థాల నిర్వహణ, మరీ ముఖ్యంగా సమయ నిర్వహణలో ఏఐ, ఎంఎల్ ఎంఎస్ఎంఈలకు సాయపడతాయని వెల్లడించింది.

**ఏఐ ప్లాట్‌ఫామ్‌ల సాయం..**

ఎస్ఎంఈలకు 'బిడ్‌అసిస్ట్' తరహా ఏఐ ఆధారిత ప్లాట్‌ఫామ్‌లు అవసరమని.. ఇది వివిధ ప్రభుత్వ విభాగాల్లో 50 లక్షల మేర టెండర్ల సమాచారాన్ని అందిస్తుందని ఆఫ్‌బిజినెస్ నివేదిక తెలిపింది. అలాగే 'నెక్సిజో.ఏఐ' అన్నది ఎప్పటికప్పుడు తాజా కమోడిటీ ధరల సమాచారాన్ని, ఆయా వ్యాపారాలకు అనుగుణమైన టెండర్ల గురించి తెలియజేస్తుందని పేర్కొంది. ఎస్ఎంఈలు తమ మెటీరియల్స్‌ను దేశవ్యాప్తంగానే కాకుండా, విదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలుగా అనుసంధానత కీలకమని తెలిపింది. ఎంఎస్ఎంఈలు కీలక విభాగాల్లో ఎదుర్కొంటున్న ఆందోళనల పరిష్కారానికి వీలుగా ఇంజనీరింగ్ కాలేజీలు, మేనేజ్‌మెంట్ కాలేజీలు, మానవ వనరుల సంస్థలను వీటితో అనుసంధానించాలని సూచించింది.





## హారిక గేమ్ 'డ్రా'

**నికోసియా (సైప్రస్):** మహిళల గ్రాండ్‌ప్రి చెస్ నాలుగో అంచె టోర్నమెంట్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక, భారత్‌కే చెందిన ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ వరుసగా మూడో 'డ్రా' నమోదు చేసుకున్నారు. సోమవారం జరిగిన మూడో రౌండ్‌లో జు జినెర్ (చైనా)తో జరిగిన గేమ్‌ను హారిక 41 ఎత్తుల్లో... అలెక్సాండ్రా గొర్యాక్‌చినా (రష్యా)తో జరిగిన గేమ్‌ను దివ్య కూడా 41 ఎత్తుల్లోనే 'డ్రా'గా ముగించారు. ఏడుగురు గ్రాండ్‌మాస్టర్లు, ముగ్గురు అంతర్జాతీయ మాస్టర్లు (ఐఎం) తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. మూడో రౌండ్ తర్వాత హారిక, దివ్య 1.5 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో ఉన్నారు. తొలి రౌండ్‌లో దివ్యతో జరిగిన గేమ్‌ను హారిక 50 ఎత్తుల్లో... స్టావ్‌రులా (గ్రీస్)తో జరిగిన రెండో గేమ్‌ను హారిక 42 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది.

## అజ్మతుల్లా ఆలస్యంగా



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న అఫ్గానిస్తాన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్‌జాయ్ కాస్త ఆలస్యంగా జట్టుతో చేరనున్నాడు. ఈ నెల 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుండగా... లీగ్‌లో భాగంగా 25న గుజరాత్ టైటాన్స్‌తో పంజాబ్ కింగ్స్ తొలి మ్యాచ్ ఆడనుంది. ఇప్పటికే ఆటగాళ్లంతా జట్టుతో చేరగా... వ్యక్తిగత కారణాలరీత్యా అజ్మతుల్లా ఈ నెల 20న భారత్‌కు చేరుకోనున్నాడు. లీగ్ ఆరంభం నుంచి ఒక్కసారి కూడా ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయిన పంజాబ్ కింగ్స్... ఈసారి తమ చిరకాల స్వప్నం నెరవేర్చుకోవాలనే లక్ష్యంతో ఉంది. గతేడాది కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను చాంపియన్‌గా నిలిపిన శ్రేయస్ అయ్యర్ ఈసారి పంజాబ్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా... ఆసీస్ దిగ్గజం రికీ పాంటింగ్ హెడ్‌కోచ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. వీరిద్దరితో పాటు చహల్, అర్ష్‌దీప్ సింగ్ ఇప్పటికే ధర్మశాల చేరుకున్నారు. 'అజ్మతుల్లా వ్యక్తిగత కారణాలతో ఆలస్యంగా భారత్‌కు రానున్నాడు. మిగిలిన విదేశీ ఆటగాళ్ల రాక ఇప్పటికే మొదలైంది' అని ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ జట్టు జోరుగా సాధన సాగిస్తోంది. ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న విదేశీ ఆటగాళ్లలో ఆసీస్ పేసర్ నాథన్ ఎలీస్ మినహా తక్కిన వాళ్లంతా ఇప్పటికే చెన్నై చేరుకున్నారు. ఈ మేరకు ఫ్రాంచైజీ సీఈఓ కాశీ విశ్వనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రచిన్ రవీంద్ర, కాన్వే ఇప్పటికే జట్టుతో చేరారు. త్వరలోనే ఎలీస్ రానున్నాడు' అని పేర్కొన్నారు. ధోనీ, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ ప్రాక్టీస్‌లో పాల్గొంటున్నారు.

# ఆంద్రేయెవా అదరహో



### ఇండియన్ వెల్స్ డబ్ల్యూటీఏ-1000 సిరీస్ టోర్నీలో టైటిల్ సొంతం

**ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకాపై విజయం**

**కెరీర్ బెస్ట్ ఆరో ర్యాంక్‌కు చేరిన రష్యా టీనేజ్ స్టార్**

**మహిళల టెన్నిస్‌లో మరో స్టార్ అవతరించింది. టీనేజ్ వయసులో తాను సాధిస్తున్న విజయాలు గాలివాటం కాదని రష్యాకు చెందిన 17 ఏళ్ల మిరా ఆంద్రెయెవా నిరూపించింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఇండియన్ వెల్స్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 సిరీస్ టోర్నీలో ఆంద్రెయెవా విజేతగా నిలిచింది. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ సబలెంకా (బెలారస్)తో జరిగిన తుది పోరులో ఆంద్రెయెవా మూడు సెట్‌లలో విజయాన్ని అందుకొని కెరీర్‌లో రెండో డబ్ల్యూటీఏ-1000 సిరీస్ టైటిల్‌ను హస్తగతం చేసుకుంది.**

**కాలిఫోర్నియా:** ఈ ఏడాది తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ రష్యా టీనేజ్ టెన్నిస్ స్టార్ మిరా ఆంద్రెయెవా రెండో టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సర్క్యూట్‌లో గ్రాండ్‌స్లామ్ టోర్నీ తర్వాత ఉన్నతశ్రేణి టోర్నీ అయిన 1000 సిరీస్‌లలో ఆమె వరుసగా రెండో టైటిల్‌ను దక్కించుకుంది. గత నెలలో దుబాయ్ ఓపెన్-1000 టోర్నీలో టైటిల్ సాధించిన ఆంద్రెయెవా తాజాగా ఇండియన్ వెల్స్ ఓపెన్-1000 టోర్నీలో చాంపియన్‌గా అవతరించింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో 17 ఏళ్ల ఆంద్రెయెవా 2-6, 6-4, 6-3తో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అరీనా సబలెంకా (బెలారస్)ను బోల్తా కొట్టించింది. ఈ ఏడాది బ్రిస్బేన్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలలో సబలెంకా చేతిలో ఎదురైన రెండు పరాజయాలకు ఈ గెలుపుతో ఆంద్రెయెవా బదులు తీర్చుకుంది. 2 గంటల 4 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో సబలెంకా తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. అయితే తన లోపాలను సరిదిద్దుకొని రెండో సెట్ నుంచి ఆంద్రెయెవా విజృంభించింది. మూడో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఆంద్రెయెవా నాలుగో గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 3-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఆంద్రెయెవా తన సర్వీస్‌లను కాపాడుకొని సెట్‌ను 6-4తో దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లో ఆంద్రెయెవా మూడో గేమ్‌లో, తొమ్మిదో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌లను బ్రేక్ చేసి 6-3తో సెట్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన ఆంద్రెయెవాకు 11,27,500 డాలర్ల (రూ. 9 కోట్ల 77 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ సబలెంకాకు 5,99,625 డాలర్ల (రూ. 5 కోట్ల 19 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఇండియన్ వెల్స్ టైటిల్‌తో ఆంద్రెయెవా తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరుకుంది. ఐదు స్థానాలు ఎగబాకిన ఆంద్రెయెవా ఆరో ర్యాంక్‌ను అందుకుంది.

**2** కంప్యూటర్ ర్యాంకింగ్స్‌ను 1975లో ప్రవేశపెట్టాక ఒకే టోర్నీ ఫైనల్లో, సెమీఫైనల్లో వరల్డ్ నంబర్‌వన్, ప్రపంచ రెండో ర్యాంకర్‌లను ఓడించి విజేతగా నిలిచిన రెండో అతి పిన్న వయస్కురాలిగా ఆంద్రెయెవా గుర్తింపు పొందింది. ఇండియన్ వెల్స్ టోర్నీ సెమీస్‌లో రెండో ర్యాంకర్ స్వియాటెక్ (పోలాండ్)పై ఆంద్రెయెవా గెలిచింది. 1979 యూఎస్ ఓపెన్‌లో ట్రేసీ ఆస్టిన్ (16 ఏళ్లు) ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా నిలిచింది.

**2** మార్టినా హింగిస్ (1999లో) తర్వాత 'బ్యాక్ టు బ్యాక్' డబ్ల్యూటీఏ-1000 సిరీస్ టోర్నీ టైటిల్స్ నెగ్గిన రెండో ప్లేయర్‌గా ఆంద్రెయెవా నిలిచింది.



## డ్రేపర్ ధమాకా

ఇండియన్ వెల్స్ ఓపెన్ పురుషుల విభాగంలో బ్రిటన్ ప్లేయర్ జాక్ డ్రేపర్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో డ్రేపర్ 70 నిమిషాల్లో 6-2, 6-2తో హోల్గర్ రూనే (డెన్మార్క్)పై గెలిచి తన కెరీర్‌లో తొలిసారి ఏటీపీ మాస్టర్స్ సిరీస్-1000 సింగిల్స్ టైటిల్ సాధించాడు. డ్రేపర్ 10 ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 23 ఏళ్ల డ్రేపర్ టైటిల్ గెలిచే క్రమంలో సెమీఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్, డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్)ను ఓడించాడు. తాజా గెలుపుతో డ్రేపర్ సోమవారం విడుదల చేసిన ఏటీపీ ర్యాంకింగ్స్‌లో ఏడు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 7వ ర్యాంక్‌ను అందుకున్నాడు. ఆండీ ముర్రే, టిమ్ హెన్మన్, గ్రెగ్ రుసెడ్స్కీ, కామెరాన్ నోరి తర్వాత ఏటీపీ మాస్టర్స్-1000 టైటిల్ నెగ్గిన ఐదో బ్రిటన్ ప్లేయర్‌గా డ్రేపర్ గుర్తింపు పొందాడు. విజేతగా నిలిచిన డ్రేపర్‌కు 12,01,125 డాలర్ల (రూ. 10 కోట్ల 41 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు, రన్నరప్ రూనేకు 6,38,750 డాలర్ల (రూ. 5 కోట్ల 53 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# 2028 ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌కు పచ్చజెండా

**కోస్టా నవరినో (గ్రీస్):** లాస్ ఏంజెలిస్ వేదికగా 2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో బాక్సింగ్ పోటీలు నిర్వహించే అంశంపై సందిగ్ధత వీడింది. ఆటలో సమగ్రత, నిర్ణయాల్లో స్పష్టత లేదనే కారణంగా 2022లో జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సమావేశంలో ఒలింపిక్స్ ప్రాథమిక క్రీడాంశాల జాబితాలో బాక్సింగ్‌ను చేర్చలేదు. కాగా... మంగళవారం నుంచి ఐఓసీ 144వ సెషన్ ప్రారంభం కానుండగా... దీనికి ముందు సోమవారం కార్యనిర్వాహక బోర్డు ఒలింపిక్స్‌లో బాక్సింగ్ క్రీడను కొనసాగించేందుకు పచ్చజెండా ఊపింది. అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ)ను పక్కన పెట్టి... ప్రపంచ బాక్సింగ్ సంఘానికి తాత్కాలిక గుర్తింపు నిచ్చిన తర్వాత ఐఓసీ ఈ నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి ఈ నెల 21 వరకు జరగనున్న ఐఓసీ సెషన్‌లో థామస్ బాచ్ స్థానంలో కొత్త అధ్యక్షుడిని కూడా ఎన్నుకోనున్నారు. ఇదే సెషన్‌లో 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌ను చేర్చే అంశానికి ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదం తెలపనుంది. 'ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రపంచ బాక్సింగ్ సంఘానికి తాత్కాలిక గుర్తింపు ఇచ్చిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నాం. దీన్ని ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదానికి పంపుతాం. ప్రపంచ బాక్సింగ్ సంఘం గుర్తించిన జాతీయ సమాఖ్యలకు చెందిన బాక్సర్లు నిరభ్యంతరంగా ఒలింపిక్స్‌లో పాల్గొనవచ్చు. పాలనా సమస్యలపై సుదీర్ఘ వివాదంతో పాటు బౌట్‌ల సమగ్రతకు సంబంధించిన ఆందోళనల కారణంగా ఐబీఏ గుర్తింపును రద్దు చేశాం. అనంతరం గత రెండు ఒలింపిక్స్ (2020 టోక్యో, 2024 పారిస్) క్రీడల్లో బాక్సింగ్ పోటీలను తిరిగి పర్యవేక్షించాం. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకునే బాక్సింగ్‌కు ఒలింపిక్స్‌లో అవకాశం కల్పించాం' అని థామస్ బాచ్ వెల్లడించారు. ప్రపంచ బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు బోరిస్ ఐఓసీ నిర్ణయాన్ని స్వాగతించారు. దీంతో క్రీడకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.



# జాతీయ హాకీ శిబిరం ప్రారంభం

**హాజరైన 36 మంది భారత క్రీడాకారులు**

**బెంగళూరు:** స్వదేశంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్‌లో భారత పురుషుల జట్టు ప్రదర్శనపై ఆత్మపరిశీలన చేసుకోవడంపై దృష్టి పెట్టామని చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ తెలిపారు. ఈ నేపథ్యంలో 36 మంది అగ్రశ్రేణి క్రీడాకారులతో 12 రోజులపాటు జాతీయ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బెంగళూరులోని భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) సెంటర్‌లో సోమవారం మొదలైన ఈ శిబిరం ఈనెల 28 వరకు కొనసాగుతుంది. 'మేటి జట్లతో వరుస మ్యాచ్‌లు ఆడుతూ భారత జట్టు తీరికలేకుండా గడిపింది. ప్రస్తుతం మొదలైన శిబిరంలో ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై, ఇటీవల ప్రో లీగ్‌లో ప్రదర్శనపై దృష్టి పెడుతున్నాం. ఏ అంశంలో బలహీనంగా ఉన్నామో గుర్తించి ఆ అంశంలో మరింత మెరుగ్గా రాణించేందుకు చర్యలు తీసుకుంటాం. తదుపరి ప్రో లీగ్ అంచె మ్యాచ్‌లో జూన్‌లో యూరోప్‌లో ఉన్నాయి' అని ఫుల్టన్ వివరించారు. వచ్చే వారం వివాహం చేసుకోనున్న స్టార్ ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్‌కు ఈ శిబిరం నుంచి మినహాయింపు ఇచ్చారు. సొంతగడ్డపై ఇటీవల జరిగిన ప్రో లీగ్‌లో భారత జట్టు ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదింటిలో గెలిచింది. ఓవరాల్‌గా 15 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

**భారత హాకీ ప్రాబబుల్స్:** కృషన్ బహదూర్ పాఠక్, పవన్, సూరజ్ కర్కేరా, మోహిత్ హొన్నెనహళ్లి శశికుమార్ (గోల్‌కీపర్లు), జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదాస్, సుమిత్, సంజయ్, జుగ్‌రాజ్ సింగ్, అమన్‌దీప్ లాక్రా, యశ్‌దీప్ సివాచ్ (డిఫెండర్లు), రాజ్‌కుమార్ పాల్, షంషేర్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, నీలకంఠ శర్మ, మొయిరంగ్తెమ్ రబిచంద్ర సింగ్, మొహమ్మద్ రాహీల్ మౌసీన్, పూవణ్ణ, రాజిందర్ సింగ్, విష్ణుకాంత్ సింగ్ (మిడ్ ఫీల్డర్లు), అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, గుర్జంత్ సింగ్, అంగద్‌బీర్ సింగ్, ఆదిత్య అర్జున్ లలాగే, బాబీ సింగ్ ధామి, సుదీప్ చిర్మాకో, సెల్వం కార్తీ, శిలానంద్ లాక్రా, దిల్‌ప్రీత్ సింగ్, ఉత్తమ్ సింగ్ (ఫార్వర్డ్స్).


హర్మన్‌ప్రీత్

# దేశవాళీ జోరు ఐపీఎల్‌లోనూ కొనసాగిస్తా

- విదర్భ బ్యాటర్ కరుణ్ నాయర్ వ్యాఖ్య
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు టైటిల్ అందించడమే లక్ష్యమన్న భారత క్రికెటర్

**న్యూఢిల్లీ:** దేశవాళీల్లో పరుగుల వరద పారించిన సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లోనూ అదే జోరు కొనసాగిస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 18వ సీజన్‌లో కరుణ్ నాయర్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ ఏడాది విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో 9 మ్యాచ్‌లు ఆడిన కరుణ్ నాయర్ 389.50 సగటుతో 779 పరుగులు చేశాడు. అందులో 5 సెంచరీలు ఉన్నాయి. ఇక రంజీ ట్రోఫీలోనూ అదే జోష్ కొనసాగిస్తూ 57.33 సగటు 4 సెంచరీల సాయంతో 860 పరుగులు చేసి విదర్భ జట్టు చాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలవడంలోనూ కీలక పాత్ర పోషించాలని భావిస్తున్నాడు. 'చాన్నాళ్లుగా క్రికెట్ ఆడుతున్నా. కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. కిందపడ్డ ప్రతిసారీ అంతకు రెట్టింపు బలంతో పైకి లేవడానికి ప్రయత్నించా. ప్రస్తుతానికి ఐపీఎల్ మీదే దృష్టి పెట్టా. జట్టుకు ఏం అవసరమో అది చేసేందుకు సిద్ధంగా ఉన్నా. అవకాశం వచ్చిన ప్రతి మ్యాచ్‌లో టీమ్ విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తా. ఢిల్లీ జట్టుతో చేరడం ఆనందంగా ఉంది. ప్రతి మ్యాచ్... కెరీర్‌లో చివరిది అనే విధంగానే కష్టపడతా. ఢిల్లీ కొత్త కెప్టెన్ అక్షర్ పటేల్‌కు ఆటపై మంచి అవగాహన ఉంది. ఇటీవలి కాలంలో అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇక కేఎల్ రాహుల్‌తో ఎన్నో ఏళ్ల అనుబంధం ఉంది. అతడి కెరీర్ ఆరంభం నుంచి దగ్గర నుంచి గమనించా. తిరిగి వాళ్లతో కలిసి ఆడేందుకు ఉత్సుకతతో ఉన్నా. క్యాపిటల్స్‌కు తొలిసారి కప్పు అందించేందుకు ప్రయత్నిస్తా' అని నాయర్ వివరించాడు.


కరుణ్ నాయర్

# 31 ఏళ్ల తర్వాత...


రిచ్‌మన్

**లాస్ ఏంజెలిస్:** కెరీర్‌లో పోటీపడ్డ రెండో మారథాన్ రేసులోనే అమెరికా అథ్లెట్ మాథ్యూ రిచ్‌మన్ విజేతగా నిలిచాడు. లాస్ ఏంజెలిస్ వార్షిక మారథాన్ రేసులో నిర్ణీత 42.195 కిలోమీటర్ల దూరాన్ని రిచ్‌మన్ 2 గంటల 7 నిమిషాల 56 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. తద్వారా 31 ఏళ్ల తర్వాత లాస్ ఏంజెలిస్ మారథాన్ రేసులో విజేతగా నిలిచిన అమెరికా అథ్లెట్‌గా రిచ్‌మన్ గుర్తింపు పొందాడు. గత ఏడాది అక్టోబర్‌లో మిన్నెసోటాలో జరిగిన ట్విన్ సిటీస్ మారథాన్ రేసులో తొలిసారి బరిలోకి దిగిన రిచ్‌మన్ నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు.

# పదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలిచ్చాం

**రైల్వే మంత్రి వైష్ణవ్ ప్రకటన**

**విపక్షాల వాకౌట్**



సోమవారం రాజ్యసభలో మాట్లాడుతున్న అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ:** రైల్వేలో పదేళ్లలో 5 లక్షల మందికి ఉద్యోగాలిచ్చామని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అయినా నియామకాలపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. రైల్వేలో రిక్రూట్‌మెంట్ జరగలేదని సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు రాజ్యసభలో సోమవారం ఆయన సమాధానమిచ్చారు. మొత్తం 12 లక్షల మంది ఉద్యోగుల్లో గత పదేళ్లలోనే 40 శాతం నియామకాలు జరిగాయని వెల్లడించారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని, ఇటీవల జరిగిన లోకో పైలట్ల పరీక్షకు 156 నగరాల్లోని 346 కేంద్రాల్లో 18.4 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. లెవల్ 1 నుంచి లెవల్ 6 నియామకాలకు 2.32 కోట్ల మంది అభ్యర్థులు హాజరయ్యారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా భర్తీ చేశామని తెలిపారు. రైల్వే, రక్షణ వంటి శాఖలపై రాజకీయాలు సరికాదన్నారు. మంత్రి స్పందన సరిగా లేదంటూ విపక్షాలు అభ్యంతరం వెలిబుచ్చాయి. నిరసన వాకౌట్ చేశాయి.

### అత్యాధునిక భద్రతా చర్యలు

మహాకుంభ్ మేళా సందర్భంగా ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీ సహా డేటా భద్రంగా ఉందని మంత్రి అన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ విచారణ జరుపుతోందని, దాదాపు 300 మంది నుంచి వివరాలు సేకరిస్తున్నామని, వాస్తవాలు తెలుసుకుంటున్నామని వెల్లడించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూసేందుకు దేశ్యాప్తంగా అత్యంత రద్దీగా ఉండే 60 స్టేషన్లను గుర్తించామని వైష్ణవ్ తెలిపారు. వీటన్నింటిలోనూ అత్యాధునిక సాంకేతికతతో కూడిన భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు.

**నిలకడగా ఆర్థిక పరిస్థితి**

రైల్వే ఆర్థిక పరిస్థితి నిలకడగా ఉందన్న మంత్రి.. కోవిడ్ మహమ్మారి సందర్భంగా ఎదురైన సవాళ్లను విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ప్యాసింజర్ రైళ్లు, కార్గో ట్రాఫిక్ రెండింటిలోనూ వృద్ధి నమోదైందన్నారు. 2023 -24 మధ్య సుమారు రూ 2,78,000 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. సిబ్బంది వ్యయం, పెన్షన్ చెల్లింపులు, ఇంధన వ్యయాలు, ఫైనాన్సింగ్‌పై రైల్వే ఖర్చు చేసిందన్నారు. తన సొంత ఆదాయంతోనే వ్యయాన్ని భరిస్తోందని, ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపర్చేందుకు ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నామని మంత్రి వెల్లడించారు. కార్గో, సరుకు రవాణా ఆదాయంతో ప్రయాణికుల చార్జీల సబ్సిడీ చెల్లిస్తున్నామన్నారు. పొరుగు దేశాలతో పోలిస్తే మన రైల్వేలో అన్ని కేటగిరీల్లో టికెట్ చార్జీలు తక్కువగా ఉన్నాయని వివరించారు. మార్చి 31 నాటికి 1.6 బిలియన్ టన్నుల సరుకు రవాణాతో మన దేశం ప్రపంచంలోని మొదటి మూడు దేశాల్లో ఒకటిగా ఉంటుందన్నారు. 50 వేల కిలోమీటర్ల ట్రాక్‌ల నిర్మాణం, 12 వేల అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణం, 14 వేల వంతెనల పునర్నిర్మాణం మన రైల్వే సాధించిన విజయాలని మంత్రి వైష్ణవ్ పేర్కొన్నారు.

**ఎగుమతుల రంగంలో..**

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు వస్తువుల ఎగుమతులను రైల్వే ఎలా పెంచుతోందో వివరించారు ఆస్ట్రేలియాకు మెట్రో కోచ్‌లు ఎగుమతి చేస్తున్నామన్నారు. బ్రిటన్, సౌదీ అరేబియా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియాలకు బోగీలు, ఫ్రాన్స్, మెక్సికో, రొమేనియా, స్పెయిన్, జర్మనీ, ఇటలీలకు ప్రొపల్షన్‌లు, మొజాంబిక్, బంగ్లాదేశ్, శ్రీలంకలకు ప్రయాణికుల బోగీలు ఎగుమతి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. మొజాంబిక్, సెనెగల్, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్‌లకు లోకోమోటివ్‌లను ఎగుమతి చేస్తున్నామని, సమీప భవిష్యత్‌లో బీహార్‌లోని సరన్ జిల్లాలో ఉన్న మర్హోరా వద్ద తయారైన 100కు పైగా లోకోమోటివ్‌లను ఎగుమతి చేస్తామని తెలిపారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళలో నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఆయా రాష్ట్రాల సహకారాన్ని కోరారు. పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో రైల్వేలు విఫలమయ్యాయన్న ఆరోపణలు వైష్ణవ్ తోసిపుచ్చారు.

# పదేళ్లలో రూ.16 లక్షల కోట్ల మొండిబకాయిలు రైటాఫ్

**లోక్‌సభలో వెల్లడించిన నిర్మల**

**న్యూఢిల్లీ:** గత పదేళ్లకాలంలో దేశవ్యాప్తంగా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్‌లు అన్ని కలిపి రూ.16.35 లక్షల కోట్ల విలువైన మొండి బకాయిలు/నిరర్థక ఆస్తు(ఎన్‌పీఏ)లను రైటాఫ్ చేశాయి. సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ బకాయిల్లో గరిష్ఠ మొత్తం అంటే రూ.2,36,265 కోట్లను ఒక్క 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే రైటాఫ్ చేశారు. గత పదేళ్లలో కనిష్టంగా అంటే రూ.58,786 కోట్లను 2014-15 ఆర్థిక సంవత్సరంలో రైటాఫ్ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,70,270 కోట్లను రైటాఫ్‌చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,16,324 కోట్లను రైటాఫ్‌చేశారు. ''నాలుగు సంవత్సరాలు పూర్తయినా బ్యాంక్‌లు ఏదైనా రుణాన్ని తిరిగి రాబట్టలేకపోతే సాధారణంగానే రైటాఫ్ జాబితాలో చేర్చుతాయి. అంతమాత్రాన ఆయా రుణాలను బ్యాంక్‌లు ఇక వదులుకున్నట్లుగా భావించకూడదు. రైటాఫ్ చేసినంత మాత్రాన ఆయా రుణ గ్రహీతలకు ఉపశమనం కల్పించినట్లు అనుకో వద్దు. ఆయా మొండిబకాయిలను ఎలాగైనా తిరిగి రాబట్టేందుకు బ్యాంకులు శతథా ప్రయత్నిస్తాయి. వివిధ మార్గాలను అనుసరిస్తాయి. సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం ప్రకారం సివిల్ కోర్టుల్లో దావా వేయడం, రుణ రికవరీ ట్రిబ్యునళ్లను ఆశ్రయించడం వంటి చేస్తాయి. వీటితోపాటు దివాళా చట్టం కింద నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను బ్యాంక్‌లు ఆశ్రయిస్తాయి'' అని మంత్రి చెప్పారు.

### ఎన్‌పీఏలుగా 29 కంపెనీలు

2024 డిసెంబర్ 31వ తేదీనాటి భారతీయ రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం నిరర్థక ఆస్తుల జాబితాలోకి 29 కంపెనీలు చేరిపోయాయి. ఒక్కో కంపెనీ నుంచి బ్యాంక్‌లకు కనీసం రూ.1,000 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఈ 29 కంపెనీల నుంచే రూ.61,027 కోట్ల బకాయిలు ఇంకా వసూలుచేయాల్సి ఉందని మంత్రి చెప్పారు.

# ప్రధాని మోదీతో తులసీ గబ్బార్డ్ భేటీ

**వ్యూహాత్మక బంధంపై చర్చ**

**న్యూఢిల్లీ:** అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ సోమవారం ఢిల్లీలో భారత ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు, సముద్రమార్గాల్లో భద్రత, సైబర్ సెక్యూరిటీ విషయంలో పరస్పర సహకారంపై చర్చించారు. ఇరుదేశాల వ్యూహాత్మక బంధంపై ప్రధానంగా చర్చించారు. ''గత నెలలో అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో తులసీతో సమావేశమయ్యా. ఆనాడు అమెరికాలో ట్రంప్‌తో ఫలవంతమైన చర్చలు జరిపా'' అని మోదీ గుర్తుచేసుకున్నారని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. రక్షణ, అత్యాధునిక సాంకేతికతలు, ఉగ్రవ్యతిరేక కార్యక్రమాల్లో తులసీ పాత్ర ఎనలేనిదని మోదీ ఆమెకు పొగిడారు. ఈ ఏడాది చివర్లో భారత్‌లో పర్యటించనున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోసం 140 కోట్ల మంది భారతీయులు ఎదురుచూస్తున్నట్లు తులసీతో మోదీ చెప్పారు. ఈ భేటీ సందర్భంగా మహాకుంభమేళా జరిగిన త్రివేణి సంగమం నుంచి తెప్పించిన గంగాజలాన్ని తులసీకి మోదీ బహూకరించారు. రుద్రాక్షమాలను మోదీకి తులసీ కానుకగా ఇచ్చారు.

# మన వ్యవస్థల పట్ల మనకు విశ్వాసం ఉండాలి: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** మన వ్యవస్థల పట్ల దేశ పౌరులుగా మనకు విశ్వాసం ఉండాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నియామక ప్రక్రియ పట్ల అభ్యంతరం వ్యక్తంచేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. కాగ్‌ను కేవలం ప్రధానమంత్రితోపాటు కార్యనిర్వాహక వర్గం కలిసి నియమించడం సమంజసం కాదంటూ ఓ ఎన్జీఓ ఈ పిటిషన్ దాఖలు చేసింది. కాగ్ నియామక ప్రక్రియను రాజ్యాంగవిరుద్ధమని ప్రకటించాలని కోరింది. ఈ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి ధర్మాసనం సూచించింది. ఈ మేరకు నోటీసు జారీ చేసింది. ఇదే అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కేసులతో ఈ తాజా కేసును జతచేస్తున్నట్లు వెల్లడించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 148 ప్రకారం 'కాగ్'ను నియమిస్తున్నట్లు ధర్మాసనం గుర్తుచేసింది. ఈ ఆర్టికల్ కాగ్‌కు తగిన రక్షణలు కల్పిస్తోందని వివరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఉన్నట్లుగానే కాగ్‌కు సైతం రాజ్యాంగపరమైన రక్షణలు ఉన్నాయని పేర్కొంది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. కాగ్ స్వతంత్రతపై ఇటీవల అనుమానాలు తలెత్తుతున్నాయని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కాగ్ ఆడిట్‌ను అడ్డుకుంటున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. స్వతంత్ర లేదా తటస్థ ఎంపిక కమిటీ సిఫార్సుల మేరకు కాగ్‌ను రాష్ట్రపతి నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ కమిటీలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సభ్యులుగా ఉండాలని చెప్పారు. పూర్తి పారదర్శకంగా కాగ్ నియామకం జరగాలన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. మన వ్యవస్థల పట్ల మనకు విశ్వాసం ఉండాలని సూచించింది.

# ఏనుగు, డ్రాగన్ కలిసి నాట్యం చేయాలి

- ప్రధాని మోదీ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం
- చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ వెల్లడి

**చైనా:** భారత్-చైనా మధ్య చర్చల్లో వేగం పెరగాలని, ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడాలని కోరుకుంటున్నట్లు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాజాగా ఒక పాడ్‌కాస్ట్‌లో చేసిన వ్యాఖ్యలను చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ స్వాగతించారు. మోదీ సానుకూల వ్యాఖ్యలు చేశారని ప్రశంసించారు. ఇండియాతో అద్భుతమైన సంబంధాలను తాము కోరుకుంటున్నామని సోమవారం వెల్లడించారు. మన రెండు దేశాలు పరస్పరం కలిసి పని చేయాలన్నదే తమ ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. ఏనుగు, డ్రాగన్ గొప్ప సమన్వయంతో కలిసికట్టుగా నాట్యం చేయడం మనకు ఎంతగానో మేలు చేస్తుందని వివరించారు. ఇటీవలి కాలంలో భారత్, చైనా దేశాల నేతలు ఏకాభిప్రాయంతో తీసుకుంటున్నట్లు నిర్ణయాలు అమల్లోకి వస్తున్నాయని, వాటి ఫలితాలు సైతం కనిపిస్తున్నాయని మావో నింగ్ వెల్లడించారు. వివిధ స్థాయిల్లో రెండు దేశాల నడుమ ఆచరణబద్ధమైన సహకారం కొనసాగుతోందని చెప్పారు. భారత్, చైనా విజయ పథంలో నడవాలంటే మనకున్న ఐచ్ఛికం 'ఎలిఫెంట్-డ్రాగన్ డ్యాన్స్' అని వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలకు 75 ఏళ్లు నిండుతున్నాయని గుర్తుచేశారు. ద్వైపాక్షిక సహకారం, భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి ఈ సందర్భాన్ని తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. 2020 మే నెలలో గల్వాన్ లోయలో జరిగిన భీకర ఘర్షణ తర్వాత భారత్, చైనా మధ్య సంబంధాలు క్షీణించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత పలు దశల చర్చల వల్ల సంబంధాలు కొంత మెరుగుపడ్డాయి. కానీ, 2020 ముందునాటి స్థితికి ఇంకా రాలేదు.



కొడుకుతో తల్లి. పక్కన వైద్యులు

# కిడ్నీ ఇచ్చి కొత్త జీవితం ప్రసాదించిన 80 ఏళ్ల తల్లి

**న్యూఢిల్లీ:** తల్లి ప్రేమకు అవధుల్లేవని మరోసారి నిరూపితమైంది. 80 ఏళ్ల వృద్ధాప్యంలోనూ కన్నపేగు తన సంతానం సమస్యల్లో చిక్కుకుంటే అల్లాడిపోయింది. వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయక త్యాగానికి సిద్ధపడింది. 59 ఏళ్ల కుమారుడు రాజేశ్ మూత్రపిండం వైఫల్యంతో ఇబ్బందులు పడుతుంటే తాను కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చిన ఆ తల్లి పేరు దర్శనా జైన్. తల్లి ప్రేమను చూసి ఆశ్చర్యపోయిన వైద్యులు.. అసలు 80 ఏళ్ల వయసులో ఈమె కిడ్నీ ఆరోగ్యవంతంగా ఉంటుందా? ఒకవేళ ఆరోగ్యంగా ఉన్నా ఈయనకు సరిపోతుందా? అనే సందేహాలొచ్చాయి. అన్నిరకాల వైద్యపరీక్షల తర్వాత ఈమె కిడ్నీ కుమారుడికి సరిగ్గా సరిపోతుంది తేలడంతో తల్లి ఆనందానికి అవధుల్లేవు. వెంటనే కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను ఢిల్లీలోని బీఎల్‌కే-మ్యాక్స్ సూపర్‌స్పెషాలిటీ వైద్యులు విజయవంతంగా పూర్తిచేశారు. ఆపరేషన్ అయిన నాలుగు రోజులకు తల్లి, ఆరు రోజులకు కుమారుడు డిశ్చార్జ్ అయ్యారు. ఇద్దరూ ఆరోగ్యవంతంగా ఉన్నారని వైద్యులు ధృవీకరించారు.

# జమ్మూకశ్మీర్‌పై మోదీవి ఏకపక్ష వ్యాఖ్యలు: పాక్

**ఇస్లామాబాద్:** కశ్మీర్‌పై ప్రధాని మోదీ పాడ్‌కాస్ట్‌లో చేసిన వ్యాఖ్యలు ఏకపక్షంగా ఉన్నాయని పాకిస్తాన్ ఆరోపించింది. ఈ మేరకు పాక్ విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఈ వ్యాఖ్యలు తప్పుదోవ పట్టించేవిగా, ఏకపక్షంగా ఉన్నాయి. ఐరాస, పాకిస్తాన్, కశ్మీరీ ప్రజలకు హామీలు ఇచ్చిన భారత ప్రభుత్వం వాటిని విస్మరించింది. పాక్‌గడ్డపై అల్లర్లను రెచ్చగొట్టడం, జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వ అనుమతితో అణచివేతకు పాల్పడటంలో భారత్ ప్రమేయం ఉంది. విదేశీ భూభాగాల్లో హత్యలు, విధ్వంసాలు, ఉగ్రవాదానికి భారత్ కుట్ర పన్నుతోంది' అని ప్రకటనలో పేర్కొంది. జమ్మూకశ్మీర్ వివాదాన్ని పరిష్కరించడానికి పాకిస్తాన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక, ఫలితాలనిచ్చే చర్చలను ప్రోత్సహిస్తుందని, కానీ భారత్ కఠినమైన విధానాలు, ఆధిపత్య ఆకాంక్షలు అడ్డంకులుగా ఉన్నాయని తెలిపింది. భారత్ నుంచి వెలువడుతున్న పాక్ వ్యతిరేక కథనాలు.. ద్వైపాక్షిక వాతావరణాన్ని దెబ్బతీస్తున్నాయని, శాంతి సహకార అవకాశాలకు విఘాతం కలిగిస్తాయని, వాటిని ఆపాలని పేర్కొంది. కాగా, అమెరికాకు చెందిన ప్రముఖ పాడ్కాస్టర్, కంప్యూటర్ సైంటిస్ట్ ఫ్రిడ్మన్‌తో మోదీ మాట్లాడారు. 2014లో తన ప్రమాణ స్వీకారోత్సవానికి పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించానని గుర్తు చేశారు. 'శాంతిని పెంపొందించడానికి చేసిన ప్రతి ప్రయత్నంలో శత్రుత్వం, ద్రోహమే ఎదురైంది. వారికి జ్ఞానం వెల్లివిరుస్తుందని, శాంతి మార్గాన్ని ఎంచుకుంటారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నా'అని మోదీ వ్యాఖ్యానించారు.

# అమెరికాను కాపాడండి ట్రంప్‌కు సాయం చేయండి

**ఐదేళ్ల బుడతడి దేశభక్తి • మరోసారి వైరల్‌గా మారిన మస్క్ కుమారుడి వీడియో**



**వాషింగ్టన్:** గత ఏడాది మూడోసారి అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో దిగిన డొనాల్డ్ ట్రంప్‌ను ఎలాగైనా గెలిపించాలనే పట్టుదలతో వందల కోట్ల రూపాయలు సొంతంగా ఖర్చుచేసిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చిట్టచివరకు అనుకున్నది సాధించారు. ట్రంప్ గెలుపు కోసం తండ్రి తెగ తాపత్రయపడితే తర్వాత మస్క్ కుమారుడు సైతం ట్రంప్‌కు సాయంచేయాలని అభ్యర్థించాడు. దేశాన్ని కాపాడాలని వేడుకున్నాడు. అయితే మస్క్ కుమారుడి వయసు కేవలం ఐదేళ్లు కావడం విశేషం. ఎక్స్ ఏ-12 పేరున్న ఈ బుడతడి దేశభక్తిపై ఆనాడే అమెరికా ఇంటర్నెట్‌లో నెటిజన్లు జేజేలు పలుకగా తాజాగా మళ్లీ వైరల్‌గా మారడంతో మరోసారి అతడిని గుర్తుచేసుకుంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. పిట్ట కొంచెం కూత ఘనం అన్న రీతిలో చిన్నతనంలోనే దేశం కోసం ఆలోచిస్తున్నాడని నెటిజన్లు పొగడ్తల వర్షం కురిపించారు.

### నాటి వీడియోలో ఏముంది?

వాషింగ్టన్ డీసీలో అమెరికా దిగువ సభ, ఎగువ సభ సభ్యులు సమావేశమయ్యే 'క్యాపిటల్ బిల్డింగ్'కు ఎలాన్ మస్క్ తన కుమారుడు ఎక్స్ ఏ-12తో కలిసి 2024 డిసెంబర్ పదో తేదీన కారులో వచ్చారు. ట్రంప్ సర్కార్ కొత్తగా ఏర్పాటుచేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్)కి సంబంధించిన కీలకసమావేశంలో పాల్గొనేందుకు మస్క్ వచ్చారు. కారులో కూర్చున్నప్పుడే తండ్రీ కొడుకుల మధ్య చిన్నపాటి సంభాషణ మొదలైంది. డోజ్‌కు సారథిగా నేనే ఏం చేస్తే బాగుంటుందని నువ్వు అనుకుంటున్నావ్? అని మస్క్ అడగ్గా.. ''అమెరికాను కాపాడు'' అని పిల్లాడు తక్కున సమాధానం చెప్పాడు. దీంతో ఆశ్చర్యపోయిన మస్క్ వెంటనే.. 'ఇంకా ఏం చేయాలంటావ్?' అని మరోప్రశ్న అడగ్గా... ''ట్రంప్‌కు సాయంగా ఉండు'' అని మరో సలహా ఇచ్చాడు. దీంతో ఆశ్చర్యపోవడం మస్క్ వంతయింది. అధ్యక్షుడికి పరిపాలనలో సాయపడాలని, దేశాన్ని కాపాడాలని పిల్లాడు చెప్పిన మాటలపై పలువురు సంతోషం వ్యక్తంచేశారు. ''పిల్లాడైనాసరే ఎంత చక్కగా మాట్లాడాడు!. పెద్దవాడయ్యాక ఈ వీడియో చూసుకుంటే ఎంతో గర్వంగా ఫీలవుతాడు''అని ఒక నెటిజన్ ట్వీట్‌చేశాడు. ''ఈ బాబు పెద్ద దేశభక్తుడు అవుతాడు. మంచి బోధనలతో చక్కటి అలవాట్లను భవిష్యత్ తరాలకు నేర్పించాలి. ఈ విషయంలో ఎలాన్ మస్క్ గొప్ప తండ్రి'' అని మరో నెటిజన్ అన్నారు.

# వక్ఫ్(సవరణ) బిల్లుకు మద్దతిస్తే ముస్లింలు ఎప్పటికీ క్షమించరు

- ఎన్డీయే పార్టీలకు అసదుద్దీన్ ఒవైసీ హెచ్చరిక
- బిల్లుకు వ్యతిరేకంగా ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శన

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్(సవరణ) బిల్లుపై ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బిల్లును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తేల్చిచెప్పింది. బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఏఐఎంపీఎల్‌బీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. వివిధ పార్టీల నేతలు, మత పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రసంగించారు. వక్ఫ్(సవరణ) బిల్లుకు ఎన్డీయే పార్టీలైన తెలుగుదేశం, జేడీ(యూ), ఎల్‌జేపీ(రామ్‌విలాస్) మద్దతు ఇస్తే ముస్లింలు ఆ పార్టీలను ఎప్పటికీ క్షమించబోరని స్పష్టంచేశారు. దేశంలో శాంతిని భగ్నం చేయడానికి, ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చిందని మండిపడ్డారు. మందిరం-మసీదు పేరిట జనం నిత్యం గొడవలు పడుతూ ఉండాలన్నదే సర్కారు ఉద్దేశమని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తుల రక్షణకు సంబంధించి ఈ బిల్లులో ఎలాంటి ప్రతిపాదనలు లేవని విమర్శించారు. ముస్లింలకు చెందిన మసీదులు, దర్గాలు, శ్మశాన వాటికలను కబ్జా చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ (సవరణ) బిల్లుకు మద్దతు ఇవ్వకూడదని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడితోపాటు ఎన్డీయే పార్టీల అధినేతలను అసదుద్దీన్ ఒవైసీ కోరారు. ఒకవేళ మద్దతు ఇస్తే ముస్లింల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. వక్ఫ్(సవరణ) బిల్లు రాజ్యాంగం ప్రకారం చెల్లుబాటు కాదని కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ఈ బిల్లు పట్ల ప్రజలెవరూ సంతృప్తిగా లేరని తేల్చిచెప్పారు.



వెనిజులా నేరగాళ్ల ముఠా సభ్యులుగా భావిస్తున్న అక్రమ వలసదారులను ఎల్ సాల్వెడార్‌లోని ఉగ్రవాద నిర్బంధ కేంద్రానికి తరలిస్తున్న జైలు సిబ్బంది

# జడ్జి ఆదేశాలు బేఖాతరు

**261 మంది వలసదారులు ఎల్ సాల్వెడార్, హోండురాస్‌లకు**

**వాషింగ్టన్:** వలసదారులను బహిష్కరించి అక్రమంగా విదేశాలకు తరలించే విధానాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయాలని అమెరికాలో జిల్లా జడ్జి ఇచ్చిన ఆదేశాలను ట్రంప్ ప్రభుత్వం బేఖాతరు చేసింది. కరడుగట్టిన వెనిజులా నేర ముఠా 'ట్రెన్ డీ అరాగ్వా'కు చెందిన 238 మంది సభ్యులను, అంతర్జాతీయ ఎంఎస్-13 గ్యాంగ్‌కు చెందిన 23 మందిని మొత్తంగా 261 మందిని ఎల్ సాల్వెడార్, హోండురాస్ దేశాలకు పంపించినట్లు అమెరికా ప్రభుత్వం శనివారం ప్రకటించింది. అయితే ఈ బహిష్కరణ ఉత్తర్వుల అమలును తాత్కాలికంగా ఆపాలని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జేమ్స్ ఇ.బోస్‌బర్గ్ అంతకుకొద్దిసేపటి ముందు ఆదేశాలు ఇచ్చారు. వెంటనే అక్కడే ఉన్న ప్రభుత్వ లాయర్లు ఈ ఆదేశాలు ఇప్పుడు అమలుచేయడం సాధ్యంకాదని, వాళ్లందర్నీ తరలిస్తున్న విమానాలు ఇప్పటికే ప్రయాణం మొదలెట్టాయని చెప్పారు. వెంటనే ఆ విమానాలను మళ్లీ వెనక్కి రప్పించాలని జడ్జి మౌఖిక ఆదేశాలిచ్చారు. కానీ ఆ ఆదేశాలు అమలుకాలేదు. దీంతో కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ ట్రంప్ సర్కార్ ఘోర తప్పిదానికి పాల్పడిందని విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ మాట్లాడారు. ''కోర్టు ఉత్తర్వులను ప్రభుత్వం ఏనాడూ ఉల్లంఘించలేదు. శత్రుమూకలను దేశం ఆవలికి పంపేసే సర్వాధికారం అధ్యక్షుడైన ట్రంప్‌కు ఉంది. ఆయన తన అసాధారణ అధికారాలను ఉపయోగించి శత్రువులను తరిమేశారు'' అని ఆమె చెప్పారు. గుండు కొట్టించి, కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి విమానంలోకి కుక్కుతున్న ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారడంతో మానవహక్కుల సంఘాలు ఆగ్రహించాయి. రెండుప్రపంచయుద్ధం తర్వాత వాడుకలోలేని చట్టాన్ని తీసుకొచ్చి మానవహక్కుల్ని హరిస్తున్నారన్న ఆరోపించాయి. దీనిపై మీడియా ప్రశ్నించగా ఆదివారం సాయంత్రం ట్రంప్ స్పందించారు. ''ఈ విషయాలను మా లాయర్లను అడగండి. నిజానికి బహిష్కరణకు గురైన వాళ్లంతా చెడ్డ వ్యక్తులు. అక్రమ చొరబాటుదారులతో అమెరికాలో యుద్ధభీతిని పెంచారు. అందుకే యుద్ధకాలంనాటి చట్టాన్ని మళ్లీ తెచ్చా''అని ట్రంప్ అన్నారు.

# కష్టసుఖాల్లో కృష్ణుని బోధనలే ఉపకరించాయి

**హిందూ అమెరికన్ ఉన్నతాధికారి తులసీ గబ్బార్డ్ వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** కీలక సదస్సు కోసం భారత్‌కు వచ్చిన అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ తాను భగవద్గీతను ఎందుకు ఇష్టపడతారో వివరించారు. ''సంతోషంగా ఉన్నప్పుడు, సవాళ్లు ఎదురైనప్పుడు రెండు సందర్భాల్లోనూ నేను భగవద్గీతనే ఆశ్రయిస్తా. కృష్ణుని బోధనల్లో నాకు అన్నింటికీ సమాధానం దొరుకుతుంది. భగవద్గీత నాకు స్థైర్యాన్ని ఇస్తూ మార్గదర్శకంగా నిలుస్తుంది. ప్రపంచంలోనే భిన్న దేశాల్లో గతంలో నేను యుద్ధ క్షేత్రాల్లో పనిచేసినప్పుడుగానీ, మేం ఇప్పుడు సవాళ్లు ఎదుర్కొన్నప్పుడుగానీ భగవద్గీతలో అర్జునుడికి కృష్ణుడు చేసిన హితబోధలే సాయపడ్డాయి''అని ఆమె అన్నారు. తులసి గబ్బార్డ్‌కు భారతదేశంతో ఎటువంటి సంబంధాలు లేవు. గబ్బార్డ్ తల్లి హిందూ మతంలోకి మారి.. తన పిల్లలందరికీ హిందూ పేర్లను పెట్టారు. తల్లి బాటలో తులసి సైతం హిందూత్వాన్ని స్వీకరించారు. దీంతో హిందూ మహిళా అమెరికన్ రాజకీయవేత్తగానూ తులసి గబ్బార్డ్ గుర్తింపు పొందారు. ఈమె తొలి హిందూ అమెరికా కాంగ్రెస్ మహిళగా గతంలో రికార్డ్ నెలకొల్పారు.




# 'వాయిస్ ఆఫ్ అమెరికా'పై ట్రంప్ వేటు

**వాషింగ్టన్:** అమెరికా ప్రభుత్వ వ్యయనియంత్రణ చర్యల్లో భాగంగా డొనాల్డ్ ట్రంప్ సర్కార్ సిబ్బంది కోతలపర్వాన్ని కొనసాగిస్తోంది. ఇందులోభాగంగా తాజాగా 'వాయిస్ ఆఫ్ అమెరికా'బ్రాడ్‌కాస్టర్ మీడియా సంస్థలోని మొత్తం సిబ్బందిని ప్రభుత్వం సెలవుపై పంపించింది. వాయిస్ ఆఫ్ అమెరికా అనేది ప్రభుత్వ నిధులతో పనిచేసే బహుళజాతి మీడియా సంస్థ. ఇది 40 భాషల్లో రేడియో, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్, సోషల్‌మీడియాల్లో అమెరికా సంబంధ సమాచార, సాంస్కృతి కార్యక్రమాలను ప్రసారంచేస్తోంది. ఈ సంస్థలో మొత్తం 1,300 మంది సిబ్బంది ఉన్నారు. వీళ్లందరినీ సెలవుపై పంపుతున్నట్లు ఈ బ్రాడ్‌కాస్టర్ మీడియా ఏజెన్సీ సీనియర్ మహిళా సలహాదారు కరీ లేక్ చెప్పారు. ''యూఎస్ ఏజెన్సీ ఫర్ గ్లోబల్ మీడియా(యూఎస్ఏజీఎం) నిధులతో నడిచే వాయిస్ ఆఫ్ అమెరికా, ఆఫీస్ ఆఫ్ క్యూబా బ్రాడ్‌కాస్టింగ్‌లలో మీరు పనిచేస్తుంటేగనక వెంటనే మీ ఈ-మెయిల్‌ను చెక్ చేసుకోండి''అని కరీలేక్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. శుక్రవారం 'ప్రభుత్వ రంగ సిబ్బంది తగ్గింపు కొనసాగింపు'కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశాక 'వాయిస్ ఆఫ్ అమెరికా'పై ప్రభుత్వం కన్నేసింది. దీంతో 83 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా 'వాయిస్ ఆఫ్ అమెరికా'మూగబోయిందని సంస్థ డైరెక్టర్ మైఖేల్ అబ్రమోవిట్జ్ ఆవేదన వ్యక్తంచేశారు.

# ట్రూత్‌సోషల్‌లో చేరిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేరారు. పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్మన్‌తో మోదీ ఆదివారం సంభాషించారు. ఈ పాడ్‌కాస్ట్‌ను ట్రంప్ తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో వెంటనే షేర్ చేశారు. దీంతో సోమవారం మోదీ ట్రూత్ సోషల్‌లో అరంగేట్రం చేశారు. 'ట్రూత్‌సోషల్‌లో చేరడం సంతోషంగా ఉంది. ఇక్కడ ఉద్వేగ భరిత గొంతులతో సంభాషించడానికి, రాబోయే కాలంలో మరింత అర్థవంతమైన సంభాషణల్లో పాల్గొడానికి ఎదురు చూస్తుంటాను' అని ప్రధాని మొదటి పోస్ట్‌లో పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో.. ఫ్రిడ్మన్‌తో జరిగిన తన సంభాషణను పంచుకున్నందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'నా మిత్రుడు, అధ్యక్షుడు ట్రంప్‌కు ధన్యవాదాలు. నా జీవిత ప్రయాణం, భారతదేశ నాగరిక దృక్పథం, ప్రపంచ సమస్యలు, మరెన్నో అంశాలను నేను కవర్ చేశాను' అని పేర్కొన్నారు.

# పాఠశాల భోజనంలో వంటనూనె తగ్గించండి

**విద్యార్థుల్లో ఊబకాయం నేపథ్యంలో రాష్ట్రాలకు కేంద్రం సూచన**


**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ (పీఎం పోషణ్) పథకం కింద పాఠశాల భోజనంలో వంట నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. బాల్యంలో ఊబకాయం గురించి పెరుగుతున్న ఆందోళనల దృష్ట్యా విద్యార్థులలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సూచనలు చేసింది. ''వంట నూనెల వినియోగాన్ని తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యా శాఖలు, పాఠశాల అధికారులు విద్యార్థులలో అవగాహన పెంచాలి. తక్కువ నూనెతో తయారయ్యే ఆహారాలపై పోషకాహార నిపుణులతో సెషన్లు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై క్విజ్ పోటీలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి, బరువును సమర్థంగా నిర్వహించడానికి వ్యాయామం, యోగా వంటివాటిని సూచించాలి'' అని పేర్కొంది. బాలల్లో ఊబకాయంపై ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఆందోళన వెలిబుచ్చడం తెలిసిందే.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.



# 'రాజకీయ పార్టీ' ఏ షెడ్యూల్‌లో ఉంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
**జనరల్ స్టడీస్**
**పాలిటీ**




### రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్

రాజ్యాంగం పనితీరును సమీక్షించడానికి ఎన్డీఏ ప్రభుత్వం 2000 ఫిబ్రవరి 22న జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య అధ్యక్షతన 10 మంది సభ్యులతో భారత రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

ఈ కమిషన్ సభ్యుడు పి.ఎ. సంగ్మా కమిషన్ నివేదిక సమర్పించక ముందే రాజీనామా చేశారు. ఈ కమిషన్‌కు కార్యదర్శిగా డా.రఘువీర్‌సింగ్ వ్యవహరించారు. ఈ కమిషన్ రచనా సంఘం 2001 సెప్టెంబర్‌లో డా.సుభాష్ సి.కశ్యప్ అధ్యక్షతన ఇద్దరు సభ్యులతో ఏర్పడింది. రచనా సంఘంలో కె.పరాశరన్, డా. అబిద్ హుస్సేన్‌లను సభ్యులుగా నియమించారు. ఈ రాజ్యాంగ సమీక్ష సంఘం 18 పర్యాయాలు సమావేశమై 46 రోజులు సంప్రదింపులు జరిపింది. రాజ్యాంగ సమీక్ష కమిషన్ 2002 మార్చి 11న తన అధ్యయన నివేదికను ఆమోదించింది. 2002 మార్చి 31న అధ్యయన నివేదికను నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయికి సమర్పించింది. ఈ కమిషన్ 249 సిఫారసులతో 11 శీర్షికలుగా నివేదికను రూపొందించింది.

**సూచనలు:**

- ఏడాదిలో కనీసం 80 రోజులు వేతనం అందేలా గ్రామాల్లో ఉపాధి పొందే హక్కును కల్పించడం.
- భారత రాజ్యాంగంలోని 4వ భాగం శీర్షిక-రాజ్యాంగ విధాన 'ఆదేశిక సూత్రాలు' అనే చర్యగా సవరించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గురించి, ప్రాథమిక విధులకు సంబంధించి పౌరులకు తగిన అవగాహన, పరిజ్ఞానం కల్పించే చర్యలు చేపట్టాలి.
- ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వమే భరించేలా సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలి.
- రాజకీయ పార్టీలన్నీ మహిళలకు 30 శాతం స్థానాలు కేటాయించాలి.
- పార్లమెంటు ఏడాదికి 120 రోజులు సమావేశం కావాలి. రాజ్యసభ 100 రోజులు సమావేశం కావాలి. రాష్ట్రాల శాసన సభలు కూడా ఏడాదికి 90 రోజులు సమావేశం కావాలి.
- కార్యనిర్వహణ శాఖ, ప్రభుత్వ పాలన, అధికారుల్లో బాధ్యత, జవాబుదారీతనం పెంపొందించడానికి సామాజిక తనిఖీ వ్యవస్థను ప్రవేశపెట్టాలి.
- కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలంగా ఉండాలి, అంతర్రాష్ట్ర మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వం వైయుక్తికంగా, సమష్టిగా రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి.
- న్యాయశాఖలో మార్పులు చేపడుతూ, జాతీయ న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.
- అధికార వికేంద్రీకరణ, స్వావలంబన, గ్రామ పంచాయతీలను స్వయం పాలనా సంస్థలుగా ప్రకటించి వాటికి ప్రత్యేక అధికారాలు కేటాయించాలి.
- వ్యవస్థీకృతమైన మార్పులు జరగాలి. సాంఘిక, ఆర్థిక మార్పులతో పాటు అభివృద్ధి క్రమం విస్తరించాలి. మైనారిటీ వర్గాల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి చర్యలు చేపట్టాలి.

**లక్ష్యాలు**

- దేశంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సమర్థవంతమైన, జవాబుదారీతనం, పారదర్శకత, నీతివంతమైన పాలన కోసం ఏ మేరకు రాజ్యాంగపరమైన అంశాలు దోహదపడతాయనే అంశాలను సునిశితంగా పరిశీలించి సూచనలు చేయడం.
- రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగం కలగకుండా రాజ్యాంగపరమైన అంశాల్లో అవసరమైన క్రమానుగత మార్పులను సూచించడం.
- పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంవిధానం మేరకు ఆధునిక భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ అభివృద్ధి సాధనకు సవివరమైన సూచనలు చేయడం.

### జిల్లా కలెక్టర్

దేశంలో జిల్లా కలెక్టర్ పదవిని 1772లో వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యానంతరం ఐఏఎస్‌కు చెందిన అధికారి జిల్లా కలెక్టర్‌గా నియమితులవుతున్నారు. జిల్లా కలెక్టర్ హోదాను ఫ్రాన్స్ లోని ప్రిఫెక్ట్ అనే పదవితో పోల్చుతారు.

**అధికారాలు-విధులు**

1) రెవెన్యూ విధులు 2) న్యాయపరమైన విధులు 3) ఎన్నికల నిర్వహణ 4) ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయినవారిని ఆదుకోవడం 5) అభివృద్ధి కార్యక్రమాల అమలు 6) జనాభా లెక్కల సేకరణ 7) స్థానిక సంస్థలపై పర్యవేక్షణ.

**నోట్:** జిల్లా కలెక్టర్‌కు అనేక అంశాలతో జిల్లా పరిషత్‌లకు సంబంధం ఉంటుంది. జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలకు శాశ్వత ఆహ్వానితుడి హోదాలో కలెక్టర్ హాజరవుతాడు. జిల్లా పరిషత్ పనితీరు గురించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాడు. జిల్లా పరిషత్‌లోని వివిధ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తాడు.

### జాతీయ న్యాయ మండలి

న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తెచ్చే దిశగా న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. న్యాయమూర్తులపై వచ్చే ఆరోపణలపై విచారణ చేయడానికి, దోషులుగా తేలిన న్యాయమూర్తులను తొలగించడానికి వీలుగా ఉండే 'The Judges Bill - 2006ను తీసుకురావాలని అప్పట్లో కేంద్ర మంత్రి మండలి నిర్ణయించింది. 2006 నవంబర్ 9న నాటి ప్రధాని అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత, జడ్జీలను జవాబుదారీ చేయడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను విచారించడానికి జాతీయ న్యాయ మండలి (ఎన్‌జేసీ) ఏర్పాటు చేయాలని ఈ బిల్లు పేర్కొంటుంది. దీనికోసం 1968 జడ్జీల చట్టానికి సవరణ తీసుకొస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మినహా ఇతర జడ్జీల్లో ఎవరిపై ఆరోపణలు వచ్చినా ఎన్‌జేసీ విచారిస్తుంది. జాతీయ న్యాయ మండలిలో భారత ప్రధాన న్యాయమూర్తితో పాటు సుప్రీంకోర్టులోని ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, మరో ఇద్దరు సీనియర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. ఒకవేళ సుప్రీంకోర్టులోని జడ్జిపై ఫిర్యాదును విచారించాల్సివస్తే హైకోర్టు న్యాయమూర్తుల స్థానంలో మరో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు. జడ్జీలపై తప్పుడు ఆరోపణలు చేస్తే అతడికి ఏడాది జైలు, రూ. 25 వేల వరకు జరిమానా విధిస్తారు. ఈ న్యాయ మండలి నేరుగా లేదా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్‌పర్సన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ఫిర్యాదుదారు, జడ్జి ఎవరనేది రహస్యంగా ఉంచేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా నెల పాటు శిక్ష, రూ. 500 జరిమానా లేదా రెండూ అమలు చేయవచ్చు. ఫిర్యాదులను ఎన్‌జేసీ రహస్యంగా విచారిస్తుంది. జడ్జి దుష్ప్రవర్తన, అసమర్థతతో వ్యవహరించినట్లు రుజువైతే.. అతడ్ని తొలగించాల్సిన అవసరం లేదని న్యాయ మండలి భావిస్తే, ఈ కింది చర్యలు తీసుకోవచ్చు.

- సలహాలు ఇవ్వడం.
- హెచ్చరికలు చేయడం
- స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని కోరడం.
- బహిరంగంగా లేదా రహస్యంగా మందలించడం లేదా అభిశంసించడం చేస్తుంది.

ఒకవేళ న్యాయమూర్తి తొలగింపు తప్పదని భావిస్తే, ఆ మేరకు రాష్ట్రపతికి న్యాయ మండలి సిఫారసు చేస్తుంది. దీన్ని స్వీకరించిన రాష్ట్రపతి మండలి గుర్తించిన అంశాలు, సంబంధిత నివేదికలను, సిఫారసులను పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపెట్టాలని కోరతాడు. అప్పుడు జడ్జి తొలగింపు కోసం రాష్ట్రపతికి అభ్యర్థన చేస్తూ సభలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెడుతుంది. ఆ తీర్మానం ఆమోదం ద్వారా తొలగింపునకు గురైన న్యాయమూర్తి వివిధ రకాల విధులకు అనర్హుడవుతారు. లా కమిషన్ 195వ నివేదికలో చేసిన సిఫారసుల ప్రాతిపదికన ఈ నూతన బిల్లును రూపొందించారు. జస్టిస్ వెంకటాచలయ్య కమిటీ, జాతీయ లా కమిషన్‌లు న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తీసుకురావాలని సిఫారసు చేశాయి.

### పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

పదవి, డబ్బులకోసం సభ్యులు పార్టీలు మారడం 1967 తర్వాత ఎక్కువగా జరిగాయి. దీన్నే ఫ్లోర్ క్రాసింగ్ అంటారు. పార్టీ ఫిరాయింపులను నివారించడానికి 1985లో 52వ రాజ్యాంగ సవరణ చేశారు. పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం ఈ కింది కారణాలతో సభ్యులను తొలగించవచ్చు.

- పార్టీ సభ్యుడు తాను ఎన్నికైన పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పుడు.
- పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా సభలో తన ఓటు హక్కును వినియోగించినప్పుడు, ముందుగా అనుమతి తీసుకోకుండా ఓటింగ్‌కు గైర్హాజరైనప్పుడు.

అయితే అత్యవసర కారణాల వల్ల సభకు రాలేకపోయాడని గైర్హాజరైన 15 రోజుల లోపు పార్టీ గుర్తిస్తే పార్టీ ఫిరాయింపు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. 1942లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పార్టీలు జారీ చేసే విప్.. విశ్వాస, అవిశ్వాస తీర్మానాలకు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. స్వతంత్రంగా ఎన్నికైన సభ్యుడు ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు. నామినేటెడ్ సభ్యుడు ఆరు నెలల తర్వాత ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు.

**ముఖ్యాంశాలు:**

- భారత రాజ్యాంగంలో రాజకీయ పార్టీ అనే పదం 10వ షెడ్యూల్‌లో మాత్రమే ఉంది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలో 52వ రాజ్యాంగ సవరణ చేసి ఫిరాయింపుల చట్టానికి సంబంధించి 102(2), 191(2) అధికరణలను చేర్చారు.
- దేశంలో రాజకీయ పార్టీలు రాజ్యాంగ బద్ధమైనవి కావు. అవి కేవలం చట్టబద్ధంగా ఎన్నికల కమిషన్ ద్వారా గుర్తింపు పొంది ఏర్పాటయ్యాయి.

**వర్తించని సందర్భాలు:**

- పార్టీలలో చీలిక ఏర్పడి మూడో వంతు సభ్యులు గ్రూప్‌గా ఏర్పడితే ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి రాదు.
- పార్టీ సభ్యుల్లో 2/3వ వంతు సభ్యులు వేరే పార్టీలో చేరినప్పుడు కూడా ఈ చట్టం పరిధిలోకి రాదు.
- లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌లు తమ పదవులు వదిలి వారి పార్టీల్లో చేరినప్పుడు వారికి ఈ చట్టం వర్తించదు. రాష్ట్రాల్లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.
- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు విషయంలో ఛైర్మన్, స్పీకర్‌దే అంతిమ నిర్ణయం.
- రాజకీయ పార్టీల్లో చీలికలను నిరోధించడానికి, రాష్ట్రాల్లో మంత్రివర్గ పరిమాణాన్ని నియంత్రించడానికి ఉద్దేశించిన 97వ రాజ్యాంగ సవరణ బిల్లు, 91వ రాజ్యాంగ సవరణ చట్టం 2003గా అమల్లోకి వచ్చింది. ఈ బిల్లు ప్రకారం పార్టీ నుంచి ఎంతమంది ఫిరాయించినా వారు అనర్హులవుతారు. తిరిగి పోటీ చేసి గెలిచే వరకూ వారు ప్రతిఫలాన్నిచ్చే ఏ పదవీ చేపట్టడానికి వీలులేదు.
- పార్టీ అధ్యక్షుడి ఫిర్యాదు మేరకు స్పీకర్ వారి సభ్యత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంటుంది.

**సభ్యత్వం రద్దు-సుప్రీంకోర్టు తీర్పు**

1993లో కిహోటో ఉలాహన్ వర్సెస్ జాచి లు కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ.. సభ్యుడి సభ్యత్వం రద్దుపై స్పీకర్(సభాధ్యక్షుడు)ది తుది నిర్ణయం కాదని వారి నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని పేర్కొంది.

**ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ**

క్రిమినల్ కేసుల్లో కోర్టు దోషులుగా నిర్ధారించిన వ్యక్తులు శిక్ష అనుభవిస్తున్న కాలం తర్వాత మరో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే వీలు లేకుండా ప్రజాప్రాతినిధ్యం చట్టం (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించింది. నేర చరితులను చట్ట సభలకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణ చేస్తున్నారు. గతంలో దీర్ఘకాలం శిక్షపడిన వ్యక్తులు తొలి ఆరేళ్లలో పోటీ చేయలేకపోయినా తర్వాత జైలులో ఉండి పోటీ చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు అలాంటి అవకాశం లేకుండా చేశారు. అవినీతి నిరోధక చట్టం, తీవ్రవాద నిరోధక చట్టం కింద శిక్షపడిన వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. అవినీతి నిరోధక చట్టం కింద కనీసం రెండు సంవత్సరాలు శిక్షపడినా అనర్హత వర్తిస్తుంది.

### మాదిరి ప్రశ్నలు

1. **రాజ్యాంగ సమీక్ష కోసం ఏర్పాటైన జాతీయ కమిషన్‌కు అధ్యక్షత వహించిన వారు?**
   ఎ) పి.ఏ సంగ్మా
   బి) జస్టిస్ బి.పి జీవన్‌రెడ్డి
   సి) జస్టిస్ ఎంఎన్. వెంకటాచలయ్య
   డి) సీఆర్ ఇరానీ
2. **జిల్లా కలెక్టర్ వ్యవస్థను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?**
   ఎ) 1771 బి) 1772 సి) 1773 డి) 1774
3. **ఎన్నికల ప్రక్రియలో వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలని సిఫారసు చేసిన కమిషన్?**
   ఎ) వీరప్ప మొయిలీ కమిటీ
   బి) రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్
   సి) సర్కారియా కమిషన్
   డి) పైవేవీ కావు

**సమాధానాలు**
1) సి; 2) బి; 3) బి.

# స్ట్రాబెర్రీలో జరిగే శాఖీయ ప్రత్యుత్పత్తి?




**జీవులు తమను పోలిన జీవులను ఉత్పత్తి చేసుకుంటాయి. దీంతో అవి నిరంతరం మనుగడ సాగిస్తాయి. ప్రతి జీవి తన తర్వాతి తరాన్ని ఉత్పత్తి చేయడానికి అవలంబించే పద్ధతినే ప్రత్యుత్పత్తి అంటారు.**

### ప్రత్యుత్పత్తి వ్యవస్థ

అన్ని జీవుల్లో ప్రత్యుత్పత్తి విధానం ఒకేలా ఉండదు. లైంగిక, అలైంగిక పద్ధతులు, మొక్కల్లో శాఖీయోత్పత్తిని స్థూలంగా గమనించొచ్చు. అలైంగిక ప్రత్యుత్పత్తి పద్ధతిలో సంయోగ బీజాల ఉత్పత్తి, వాటి కలయిక ఉండదు. ఈ జీవుల్లో సరళమైన విధానంలో అంటే ఒక జనక జీవి ప్రమేయంతోనే ప్రత్యుత్పత్తి జరుగుతుంది. అమీబా, పేరమీషియం, బ్యాక్టీరియా లాంటి జీవులు విచ్ఛిత్తి ద్వారా కొత్త జీవులను ఉత్పత్తి చేసుకుంటాయి. ఈస్ట్‌లో కోరకీభవనం, స్పైరోగైరా లాంటి శైవలాల్లో జీవి ముక్కలుగా విడిపోవడం ద్వారా ఈ పద్ధతి కొనసాగుతుంది. అరటి, ద్రాక్ష మొదలైన పండ్లను విత్తనరహిత ఫలాలుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇది లైంగిక విధానం, అలైంగిక ప్రత్యుత్పత్తి విధానంగా మార్పు చెందిన చర్య. దీన్ని అనిషేక ఫలనం అంటారు. అదేవిధంగా రోటిఫెరాకు చెందిన తేనెటీగలు, చెదలు, కందిరీగలు, చీమల్లో లైంగిక, అలైంగిక విధానాలను వాటి జీవిత చక్రంలో ఒకేసారి గమనించొచ్చు. అందుకే వాటిలో డ్రోన్‌లు, రాణిఈగలు, ప్రత్యుత్పత్తికి నోచని శ్రామిక ఈగలు ఉంటాయి. దీన్ని పార్థినోజెనిసిస్ అంటారు.

మొక్కల్లో శాఖేతర భాగాల నుంచి కొత్త మొక్కలు ఏర్పడే విధానాన్ని శాఖీయోత్పత్తి అంటారు. ఈ విధానం హార్టికల్చర్, ఉద్యానవనాల పెంపకంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. ఇందులో సహజ పద్ధతుల్లో పత్రాలు, కాండాలు, వేర్లు వంటి శాఖీయ భాగాల ద్వారా కొత్త మొక్కలు ఏర్పడుతాయి. కృత్రిమ పద్ధతుల్లో ఛేదనం, అంటుతొక్కడం, అంటు కట్టడం, కణజాలవర్ధనం తదితర పద్ధతుల ద్వారా మొక్కలను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రయోగశాలలో కణజాలవర్ధనం ద్వారా ఒకే రకమైన లక్షణాలు ఉన్న మొక్కలను లక్షల సంఖ్యలో ఒకేసారి ఉత్పత్తి చేయవచ్చు. అలాగే బ్రెడ్ మోల్డ్‌లో సిద్ధబీజాల ఉత్పత్తి, ఫెర్న్ లాంటి మొక్కల్లో సిద్ధ బీజాశయ పత్రాలు, సోరైల ద్వారా కొత్త మొక్కలు ఏర్పడతాయి.

మానవుడిలో పరిణతి చెందిన స్త్రీ, పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలు ఉన్నాయి. పురుషుడిలో ముష్కాలు శుక్రకణాలను ఉత్పత్తి చేస్తాయి. ఇందుకు పౌరుష, కౌపర్ గ్రంథులు, టెస్టోస్టిరాన్ హార్మోన్ సహాయ పడతాయి. 13-14 ఏళ్ల వయసు నుంచి శుక్రకణాల ఉత్పత్తి ప్రారంభమై చాలాకాలం పాటు కొనసాగుతుంది. స్త్రీలలో బీజకోశాలు ఉదర కుహరంలో ఉంటాయి. వీటి పుటికల్లో అండాలు అభివృద్ధి చెందుతాయి. ఈ పుటికలను 'గ్రాఫియన్ పుటికలు' అంటారు. అండం పరిపక్వం చెందిన తర్వాత పుటిక పగిలి అండం విడుదలవుతుంది. దీన్నే అండోత్సర్గం అంటారు. ఈ అండం ఫాలోపియన్ ట్యూబ్ ద్వారా ప్రయాణిస్తున్నప్పుడు శుక్రకణం కలయిక వల్ల ఫలదీకరణం చెంది నూతన జీవికి అంకురార్పణ జరుగుతుంది.

ఫలదీకరణ ఫలితంగా ఏర్పడిన సంయుక్త బీజం గర్భాశయ గోడలకు అతుక్కొని పెరుగుతుంది. దీన్ని పిండ ప్రతిస్థాపన అంటారు. గర్భాశయ కుడ్యంలో వివిధ మార్పులు సంభవిస్తాయి. పిండ ప్రతిస్థాపన తర్వాత పిండంలోని కొన్ని కణాలు పిండానికి పోషణ, రక్షణ ఆధారాన్నివ్వడానికి వేర్వేరు పిండ త్వచాలుగా అభివృద్ధి చెందుతాయి. పరాయువు, జరాయువు, ఉల్బం, ఎల్లంటోయిస్, నాభిరజ్జువు ముఖ్యమైనవి. భ్రూణం పూర్తిగా ఎదగడానికి సుమారు 9 నెలలు(280 రోజులు) పడుతుంది. ఈ గర్భావధికాలం ముగిసిన తర్వాత శిశు జననం జరుగుతుంది. జననాంతరం ప్రథమ స్తన్యం ఏర్పడి, తర్వాత కొద్ది రోజులకు తల్లిపాలుగా మార్పు చెందుతుంది.

మొక్కల్లో పుష్పం అతి ముఖ్యమైన లైంగిక అవయవం. పుష్పంలోని ఆవశ్యక భాగాలు.. రక్షక పత్రావళి, ఆకర్షణ పత్రావళి, కేసరావళి, అండకోశాలు. కేసరావళిలోని పరాగకోశంలో పరాగరేణువులు, అండకోశంలోని అండాశయంలో అండాలు ఏర్పడతాయి. వీటిలో క్షయకరణ విభజన జరిగి ఏకస్థితిక కణాలు ఏర్పడతాయి. పరాగ రేణువులు కీటకాలు, గాలి, నీరు లాంటి మాధ్యమాల ద్వారా పరాగ సంపర్కం జరుపుతాయి. కీలాగ్రానికి చేరిన పరాగ రేణువులు అండకోశంలోని అండాన్ని చేరి ఫలదీకరణ చెందుతాయి. పుష్పించే మొక్కల్లో 'ద్విఫలదీకరణ' జరుగుతుంది.

కణ విభజన చరిత్ర, కణ విభజనలో రకాలు, ప్రత్యుత్పత్తి, ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, భ్రూణ హత్యలు, బాల్య వివాహాల లాంటి అంశాలు ఈ పాఠంలో ఉన్నాయి.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు..

- పాలలో బ్యాక్టీరియా వృద్ధి చెందే ప్రయోగం
- లైంగిక, అలైంగిక ప్రత్యుత్పత్తిలో భేదాలు.
- స్త్రీ, పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ, పుష్పం అంతర్నిర్మాణం చిత్రాలు.
- పిండ పొరలు, మొక్కలో ద్విఫలదీకరణ.
- కణచక్రం, సమ విభజన, హెచ్ఐవీ - ఎయిడ్స్.

### ముఖ్యమైన ప్రశ్నలు

1. కప్పలు అసంఖ్యాకమైన అండాలను విడుదల చేయడానికి కారణాలేమిటి?
2. శుక్రకణాలు వాటి విధులను నిర్వర్తించడానికి ఎలాంటి అనుకూలనాలను కలిగి ఉన్నాయి?
3. అలైంగిక ప్రత్యుత్పత్తి, లైంగిక ప్రత్యుత్పత్తి కంటే ఎలా భిన్నంగా ఉంటుంది?
4. రైజోఫస్‌లో సిద్ధబీజాల ఉత్పత్తి ఎలా జరుగుతుంది?
5. పాలు పెరుగుగా ఎలా మారుతుంది?
6. వర్షాకాలంలో భూమి నుంచి కొన్ని రకాల కీటకాలు ఎలా ప్రత్యక్షమవుతాయి?
7. ఎపిడిడిమిస్ ప్రత్యేకత ఏమిటి?
8. నాభిరజ్జువు ఎలా ఏర్పడుతుంది?
9. బల్లి లాంటి జీవుల్లో తోక తెగితే మళ్లీ ఏర్పడటానికి కారణం.
10. క్రోమోజోములను గురించి శాస్త్రవేత్తల పరిశీలనలు రాయండి.
11. కుటుంబ నియంత్రణ గురించి వైద్యుడిని మీరు ఇంటర్వ్యూ చేయడానికి ఎలాంటి ప్రశ్నలడుగుతారు?
12. ఏకలింగ, ద్విలింగ పుష్పాలను నిర్వచించండి.
13. శాఖీయోత్పత్తి వల్ల కలిగే ప్రయోజనాలు రాయండి.
14. భ్రూణ హత్యల నివారణ ప్రచారానికి మీరు ఎలాంటి నినాదాలు రాస్తారు.
15. గర్భాశయంలో పెరుగుతున్న పిండానికి పోషణ అవసరం. పిండానికి పోషకాలు ఎలా అందుతాయి?
16. సమ విభజన, క్షయకరణ విభజన మధ్య భేదాలేమిటి?
17. ఒకవేళ జీవుల్లో క్షయకరణ విభజన జరగకుంటే, దాని ఫలితం ఎలా ఉంటుంది.

### మాదిరి ప్రశ్నలు

1. **ప్రసవం జరిగిన వెంటనే క్షీరగ్రంథులు స్రవించేది?**
   1) పాలు 2) కొలోస్ట్రమ్
   3) రక్తం 4) ఉల్బం
2. **శిశువు తల్లి గర్భంలో ఉన్నప్పుడు రక్తకణాలు వేటి నుంచి ఉత్పత్తి అవుతాయి?**
   1) ఎముకమజ్జ
   2) కాలేయం, ప్లీహం
   3) మూత్రపిండాలు
   4) మెదడు, వెన్నెముక
3. **ఐ.వి.ఎఫ్. అంటే?**
   1) ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్
   2) ఇన్‌విట్రో ఫెలోపియన్
   3) ఇంటర్నల్ పేస్ ఫ్లో
   4) ఇంటర్నేషనల్ వీడియో ఫెలోషిప్
4. **ఉభయ లైంగిక జీవికి ఉదాహరణ?**
   1) రొయ్య 2) బొద్దింక
   3) నత్త 4) వానపాము

**సమాధానాలు**
1) 2; 2) 2; 3) 1; 4) 4.

## విద్య, ఉద్యోగ సమాచారం

**ఐసీఏఆర్-ఐఏఆర్ఐ న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు**

న్యూఢిల్లీలోని ఐసీఏఆర్- ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్-02, ఐటీ ప్రొఫెషన్‌4-01, సీనియర్ రీసెర్చ్ ఫెలో-03, యంగ్ ప్రొఫెషనల్1-01, ఆఫీస్ కమ్ ల్యాబ్ అసిస్టెంట్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు, నెట్/గేట్ స్కోరు, ఉద్యోగానుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.61,000, ఐటీ ప్రొఫెషన్‌కు రూ.60,000, సీనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000, యంగ్ ప్రొఫెషనల్‌కు రూ.30,000, ఆఫీస్ కమ్ ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.25,000.
- **వయసు:** పోస్టును అనుసరించి 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025.
- **వెబ్‌సైట్:** https://www.iari.res.in/

**బెల్, బెంగళూరులో 10 సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు**

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 01.02.2025 నాటికి 50 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.30,000 నుంచిరూ.1,20,000.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 19.03.2025.
- **వెబ్‌సైట్:** https://belindia.in/

**ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో కౌన్సిలర్ పోస్టులు**

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్).. ఒప్పంద ప్రాతిపదికన కౌన్సిలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 28.03.2025 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.84,150.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.03.2025.
- **వెబ్‌సైట్:** https://www.iisertirupati.ac.in/

**బెల్, మచిలీపట్నంలో 20 డిప్యూటీ ఇంజనీర్ పోస్టులు**

మచిలీపట్నంలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన డిప్యూటీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 20.
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)-08, డిప్యూటీ ఇంజనీర్(మెకానికల్)-12.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్/ఏఎంఐఈ/జీఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.02.2025 నాటికి జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీలకు 31 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2025.
- **వెబ్‌సైట్:** https://belindia.in/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
మంగళవారం । 18-3-2025

# స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఉపగ్రహం?

## ఇస్రో సాధించిన విజయాలు

**కాలక్రమణిక:**

**1962:** 'ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ రీసెర్చ్ సెంటర్'ను భారత అణుశక్తి శాఖ ఏర్పాటు చేసింది.

తుంబా ఈక్వెటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్‌ను కేరళలో ప్రారంభించారు.

**1963:** నవంబర్ 2న మొదటి సౌండింగ్ రాకెట్‌ను లాంచ్ చేశారు.

**1965:** తుంబాలో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేశారు.

**1968:** అహ్మదాబాద్‌లో ప్రయోగాత్మక శాటిలైట్ కమ్యూనికేషన్ ఎర్త్ స్టేషన్ ఏర్పాటు చేశారు.

**1969:** ఆగస్టు 15న అణుశక్తి శాఖలో భాగంగా ఇస్రో ఏర్పాటు.

**1971:** షార్ కేంద్రం- సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌ను శ్రీహరికోటలో ఏర్పాటు చేశారు.

**1972:** అంతరిక్ష శాఖను ఏర్పాటు చేసి ఇస్రోను ఆ శాఖ పరిధిలోకి మార్చారు. బెంగళూరులో ఇస్రో శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లో స్పేస్ అప్లికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

**1975:** ఏప్రిల్ 19న ఆర్యభట్ట ఉపగ్రహాన్ని ప్రయోగించారు. అమెరికా ఉపగ్రహం ద్వారా శాటిలైట్ ఇన్‌స్ట్రక్షనల్ టెలివిజన్ ఎక్స్‌పెరిమెంట్‌ను ప్రారంభించారు.

**1977:** ఫ్రాంకో-జర్మనీ సింఫనీ శాటిలైట్ ద్వారా శాటిలైట్ టెలీకమ్యూనికేషన్ ఎక్స్‌పెరిమెంట్ ప్రాజెక్టు(1977-79) చేపట్టారు.

**1979:** భూపరిశీలన కోసం భాస్కర-I ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ఎస్ఎల్‌వీ-3 ద్వారా చేపట్టిన రోహిణి ఉపగ్రహ ప్రయోగం విఫలమైంది.

**1980:** రోహిణి-II ప్రయోగం విజయవంతం.

**1981:** అభివృద్ధిపర్చిన మొదటి ఎస్ఎల్‌వీ-3 ద్వారా రోహిణి ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు. భూస్థావర సమాచార ఉపగ్రహం 'ఆపిల్'ను ప్రయోగించారు. భాస్కర-2 ఉపగ్రహాన్ని రష్యా రాకెట్ ద్వారా ప్రయోగించారు.

**1982:** సమాచార ప్రసారం కోసం ఉద్దేశించిన ఇన్‌శాట్-1ఎ ఉపగ్రహాన్ని అమెరికా రాకెట్ ద్వారా ప్రయోగించారు.

**1983:** అభివృద్ధిపర్చిన రెండో ఎస్ఎల్‌వీ-3 ద్వారా రోహిణి ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇన్‌శాట్ శ్రేణి ఉపగ్రహాలు ప్రారంభం. ఇన్‌శాట్-1బి ప్రయోగం విజయవంతమైంది.

**1984:** భారత మొదటి అంతరిక్ష యాత్రికుడు రాకేష్ శర్మ రష్యా స్పేస్ స్టేషన్ 'సెల్యూట్ 7'లో 8 రోజులు గడిపారు. రష్యా రాకెట్ షోయజ్-T-11 ద్వారా ఈయన అంతరిక్షంలోకి వెళ్లారు.

**1987:** అభివృద్ధిపర్చిన మొదటి వాహక నౌక ఏఎస్ఎల్‌వీ (ఆగ్యుమెంటెడ్ శాటిలైట్ లాంచ్ వెహికల్) ద్వారా SROSS-Iను ప్రయోగించారు. ఇది విఫలమైంది.



**1988:** ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం ఐఆర్ఎస్-1ఎను రష్యన్ రాకెట్ ద్వారా ప్రయోగించారు. అభివృద్ధిపర్చిన ఏఎస్ఎల్‌వీ ద్వారా SROSS శాటిలైట్‌ను ప్రయోగించారు. ఇది విఫలమైంది.

**1991:** ఐఆర్ఎస్-1బి ప్రయోగం. రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల శ్రేణిలో ఇది రెండోది.

**1992:** ఏఎస్ఎల్‌వీ ప్రయోగం విజయవంతం. SROS-C ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొదటి ఉపగ్రహం ఇన్‌శాట్-2ఎను ప్రయోగించారు. ఇది రెండో తరానికి చెందింది. దీని తర్వాత 3, 4 తరాల శ్రేణులు వచ్చాయి.

**1993:** పీఎస్ఎల్‌వీ ద్వారా ఐఆర్ఎస్-1ఇను ప్రయోగించారు. ఇది విఫలమైంది.

**1994:** ఏఎస్ఎల్‌వీ ద్వారా SROSS-C2ను విజయవంతంగా ప్రయోగించారు. పీఎస్ఎల్‌వీ ద్వారా ఐఆర్ఎస్-పీ2ను కక్ష్యలో ప్రవేశపెట్టారు.

**1996:** పీఎస్ఎల్‌వీ ద్వారా ఐఆర్ఎస్-పీ3 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు.

**1997:** పీఎస్ఎల్‌వీ ద్వారా ఐఆర్ఎస్-1డి ప్రయోగం.

**1999:** పీఎస్ఎల్‌వీ ద్వారా మొదటిసారిగా విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం మొదలైంది. కొరియా, జర్మనీ ఉపగ్రహాలతోపాటు ఇస్రో అభివృద్ధిపర్చిన ఓషన్‌శాట్‌ను ప్రయోగించారు.

**2001:** జియో సింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ)తో జీశాట్-1 ఉపగ్రహాన్ని ప్రయోగించారు. పీఎస్ఎల్‌వీ ద్వారా ఇస్రో ప్రయోగాత్మక ఉపగ్రహంతోపాటు బెల్జియం, జర్మనీలకు చెందిన ఉపగ్రహాలను ప్రయోగించారు.

**2002:** పీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా కల్పన-1 శాటిలైట్‌ను ప్రయోగించారు.

**2003:** జీఎస్ఎల్‌వీ ద్వారా జీశాట్, పీఎస్ఎల్‌వీ ద్వారా రిసోర్స్ శాట్-1 ప్రయోగం.

**2004:** జీఎస్ఎల్‌వీ ద్వారా ఎడ్యుశాట్ ప్రయోగం.

**2005:** శ్రీహరికోటలో రెండో లాంచ్‌ప్యాడ్ ఏర్పాటు చేశారు. పీఎస్ఎల్‌వీ ద్వారా కార్టోశాట్-1, హామ్‌శాట్ ప్రయోగించారు.

**2006:** జీఎస్ఎల్‌వీ ద్వారా ఇన్‌శాట్-4సి ప్రయోగం. మొదటిసారిగా కమ్యూనికేషన్ శాటిలైట్‌ను భారత రాకెట్ మోసుకెళ్లింది. కానీ ఈ మిషన్ విఫలమైంది.

**2007:** కార్టోశాట్-2 ఉపగ్రహాన్ని, తొలిసారిగా స్పేస్ క్యాప్సుల్ రికవరీ ఎక్స్‌పెరిమెంట్‌తో పాటు రెండు విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించారు. స్పేస్‌క్యాప్సూల్‌ను విజయవంతంగా తిరిగి పొందారు. పీఎస్ఎల్‌వీ ద్వారా ఇటలీ ఉపగ్రహం ఎజిలీని, జీఎస్ఎల్‌వీ ద్వారా ఇన్‌శాట్-4సీఆర్‌ను ప్రయోగించారు.

**2008:** పీఎస్ఎల్‌వీ ద్వారా ఇజ్రాయెల్ శాటిలైట్ టెక్‌శార్‌ను ప్రయోగించారు. రెండు స్వదేశీ ఉపగ్రహాలతోపాటు ఎనిమిది విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారా ఒకేసారి ప్రయోగించారు. ఇది ఇస్రో చరిత్రాత్మక విజయం. పీఎస్ఎల్‌వీ ద్వారా చేపట్టిన చంద్రయాన్-1 ప్రయోగం విజయవంతమైంది.

**2009:** రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ (RISAT-2), అన్నా యూనివర్సిటీకి చెందిన అనుశాట్ (విశ్వవిద్యాలయాలకు చెందిన తొలి ఉపగ్రహం)ను పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించారు. ఓషన్‌శాట్‌తో పాటు మరో 7 ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారా కక్ష్యలో ప్రవేశపెట్టారు.

**2010:** జీఎస్ఎల్‌వీ ప్రయోగం రెండుసార్లు విఫలమైంది. పీఎస్ఎల్‌వీ ద్వారా కార్టోశాట్-2బి, STUDSAT, విదేశీ మినీ శాటిలైట్‌లను ప్రయోగించారు.

**2011:** రిసోర్స్‌శాట్-2, రెండు మినీ శాటిలైట్‌లను పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించారు. జీశాట్-12, మేఘాట్రాపిక్స్, మరో మూడు చిన్న ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించారు.

**గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం**
**జనరల్ స్టడీస్**
**సైన్స్ అండ్ టెక్నాలజీ**

**2012:** పీఎస్ఎల్‌వీ ద్వారా రిశాట్-1ను ప్రవేశపెట్టడంతోపాటు ఫ్రెంచి శాటిలైట్ స్పాట్-6, జపాన్ శాటిలైట్ పోయిటెర్స్‌ను ప్రయోగించారు.

**2013:** మనదేశంలో మొదటి రీజనల్ నావిగేషన్ శాటిలైట్‌ను పీఎస్ఎల్‌వీ-సీ22 ద్వారా ప్రయోగించారు.

మార్స్ ఆర్బిటర్ మిషన్(మామ్) స్పేస్ క్రాఫ్టును పీఎస్ఎల్‌వీ-సీ25 ద్వారా విజయవంతంగా అంగారక గ్రహంపైకి ప్రయోగించారు.

**2014:** సెప్టెంబర్ 24న మామ్ అంగారక గ్రహాన్ని చేరింది. తొలి ప్రయత్నంలోనే ఈ ఘనత సాధించిన ఏకైక దేశం భారత్.

**2015:** మార్చి 28న పీఎస్ఎల్‌వీ-సీ27 ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1డీని ప్రయోగించారు. జూలై 10న బ్రిటన్‌కు చెందిన 5 ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ-సీ28 ద్వారా ప్రయోగించారు. ఆగస్టు 27న జీఎస్ఎల్‌వీ-డీ6 ద్వారా జీశాట్-6ను ప్రయోగించారు. ఇది జీఎస్ఎల్‌వీ-డీ6 ద్వారా చేపట్టిన తొమ్మిదో ప్రయోగం. సెప్టెంబర్ 28న పీఎస్ఎల్‌వీ-సీ30 ద్వారా ఆస్ట్రోశాట్‌తోపాటు ఆరు విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించారు.

## ఇస్రో విభాగాలు

**ఇస్రో సంస్థ:** దీని ప్రధాన కార్యాలయం బెంగళూరులో ఉంది. అంతరిక్ష విజ్ఞానం అభివృద్ధికి కావాల్సిన ప్రయోగశాలలను ఏర్పాటు చేసి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వనరులను సమకూర్చడం దీని కర్తవ్యం.

**విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (VSSC):** దీన్ని త్రివేండ్రంలో ఏర్పాటు చేశారు. ఉపగ్రహాల ప్రయోగానికి అవసరమైన రాకెట్‌లను రూపొందిస్తోంది. ఈ కేంద్రానికి ఐరాస గుర్తింపు ఉండటం వల్ల ఇతర దేశాల ఖగోళ శాస్త్రవేత్తలు మన దేశంతో కలిసి పనిచేస్తున్నారు. 2007లో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రం ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీలను రూపొందించింది.

**ఇండియన్ శాటిలైట్ అప్లికేషన్ సెంటర్ (ISAC):** బెంగళూరు సమీపంలోని పీన్యలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉపగ్రహాలను తయారు చేస్తారు. ఈ కేంద్రం రూపొందించిన వాటిలో ఆర్యభట్ట, భాస్కర, ఆపిల్, ఇన్‌శాట్, ఐఆర్ఎస్, ఎడ్యుశాట్, కార్టోశాట్, జీశాట్ ఉపగ్రహాలు ముఖ్యమైనవి.

**లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ (LPSC):** రాకెట్‌లో ఉపయోగించే ఇంధనాలను తయారు చేస్తారు. బెంగళూరు, త్రివేండ్రం, మహేంద్రగిరి (తమిళనాడు)లో దీని ఉపకేంద్రాలు ఉన్నాయి.

**శ్రీహరికోట హై ఆల్టిట్యూడ్ అండ్ రేంజింగ్ (SHAR):** నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట సమీపంలో ఉంది. ఈ కేంద్రాన్ని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ అని కూడా అంటారు. ఒకేసారి రెండు రాకెట్‌లను ప్రయోగించే సామర్థ్యం ఉంది. ప్రపంచ రాకెట్ ప్రయోగ కేంద్రాల్లో రెండో అత్యుత్తమైంది.

**మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ (MCF):** కర్ణాటకలోని హసన్‌లో ఏర్పాటు చేశారు. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలను ఎప్పటికప్పుడు నియంత్రించటానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుంది. రెండో కేంద్రాన్ని భోపాల్‌లో ఏర్పాటు చేశారు.

**నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (NRSC):** ఉపగ్రహాలు పంపించే సంకేతాలు, ఫొటోలను ఈ కేంద్రం స్వీకరించి విశ్లేషిస్తుంది. దీని ఉపవిభాగాలు..

ఎ) పరిపాలన విభాగం
– బాలానగర్ (రంగారెడ్డి జిల్లా)

బి) ప్రయోగశాలలు
– పఠాన్ చెరువు (మెదక్ జిల్లా)

సి) గ్రౌండ్ రిసీవింగ్ స్టేషన్
– షాద్‌నగర్ (మహబూబ్‌నగర్ జిల్లా)

సహజ వనరులను వెలికి తీయడంలో ఎన్ఆర్ఎస్‌సీ ప్రధానపాత్ర పోషిస్తోంది.

**శాటిలైట్ ట్రాకింగ్ అండ్ రేంజింగ్ సిస్టమ్ (STARS):** తమిళనాడులోని కడలూరులో ఏర్పాటు చేశారు. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాల ఎత్తును, వాటి కక్ష్యను ఎప్పటికప్పుడు తెలుసుకుంటారు.

**స్పేస్ అప్లికేషన్ సెంటర్ (SAC):** దీన్ని అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఉపగ్రహాల నుంచి వచ్చే సంకేతాలను వ్యవసాయం, పారిశ్రామిక, సమాచార, పరిపాలన లాంటి అనేక రంగాల్లో వినియోగించడం కోసం శాస్త్రవేత్తలకు తగిన శిక్షణ ఇస్తోంది.

**డెవలప్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ యూనిట్ (DECU):**

అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేశారు. దేశంలో అక్షరాస్యత పెంచడానికి కృషి చేస్తోంది. 2004లో ఎడ్యుశాట్‌ను ప్రయోగించడం ద్వారా దేశంలోని 1000 విద్యాకేంద్రాలను అనుసంధానించారు. దీనివల్ల లక్షలాది మంది ప్రజలు విద్యను అభ్యసిస్తున్నారు.

**ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీ (PRL):** కాస్మిక్ కిరణాల అధ్యయనానికి డాక్టర్ విక్రమ్ సారాభాయ్ ఈ కేంద్రాన్ని అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేశారు.

**ఆంట్రిక్స్ కార్పొరేషన్:** 1992లో బెంగళూరులో ఏర్పాటు చేశారు. ఇస్రో వాణిజ్య కార్యకలాపాలను ఇది నిర్వహిస్తోంది. విదేశీ ఉపగ్రహాలను వాణిజ్య స్థాయిలో మన భూభాగం నుంచి ప్రయోగిస్తున్నారు. దీనికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను ఆంట్రిక్స్ పర్యవేక్షిస్తోంది.

**ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (IPRC):** మహేంద్రగిరిలో నెలకొల్పారు. ఇక్కడ కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో పరిశోధన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**ఇస్రో టెలిమెట్రి, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (ISTRAC):** బెంగళూరులో ఉంది. స్పేస్ క్రాఫ్ట్ కంట్రోల్, టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ సేవలు లభిస్తాయి. రాడార్‌లను అభివృద్ధి చేసి ట్రాకింగ్, వాతావరణ అనువర్తనాలను రూపొందిస్తారు.

**ఇస్రో ఇనెర్షియల్ సిస్టమ్స్ యూనిట్ (IISU):** తిరువనంతపురంలో ఉంది. స్పేస్ క్రాఫ్ట్‌లు, వాహక నౌకల్లో జడత్వ వ్యవస్థలను ఇక్కడ నియంత్రిస్తారు. ఈ కేంద్రం భారత అంతరిక్ష కార్యక్రమానికి అవసరమయ్యే జడత్వ వ్యవస్థల డిజైన్, నిర్మాణం, అభివృద్ధి బాధ్యతలను చూస్తోంది.

**లేబొరేటరీ ఫర్ ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్స్ (LEOS):** బెంగళూరులోని పీన్యా పారిశ్రామికవాడలో ఏర్పాటు చేశారు. ఎలక్ట్రో ఆప్టిక్ సెన్సార్లు, కెమేరాలను తయారు చేస్తారు.

**ఇండియన్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (IIST):** ఇది తిరువనంతపురంలో ఉన్న డీమ్డ్ యూనివర్సిటీ. ఇందులో ఏవియోనిక్స్, ఏరోస్పేస్, ఇంజనీరింగ్, భౌతిక శాస్త్రాల్లో కోర్సులు ఉన్నాయి.

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (IIRS):** డెహ్రాడూన్‌లో ఏర్పాటైంది. ఇది ఇస్రో, అంతరిక్ష శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రతిష్టాత్మక విద్యాకేంద్రం.

**నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (NE-SAC):** 2000లో ఈశాన్య ప్రాంతమైన షిల్లాంగ్‌లో నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శాస్త్ర సాంకేతిక శాఖ, ఈశాన్య రాష్ట్రాల కౌన్సిల్ ఆధ్వర్యంలో నడుస్తోంది.

**సెమికండక్టర్ లేబొరేటరీ (SCL):** చండీగఢ్‌లో ఉంది. సెమికండక్టర్ టెక్నాలజీ అభివృద్ధి, పరిశోధనలు చేయడం దీని ఉద్దేశం. మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేస్తారు.

**నేషనల్ అట్మాస్ఫిరిక్ రీసెర్చ్ లేబొరేటరీ (NARL):** తిరుపతి సమీపంలోని గాదంకిలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

# The mountain tops were hidden..

## Model Questions

**Directions (Q. No. 1-5):** Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Internet giant Google could be on the side of forces working towards thwarting net neutrality in India. The company has allegedly been trying to prevent the Internet and Mobile Association of India, a body that represents internet firms in India, from opposing Zero Rating, the practice of letting users access select applications/websites free of data charges by striking deals with telecom operators. It's worth pointing out that so far, Google has chosen to remain silent on the matter of net neutrality in India.

As pointed out by MediaNama, Google has not participated in the consultation process for net neutrality and has not submitted any comments to the TRAI. It opted out of **deposing** before the Parliamentary Standing Committee on IT looking into Net Neutrality, despite receiving a specific invite from the committee. In its report, the DoT had opposed Zero Rating plans from content providers like Facebook and had said that "content and application providers cannot be permitted to act as gatekeepers and use network operations to extract value in violation of core principles of Net Neutrality, even if it is for an **ostensible** public purpose." It had said that partnerships between telecom operators and content providers that enable gatekeeping should be actively discouraged, opposing Facebook's Internet.org.

It's worth mentioning that Google had put on hold plans to provide free data to end users in India by zero rating certain apps in May, following public backlash against Facebook's and Airtel's Zero rated offerings.

The internet giant, which was in early discussions with telecom operators and applications developers to launch a zero rating platform, had decided to take a wait and watch approach, as per sources close to the company.

**1.** The central theme of the passage is about
1) Net neutrality in India
2) Rating plans from content providers
3) Partnerships between telecom operators and content providers
4) To launch a zero rating platform
5) Proposing Zero Rating plans

**2.** DoT's report states that
1) content and application providers can be permitted
2) content and application providers cannot be opposed
3) use network operations to enable gatekeeping
4) content and application providers cannot be permitted
5) gatekeeping should be actively encouraged

**3.** Google had put on hold plans to provide free data to end users because
1) Public's hostile response against Facebook's and Airtel's Zero rated offerings
2) public appreciation against Facebook's and Airtel's Zero rated offerings
3) rise of Facebook's and Airtel's Zero rated offerings
4) had decided to take a wait and watch approach
5) has chosen to remain silent

**4.** The synonym of ostensible is
1) professed 2) real
3) genuine 4) valid
5) authentic

**5.** The antonym of depose is
1) overthrow 2) topple
3) pressure 4) install
5) conquer

**Directions (Q. No. 6-15):** Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.



**6.** His resignation has created a ___ which cannot be easily filled.
1) gap 2) space 3) room
4) vacuum 5) ridge

**7.** The bank provides valuable information on recent ______.
1) trends 2) method
3) policy 4) bond 5) loan

**8.** Politics is _____ often concerned only with the personal _______ of politicians.
1) to – attitude
2) very – characters
3) much – appearance
4) many – approach
5) too – vanities

**9.** New techniques ____ introduced with _____ degrees of success.
1) are – many 2) is – shaded
3) were – varying
4) was – different
5) have – various

**10.** The mountain tops were hidden _______ a veil of mist.
1) Beside 2) under 3) because
4) beneath 5) below

**11.** A ______ business venture ____ him thousands of dollars.

## BANK EXAMS
### GENERAL ENGLISH

1) prosperous – puts
2) lucrative – loss
3) good – bet
4) disastrous – lost
5) bad – debt

**12.** He's a ______ genius but he has ______ verbalizing his ideas.
1) good – differences
2) matured – symptoms
3) true – similarities
4) real – difficulty
5) great – trouble

**13.** The English ____ of the novel is ____ for publication next year.
1) part – suppose
2) model – to be
3) module – probably
4) section – definite
5) version – due

**14.** The conference spent days discussing the ____ question ____border controls.
1) same – about 2) different – off
3) vexed – of 4) vested – along
5) similar – also

**15.** This evidence supports the ____ that there is too ____ violence on television.
1) ideas – many
2) principle – most
3) rule – often 4) view – much
5) statement – regular

**Directions: (Q.No. 16 - 20):** Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

**16.** The debate veered side from the main topic of discussion.
1) Veer aside 2) Veered away
3) Veered to 4) Veered along
5) No correction required

**17.** Be there by six at the many latest.
1) much 2) more 3) most
4) very 5) No correction required

**18.** Thailand is at its very bright during the New Year celebrations.
1) Many good 2) much light
3) mostly brighter
4) most vibrant
5) No correction required

**19.** For years the family was been victimized by racist neighbours.
1) were 2) was be
3) had been 4) have being
5) No correction required

**20.** Anti-nuclear protestors regarding the Chernobyl accident as a clear vindication of their campaign.
1) is regards 2) are regarded
3) were regards 4) regarded
5) No correction required

**Directions (Q. No. 21-25):** Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

**21.** She accused (1)/ the press photographers (2)/ of violence (3)/ her privacy. (4)/ No error. (5)

**22.** They could see (1)/ no virtue (2)/ in discussing it (3)/ farther. (4)/ No error. (5)

**23.** He was feeling virtuous (1)/ because (2)/ he had finished (3)/ and they haven't. (4)/ No error. (5)

**24.** The advertisements intention (1)/ to increase (2)/ the company's visibility (3)/ in the market. (4)/ No error. (5)

**25.** It is vital (1)/ that you keeping (2)/ accurate records (3)/ when you are self employed. (4)/ No error. (5)

**Directions (Q.No. 26-30):** Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

**26.** New roads **are being** (1) built to **cope up with** (2) the **increased** (3) volume **of** (4) traffic.

**Directions (Q.No. 31-35):** Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) In our modern world, many of the constellations have been redefined so now every star in the sky is in exactly one constellation.
B) On a really dark night, you can see about 1000 to 1500 stars. Trying to tell which is which is hard.
C) The constellations are totally imaginary things that poets, farmers and astronomers have made up over the past 6,000 years.
D) The real purpose for the constellations is to help us tell which stars are which, nothing more.
E) The constellations help by breaking up the sky into more managable bits. They are used as mnemonics, or memory aids.
F) The constellations have changed over time.

## Answers

1) 1 2) 2 3) 1 4) 1 5) 4
6) 4 7) 1 8) 5 9) 3 10) 4
11) 4 12) 4 13) 5 14) 4 15) 4
16) 2 17) 3 18) 4 19) 3 20) 4
21) 3 22) 4 23) 4 24) 2 25) 2
26) 2